
'ప్రతి కుటుంబం సుఖ సంతోషాలతో గడపాలి. అందుకు సంక్షేమ పథకాలు పెద్దన్న పాత్ర పోషించాలి'

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 16 వెల: ₹ 5.50

సంపుటి: 17 సంచిక: 308

బుధవారం 29-1-2025

SIMULTANEOUSLY PRINTED AT HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL



సుప్రీంకోర్టు.. అసలైన ప్రజాకోర్టు

మన సుప్రీంకోర్టు 140 కోట్ల మంది ప్రజల ఆకాంక్షలను ప్రతిబింబిస్తూ ప్రపంచంలోనే అత్యుత్తమమైన, సమర్థవంతమైన న్యాయస్థానంగా ఎదిగిందని సీజేఐ జస్టిస్ సంజీవ్ ఖన్నా అన్నారు.

వివరాలు 6లో ▸



'సెంచరీ'కి షార్ సిద్ధం

ఏపీలోని షార్ నుంచి బుధవారం ఉదయం 6.23కి ప్రతిష్టాత్మక వందో ప్రయోగానికి భారత అంతరిక్ష పరిశోధనా సంస్థ (ఇస్రో) ఏర్పాట్లు పూర్తిచేసింది. జీఎస్ఎల్వీ-ఎఫ్15 రాకెట్ ప్రయోగానికి అంతా సిద్ధమైంది.


వివరాలు 6లో ▸

త్రిషాన్‌దార్

మహిళల అండర్-19 టి20 ప్రపంచకప్ చరిత్రలో సెంచరీ చేసిన తొలి ప్లేయర్‌గా భారత క్రికెటర్ గొంగడి త్రిష రికార్డు

స్కాట్లాండ్‌తో మ్యాచ్‌లో ఆల్‌రౌండ్ ప్రదర్శనతో అదరగొట్టిన తెలంగాణ అమ్మాయి

టోర్నీలో ఆద్యంతం నిలకడగా రాణిస్తున్న త్రిష 14లో



బ్యాటింగ్: 110* — 59 బంతులు

బౌలింగ్: 3 తీసిన వికెట్లు; 2 వేసిన ఓవర్లు; 6 ఇచ్చిన పరుగులు

24 సింగిల్స్; 5 డబుల్స్; 13 ఫోర్లు; 4 సిక్స్‌లు

నాన్న కల నెరవేర్చింది

వివరాలు 13లో ▸

న్యూస్‌రీల్

ప్రధాన ప్రతిపక్షం కనిపించట్లేదు



తెలంగాణలో అధికార పార్టీకి ప్రధాన ప్రతిపక్షంగా ఏ పార్టీ కనిపించడం లేదని డిప్యూటీ సీఎం భట్టి వ్యాఖ్యానించారు. భావస్వేచ్ఛపై తమ ప్రభుత్వానికి విశ్వాసం ఉన్నందునే ఆయా పార్టీలు వారి సిద్ధాంతాలను ప్రచారం చేసుకునే అవకాశమిచ్చామన్నారు.

- వివరాలు 3లో▶

దళిత నేతకు సీపీఎం పగ్గాలు



భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు) తెలంగాణ కార్యదర్శిగా జాన్‌వెస్లీ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. వనపర్తి జిల్లా అమరచింతకు చెందిన జాన్‌వెస్లీ డీవైఎఫ్ఐ, కులవివక్ష వ్యతిరేక పోరాట సమితి (కేవీపీఎస్) రాష్ట్ర అధ్యక్షునిగా పనిచేశారు.

- వివరాలు 12లో▶

మైనర్ డ్రైవింగ్.. ట్రిపుల్ రైడింగ్.. ఓవర్ స్పీడ్

- హైదరాబాద్‌లో నలుగురు బాలుర దుర్మరణం.. ఓ ఘటనలో ముగ్గురు.. మరో ఘటనలో ఒకరు..

- వివరాలు 5లో▶

రూ.1.80 లక్షల కోట్ల పెట్టుబడులు

14 నెలల్లో అతిపెద్ద విజయం

విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న సీఎం రేవంత్‌రెడ్డి. చిత్రంలో మంత్రులు పొంగులేటి, శ్రీధర్‌బాబు, తుమ్మల, సీతక్క



దావోస్‌లో 25 సంస్థలతో ఒప్పందాలు కుదిరాయి

మీడియాతో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి

- కొందరు హైదరాబాద్‌పై అపోహలు సృష్టించేలా విష ప్రచారం చేశారు
- రాష్ట్ర ఆర్థిక వ్యవస్థ మూలాలను దెబ్బతీసేందుకు కుట్రలు చేశారు
- భారీ పెట్టుబడులతో వారి కుట్రలు పటాపంచలయ్యాయన్న సీఎం
- ఫార్ములా–ఈ వ్యవహారంలో డబ్బులు కొల్లగొట్టి లండన్‌లో పెట్టుబడులు పెట్టారని ఆరోపణ

సాక్షి, హైదరాబాద్: 'తమ అనుచరులు, తమ దగ్గరున్న అక్రమ నిధులతో తెలంగాణ ప్రభుత్వం, హైదరాబాద్‌పై అపోహలు, అనుమానాలు సృష్టించేలా కొంత మంది విష ప్రచారం చేస్తూ రాష్ట్ర ఆర్థిక వ్యవస్థ మూలాలను దెబ్బతీసేందుకు కుట్రలు చేశారు. కానీ ప్రపంచ దిగ్గజ కంపెనీలు రాష్ట్ర ప్రభుత్వంపై సంపూర్ణ విశ్వాసం ఉంచి రూ.1.80 లక్షల కోట్ల పెట్టుబడులు పెట్టేందుకు ముందుకు రావడంతో ఈ కుట్రలు, కుతంత్రాలు పటాపంచలయ్యాయి. మేము అధికారం చేపట్టిన 14 నెలల్లో ఇదో పెద్ద విజయం. అమెజాన్ రూ.60 వేల కోట్లు, సన్ పెట్రోకెమికల్స్ రూ.45 వేల కోట్ల పెట్టుబడులు పెట్టేందుకు ఒప్పందాలు చేసుకున్నాయి. మొత్తం 25 సంస్థలతో ఎంఓయూలు కుదిరాయి..' అని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తెలిపారు. మంగళవారం సచివాలయంలో

మిగతా 2వ పేజీలో ▶

ఎన్నికల ముందు పథకాల డ్రామా

- నల్లగొండ రైతు మహాధర్నాలో ప్రభుత్వంపై కేటీఆర్ ధ్వజం
- స్థానికసంస్థల ఎన్నికలు పూర్తయితే రైతు భరోసా బంద్ అవుతుందని వ్యాఖ్య.. ఆరు గ్యారంటీల అమల్లో సీఎం రేవంత్‌ది మోసమేనంటూ మండిపాటు

12లో





- కొన్నేళ్లుగా రాష్ట్రం ఆశించిన మేర ప్రయోజనం చేకూర్చని కేంద్ర బడ్జెట్లు
- గత బడ్జెట్ కేటాయింపుల్లోనూ అనుకున్నట్టుగా రాని నిధులు
- ఈసారి ఫ్యూచర్ సిటీ, ట్రిపుల్ ఆర్, మెట్రోరైలు విస్తరణ ప్రాజెక్టులకు నిధులు ఆశిస్తున్న రాష్ట్ర ప్రభుత్వం
- కేంద్రం సహకరిస్తేనే మూసీ పునరుజ్జీవం, రేడియల్ రోడ్లు, గ్రీన్‌ఫీల్డ్ హైవే పనులకు చాన్స్
- పన్నుల్లో వాటా పెంపు,గ్రాంట్ల కోసం సర్కారు ఎదురుచూపులు

మురిపించేనా.. మొండిచెయ్యేనా?

సాక్షి, హైదరాబాద్

ఫిబ్రవరి ఒకటో తేదీన ప్రవేశపెట్టనున్న కేంద్ర బడ్జెట్‌పై రాష్ట్రం గంపెడాశలు పెట్టుకుంది. గత ఏడాది కేటాయింపులు కార్యరూపం దాల్చకపోవడం, ఆశించిన మేర నిధులు రాకపోవడంతో కించిత్ దూరంలో ఉన్న కీలక ప్రాజెక్టులు ఈసారైనా కేంద్ర సాయం దక్కక పోతుందా అని ఎదురుచూస్తున్నాయి. అలాగే ఫ్యూచర్ సిటీ మొదలు అనేక అభివృద్ధి ప్రణాళికలు, కార్యక్రమాలకు నిధులు కావాల్సి ఉంది. రాష్ట్ర విభజన సమయంలో ఇచ్చిన హామీల అమలు, పాలమూరు–రంగారెడ్డి సాగునీటి ప్రాజెక్టుకు జాతీయ హోదాలాంటి పాత డిమాండ్లు నెరవేర్చాలని కోరడంతో పాటు, ట్రిపుల్ ఆర్, మెట్రో రైలు విస్తరణ లాంటి కొత్త పనులకు కూడా నిధులు కావాలని రాష్ట్ర ప్రభుత్వం అడుగుతోంది. అయితే గత కొన్నేళ్లుగా కేంద్ర బడ్జెట్ ఆశించిన మేర రాష్ట్రానికి ప్రయోజనం చేకూర్చడం లేదు. దీంతో నిర్మలా సీతారామన్ బడ్జెట్ ఈసారైనా మంచి చేయకపోతుందా.. మరిన్ని నిధులు వచ్చేలా ప్రతిపాదనలు చేయకపోతుందా..పన్నుల్లో వాటా పెంచకపోతుందా, గ్రాంట్లు ఇవ్వకపోతుందా

మిగతా 12వ పేజీలో ▶

ఏఐ 'డీప్' వార్!

ప్రపంచ టెక్నాలజీ రంగంలో డీప్‌సీక్ ఏఐ కుదుపు



- అతి తక్కువ ఖర్చుతో ఏఐ మోడల్‌ను రూపొందించిన చైనా స్టార్టప్
- డ్రాగన్ అనూహ్య పోటీతో పాశ్చాత్య టెక్ కంపెనీల్లో వణుకు.. పేకమేడల్లా కుప్పకూలిన 'ఏఐ' సంబంధిత షేర్లు...
- ఏఐ ఎకోసిస్టమ్‌లో సమూల మార్పులు తప్పవంటున్న విశ్లేషకులు

16లో



మా పరిశోధకుల్లో ఎక్కువ మంది చైనా టాప్ యూనివర్సిటీల నుంచి తీసుకున్న ఫ్రెష్ గ్రాడ్యుయేట్లే. భారీ పెట్టుబడులతో నవకల్పనలు పెరుగుతాయంటే పొరపాటే. అదే నిజమైతే ప్రపంచంలోని ఇన్నోవేషన్ అంతా బడా కంపెనీల చేతుల్లోకి వెళ్లిపోయేది

- డీప్‌సీక్ ఫౌండర్ లియాంగ్ వెన్‌ఫెంగ్

డీప్‌సీక్‌పై సైబర్‌దాడి

కొద్దిసేపు సేవలకు అంతరాయం

- వివరాలు 6లో

అమెరికన్లపై ఆదాయపు పన్ను ఉండదు



- వివరాలు 6లో

వచ్చే నెలలో అమెరికాకు మోదీ!: ట్రంప్

నాగోబాకు మహాపూజలు

- వివరాలు 5లో





విద్యుత్ కాంతుల్లో నాగోబా ఆలయం

కాళ్ల నుంచి మెడ దాకా.. నరకం!



గులియన్ బ్యారీ సిండ్రోమ్ (జీబీఎస్).. మహారాష్ట్రలోని పుణేలో తాజాగా కలకలం సృష్టిస్తున్న వ్యాధి. దీని బారినపడి 110 మంది ఆస్పత్రులపాలయ్యారని.. మహారాష్ట్ర చరిత్రలోనే తొలిసారిగా ఒకరు ఈ వ్యాధితో మరణించారని వార్తలు చక్కర్లు కొడుతున్నాయి. ఏదైనా వైరల్ లేదా బ్యాక్టీరియల్ ఇన్ఫెక్షన్ సోకాక పోస్ట్ వైరల్ లేదా పోస్ట్ బ్యాక్టీరియల్ వ్యాధిగా కనిపించే ఈ సమస్య కాళ్లు చచ్చుబడిపోవడంతో ప్రారంభమవుతుంది. చిత్రంగా బాధితుల వైటల్స్... అంటే నాడి, రక్తపోటు వంటివన్నీ సాధారణంగానే ఉంటాయి. కానీ కాళ్ల దగ్గర్నుంచి క్రమంగా పైపైపునకు శరీరం అచేతనమవుతూ వస్తుంది. అలా ఊపిరితిత్తులను ప్రభావితం చేస్తే శ్వాస తీసుకోలేక బాధితులు మృతిచెందే అవకాశం ఉంది. ఈ నేపథ్యంలో ఈ వ్యాధి లక్షణాలు, రోగ నిర్ధారణ, చికిత్స పద్ధతుల గురించి వివరాలివీ..

మహారాష్ట్రలోని పుణేలో కలకలం సృష్టిస్తున్న గులియన్ బ్యారీ సిండ్రోమ్ | కాళ్ల నుంచి మెడ కండరాల దాకా శరీరమంతా అచేతనం కావడం ప్రధాన రోగ లక్షణం | నిర్ధారణ, చికిత్స పద్ధతులివీ...

కలుషిత నీటి వాడకంతో మొదలు..

గతంలో జీబీఎస్ వ్యాధి చాలా అరుదుగా కనిపించేది. ప్రతి లక్ష మందిలో కేవలం ఒకరిద్దరికే ఈ వ్యాధి వచ్చేది. ఇప్పుడు వందలాది మందిని ప్రభావితం చేస్తోంది. ఇటీవల దీని విస్తృతి పెరిగింది. ఇది ఏ వయసువారిలోనైనా రావచ్చు. అయితే పుణేలో అనేక మంది కలుషితమైన నీటిని వాడటంతో ఈ వ్యాధి ప్రబలినట్లు తేలింది. సాధారణంగా పోస్ట్ వైరల్/బ్యాక్టీరియల్ ఇన్ఫెక్షన్ వల్ల ఈ వ్యాధి వస్తుంటుంది. అక్కడి నీళ్లలో నోరో వైరస్, క్యాంపైలో బ్యాక్టీరియా ఉందని.. ఆ వైరస్, బ్యాక్టీరియాల ప్రభావంతో వ్యాధినిరోధక శక్తి బాధితుల నరాలపై ఉన్న మైలీన్ పొరను దెబ్బతీయడంతో ఈ ఆటోఇమ్యూన్ వ్యాధి వచ్చినట్లు ప్రాథమిక నివేదికల్లో తేలింది.

బాధితులు అచేతనం కావడం ఎందుకంటే...

మనిషి ప్రతి అవయవాన్నీ మెదడు నియంత్రిస్తుంటుంది. మెదడు నుంచి దేహంలోని ప్రతి భాగానికీ ఆదేశాలందించే నరాలపై మైలీన్ అనే పొర ఉంటుంది. సొంత వ్యాధినిరోధక వ్యవస్థలోని యాంటీబాడీస్ తమ సొంత మైలీన్ పొరను దెబ్బతీసినప్పుడు మెదడు నుంచి వచ్చే సిగ్నల్స్ అందకపోవడంతో అవయవాలు చచ్చుబడి అచేతనమవుతాయి.

ఇవీ లక్షణాలు..

- మెదడు నుంచి కాళ్ల వరకు పొడవుగా ఉండే కాలి నరాలు ప్రభావితమై కాళ్లు చచ్చుబడిపోతాయి.
- అచేతనం కావడం కింది నుంచి ప్రారంభమై పైకి పాకుతుంది. దాంతో వీపు భాగం, చేతులు, మెడ కండరాలు ఇలా దేహమంతా పూర్తిగా అచేతనమవుతుంది.
- గొంతు కండరాలు అచేతనమైతే రోగి మాట్లాడలేడు. మింగడమూ కష్టమవుతుంది. ముఖంలోని కండరాలు అచేతనమైతే కళ్లు కూడా మూయలేడు.
- అచేతనమయ్యే ఈ ప్రక్రియ ఛాతీ, కండరాలు, ఊపిరితిత్తులను పనిచేయించే డయాఫ్రమ్ కండరాల వరకు వెళ్లినప్పుడు ఊపిరితీసుకోవడం కష్టమవుతుంది. ఈ జబ్బును పూర్తిగా ప్రమాదకరంగా మార్చే అంశమిదే.

వేర్వేరుగా తీవ్రత స్థాయి

కండరాలు అచేతనం కావడంలోని ఈ తీవ్రత ఒక్కొక్కరిలో ఒక్కోలా ఉంటుంది. కొందరిలో స్వల్పంగా ఉంటే మరికొందరిలో తీవ్రత ఎక్కువగా ఉంటుంది. తీవ్రత స్వల్పంగా ఉంటే నడక కష్టమవుతుంది. వ్యాధి తీవ్రత ఎక్కువగా ఉంటే బాధితులు పూర్తిగా మంచానికే పరిమితమవుతారు. చాలా మందిలో తమ ప్రమేయం లేకుండా జరిగిపోయే కీలకమైన జీవక్రియలు చాలా అరుదుగా మాత్రమే ప్రభావితమవుతాయి. కొందరిలో అవి కూడా ప్రభావితమైనప్పుడు గుండె స్పందనలు వేగంగా లేదా మెల్లగా మారడం, బీపీ హెచ్చుతగ్గులకు గురికావడం, ముఖం నుంచి వేడి ఆవిర్లు వస్తున్నట్లు అనిపించడం, బాగా చెమటలు పట్టడం జరగవచ్చు.

ఎప్పుడు ప్రమాదకరమంటే...

వ్యాధి మొదలయ్యాక క్రమంగా 7 నుంచి 14 రోజులపాటు తీవ్రం కావచ్చు. మైలీన్ పొర మళ్లీ యథాస్థితికి వస్తే బాధితుడు క్రమంగా కోలుకోవడం మొదలవుతుంది. ఇలా కోలుకోవడమన్నది రోజుల వ్యవధి నుంచి ఆరు నెలలలోగా జరగవచ్చు.

జీబీ సిండ్రోమ్ లక్షణాలే కనిపించే మరికొన్ని జబ్బులు

శరీరంలో పొటాషియం లేదా కాల్షియం పాళ్లు తగ్గితే జీబీఎస్‌లో కనిపించే లక్షణాలే కనిపిస్తాయి. అయితే అవి భర్తీ కాగానే అచేతనత్వం తగ్గిపోతుంది. ఇక శరీరంలో అకస్మాత్తుగా క్రియాటినిన్ పాళ్లు పెరిగిపోవడం, డిఫ్తీరియా, హెచ్ఐవీ, లింఫోమా వంటి జబ్బుల్లోనూ జీబీ సిండ్రోమ్‌లోని లక్షణాలే కనిపిస్తాయి.

నిర్ధారణ ఇలా..

గులియన్ బ్యారీ సిండ్రోమ్ వంటి లక్షణాలతోనే మరికొన్ని ఇతర సమస్యలు వ్యక్తం కావడంతోపాటు పొటాషియం, కాల్షియం వంటి ఖనిజ లవణాలు తగ్గడం లేదా పెరగడం వల్ల కూడా ఇలాంటి లక్షణాలే కనిపిస్తాయి. కాబట్టి జీబీ సిండ్రోమ్ నిర్ధారణ చాలా స్పష్టంగా జరగాలి. అందుకే రోగుల్లో తొలుత సాధారణ రక్తపరీక్ష చేసి అందులో పొటాషియం, కాల్షియం పాళ్లను, క్రియాటినిన్ మోతాదులను పరిశీలిస్తారు. అవన్నీ సక్రమంగా ఉన్నప్పుడు నర్వ్ కండక్షన్ పరీక్షల ద్వారా జీబీ సిండ్రోమ్‌ను నిర్ధారణ చేస్తారు. అయితే ఈ పరీక్షతో వ్యాధి తీవ్రత తెలియదు. కొన్నిసార్లు వెన్ను నుంచి నీరు తీసే 'సెరిబ్రో స్పైనల్ ఫ్లూయిడ్'(సీఎస్ఎఫ్) పరీక్ష కూడా అవసరం కావచ్చు.

చికిత్స..

ఈ జబ్బులో రోగి తన రోజువారీ పనులను సొంతంగా చేసుకోలేని పరిస్థితికి చేరుకుంటే ఈ కింది చికిత్సలు అందుబాటులో ఉన్నాయి.

- **ఇమ్యూనోగ్లోబ్యులిన్ చికిత్స:** శరీర బరువు ఆధారంగా వారికి తగిన మోతాదులో 5 రోజులపాటు ఇమ్యూనోగ్లోబ్యులిన్ ఇంజెక్షన్లను ఇవ్వడమన్నది ఒక చికిత్స ప్రక్రియ. ఇవి దేహంలో మైలీన్ షీత్‌ను ధ్వంసం చేసే యాంటీబాడీస్‌ను బ్లాక్ చేయడం ద్వారా పరిస్థితిని చక్కదిద్దుతాయి.
- **ప్లాస్మా ఎక్స్ఛేంజ్ చికిత్స:** ఈ చికిత్స ప్రక్రియలో శరీరం బరువునుబట్టి ప్రతి కిలోగ్రాముకూ 250 ఎంఎల్ ప్లాస్మాను రక్తం నుంచి తొలగిస్తారు. అందులో ఐదు విడతలుగా రోజు విడిచి రోజు రక్తంలోని ప్లాస్మాను తీసేయడం ద్వారా ప్లాస్మాలోని యాంటీబాడీస్‌ను తొలగించడం జరుగుతుంది. ఈ రెండు చికిత్సల్లో ఇమ్యూనోగ్లోబ్యులిన్ చికిత్స చాలా ఖరీదైనది. దానితో పోలిస్తే ప్లాస్మా ఎక్స్ఛేంజ్ చికిత్స దాదాపు సగం ఖర్చులోనే అవుతుంది.

మరణాలు 5 శాతం లోపే..

ఈ వ్యాధి సోకిన వారిలో 70 శాతం మంది పూర్తిగా కోలుకుంటారు. మరో 10 శాతం మందిలో చెప్పుకోదగ్గ పురోగతి ఉండదు. కేవలం 3 శాతం నుంచి 5 శాతం రోగులు మెరుగైన చికిత్స ఇప్పించినప్పటికీ మృత్యువాత పడే అవకాశాలున్నాయి. యువకులు, టీనేజీ పిల్లలు వేగంగానే కోలుకుంటారు. పైగా దీని ఉనికేలేని తెలుగు రాష్ట్రాల వారిలో ఆందోళన అక్కర్లేదు. కాకపోతే కలుషితమైన నీరు, ఆహారం వాడకపోవడం అన్ని విధాలా మేలని గుర్తించాలి.

- ఫ్యామిలీ హెల్త్ డెస్క్

క్లుప్తంగా...

రాజకీయ లబ్ధి కోసమే తప్పుడు కేసు

- ఫోన్ ట్యాపింగ్ కేసులో హరీశ్‌రావు అఫిడవిట్
- ఫిబ్రవరి 5 వరకు అరెస్టు వద్దన్న హైకోర్టు

సాక్షి, హైదరాబాద్: రాజకీయ లబ్ధి కోసమే తనపై తప్పుడు కేసు బనాయించారని మాజీ మంత్రి తన్నీరు హరీశ్‌రావు తెలిపారు. ఈ మేరకు హైకోర్టులో ఆయన అఫిడవిట్ దాఖలు చేశారు. పంజగుట్ట పీఎస్‌లో తనపై నమోదు చేసిన 'ట్యాపింగ్' కేసును కొట్టివేయాలని కోరుతూ హైకోర్టులో హరీశ్‌రావు పిటిషన్ దాఖలు చేసిన విషయం తెలిసిందే. ఈ పిటిషన్‌పై న్యాయమూర్తి జస్టిస్ కె.లక్ష్మణ్ మంగళవారం విచారణ చేపట్టారు. సుప్రీంకోర్టు న్యాయవాదులు హాజరై వాదనలు వినిపిస్తారని.. వాయిదా వేయాలని పీపీ పల్లె నాగేశ్వర్‌రావు, పిటిషనర్ న్యాయవాది కోరారు. అంగీకరించిన న్యాయమూర్తి.. హరీశ్‌రావును ఫిబ్రవరి 5 వరకు అరెస్టు చేయవద్దని పోలీసులను ఆదేశించారు. గతంలో ఇచ్చిన మధ్యంతర ఉత్తర్వులను మరోసారి పొడిగిస్తూ విచారణ వాయిదా వేశారు. ఈ సందర్భంగా హరీశ్ అఫిడవిట్ దాఖలు చేశారు. 'నాపై ఆరోపణలకు ఆధారాలు లేవు. చక్రధర్‌గౌడ్ ఫిర్యాదు మేరకు నమోదైన కేసును కొట్టేయాలి. రాజకీయ లబ్ధికోసమే తప్పుడు కేసు పెట్టారు. ఫిర్యాదుదారుడిపై అత్యాచారం, కిడ్నాప్ వంటి 11 పోలీసు కేసులున్నాయి. నా ప్రతిష్టను దెబ్బతీయడానికే తప్పుడు కేసు పెట్టారు. ప్రాథమిక విచారణ కూడా చేయకుండానే పోలీసులు ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. ఈ కేసును కొట్టేయండి' అని అఫిడవిట్‌లో హరీశ్‌రావు పేర్కొన్నారు.

సమ్మె నోటీసుతో సంబంధం లేదు: ఆర్టీసీ జేఏసీ

సాక్షి, హైదరాబాద్: ఆర్టీసీ యాజమాన్యానికి సోమవారం కొన్ని సంఘాల నేతలు ఇచ్చిన సమ్మె నోటీసుతో తమకు ఏమాత్రం సంబంధం లేదని ఆర్టీసీలోని పలు సంఘాలు, ముఖ్య సంఘాల ప్రధాన నేతలతో కూడిన జేఏసీ ప్రకటించింది. తమతో చర్చించకుండా ఏకపక్ష నిర్ణయాలతో ఆ నోటీసు ఇచ్చారని జేఏసీ చైర్మన్ అశ్వత్థామరెడ్డి, కన్వీనర్ నరేందర్, కో-కన్వీనర్లు స్వామికుమార్, హరికిషన్‌లు ఒక ప్రకటనలో స్పష్టం చేశారు. గతంలో బీఆర్ఎస్ పంచన చేరి కార్మికులకు ద్రోహం చేసిన వ్యక్తి.. ఇప్పుడు ఆ నోటీసు ఇచ్చిన జేఏసీలో భాగంగా ఉన్నారని పేర్కొన్నారు. దీంతో ఆ జేఏసీకి ఇటు ప్రభుత్వం, అటు కార్మికుల వద్ద ఎలాంటి గుర్తింపు ఉండదు కాబట్టే దూరంగా ఉన్నామని తెలిపారు. ఇప్పటికైనా అన్ని సంఘాలతో చర్చించి ప్రభుత్వం దగ్గరికి వెళ్తే సమస్యల పరిష్కారానికి వీలవుతుందని అభిప్రాయపడ్డారు.

తెలంగాణకు మణిహారంగా ఎక్స్‌పీరియం ఎకోపార్కు

వికారాబాద్‌ను ఎకో టూరిజంగా అభివృద్ధి చేసేందుకు ప్రణాళిక

- ప్రొద్దుటూరులోని ఎకో పార్కు ప్రారంభోత్సవంలో సీఎం రేవంత్‌రెడ్డి
- త్వరలోనే కొత్త టూరిజం పాలసీ తెస్తామని ప్రకటన



చిరంజీవికి జ్ఞాపికను అందజేస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి. చిత్రంలో మంత్రి జూపల్లి, రాందేవ్‌రావు

శంకర్‌పల్లి: 'ఎక్స్‌పీరియం ఎకోపార్కు' రాష్ట్రానికి మణిహారంగా మారుతుందని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. రంగారెడ్డి జిల్లా శంకర్‌పల్లి మండలం ప్రొద్దుటూరు వద్ద 150 ఎకరాల విస్తీర్ణంలో 85 దేశాల నుంచి తెచ్చిన 25 వేల మొక్కలతో ఏర్పాటు చేసిన 'ఎక్స్‌పీరియం' ఎకో పార్కును ప్రముఖ సినీనటుడు చిరంజీవి, పర్యాటకశాఖ మంత్రి జూపల్లి కృష్ణారావుతో కలిసి మంగళవారం ఆయన ప్రారంభించారు. అనంతరం పార్కు యజమాని రాందేవ్‌రావుతో కలిసి ఎలక్ట్రిక్ వాహనంలో తిరుగుతూ పార్కును పరిశీలించారు. మొక్కల విశేషాలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో భాగంగా వనజీవి రామయ్య దంపతులు, ఇటీవల గవర్నర్ పురస్కారానికి ఎంపికైన దుశ్చర్ల సత్యనారాయణను సీఎం రేవంత్‌రెడ్డి, చిరంజీవి ఘనంగా సన్మానించారు. అనంతరం ఎక్స్‌పీరియం ఎకోపార్కు లోగో, కాఫీ టేబుల్‌బుక్‌ను ఆవిష్కరించారు. అయితే కార్యక్రమ ప్రారంభోత్సవంలో వేదికపైకి వనజీవి రామయ్యను పిలవకపోవడాన్ని గమనించిన సీఎం..వారిని వేదికపైకి పిలిచి గౌరవించారు.

టూరిజంతోనే గుర్తింపు, ఆదాయం

సీఎం రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ తెలంగాణ ఇప్పటికే ఐటీ, ఫార్మా, ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ రంగాల్లో రాణించిందని, టూరిజంను అభివృద్ధి చేసేందుకు వనరులున్నా, గత ప్రభుత్వాలు పట్టించుకోలేదన్నారు. టూరిజం ద్వారానే రాష్ట్రానికి గుర్తింపు, ఆదాయం లభిస్తుందని తెలిపారు. త్వరలోనే నూతన టూరిజం (టెంపుల్, ఎకో, హెల్త్) పాలసీని తీసుకొచ్చేందుకు మంత్రి జూపల్లి కృష్ణారావు నేతృత్వంలోని కమిటీ అధ్యయనం చేస్తోందన్నారు. వికారాబాద్ ప్రాంతంలో సాధారణం కంటే 2 నుంచి 3 డిగ్రీల ఉష్ణోగ్రత తక్కువ ఉంటుందని, ఈ ప్రాంతాన్ని ఎకో టూరిజం స్పాట్‌గా మారుస్తామని, ఇందుకోసం పెద్ద పెద్ద పరిశ్రమలు ముందుకు వస్తున్నాయని స్పష్టం చేశారు. 25ఏళ్ల కలను సాకారం చేసుకున్న ఎక్స్‌పీరియం పార్కు యజమాని రాందేవ్‌రావును సీఎం ప్రత్యేకంగా అభినందించారు. ఈ పార్కు తెలంగాణ పర్యాటక రంగానికి ఎంతో దగ్గరగా ఉందని, ప్రస్తుతం 30 శాతం మాత్రమే పూర్తయిందని, ఏడాదిలో పూర్తిస్థాయిలో అందుబాటులోకి వస్తుందని తెలిపారు. దీనికి ప్రభుత్వం పూర్తిస్థాయిలో సహకరిస్తుందని స్పష్టం చేశారు. వనజీవి రామయ్య జీవితాన్ని ప్రతిఒక్కరూ ఆదర్శంగా తీసుకొని ముందుకు సాగాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీలు కొండా విశ్వేశ్వర్‌రెడ్డి, సీఎం రమేశ్, అనిల్‌కుమార్, శాసనమండలి చీఫ్‌విప్ పట్నం మహేందర్ రెడ్డి, ఎమ్మెల్యేలు కాలె యాదయ్య, మల్‌రెడ్డి రంగారెడ్డి, ప్రముఖ రచయిత విజయేంద్ర ప్రసాద్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మధుసూదన్‌రెడ్డి, కలెక్టర్ నారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రస్తుతం నా సంపాదన అంతంతే: చిరంజీవి

'రాందేవ్ నాకు ఎన్నో ఏళ్ల నుంచి తెలుసు. దేశ, విదేశాల్లోని మొక్కలను తీసుకొచ్చి చూపిస్తూ తీసుకోండి సార్ అనేవారు. అప్పుడు రూ.వేలల్లో ఉన్న మొక్కలు ధరలు, ఇప్పుడు కోట్లలో ఉన్నాయి. ప్రస్తుతం నా సంపాదన అంతంత మాత్రమే ఉంది. తర్వాత కొనుగోలు చేస్తానంటూ' మెగాస్టార్ చిరంజీవి చమత్కరించారు. దీంతో సభలో నవ్వులు విరిశాయి. ప్రొద్దుటూరులో రాందేవ్‌రావు నిర్మించిన ఎక్స్‌పీరియం పార్కును చూడాలంటే కళా హృదయం ఉండాలని చిరంజీవి అన్నారు. తనకు ఈ ప్రాంతంతో 25 ఏళ్ల క్రితం నుంచి అనుబంధం ఉందన్నారు. 2000లో జీవం ఉన్న మొక్కలను అందించి రాందేవ్ తననే ఆశ్చర్యపరిచారని, ఆ మొక్కలు నేటికి తన గార్డెన్‌లో ఉన్నాయని తెలిపారు. షూటింగ్‌లకు అనుమతి ఇస్తారా అంటే తనకే ఫస్ట్ ఇస్తానని రాందేవ్ చెప్పారని, రానున్న రోజుల్లో ఇక్కడ షూటింగ్ చేసేందుకు తాను సుముఖంగా ఉన్నానని తెలిపారు.

ప్రపంచ నగరాలకు దీటుగా ఫ్యూచర్ సిటీ

రియల్టర్లకు ప్రభుత్వం అండగా ఉంటుంది

రియల్ ఎస్టేట్ సమ్మిట్-2025లో మంత్రి ఉత్తమ్



సదస్సులో మాట్లాడుతున్న మంత్రి ఉత్తమ్

మాదాపూర్: రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చాక ప్రపంచం నలుమూలల నుంచి పెట్టుబడులు పెట్టేందుకు పారిశ్రామిక వేత్తలు తరలిరావడం అభినందనీయమని రాష్ట్ర నీటిపారుదల, పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి పేర్కొన్నారు. మాదాపూర్‌లోని హెచ్ఐసీసీలో మంగళవారం 'హైదరాబాద్ రియల్ ఎస్టేట్ సమ్మిట్-2025'లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఇటీవల దావోస్‌లో జరిగిన వరల్డ్ ఎకనామిక్ ఫోరమ్ సమ్మిట్‌లో పాల్గొని తమ ప్రభుత్వం రాష్ట్రానికి 1.78 లక్షల పెట్టుబడులు తీసుకువచ్చిందని తెలిపారు. రియల్ ఎస్టేట్ రంగానికి ప్రభుత్వం పూర్తి స్థాయిలో చేయూతనందిస్తుందని ఆయన స్పష్టం చేశారు. ఐటీ, నిర్మాణరంగం వాటితో పాటు పరిశ్రమలకు వృత్తినైపుణ్యం కలిగిన వారిని అందించేందుకు అంతర్జాతీయ ప్రమాణాలతో కూడిన వృత్తి నైపుణ్య విశ్వవిద్యాలయం ఏర్పాటు చేస్తున్నట్టు వెల్లడించారు. అలాగే అంతర్జాతీయ ప్రమాణాలతో కూడిన క్రీడా విశ్వవిద్యాలయం ఏర్పాటు చేయనున్నట్టు తెలిపారు. ప్రభుత్వం చేపట్టిన మూసీ పునరుజ్జీవం హైదరాబాద్ అభివృద్ధిలో భాగమేనన్నారు. గ్లోబల్ సిటీగా ఎదుగుతున్న హైదరాబాద్ మహానగరంలో ప్రజల దాహార్తిని తీర్చేందుకు గోదావరి జలాలను సరఫరా చేసేందుకు ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. పెరుగుతున్న ట్రాఫిక్ రద్దీని నియంత్రించేలా మెట్రోని విస్తరించేందుకు ఉపక్రమించినట్టు ఉత్తమ్ తెలిపారు.

ఇందిరమ్మ ఇళ్లకు ఇసుకపై ప్రత్యేక విధానం

ఖరారు కోసం కమిటీ ఏర్పాటు చేసిన సీఎం

సాక్షి, హైదరాబాద్: ఇందిరమ్మ ఇళ్లకు ఇసుక సరఫరా చేసే విధానం ఖరారుకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఒక కమిటీని ఏర్పాటు చేశారు. కమిటీ సభ్యులుగా రాష్ట్ర ఆర్థిక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, గనుల శాఖ ముఖ్య కార్యదర్శి ఎన్.శ్రీధర్, ఫ్లాగ్‌షిప్ ప్రోగ్రామ్స్ కమిషనర్ శశాంక, టీజీ ఎండీసీ మేనేజింగ్ డైరెక్టర్ సుశీల్ కుమార్‌లను నియమించారు. వీరు వారంలోపు నివేదిక సమర్పించాలని సీఎం ఆదేశించారు. ఇందిరమ్మ ఇళ్లకు ఇసుక సరఫరా.. గనుల శాఖపై రాష్ట్ర సచివాలయంలో ముఖ్యమంత్రి మంగళవారం సమీక్ష నిర్వహించారు. రాష్ట్రంలో పెద్ద సంఖ్యలో చేపట్టే ఇందిరమ్మ ఇళ్లకు ఇసుక సరఫరాపై ప్రత్యేక విధానం అవసరమని సీఎం అభిప్రాయపడ్డారు. రాష్ట్రంలో ఏటేటా నిర్మాణాలు పెరుగుతున్నా.. ఇసుక నుంచి ప్రభుత్వానికి ఆదాయం ఆశించినంత రావడం లేదని, అదే సమయంలో ప్రజలు మాత్రం ఇసుకపై భారీ మొత్తాన్ని వెచ్చించాల్సి వస్తోందని పేర్కొన్నారు. దీన్ని మార్చాల్సి ఉందని, ప్రభుత్వానికి ఇసుక రూపంలో ఆదాయం పెరగటంతోపాటు.. ప్రజలకు తక్కువ ధరకే ఇసుక అందుబాటులో ఉండేలా చూడాలని సూచించారు. ఇది జరగాలంటే ఇసుక మాఫియా నియంత్రణకు తగు చర్యలు తీసుకోవాల్సి ఉందని పేర్కొన్నారు. మేజర్, మైనర్ ఖనిజ విధానంపై సమగ్రంగా అధ్యయనం చేసి రెండు వారాల్లో నివేదిక సమర్పించాలని అధ్యయన కమిటీని సీఎం ఆదేశించారు. సమీక్షలో గృహనిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పెట్టుబడులపై సీఎం కట్టుకథలు

- పెట్టుబడులపై పొంతన లేని లెక్కలు
- రైతు భరోసాకు ఇంకెన్ని గడువులు?
- మాజీ మంత్రి హరీశ్‌రావు



సాక్షి, హైదరాబాద్: దావోస్‌లో అల్లిన పెట్టుబడుల కట్టుకథను నమ్మించేందుకు సీఎం రేవంత్ రెడ్డి శత విధాలుగా ప్రయత్నించి అట్టర్‌ఫ్లాప్ అయ్యారని బీఆర్ఎస్ ఎమ్మెల్యే, మాజీ మంత్రి హరీశ్ రావు విమర్శించారు. దావోస్ పెట్టుబడుల పేరిట ప్రభుత్వం విడుదల చేసిన పత్రిక ప్రకటనలు, మీడియా కవరేజ్, ఈనో కథలను ఎవరూ నమ్మడం లేదని భావించిన సీఎం రేవంత్.. స్వయంగా రంగంలోకి దూకి మీడియా సమావేశం ఏర్పాటు చేశారని మండిపడ్డారు. మంగళవారం విలేకరుల సమావేశంలో సీఎం రేవంత్ చేసిన వ్యాఖ్యలను హరీశ్‌రావు ఒక ప్రకటనలో ఖండించారు. దావోస్‌లో కుదిరిన అవగాహన ఒప్పందాలన్నీ కేవలం పెట్టుబడులకు ఆసక్తి వ్యక్తీకరణ మాత్రమేనని స్పష్టం చేశారు. పెట్టుబడుల విషయంలో సీఎం రేవంత్, డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క తలోమాట చెబుతున్నారని పేర్కొన్నారు. కంపెనీలు, పెట్టుబడులకు సంబంధించి సీఎం చెప్పిన పొంతన లేని లెక్కలు డొల్ల ప్రచారమని తెలంగాణ ప్రజానీకం గమనించిందని వ్యాఖ్యానించారు. రైతు భరోసా కోసం గంపెడాశ, కొండంత ఆందోళనతో ఎదురు చూస్తున్న రైతుల ఆరాటాన్ని సీఎం చిల్లర పంచాయితీ అంటున్నారని విమర్శించారు. రైతు భరోసా విషయంలో సంక్రాంతి, జనవరి 26 అంటూ గడువులు విధించి తాజాగా ఈ గడువును మార్చి 31 దాకా పొడిగించారని ఎద్దేవా చేశారు.

14 నెలల్లో అతిపెద్ద విజయం

▶ మొదటి పేజీ తరువాయి

సహచర మంత్రులతో కలిసి ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఇటీవలి దావోస్, సింగపూర్ పర్యటనల్లో వచ్చిన పెట్టుబడుల వివరాలను వెల్లడించారు.

ప్రవీణ్‌కుమార్‌ది బానిస మనస్తత్వం

'మేము స్వరాష్ట్రం, స్వదేశం, విదేశాల్లోని వారి దగ్గరున్న సొమ్మును పెట్టుబడులుగా మార్చి ఇక్కడ పరిశ్రమలు పెట్టిస్తే రాష్ట్ర ప్రభుత్వానికి పన్నుల ఆదాయంతో పాటు నిరుద్యోగులకు ఉద్యోగ, ఉపాధి అవకాశాల లభిస్తాయనే ఉద్దేశంతో దావోస్‌కు వెళ్లాం. కానీ ఫార్ములా-ఈ రేసు వ్యవహారంలో రాష్ట్ర ప్రజల సొమ్మును కొల్లగొట్టి విదేశాలకు తరలించారు. ఇక్కడి డబ్బులు తీసుకెళ్లి లండన్‌లో పెట్టుబడులు పెట్టారు..' అంటూ గత బీఆర్ఎస్ ప్రభుత్వంపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆరోపణలు చేశారు. ప్రజల సొమ్మును కొల్లగొట్టిన వారిపై తాము కేసులు పెట్టామని చెప్పారు. ఫార్ములా ఈ-రేసు వ్యవహారంలో తనపై బీఆర్ఎస్ నేత ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ పోలీసులకు ఫిర్యాదు చేయడంపై ఆయన స్పందించారు. తనపై ఫిర్యాదు చేసిన ఆయనది బానిస మనస్తత్వం అని, ఏదో ఒకరోజు ఆయన బానిస సంకెళ్లు తెంచుకోవాలని సూచించారు.

అమీర్‌పేట సెంటర్‌లో జరిగితేనే ఒప్పందమా?

'రాష్ట్రానికి పెట్టుబడులు వస్తుంటే వారికి అక్కసు, కడుపులో మంట ఎందుకు? మేము ఎక్కడో ఓ చోట విఫలమైతే చూసి పైశాచిక ఆనందం పొందాలనేదే వారి ఉద్దేశం. మహారాష్ట్రలోని రిలయన్స్ ఇండస్ట్రీతో ఆ రాష్ట్ర సీఎం దావోస్‌లో ఒప్పందం చేసుకుంటే ఎవరూ ప్రశ్నించలేదు. కానీ తెలంగాణలోని (మేఘా) కంపెనీతో మేము దావోస్‌లో ఒప్పందం చేసుకుంటే ప్రశ్నిస్తున్నారు. ఇక్కడ అమీర్‌పేట సెంటర్‌లో జరిగితేనే ఒప్పందమా? శ్వేతపత్రం అంటే ఏమిటో తెలియకుండా దాన్ని విడుదల చేయాలంటున్నారు. అన్ని ఒప్పందాల వివరాలు, ఫోటోలను కూడా ఇచ్చాం. అవే శ్వేతపత్రం. కొత్తగా తీసుకువచ్చిన ఎనర్జీ పాలసీలో ఓపెన్ యాక్సెస్ విధానంలో విద్యుత్ కొనుగోలు చేసేందుకు అవకాశం కల్పించడంతో డేటా సెంటర్ల ఏర్పాటుకు రూ.లక్ష కోట్ల పెట్టుబడులు వచ్చాయి..' అని సీఎం తెలిపారు. 'పెళ్లి చూపులు అయ్యాయి. లగ్న పత్రిక రాసుకున్నం. మిగతా కార్యక్రమాలు ముందు ఉన్నయి.' అని వ్యాఖ్యానించారు. 'తెలంగాణ తలసరి ఆదాయంలో దేశంలోనే అగ్రస్థానంలో ఉంది. అలాగే దేశంలోనే అత్యధిక ఆదాయం కలిగిన రాష్ట్రంగా తెలంగాణ మారాలి. రాష్ట్రాన్ని ట్రిలియన్ డాలర్ ఎకనామీకి తీసుకెళ్లాలని నిరంతరం కృషి చేస్తున్నాం. భవిష్యత్తులో మరిన్ని పెట్టుబడులు తెచ్చి ఆదాయంలో అగ్రస్థానంలో పెడతాం..' అని రేవంత్ చెప్పారు.

ఇటీవల అటెన్షన్ సీకింగ్ అనే జబ్బు కనిపెట్టారు

'ఈ మధ్య పరిశోధనలో అటెన్షన్ సీకింగ్ డిజార్డర్ అనే ఒక కొత్త జబ్బు కనిపెట్టారు. ఎక్కడైనా పెళ్లికి వెళ్లినప్పుడు అటెన్షన్ అంతా పెళ్లి పిల్లగాడిపైనే ఉండటం చూసి.. తానే పెళ్లి పిల్లగాడినైతే బాగుండని, ఎక్కడైనా సావుకు పోయినప్పుడు శవయాత్ర జరుగుతుంటే తానే శవాన్ని అయితే ఇంకా బాగుండు అని ఆ జబ్బుతో బాధపడేవారికి ఉంటుంది..' అంటూ బీఆర్ఎస్ నేత కేటీఆర్‌ను ఉద్దేశించి సీఎం పరోక్ష వ్యాఖ్యలు చేశారు.

చంద్రబాబు వ్యాఖ్యలపై నో కామెంట్

పెట్టుబడుల కోసం దావోస్‌కు వెళ్లరంటూ ఏపీ సీఎం చంద్రబాబునాయుడు చేసిన వ్యాఖ్యలపై స్పందించేందుకు ముఖ్యమంత్రి నిరాకరించారు. పెట్టుబడులే కాకుండా ప్రపంచం ఏ విధంగా ముందుకు వెళ్తుందో తెలుసుకునేందుకు అక్కడికి వెళ్తామని అన్నారు.

సింగపూర్‌తో కలిసి పనిచేస్తాం..

యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీ సిలబస్, అధ్యాపకులకు శిక్షణ, స్టూడెంట్స్ ఎక్స్ఛేంజీతో పాటు ఆర్థిక అంశాలపై సింగపూర్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ ఇన్ ఎడ్యుకేషన్ (ఐటీఈ)తో ఎంఓయూ చేసుకున్నట్టు సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి శ్రీధర్‌బాబు తెలిపారు. సాంకేతిక నైపుణ్యాన్ని ఇచ్చిపుచ్చుకోవడం ద్వారా సింగపూర్ ప్రభుత్వంతో కలిసి పని చేసేందుకు ఒప్పందం చేసుకున్నామని చెప్పారు. సింగపూర్ విదేశాంగ, పెట్టుబడుల మంత్రులకు.. మూసీ ప్రక్షాళన, యువతలో నైపుణ్యాభివృద్ధికి తీసుకుంటున్న చర్యలు సీఎం వివరించగా, వారు తమ వంతు సహకారం అందిస్తామని హామీ ఇచ్చారని శ్రీధర్‌బాబు చెప్పారు.

కార్యాచరణ దశలో 17 ప్రాజెక్టులు

'గత ప్రభుత్వం 2022-23లో దావోస్‌లో రూ.20 వేల కోట్ల ఒప్పందాలు చేసుకుంటే మేము గత ఏడాది జనవరిలో రూ.40 వేల కోట్ల ఒప్పందాలు చేసుకున్నాం. 14 కంపెనీలతో 18 ప్రాజెక్టులకు ఎంఓయూలు చేసుకోగా, 17 ప్రాజెక్టులు కార్యాచరణ దశలో ఉన్నాయి. 10 ప్రాజెక్టుల నిర్మాణ పనులు 60-70 శాతం పూర్తయ్యాయి. మరో 7 ప్రాజెక్టులు ప్రారంభ దశలో ఉన్నాయి. తాజాగా రూ.1,78,950 కోట్లు, జూరిక్‌లో మరో రూ.4 వేలు కోట్లు కలిపి మొత్తం రూ.1,82,950 కోట్ల విలువైన పెట్టుబడులకు ఎంఓయూలు చేసుకున్నాం..' అని వివరించారు. విలేకరుల సమావేశంలో మంత్రులు తుమ్మల నాగేశ్వర్‌రావు, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, సీతక్క, జూపల్లి కృష్ణారావు తదితరులుపాల్గొన్నారు.

ఉద్యోగ విరమణ వయసు పెంపు లేదు

సీఎం రేవంత్ స్పష్టీకరణ

సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల ఉద్యోగ విరమణ వయసును 61 ఏళ్ల నుంచి 65 ఏళ్లకు పెంచుతారని జరుగుతున్న ప్రచారాన్ని సీఎం రేవంత్ రెడ్డి తోసిపుచ్చారు. మంగళవారం సచివాలయంలో విలేకరుల సమావేశం అనంతరం ఆయన వెళ్లిపోతూ.. కారిడార్‌లో మీడియా ప్రతినిధులతో ముచ్చటించారు. ఉద్యోగ విరమణ వయసు పెంపుపై మీడియానే ఊహించి వార్తలు రాసిందని సీఎం వ్యాఖ్యానించారు.


ప్రభుత్వ ఉపాధ్యాయుడు, విద్యార్థినికి 'ఆత్మీయ భరోసా'

మెదక్ జిల్లాలో వెలుగుచూసిన అక్రమాలు

మంత్రి దామోదరకు ఫిర్యాదు.. విచారణకు ఆదేశం

అల్లాదుర్గం (మెదక్): ప్రభుత్వ ఉపాధ్యాయుడు, ఓ విద్యార్థిని ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకం కింద ఎంపిక కావడం సర్వత్రా చర్చనీయాంశమైంది. కాంగ్రెస్ ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా అమలు చేసిన సంక్షేమ పథకాలలో మొదటి విడత, మొదటి రోజే మెదక్ జిల్లా అల్లాదుర్గం మండలంలో అక్రమాలు చోటు చేసుకున్నాయి. రాజకీయ నాయకులు, అధికారులు కుమ్మక్కై అనర్హులను ఎంపిక చేసి మంజూరు పత్రాలు అందజేశారు. స్థానికులు మంత్రి దామోదర రాజనర్సింహకు ఫిర్యాదు చేయడంతో వెంటనే స్పందించిన మంత్రి విచారణకు ఆదేశించారు. దీంతో మంగళవారం మండల పరిధిలోని నడిమితండాలో అక్రమాలపై అధికారులు విచారణ చేపట్టారు. రైతులకు రైతు భరోసా, భూమిలేని నిరుపేదలకు ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, ఇళ్లు లేని పేదలకు ఇందిరమ్మ ఇళ్లు, రేషన్ కార్డు పథకాలను రిపబ్లిక్ డే నాడు ప్రభుత్వం అమలు చేసింది. పైలెట్ గ్రామంగా అల్లాదుర్గం మండలం నడిమితండాను అధికారులు ఎంపిక చేశారు. 10 మందికి రేషన్ కార్డులు, 20 మంది రైతులకు రైతు భరోసా, 14 మందికి ఆత్మీయ భరోసా, తొమ్మిది మందికి ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేశారు. ప్రభుత్వ ఉపాధ్యాయుడి కుటుంబానికి, డిగ్రీ మొదటి సంవత్సరం చదువుతున్న విద్యార్థినిని ఆత్మీయ భరోసా పథకం కింద ఎంపిక చేసి పత్రాలు అందజేశారు. మంత్రి ఆదేశాలతో నడిమితండాలో అధికారులు ఇంటింటికీ వెళ్లి విచారణ చేపట్టారు. అనర్హులను ఎంపిక చేసినట్లు విచారణలో తేలింది. కాగా, ఈ విషయంపై ఎంపీడీఓ చంద్రశేఖర్‌ను వివరణ కోరగా ఉపాధ్యాయుడి కుటుంబాన్ని ఆత్మీయ భరోసా పథకం కింద ఎంపిక చేసిన విషయం వాస్తవమేనన్నారు. విచారణ నివేదికను కలెక్టర్‌కు పంపించి చర్యలు తీసుకుంటామని తెలిపారు.

ఇదండీ సంగతి




అంతా ఈయనే చేశారు...

అవును.. అంతా ఈయనే చేశారు..

ఇంతకీ ఏం చేశారనేగా మీ డౌటు..

మన దేశంలో తొలిసారిగా ఆదాయపు పన్నును ప్రవేశపెట్టారు..

ఇప్పుడు అర్థమైందిగా.. ఇప్పటి మన ఐటీ తిప్పలకు కారణం ఎవరో..



-సాక్షి సెంట్రల్ డెస్క్

జేమ్స్ విల్సన్.. మనం బ్రిటిష్ పాలనలో ఉన్నప్పుడు ఈయనే తొలి బడ్జెట్‌ను ప్రవేశపెట్టారు. 1857 సిపాయిల తిరుగుబాటు, తదనంతర పరిణామాల ఫలితంగా ఈస్టిండియా కంపెనీకి ఆర్థికంగా చాలా నష్టం జరిగింది. ఈ ఆర్థిక సంక్షోభం నుంచి గట్టెక్కించే బాధ్యతను క్వీన్ విక్టోరియా స్కాట్లాండ్‌కు చెందిన వ్యాపారవేత్త, రాజకీయ నాయకుడు జేమ్స్ విల్సన్‌కు అప్పగించారు. అలా ఆమె ఆదేశం మేరకు విల్సన్ 1859లో భారత్‌కు వచ్చారు. 1860 ఏప్రిల్ 7న తొలి బడ్జెట్‌ను ప్రవేశపెట్టారు. ఆ సమయంలో ఆయన మూడు రకాల పన్నులను ప్రతిపాదించారు. ఆదాయపు పన్ను, లైసెన్స్ పన్ను, పొగాకు సుంకం.. ఇందులో ఆదాయపు పన్నును మాత్రమే అమల్లోకి తెచ్చారు. మిగిలినవాటిని పక్కనపెట్టారు. అయితే, భారత్‌లోని పరిస్థితులను పరిగణనలోకి తీసుకోకుండా ఈ బడ్జెట్‌ను ప్రవేశపెట్టారంటూ అప్పట్లో విమర్శలు వచ్చాయి. ముఖ్యంగా జమీందారులు, వ్యాపారవేత్తలు ఈ నిర్ణయంపై కినుక వహించారు. 1793లో అప్పటి గవర్నర్ జనరల్ కారన్ వాలీస్ అమల్లోకి తెచ్చిన శాశ్వత భూమి శిస్తు విధానం స్ఫూర్తికి ఇది వ్యతిరేకమని అన్నారు. అప్పట్లో భూమి శిస్తును శాశ్వతంగా నిర్ణయించారు. అదనంగా ఆదాయపు పన్నును విధించడాన్ని విమర్శించారు. ఎన్ని విమర్శలు వచ్చినప్పటికీ.. జేమ్స్ విల్సన్ తన నిర్ణయాన్ని సమర్థించుకున్నారు. దేశంలో భారతీయులు వ్యాపారం చేసుకునేందుకు బ్రిటిషర్లు సురక్షితమైన వాతావరణాన్ని కల్పించినందున ఆదాయంపై పన్ను విధించడం సబబే అని ఆయన వాదించారు. అయితే, బడ్జెట్‌ను ప్రవేశపెట్టిన కొన్ని నెలలకే ఆగస్టులో రక్త విరోచనాలతో బాధపడుతూ జేమ్స్ విల్సన్ కోల్‌కతాలో మరణించారు. దేశంలో సివిల్ పోలీసు విభాగం ఏర్పాటు, తొలిసారిగా పేపర్ కరెన్సీ తేవడం, ఆర్థిక వ్యవస్థలో సంస్కరణలు, ఆడిటింగ్, పబ్లిక్ వర్క్స్, రహదారుల నిర్మాణం కోసం ప్రత్యేక విభాగం ఏర్పాటు, మిలటరీ ఫైనాన్స్ కమిషన్, సివిల్ ఫైనాన్స్ కమిషన్‌ల ఏర్పాటు.. ఇలా అన్ని ఆయన కృషి ఫలితమే అని చెబుతారు. ప్రస్తుత స్టాండర్డ్ చార్టర్డ్ బ్యాంక్ పూర్వ సంస్థ చార్టర్డ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా వ్యవస్థాపకుడు కూడా ఈయనే..

ఎలాగూ ఐటీ విషయం వచ్చింది కాబట్టి.. ఓ తాజా వార్త.. అమెరికాలో ఆదాయపు పన్ను రద్దు చేయాలని ట్రంప్ అనుకుంటున్నారట..

మేడమ్ వింటున్నారా?

ఐఏఎంసీకి భూ కేటాయింపుపై తీర్పు రిజర్వు

ఇరుపక్షాల వాదనలు విన్న హైకోర్టు

సాక్షి, హైదరాబాద్: హైదరాబాద్‌లోని ఇంటర్నేషనల్ ఆర్బిట్రేషన్ అండ్ మీడియేషన్ సెంటర్ (ఐఏఎంసీ)కు 5 ఎకరాల భూమిని కేటాయించడాన్ని సవాల్ చేస్తూ దాఖలైన పిటిషన్‌లో హైకోర్టు తీర్పును రిజర్వు చేసింది. 'రంగారెడ్డి జిల్లా శేరిలింగంపల్లి మండలం రాయదుర్గ్‌లోని సర్వే నంబర్ 83/1 ప్లాట్ నంబర్ 27లోని 3.7 ఎకరాల ప్రభుత్వ భూమిని కేటాయిస్తూ 2021, నవంబర్ 26న జీవో 126ను విడుదల చేసింది. నిర్వహణ ఖర్చుల కింద రూ.3 కోట్లు మంజూరు చేసింది. ఇది తెలంగాణ అర్బన్ ఏరియాస్ (డెవలప్‌మెంట్) చట్ట ఉల్లంఘన అవుతుంది. ప్రభుత్వం భూమిని తిరిగి స్వాధీనం చేసుకునేలా, ఇచ్చిన మొత్తాన్ని తిరిగి వెనక్కి తీసుకునేలా ఆదేశాలు జారీ చేయాలి'అని కోరుతూ న్యాయవాది కె.రఘునాథ్ రావు హైకోర్టులో ప్రజాప్రయోజన వ్యాజ్యం(పిల్) దాఖలు చేశారు. ఈ పిల్‌పై జస్టిస్ కె.లక్ష్మణ్, జస్టిస్ కె.సుజన ధర్మాసనం మంగళవారం మరోసారి విచారణ చేపట్టింది. ప్రభుత్వం, ఐఏఎంసీ తరఫున అడ్వొకేట్ జనరల్ ఏ.సుదర్శన్‌రెడ్డి, మాజీ ఏజీ దేశాయి ప్రకాశ్‌రెడ్డి వాదనలు వినిపించారు. ఆర్బిట్రేషన్‌ను ప్రభుత్వం ప్రోత్సహించాలని, మౌలిక సదుపాయాలను కల్పించాలని చెప్పారు. ప్రభుత్వం కేటాయించిన నిధుల్లో ఒక్క రూపాయి కూడా దుర్వినియోగం కాలేదన్నారు.

రాష్ట్రంలో ప్రధాన ప్రతిపక్షం కనిపించడం లేదు

- అన్ని పార్టీలూ ఉండాలనే మేం కోరుకుంటున్నాం
- విధానపరంగా కేంద్రంతో కొట్లాడుతూనే ఉంటాం
- చెన్నై కాంక్లేవ్‌లో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క



సాక్షి, హైదరాబాద్: తెలంగాణలో అధికార కాంగ్రెస్ పార్టీకి ప్రధాన ప్రతిపక్షంగా ఏ పార్టీ కనిపించడం లేదని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క వ్యాఖ్యానించారు. ప్రతిపక్షం లేకపోతే ప్రజాస్వామ్యం లేదని, అన్ని పార్టీలూ ఉండాలని తాము కోరుకుంటున్నామని చెప్పారు. భావస్వేచ్ఛపై తమ ప్రభుత్వానికి విశ్వాసం ఉన్నందునే ఆయా పార్టీలు వారి సిద్ధాంతాలను ప్రచారం చేసుకునే అవకాశమిచ్చామన్నారు. చెన్నై వేదికగా మంగళవారం ప్రముఖ ఆంగ్ల పత్రిక 'విద్య'అంశంపై నిర్వహించిన కాంక్లేవ్‌లో పాల్గొన్న భట్టి పలు ప్రశ్నలకు సమాధానాలిచ్చారు. ఈ కార్యక్రమంలో భట్టి ఏమన్నారంటే...

- ఫార్ములా ఈ–కార్ రేసు వ్యవహారంలో రాజకీయంగా మేం చేసిందేమీ లేదు. ప్రజాధనం దుర్వినియోగమైందన్న ఆరోపణల మేరకు నాటి మంత్రి కేటీఆర్‌పై కేసు నమోదై విచారణ జరుగుతోంది. ఈ అంశంలో ఎవరైనా విచారణ సంస్థల ముందుకొచ్చి వారి అభిప్రాయాలను చెప్పొచ్చు.
- ప్రజాస్వామ్యం, సమాఖ్య వ్యవస్థలపై మాకు నమ్మకం ఉంది. భారత రాజ్యాంగంపై అచంచల విశ్వాసం ఉంది. కేంద్ర ప్రభుత్వంతో సంబంధాలు బలంగా ఉండాలని రాష్ట్ర ప్రభుత్వంగా మేం కోరుకుంటున్నాం. అయితే, విధానపరమైన అంశాలపై కొట్లాడుతూనే ఉంటాం.
- స్వాతంత్ర్యోద్యమాన్ని ప్రచారం చేసేందుకు గాంధీజీ యంగ్ ఇండియా పత్రికను స్థాపించారు. ఆ పత్రిక స్ఫూర్తితోనే యంగ్ ఇండియా ఇంటర్నేషనల్ స్కూల్స్ ఏర్పాటు చేస్తున్నాం. ఇంజనీరింగ్ విద్య పూర్తి చేసుకుని లక్షల్లో వస్తున్న విద్యార్థుల్లో ఎంఎన్‌సీలు ఆశిస్తున్న నైపుణ్యాలు ఉండటం లేదు. దీంతో ఉపాధి కష్టతరమవుతోంది. ఈ పరిస్థితిని దృష్టిలో ఉంచుకుని స్కిల్స్ వర్సిటీని స్థాపించాలని నిర్ణయం తీసుకున్నాం.
- పాత లేత్ మెషీన్లతో ఉన్న ఐటీఐలను కంప్యూటర్ యుగానికి అనుగుణంగా తీర్చిదిద్దుతున్నాం. రాష్ట్రంలోని 65 ఐటీఐలను అప్‌గ్రేడ్ చేస్తున్నాం.
- విద్యపై పెట్టుబడితో గొప్ప మానవ వనరులను ఉత్పత్తి చేయొచ్చు. ఈ వనరుల ద్వారా రాష్ట్రానికి సంపద చేకూరుతుంది. అందుకే ఈ ఏడాది బడ్జెట్‌లో విద్యకు రూ.21వేల కోట్లు కేటాయించాం.
- అంతర్జాతీయ ప్రమాణాల పేరుతో ప్రైవేటు విద్యాసంస్థలు ఏర్పాటు చేస్తున్న ఫీజు దోపిడీపై విచారణ జరిపి చర్యలు చేపట్టేందుకే రాష్ట్రంలో విద్యా కమిషన్‌ను ఏర్పాటు చేశాం.
- తెలంగాణలో ఇల్లు లేకుండా ఏ ఒక్కరూ మిగిలిపోకూడదు. విద్యా సౌకర్యం అందకుండా ఎవరూ బాధపడకూడదు. ఉపాధి లేదనే భావన ఎవరికీ కలగకూడదు. ఈ లక్ష్యాలతోనే ముందుకెళ్తున్నాం. రాష్ట్ర సంపదను అర్హులైన పేదలకు పంచడమే మా లక్ష్యం.



ఒక మనిషి గురించి మరొక మనిషికి జీవితాంతం గుర్తుండిపోయేవి రెండే రెండు. చేతితో చేసిన సాయం! మాటతో చేసిన గాయం!!

– బౌద్ధ ధర్మం

సాక్షి

బుధవారం, 29 జనవరి 2025

ప్రయోగాత్మక పౌరస్మృతి

దేశంలో తొలిసారిగా ఒక రాష్ట్రం ఉమ్మడి పౌరస్మృతి (యూసీసీ) అమలుకు శ్రీకారం చుట్టింది. గత ఏడాది ఫిబ్రవరిలో చట్టసభ ఆమోదించిన యూసీసీని ఉత్తరాఖండ్ ఆచరణలోకి తెచ్చింది. ఆ రాష్ట్ర సీఎం సోమవారం డెహ్రాడూన్‌లో యూసీసీ నియమావళి ప్రకటించి, పోర్టల్‌ను ప్రారంభించడంతో కొత్త కథ మొదలైంది. వివాదాస్పద యూసీసీ అమలు 'దేవభూమి' నుంచి ఆరంభమైందన్న మాటే కానీ, వివాదాల పెనుభూతం మాత్రం ఇప్పుడప్పుడే వదిలిపెట్టడం కష్టం. ఇదంతా చూపులకు... మతాలకు అతీతంగా అందరికీ ఒకే విధమైన వ్యక్తిగత చట్టాలుండేలా ప్రమాణీకరించే ఉద్దేశంతో చేపట్టిన ప్రయత్నంగా, సమానత్వం – సమన్యాయ సిద్ధాంతాలకు అనుగుణంగా గొప్పగా అనిపించవచ్చు. ఆధునిక విలువలకూ, లైంగిక సమానత్వ – న్యాయాలకూ జై కొట్టినట్టు కనిపించవచ్చు. కానీ, లోతుల్లోకి వెళితే – ఆచరణలో ఇది కీలకాంశాలను అందిపుచ్చుకోలేదు. అనేక లోటుపాట్లూ వెక్కిరిస్తాయి. ముఖ్యంగా... చట్టసభలో సమగ్ర చర్చ లేకుండానే, ఏకాభిప్రాయం సాధించకుండానే హడావిడిగా యూసీసీ తేవడం బీజేపీ పాలకుల తెర వెనుక ఉద్దేశాలకు ప్రతీకగా కనిపిస్తుంది.

ఉత్తరాఖండ్‌లో ఇకపై పెళ్ళిళ్ళు, విడిపోవడాలు, భరణాలు లాంటివన్నిటికీ అన్ని మతాలకూ ఒకే చట్టం వర్తించనుంది. ఆ రాష్ట్రంలో పెళ్ళిళ్ళ రిజిస్ట్రేషన్ తప్పనిసరి. చేయకపోతే, జరిమానాతో పాటు, వివాహాల రిజిస్ట్రేషన్ కానివారు ప్రభుత్వ ప్రయోజనాలకు పూర్తిగా అనర్హులు. అలాగే, విడాకుల కేసుల్లో భార్యాభర్తలకు ఒకే నియమావళి వర్తిస్తుంది. బహుభార్యాత్వంపై నిషేధమూ విధించారు. అదే సమయంలో, భిన్న సంస్కృతి, సంప్రదాయాలను అంటిపెట్టుకొని ఉండే షెడ్యూల్డ్ ట్రైబ్‌లను మాత్రం నిషేధం నుంచి మినహాయించారు. ప్రభుత్వ కొత్త ప్రతిపాదనలో కొన్ని అంశాలు నైతిక నిఘా అనిపిస్తున్నాయి. పెళ్ళి చేసుకున్నవారే కాదు, సహజీవనం చేస్తున్నవారూ తప్పనిసరిగా రిజిస్ట్రేషన్ చేయించుకోవాలనడం, అలా చేయకపోతే జైలుశిక్ష, జరిమానా అనడం బలవంతంగా అందరినీ దారికి తెచ్చుకోవడమే తప్ప, న్యాయపరిరక్షణ అనుకోలేం.

అసలు విభిన్న మతాలు, సంస్కృతులు, సంప్రదాయాలకు నెలవైన మన దేశంలో పెళ్ళి, విడాకులు, దత్తత, వారసత్వం, పిత్రార్జితం లాంటి అంశాల్లో అందరినీ ఒకే తాటిపైకి తీసుకురావాలని సమష్టి వ్యక్తిగత చట్టాలు చేయడం సరైనదేనా అన్నది మౌలికమైన ప్రశ్న. ఎవరి మత ధర్మం వారికి ఉండగా, అందరినీ ఒకే గాటన కట్టి, మూకుమ్మడి పౌరస్మృతిని బలవంతాన రుద్దడమేమిటని జమైత్ ఉలేమా ఇ–హింద్ లాంటివి అభ్యంతరం చెబుతున్నాయి. షరియాకూ, మతానికీ విరుద్ధమైన చట్టాన్ని ముస్లిమ్‌లు ఆమోదించలేరని కుండబద్దలు కొడుతున్నాయి. ఇలా ఉత్తరాఖండ్ యూసీసీపై ఒకపక్క దేశవ్యాప్తంగా వాడివేడి చర్చలు జరుగుతుండగానే, మరోపక్క గౌరవ ఉపరాష్ట్రపతి హోదాలోని వారు మాత్రం 'ఇలాంటి చట్టం దేశమంతటా త్వరలోనే రావడం ఖాయమ'ని ఢంకా బజాయించడం విడ్డూరం. నిజానికి, ఉత్తరాఖండ్ యూసీసీలో లోటుపాట్లకు కొదవ లేదు. అందరూ సమానమే అంటున్నా, స్వలింగ వివాహాల ప్రస్తావన లేదేమని కొందరి విమర్శ. అలాగే, దత్తత చట్టాలపైనా యూసీసీ నోరు మెదపలేదని మరో నింద. అందరూ సమానం అంటూనే కొందర్ని కొన్ని నిబంధనల నుంచి మినహాయించడమేమిటని ప్రశ్న. ఎస్టీలకు సహేతుకంగా వర్తించే అదే మినహాయింపులు ఇతర వర్గాలకూ వర్తించాలిగా అన్న దానికి జవాబు లేదు.

44వ రాజ్యాంగ అధికరణం యూసీసీని ప్రస్తావించిందన్నది నిజమే. దీర్ఘకాలంగా యూసీసీపై అందరూ మాట్లాడుతున్నదీ నిజమే. కానీ, అది ఏ రకంగా ఉండాలి, లేదా ఉండకూడదన్న దానిపై ఇప్పటికీ ఎవరికీ స్పష్టత లేదు. పైగా, గందరగోళమే ఉందన్నదీ అంతే నిజం. ఆది నుంచి ఉమ్మడి పౌరస్మృతిని తారకనామంగా జపిస్తున్న కమలనాథులు ఇప్పుడు ఉత్తరాఖండ్‌లో ప్రయోగాత్మకంగా పరీక్షిస్తున్నారనుకోవాలి. యూసీసీ వల్ల జరిగే మంచి మాట దేవుడెరుగు, అసలిది చేయగలిగిన పనే అని ప్రపంచానికి చాటాలనుకున్నారు. అయితే, ఈ ఉత్తరాఖండ్ యూసీసీ రాజ్యాంగబద్ధత పైనా సందేహాలున్నాయి. ఒక రాష్ట్ర చట్టసభలో చేసిన చట్టాలు ఆ రాష్ట్ర పరిధికే వర్తిస్తాయని 245వ రాజ్యాంగ అధికరణ ఉవాచ. కానీ, రాష్ట్రం వెలుపల ఉన్న ఉత్తరాఖండీయులకూ యూసీసీ వర్తిస్తుందని పేర్కొన్నారు. ఇది హాస్యాస్పదం. అలాగే, సహజీవనాల రిజిస్ట్రేషన్ తప్పదంటున్నారే తప్ప, అలా చేసుకుంటే చట్టపరంగా ఆ భాగస్వాముల పరస్పర హక్కులకు రక్షణ లాంటివేమీ కల్పించలేదు. వారి ప్రైవేట్ బతుకులు వ్యవస్థలో నమోదై నడిబజారులో నిలవడమే తప్ప, నిజమైన ప్రయోజనమూ లేదు. పైగా 21వ అధికరణమిచ్చిన గోప్యత హక్కుకు విఘాతమే!

నిజానికి, గోప్యత హక్కులో సమాచార గోప్యత, స్వతంత్ర నిర్ణయాధికారం కూడా ఉన్నాయని జస్టిస్ పుట్టస్వామి కేసులో తొమ్మండుగురు న్యాయమూర్తుల సుప్రీమ్ కోర్ట్ ధర్మాసనం ఏనాడో తేల్చి చెప్పింది. ఇప్పుడీ యూసీసీ నిబంధన అచ్చంగా దానికి విరుద్ధమే. అలాగే, కులాంతర, మతాంతర వివాహాలపై విచ్చుకత్తులతో విరుచుకుపడి, ప్రాణాలు తీసే స్వభావం నేటికీ మారని సమాజంలో ఈ తరహా నిబంధనలు ఏ వెలుగులకు దారి తీస్తాయి? వెరసి, ఉత్తరాఖండ్ సర్కారు వారి యూసీసీ పైకి పెను సంస్కరణగా కనిపించినా, ఆఖరికి వేర్వేరు చట్టాల్లోని అంశాల్ని అనాలోచితంగా కాపీ చేసి అతికించిన అతుకుల బొంతగా మిగిలింది. ఇది ఏకరూపత పేరిట ప్రభుత్వం బల ప్రయోగం చేయడమే అవుతుంది. ఉత్తరాఖండ్ బాటలోనే ఇతర బీజేపీ పాలిత రాష్ట్రాలూ పయనించి, ఆఖరికి యూసీసీని దేశవ్యాప్తం చేస్తారన్న మాట వినిపిస్తున్నందున ఇకనైనా అర్థవంతమైన చర్చ అవసరం.

గ్రహం అనుగ్రహం

శ్రీ క్రోధి నామ సంవత్సరం, ఉత్తరాయణం, హేమంత ఋతువు పుష్య మాసం, **తిథి:** అమావాస్య సా.6.57 వరకు, తదుపరి మాఘ శుద్ధ పాడ్యమి, **నక్షత్రం:** ఉత్తరాషాఢ ఉ.9.08 వరకు, తదుపరి శ్రవణం, **వర్జ్యం:** ప.1.06 నుండి 2.38 వరకు, **దుర్ముహూర్తం:** ఉ.11.53 నుండి 12.41 వరకు, **అమృతఘడియలు:** రా.10.33 నుండి 12.02 వరకు.

సూర్యోదయం : 6.38
సూర్యాస్తమయం: 5.49
రాహుకాలం : ప.12.00 నుండి 1.30 వరకు
యమగండం : ఉ.7.30 నుండి 9.00 వరకు

ఆహార భద్రతకు ఆ ఆదాయమే కీలకం

విశ్లేషణ



దేవీందర్ శర్మ

ప్రస్తుత వేగంతో 2050 నాటికి ప్రపంచం మొత్తానికి ఆహారాన్ని అందించడమనే పెను సవాలును ఎదుర్కోవడం దాదాపు అసాధ్యంగానే కనిపిస్తోంది. ఇలాంటి తరుణంలో బిగ్గరగానూ, స్పష్టంగానూ వ్యవసాయ శాస్త్రవేత్తలు, పరిశోధకులు తమ లేఖ ద్వారా చేసిన హెచ్చరిక సకాలంలో వినిపించిన మేల్కొలుపులా కనపడుతోంది. ''భవిష్యత్ ఆహార అవసరాలను తీర్చడానికి మనం సరైన మార్గంలో లేకపోగా, కనీసం దానికి సమీపంలో కూడా లేము'' అని వారి లేఖ అప్రమత్తం చేసింది.

14వ దలైలామా, జోసెఫ్ స్టిగ్లిట్జ్, కైలాస్ సత్యార్థి, రాబర్ట్ హుబెర్, డరోన్ అసెమొగ్లు, సర్ జాన్ ఇ వాకర్ వంటి నోబెల్ గ్రహీతలు, డాక్టర్ గురుదేవ్ ఎస్ ఖుష్, పెర్ పిన్‌స్ట్రప్ ఆండర్సన్, రట్టన్ లాల్, హాన్స్ ఆర్ హెర్రెన్ వంటి వరల్డ్ ఫుడ్ ప్రైజ్ గ్రహీతలు ఈ లేఖపై సంతకాలు చేసినవారిలో ఉన్నారు. ''సైన్స్, ఆవిష్కరణల నాయకులుగా మేము ప్రపంచ ఆహార, పోషకాహార భద్రతకు హామీ నివ్వడానికి, ప్రపంచాన్ని మేల్కొలపటంలో, సామూహిక ఆకాంక్షలను పెంచడంలో మాతో చేరాలని, పరిశోధనాపరమైన పెద్ద ముందంజ వేయాలని మిమ్మల్ని కోరుతున్నాము'' అని ఆ లేఖ ముగుస్తుంది.

2050 నాటికి ప్రపంచం 980 కోట్ల మంది ప్రజల అవసరాలను తీర్చడానికి తగినంత ఆహారాన్ని ఉత్పత్తి చేయడానికి పూనుకుంటున్న వేళ, దాదాపు 80 కోట్లమందిని ఆకలితో అలమటింపజేస్తున్న ఆహార కొరత అనేది ఉత్పత్తి పడిపోవడం వల్లనే ఏర్పడలేదు. ఆహార కొరత కేవలం తప్పుడు విధానాల ఫలితమేనని అందరూ గ్రహించాలి. 'హంగర్స్ టిప్పింగ్ పాయింట్' అనే శీర్షికతో కూడిన ఆ లేఖ... 'వాతావరణ మార్పులతో ముడిపడి ఉన్న సాధారణమైన తీవ్ర వాతావరణ ఘటనల' గురించి ఈ శతాబ్ది మధ్యనాటికి ఆహార, పోషకాహార సంక్షోభం మరింత తీవ్రమవడం గురించి మాట్లాడుతుంది. ఇక ఆ లేఖలోనే సరిగ్గానే వేర్కొన్నట్లుగా.. నేలకోత, భూమి క్షీణత, జీవవైవిధ్య నష్టం, నీటి కొరత, సంఘర్షణలు వంటి అదనపు అంశాలు ఆహార ఉత్పాదకతను తగ్గిస్తాయి.

ఇది కచ్చితంగా ఆందోళన కలిగించే విషయమే. ఆఫ్రికాకు ప్రధాన ఆహారమైన మొక్కజొన్న గురించి ఆ లేఖలో పేర్కొన్నప్పటికీ భవిష్యత్తులో ఆహార దిగుబడి తగ్గుతుందనే అంచనాల వల్ల ఆ పంటకు నిజంగానే ముప్పు పొంచి ఉంది. అయితే చేతులు కలిపి సహకరించాల్సిన తక్షణ అవసరాన్ని ప్రపంచం గ్రహించేవరకు, ఆహార, పోషకాహార భద్రతకు సంబంధించిన ప్రపంచ సవాళ్లను ఎదుర్కోవడం సాధ్యం కాదు. ఉదాహరణకు, ఆఫ్రికా తీవ్ర కొరతను ఎదుర్కొంటున్నప్పటికీ, అమెరికాలో దేశీయ మొక్కజొన్న ఉత్పత్తిలో 44 శాతం ఇథనాల్ ఉత్పత్తికి మళ్లిస్తున్నారు. అలాగే, న్యూ సైంటిస్టు జర్నల్ (2022 మార్చి 14) లోని ఒక నివేదిక ప్రకారం, 9 కోట్ల టన్నుల ఆహారధాన్యాలను ఇథనాల్ కోసం మళ్లించారు. ఇక యూరోపియన్ యూనియన్ గోధుమలు, మొక్కజొన్నతో సహా కోటి 20 లక్షల టన్నులను ఆటోమొబైల్స్ కోసం ఆహారంగా ఉపయోగిస్తోంది. ఇంకా, 35 లక్షల టన్నుల పామాయిల్‌ను ఈయూ డీజిల్ ఉత్పత్తి కోసం మళ్లించింది.



ఫొటో సౌజన్యం : డెక్కన్ డెవలప్‌మెంట్ సొసైటీ

రష్యా, ఉక్రెయిన్ యుద్ధం వల్ల ప్రపంచవ్యాప్తంగా ప్రధాన ఆహార సరఫరాలు దెబ్బతిన్నప్పుడు ఇదంతా జరిగింది. అమెరికా, యూరోపియన్ యూనియన్‌లలో జీవ ఇంధన ఉత్పత్తిలో కేవలం 50 శాతం తగ్గించినట్లయితే, అలా ఆదా చేసిన ధాన్యం... యుద్ధం వల్ల ఏర్పడిన మొత్తం ఆహార కొరతను తీర్చగలదు. గోధుమ, వరి వంటి పంటల్లో కిరణజన్య సంయోగక్రియను పెంపొందించడం, ప్రధాన తృణ ధాన్యాలలో జీవసంబంధమైన నత్రజనిని స్థిరీకరించడం, వార్షిక పంటలను శాశ్వత పంటలుగా మార్చడం, పంటల వ్యవస్థను వైవిధ్యీకరించడం, సూక్ష్మజీవులు – శిలీంధ్రాల నుండి పోషకాలు అధికంగా ఉండే ఆహార పదార్థాలను సృష్టించటం వంటి అవసరమైన పరివర్తనా ప్రయత్నాలను చేపట్టాలని ఈ లేఖ కోరుతోంది. ''బిలియన్ల కొద్దీ ప్రజలకు ఆరోగ్యకరమైన, ఉత్పాదక, సురక్షితమైన జీవితాలను కల్పించడం వల్ల కలిగే ప్రయోజనం ప్రపంచ ఆర్థిక వ్యవస్థ అంతటా విస్తృతంగా రాబడిని ప్రవహింపజేస్తుంది'' అని అంగీకరించాలని ఆ లేఖ పేర్కొంది.

వ్యవసాయ పరిశోధనలో పెట్టే పెట్టుబడి బహుళ రాబడిని కలిగిస్తుందని చూపడానికి తగినన్ని ఆధారాలు ఉన్నప్పటికీ, ''భవిష్యత్తులో విజయవంతమైన ఆహార వ్యవస్థను నడిపించే ఆవిష్కరణకు పునాదిగా సమాజం స్పాన్సర్ చేసిన పరిశోధన ఉండాలని'' కూడా నివేదిక పిలుపునిచ్చింది. అయితే ప్రభుత్వ ప్రాయోజిత పరిశోధనకు ప్రాధాన్యం ఉందా, లేక ప్రైవేట్ పరిశోధనల ఆధిపత్యంపై ప్రాధాన్యం ఉందా అనేది ఇంకా అస్పష్టంగానే ఉంది. ప్రజలకు ఆరోగ్యకరమైన, తక్కువ ఖర్చుతో కూడుకున్న స్థిరమైన ఆహారాన్ని అందించడంలో బహుళ మార్కెట్ వైఫల్యాల గురించి ఈ లేఖ మాట్లాడుతుంది. అయితే ఇంకా అతి పెద్ద ఉపద్రవం ఏమిటంటే, ప్రపంచంలోని ప్రతిచోటా వ్యవసాయ ఆదాయాలను పెంచడంలో మార్కెట్ల వైఫల్యం!

నా అవగాహన ప్రకారం, స్థిరమైన వ్యవసాయ జీవనోపాధికి హామీ ఇచ్చేందుకు కఠినమైన ప్రయత్నాలు చేయకపోతే భవిష్యత్తులో ఆహారం, పోషకాహార భద్రతకు సంబంధించి సవాళ్లను ఎదుర్కోవడం కష్టం కావచ్చు. ఉదాహరణకు, 2024 సెప్టెంబర్‌లో ముగిసిన చివరి ఐదు సంవత్సరాలకు సంబంధించిన బడ్జెట్ కోసం అమెరికా వ్యవసాయ బిల్లు రైతులకు, వ్యవసాయానికి 1.8 ట్రిలియన్ డాలర్లను కేటాయించింది. అయినప్పటికీ ఈ సంవత్సరం ఐదుగురు రైతుల్లో ఒకరు వ్యవసాయం మానేస్తారని అమెరికా అంచనా వేస్తోంది. నిజానికి, సరకుల ధరలు తక్కువగా ఉండడం, అధిక ఉత్పత్తి వ్యయం కారణంగా రైతులు ఎదుర్కొన్న నష్టాన్ని పూడ్చడానికి 10 బిలియన్ డాలర్ల తక్షణ సాయం వాగ్దానం చేసింది. అయినప్పటికీ ఈ పరిణామం జరగబోతోంది. కొత్త వ్యవసాయ బిల్లు–2024 ఆమోదం కోసం వేచి ఉంది.

> ◆ స్థిరమైన వ్యవసాయ జీవనోపాధికి హామీ ఇచ్చేందుకు కఠినమైన ప్రయత్నాలు చేయకపోతే భవిష్యత్తులో ఆహారం, పోషకాహార భద్రతకు సంబంధించి సవాళ్లను ఎదుర్కోవడం కష్టం.
>
> ◆ చేయీ చేయీ కలిపి సహకరించుకోవలసిన తక్షణ అవసరాన్ని దేశాలు గ్రహించే వరకు ఆహార, పోషకాహార భద్రతకు సంబంధించిన ప్రపంచ సవాళ్లను ఎదుర్కోవడం సాధ్యం కాదు.
>
> ◆ వందల కోట్ల జనాభాకు ఆరోగ్యకరమైన, సురక్షితమైన జీవితాలను కల్పించడం వల్ల కలిగే ప్రయోజనం ప్రపంచ ఆర్థిక వ్యవస్థ అంతటా విస్తృతంగా రాబడిని ప్రవహింపజేస్తుంది.

గత సంవత్సరం మొదటి నాలుగు నెలల్లో 24 దేశాల్లో రైతుల నిరసన తర్వాత యూరోపియన్ యూనియన్ హామీ ఇచ్చిన వ్యవసాయ ఆదాయం ఒక సాధారణ సూత్రంగా ముందుకొచ్చింది. పక్షం రోజుల క్రితం ఫ్రాన్స్‌లోని చిన్న రైతుల సమాఖ్య అయిన కాన్ఫెడరేషన్ పేజన్, వ్యవసాయ ఆదాయాన్ని వ్యవసాయ ఆహార సరఫరా గొలుసుకు చెందిన సర్దుబాటు అస్థిరతగా వదిలివేయ కూడదని పిలుపునిచ్చింది. రైతులకు హాని కలిగించే విధంగా దిగువ స్థాయి అదనపు మార్జిన్లను సమాఖ్య ఖండించింది. దీని అర్థం ఏమిటంటే ఆహార గొలుసులోని అన్ని ఇతర వాటాదారులు భారీ లాభాలతో ముందుకు వెళ్లిపోతున్నప్పటికీ, రైతు మాత్రం దాని అంచుల వద్దే మనుగడ సాగించాల్సి వస్తుంది.

భారత్‌లో, పంజాబ్–హరియాణా సరిహద్దులో 11 నెలలకు పైగా జరుగుతున్న రైతుల నిరసన నేపథ్యంలో గమనిస్తే, 14 ఖరీఫ్ పంటలలో ఏడింటి మార్కెట్ ధరలు కనీస మద్దతు ధర కంటే 12 నుండి 26 శాతం తక్కువగా ఉన్నాయి. సంవత్సరాలుగా, వ్యవసాయ ఆదాయాలు స్తబ్దుగా ఉంటున్నాయి లేదా కిందికి పడిపోతున్నాయి. నిజం చెప్పాలంటే, 2050లో 150 కోట్ల మంది అదనపు ప్రజలకు ఆహారమివ్వడం కచ్చితంగా సాధ్యమే. కానీ వ్యవసాయాన్ని ఆచరణీయమైనదిగా, లాభదాయకమైనదిగా మార్చే కార్యాచరణ విధానం కీలకం. అప్పుడే అది సాధ్యం.

వ్యాసకర్త ఆహార, వ్యవసాయ నిపుణులు

సోషల్ మీడియా

అన్నిటికీ నిరాశేనా!



ఏ విషయంలోనైనా ఎల్లప్పుడూ మేలే జరుగుతుందని మనం ఆశించాలి. ఆలోచనాపరులు చెప్పినట్లుగా, అందుకు భిన్నంగా జరిగినా కూడా ఎదుర్కోవడానికి సిద్ధంగా ఉండాలి. (భారత–చైనా సంబంధాలు మెరుగుపడుతున్నాయన్న విశ్లేషణలను విశ్వసించని వారిని ఉద్దేశించి).

– సమర్జీత్ నారాయణ్, రిటైర్డ్ స్టీల్ ప్లాంట్ ఇంజనీర్

గానమే పానము



అహ్మదాబాద్‌లో బ్రిటిష్ రాక్ బ్యాండ్ 'కోల్డ్‌ప్లే' కచ్చేరి విజయవంతం అయింది. దీనిని బట్టి సరదాగా గడపటానికి మద్యం అవసరం లేదని మరోసారి రుజువైంది. మద్యం ప్రియులు దీన్ని గ్రహిస్తే బావుంటుందేమో! (గుజరాత్‌లో 1960 నుండి మద్య నిషేధ చట్టం అమలులో ఉంది).

– ఐశ్వర్యా ముద్గిల్, నిత్య సంచారి

బోరింగ్ సబ్జెక్ట్



సక్సెస్ అనేది కేవలం 20 శాతం మంది మాత్రమే తమ జీవితావసరంగా పట్టుకుని వేలాడి సాధించే ఒక రాణింపు!

– జస్టిన్ వెల్ష్, ఇంటర్నెట్ బిజినెస్ టీచర్

సంసార స్నేహం



మీ బెస్ట్ ఫ్రెండ్‌ని పెళ్లి చేసుకోండి. లేదంటే, మీరు పెళ్లి చేసుకున్న వ్యక్తిని మీ బెస్ట్ ఫ్రెండ్‌గా చేసుకోండి. 'తృప్తి', 'ప్రాప్తి' అనే మాటల్ని వినీ వినీ విసుగొచ్చింది. ఒక సెక్సువల్ మెడిసిన్ డాక్టర్‌గా ఈ మాట చెబుతున్నాను.

– సునీతా సాయమ్మ, ఎంబీబీఎస్

'డి' తగ్గుతోంది!



ఆశ్చర్యకరంగా, నేను ఇండియా నుండి తిరిగి బ్రిటన్ రాగానే నాకు విటమిన్–డి మరీ తక్కువగా ఉన్నట్లు నిర్ధారణ అయింది! ఇండియాలో డి విటమిన్ పుష్కలంగా లభిస్తుందని అనుకుంటారు. నిజానికి ఆ ఎండను తట్టుకోలేక ఎక్కువ సమయం కార్లలో, ఇళ్లలో గడుపుతారు. కాబట్టి ఇండియాలోని ప్రతి ఒక్కరూ దయచేసి మీ విటమిన్ డి స్థాయులను పరీక్షించుకోండి. కోవిడ్ తర్వాత కూడా విటమిన్ డి తగ్గుదల బాగా ఎక్కువైంది.

– నవోమీ కాంటన్, లండన్ జర్నలిస్ట్

"నిన్ను నిన్నుగా..'



నా మతం మిమ్మల్ని ప్రేమతో, అవగాహనతో ఆలింగనం చేసుకుంటుంది. మీరు నా ప్రయాగ్‌రాజ్‌ని విడిచిపెట్టినప్పుడు మీరు దేశాయ్‌గా కాకుండా డిసౌజాగానే వెనుతిరుగుతారు. ఇది సనాతన ధర్మానికి అందం. హిందువుగా ఉన్నందుకు గర్వపడుతున్నాను.

– డాక్టర్ పూర్ణిమ, ప్రయాగరాజ్

చూపాల్సిన కృతజ్ఞత



మీ తల్లి తండ్రులు ధనవంతులు కాకపోయినా, మీరు నాణ్యమైన విద్యను పొందినట్లయితే, వారి త్యాగాల పట్ల కృతజ్ఞతతో ఉండండి.

– నిత్యశ్రీ, హెచ్.ఆర్.కన్సల్టెంట్

ఇన్ బాక్స్

మనవాళ్లకు భరోసా కావాలి!

ప్రపంచం ఒక గ్లోబల్ విలేజ్ అయిన తరుణంలో జనం మెరుగైన జీవనం గడపడానికి అవకాశాలు ఉన్న చోటుకు వెళ్లి జీవిస్తున్నారు. ప్రపంచంలోనే అధిక జనాభా ఉన్న భారతదేశం నుంచే అత్యధికంగా ఇతరదేశాలకు వలస వెళుతున్నారు. 2024 ఐక్యరాజ్యసమితి ప్రపంచ వలస నివేదిక (యూఎన్ వరల్డ్ మైగ్రేషన్ రిపోర్ట్) ప్రకారం కోటీ ఎనభై లక్షలమంది దాకా ఆ ఏడాది భారత్ నుంచి వలస పోయారు.



భారత విదేశాంగ శాఖ లెక్కల ప్రకారం 2024 మే నాటికి వివిధ దేశాల్లో ఉన్న భారతీయుల సంఖ్య దాదాపు మూడు కోట్ల 92 లక్షల మంది. ఇందులో రెండుకోట్ల 35 లక్షలమంది ఎన్ఆర్ఐలు ఉన్నారు. మిగతావారు భారతీయ సంతతికి చెందినవారు. ఇతర దేశాలతో పోల్చుకుంటే అత్యధికంగా (54 లక్షలు) అమెరికాలోనే పనిచేస్తున్నారు. ఇది అమెరికా జనాభాలో 1.6 శాతంగా ఉంది.

వ్యాపారాలు చేస్తూ, పన్నులు చెల్లిస్తూ అపరిమిత ఆదాయాన్ని అమెరికాకు సాధించి పెడుతున్నప్పటికీ అమెరికాలో ప్రెసిడెంట్ మారినప్పుడల్లా అభద్రతా భావంతో మనవారు కునారిల్లుతున్నారు. 47వ అమెరికా అధ్యక్షుడుగా ఎన్నికైన డొనాల్డ్ ట్రంప్ విదేశీయులకు అమెరికా గడ్డమీద జన్మించే పిల్లలకు జన్మతః లభించే పౌరసత్వాన్ని రద్దు చేస్తూ ఆర్డర్ జారీచేశారు. దీంతో అనేకమంది అమెరికాలో నివసిస్తున్న భారతీయ గర్భిణులు ట్రంప్ విధించిన గడువులోపు పిల్లల్ని బలవంతంగా కనడానికి ఆస్పత్రుల దగ్గర బారులు తీరారంటే పరిస్థితి ఎంత ఆందోళనకరంగా ఉందో అర్థమవుతుంది.

అమెరికాలోని ప్రవాస భారతీయులకు మన కేంద్ర ప్రభుత్వం ఆత్మస్థైర్యం కల్పించే చర్యలు తీసుకోవాలి. ప్రధాని నరేంద్ర మోదీకి డోనాల్డ్ ట్రంప్‌తో ఉన్న స్నేహం మనవారికి మేలు చేస్తుందేమో చూడాలి.

– ఎండి. మునీర్, సీనియర్ జర్నలిస్ట్

లోపభూయిష్ఠంగా... లబ్ధిదారుల ఎంపిక

అభిప్రాయం



డా॥ బీఎస్ రావు

ఏడాది పాలనలోనే కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాల్ని తెలంగాణ ప్రజలు గుర్తించారు. పథకాల అమలులో జరుగుతున్న అవకతవకలను, సాచివేత ధోరణిని ప్రశ్నిస్తూ రేవంత్ రెడ్డి సర్కార్‌ను నిలదీస్తున్నారు. ప్రభుత్వ భూసేకరణపై లగచర్ల లాంటి గ్రామాలు కదం తొక్కాయి. ఏకంగా కలెక్టర్ సహా ఉన్నతాధికారులను అడ్డుకొని తమ నిరసన తెలియజేశారు. కేసులు, జైళ్లను లెక్కచేయకుండా ప్రభుత్వం వెనక్కి తగ్గే వరకూ ఊరుకోలేదు. రేషన్ కార్డులు, 'రైతు భరోసా', 'ఆత్మీయ భరోసా', 'ఇందిరమ్మ ఇండ్లు'... ఇలా అనేక పథకాల లబ్ధిదారుల ఎంపికకు గ్రామ సభల్లోనే దరఖాస్తులు తీసుకోవటం వల్ల గందరగోళం ఏర్పడుతుందన్న కనీస ఆలోచన ప్రభుత్వానికి లేదు.

కేవలం వీటి గురించే కాకుండా ప్రజలు కాంగ్రెస్ ఇచ్చిన 'ఆరు గ్యారంటీ'ల గురించీ నిలదీస్తున్నారు. 'కల్యాణ లక్ష్మి' స్థానంలో తీసుకవచ్చిన 'తులం బంగారం' పథకం ఎప్పుడు అమలు చేస్తారని ఎమ్మెల్యేలను ప్రశ్నిస్తున్నారు. 'రైతు భరోసా', రుణ మాఫీ, 'మహాలక్ష్మి' పథకం ఇంకా అమలు చేయకుండా ఎందుకు తాత్సారం చేస్తున్నారో చెప్పాలని ప్రజలు అడిగితే ఎమ్మెల్యేలు నీళ్లు నములుతున్నారు. గ్రామ సభల్లోంచి ఎమ్మెల్యేలు మధ్యలోనే వెళ్లిపోవటం ప్రభుత్వం దుఃస్థితికి అద్దం పడుతోంది. పోలీసు పహారా మధ్య సభల్ని నిర్వహించినా ప్రజలు ఏ మాత్రం భయపడటం లేదు. ప్రశ్నలతో ఉక్కిరి బిక్కిరి చేస్తున్నారు. ఏడాది పాలనకే ఇంతలా భయపడితే స్థానిక సంస్థల ఎన్నికల నాటికి ఆ పార్టీ నాయకులు ప్రచారం కోసం గ్రామాల్లోకి వెళ్లగలరా అన్నది ప్రశ్న.

లబ్ధిదారుల ఎంపిక చూస్తే... లోపభూయిష్ఠంగా ఉంది. ఇందిరమ్మ ఇళ్లకు ఆధార్ కార్డును ఆధారంగా చేసుకోవటం అతిపెద్ద సమస్య. ఇంటి



జాగా గ్రామంలో ఉండి... వాళ్లు పట్టణంలో నివసించి, ఆధార్ కార్డు పొందితే వాళ్లు అనర్హులవుతారు. ఈ కారణంగా గ్రామసభల్లో ఆందోళనలు జరుగుతున్నాయి. ప్రజాపాలనలో, కులగణనలో తీసుకున్న వివరాల ఆధారంగా లబ్ధిదారుల ఎంపిక చేయకుండా మళ్లీ దరఖాస్తులు తీసుకోవటం కేవలం కాంగ్రెస్ కార్యకర్తలకు ప్రయోజనం కల్గించటానికేనని ప్రజలు అనుమానిస్తున్నారు.

ఇక 'ఆత్మీయ భరోసా' విధివిధానాలపై పల్లె జనం భగ్గుమంటున్నారు. గత సంవత్సరంలో 20 రోజులు 'ఉపాధి హామీ' పనికి వెళ్లిన వారికే భరోసా ఇస్తామంటున్నారు. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు రైతు కూలీలందరికీ ఇస్తామని చెప్పిన కాంగ్రెస్ నాయకులు ఇప్పుడు మోసం చేస్తున్నారన్న ఆవేదన రైతు కూలీల్లో ఉంది. మున్సిపాలిటీల్లో విలీనమైన గ్రామాలకు ఉపాధి హామీ పథకం వర్తించదు. కానీ ఇప్పటికీ ఆ ప్రాంతాల్లోని వాళ్లు వ్యవసాయంపై ఆధారపడే జీవిస్తున్నారు. వీళ్లు ఏ రకంగా ఆత్మీయ భరోసాకు అనర్హులవుతారో ముఖ్యమంత్రే చెప్పాలి. ఆధార్, బ్యాంకు లింక్ లేని కారణంగా చాలా కార్డులు తొలగింపునకు గురయ్యాయి. లక్షలాదిమంది దగ్గరలోని పట్టణాలు, హైదరాబాద్‌లో మెరుగైన కూలీ కోసం తాత్కాలికంగా వెళ్లిన వలసకూలీలు ఉపాధి పనులకు వెళ్లలేదు. కొందరు వర్షాకాలం, యాసంగి పంటలకు మాత్రమే ఊళ్లోకి వస్తారు. జీవనపోరాటంలో తలమునకలవుతున్న వీళ్లంతా ఏ విధంగా అనర్హులవుతారు?

దేశంలో ఏ రాష్ట్రంలోనూ అధికారంలోకి వచ్చిన ఏడాదిలోనే ఇన్ని నిరసనలు ఏ ప్రభుత్వమూ ఎదుర్కొని ఉండదు. పాలనలో ఎలాంటి అనుభవం లేని రేవంత్ రెడ్డి ఈ నిరసనల్ని ఎదుర్కోవటానికి పోలీసుల్ని ఆశ్రయించటమే పెద్ద సమస్య. ఏ ప్రజాపోరాటాల్నీ, నిరసనల్నీ బల ప్రయోగం ద్వారా ఎదుర్కోలేమన్న విషయాన్ని ఆయన గుర్తించాలి. తెలంగాణ గడ్డపై పుట్టిన ప్రతివాడూ ఆకలినైనా సహిస్తాడు, కానీ మోసాన్ని ఎండగడతాడు!

వ్యాసకర్త బీఎస్ రావు ఫౌండేషన్ ఫౌండర్ ప్రెసిడెంట్ । 98668 34717

భాగవత సారం

నారాయణునికి సంబంధించిన కథ నారాయణీయమ్. 1036 శ్లోకాలతో భాగవత గ్రంథానికి సార సంగ్రహంగా ఉన్న నారాయణీయ గ్రంథాన్ని భక్తి ప్రపత్తులతో పఠిస్తే, ఎటువంటి అనారోగ్యాలయినా నయమవుతాయని భక్తుల విశ్వాసం. ఇందులో నూరు అధ్యాయాలున్నాయి. వీటిని దశకాలు అన్నారు. పది శ్లోకాలు కలది దశకం. ప్రతి దశకం చివర 'నా రుగ్మతలు తొలగించు, భక్తిని అనుగ్రహించు, మోక్షం ప్రసాదించు' అనే విన్నపం ఉంటుంది.



1560లో జన్మించిన మేల్పత్తూర్ నారాయణ భట్టాద్రి తన 16వ ఏటనే సమస్త విద్యలు అభ్యసించాడు. 'అచ్యుత పిషరడి' అనే ప్రసిద్ధ పండితునికి శిష్యుడై, గురువుగారి వాత రోగాన్ని తాను స్వీకరించి తన పరిపూర్ణ ఆరోగ్యాన్ని గురు దక్షిణగా ఆయనకు సమర్పించిన ధన్యుడు. ఆ వాత రోగం ఉద్ధృతమైన దశలో ఆ బాధను నివృత్తి చేసుకోవటానికి భాగవత రచన ప్రారంభించి దానికి 'నారాయణీయమ్' అని పేరు పెట్టాడు. నారాయణ భట్టాద్రి గురువాయూరు దేవాలయంలో నూరు రోజుల పాటు తన రచన చేశాడు. ఈ గ్రంథ రచన పూర్తి చేసే నాటికి అతని వయస్సు 27 సంవత్సరాలు మాత్రమే.

శ్రీకృష్ణుడు తన అవతారం చాలించబోయే ముందు తన విగ్రహాన్ని తన భక్తుడు, స్నేహితుడు అయిన ఉద్ధవునికి ఇచ్చి, ఎక్కడైనా ప్రతిష్ఠించమని చెప్పాడు. ఉద్ధవుడు సరైన స్థల నిర్ణయం చేయటంలో దేవ గురువు బృహస్పతి సహాయం కోరాడు. శివుడు వారికి కలలో కనబడి, కేరళలోని అంబాపురానికి సమీపంలో ఒక స్థలం చూపించాడు. బృహస్పతి వాయుదేవుని సహాయంతో ఆ స్థలంలో విగ్రహాన్ని ప్రతిష్ఠించారని, గురువు, వాయువు లిద్దరిచే నిర్మితమైన దేవాలయం గల ఆ ఊరు 'గురువాయూరు' అయ్యిందని ఇతిహాస కథ.

శ్రీమన్నారాయణీయమ్... కృష్ణ లీలలను, మహిమలను వర్ణించే అద్భుతమైన పారాయణ గ్రంథ రాజం. దీనిని పఠిస్తే సర్వ వ్యాధులు తొలగి మనశ్శాంతి లభిస్తుందని జనుల అచంచల విశ్వాసం.

– డాక్టర్ చెంగల్వ రామలక్ష్మి

ఎరువుల విషయంలో ఇబ్బందులు తలెత్తవద్దు

- గోదాముల సామర్థ్యాన్ని పూర్తిగా వినియోగించుకోవాలి
- మార్క్‌ఫెడ్, హాకా అధికారులతో మంత్రి తుమ్మల సమీక్ష



సాక్షి, హైదరాబాద్: రైతులకు అవసరమైన ఎరువులను సరఫరా చేయడంలో పొరపాట్లకు తావివ్వకుండా, ప్రణాళికాబద్ధంగా ముందుకు సాగాలని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అధికారులను ఆదేశించారు. మంగళవారం సచివాలయంలో మార్క్‌ఫెడ్, హాకా అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, ఎరువుల విషయంలో రైతులకు ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని అధికారులను ఆదేశించారు. డిమాండుకు అనుగుణంగా ఎరువుల నిల్వలు ఉన్నాయని, పంపిణీలో జాగ్రత్త వహించాలన్నారు. మార్క్‌ఫెడ్ ఆధ్వర్యంలో వివిధ జిల్లాలలో 76 కంది కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసేందుకు ప్రతిపాదించినట్లు తెలిపారు. కంది రైతులు రూ. 7,550 మద్దతు ధరకి తమ పంటను మార్క్‌ఫెడ్ కేంద్రాలలో విక్రయించాలని కోరారు. మార్క్‌ఫెడ్, హాకా సంస్థలు వాటి నిరర్థక ఆస్తులను వినియోగంలోకి తెచ్చేవిధంగా ప్రతిపాదనలు సిద్ధం చేసి, ప్రభుత్వానికి సమర్పించాల్సిందిగా ఆదేశించారు. ఈ సమావేశంలో వ్యవసాయ శాఖ కార్యదర్శి రఘునందన్‌రావు, మార్క్‌ఫెడ్ ఎండీ శ్రీనివాసరెడ్డి, సంచాలకులు గోపి, హాకా ఎండీ చంద్రశేఖర్‌రెడ్డి, ఇతర సంస్థల అధికారులు పాల్గొన్నారు.

క్లుప్తంగా...

రేపు 'బీసీ విద్యార్థుల సమర శంఖారావం' సభ

బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల



సాక్షి, హైదరాబాద్: పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు తక్షణమే విడుదల చేయాలని, బీసీ, ఎస్సీ, ఎస్టీల రిజర్వేషన్లు అమలు చేయాలని డిమాండ్ చేస్తూ ఈనెల 30న 'బీసీ విద్యార్థుల సమర శంఖారావం'సభను నిర్వహించనున్నామని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్ తెలిపారు. స్కాలర్‌షిప్‌లు, ఫీజు బకాయిలు విడుదల చేయకుండా విద్యార్థుల జీవితాలతో చెలగాటమాడుతున్నారని మంగళవారం ఆయన ఒక ప్రకటనలో ఆవేదన వ్యక్తం చేశారు. గత ప్రభుత్వం చేసిన బకాయిలను మేమెందుకు ఇవ్వాలంటూ కాంగ్రెస్ ప్రభుత్వం తప్పించుకోవడం భావ్యం కాదన్నారు. రాష్ట్ర ప్రభుత్వం కాంట్రాక్టర్ల బిల్లులు చెల్లిస్తోందని, కాలేజీ విద్యార్థుల ఫీజు బకాయిలు మాత్రం విడుదల చేయడం లేదని జాజుల ఆరోపించారు.

మాలలపై అనుచిత వ్యాఖ్యలు సహించం

- మాల సంఘాల జేఏసీ చైర్మన్ చెన్నయ్య హెచ్చరిక



పంజగుట్ట (హైదరాబాద్): మాలలపై విషం చిమ్ముతున్న మందకృష్ణ నోరు అదుపులో పెట్టుకుని మాట్లాడాలని.. ఇకపై మాలలపై అవాకులు చెవాకులు పేలితే సహించేది లేదని మాల సంఘాల జేఏసీ చైర్మన్ జి.చెన్నయ్య హెచ్చరించారు. లక్ష డప్పులు, వెయ్యి గొంతుకలు కార్యక్రమం సందర్భంగా.. కొంతమంది మాలలకు చావు డప్పులు కొడుతున్నాం అంటున్నారని.. అంతగా చావుడప్పు కొట్టాల్సి వస్తే వర్గీకరణ బిల్లును పార్లమెంట్‌లో పెట్టనందుకు ప్రధాని మోదీకి, అమిత్‌షాకు కొట్టాలని సూచించారు. ఆయన మంగళవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో వివిధ మాల సంఘాల నాయకులు చెరుకు రాంచందర్, బేర బాలకిషన్, వెంకటేశ్, మన్నె శ్రీధర్, కరణం కిషన్‌లతో కలిసి విలేకరులతో మాట్లాడారు. సుప్రీంకోర్టు వర్గీకరణపై తీర్పు ఇచ్చిందని కొంతమంది బీసీ మేధావులు చెబుతున్నారని, సుప్రీంకోర్టు ఇచ్చిన 500 పేజీల తీర్పు మీరు చదివారా? అని ప్రశ్నించారు. అభివృద్ధి చెందని ఉప కులాలకు ప్రత్యేక నిధులు ఇవ్వాలని సుప్రీంకోర్టు సూచించిదని స్పష్టం చేశారు. దళితజాతిలోని ఎంతో మంది మేధావులకు రాని పద్మశ్రీ... బీజేపీ తొత్తు, దళిత జాతిని 30 సంవత్సరాలుగా విభజిస్తున్న మందకృష్ణకు ఇచ్చారని ఆరోపించారు.

బండి వ్యాఖ్యలు అభ్యంతరకరం

- తెలంగాణ సాంస్కృతిక సారథి చైర్‌పర్సన్ వెన్నెల గద్దర్



మాదాపూర్ (హైదరాబాద్): బాధ్యత గల పదవిలో ఉన్న కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్.. గద్దరన్నపై అనుచిత వ్యాఖ్యలు చేయడం సరికాదని తెలంగాణ సాంస్కృతిక సారథి చైర్‌పర్సన్ డాక్టర్ వెన్నెల అన్నారు. ఆమె మాదాపూర్‌లోని తెలంగాణ సాంస్కృతిక సారథి కార్యాలయంలో మంగళవారం విలేకరులతో మాట్లాడుతూ.. గద్దర్ వ్యక్తి కాదని, తెలంగాణ ప్రజల గుండె చప్పుడని స్పష్టం చేశారు. తెలంగాణ సమాజాన్ని కించపరిచేలా కేంద్రమంత్రి బండి సంజయ్ వ్యాఖ్యలు న్నాయన్నారు. బీజేపీ అగ్రనాయకులెందరో గద్దర్‌ను కలిశారని ఆమె స్పష్టం చేశారు. గద్దర్ ఎంతమందిని చంపారో ప్రజలకు తెలియజేయాలని డిమాండ్ చేశారు. గద్దర్ కుటుంబానికి, తెలంగాణ ప్రజలకు.. బండి క్షమాపణలు చెప్పాలని వెన్నెల గద్దర్ కోరారు.

పోలీసులే నివ్వెరపోయేలా హత్య..

మీర్‌పేట హత్య కేసుపై రాచకొండ సీపీ సుధీర్‌బాబు

కుటుంబ కలహాలతోనే పాశవికంగా భార్య హత్య

- భార్య తలను గోడకేసి బాది, గొంతు నులిమి చంపి.. చేతులు, కాళ్లు, తల నరికిన మాజీ జవాన్ గురుమూర్తి
- శరీర భాగాలను వాటర్ హీటర్‌తో ఉడకబెట్టి.. గ్యాస్ స్టవ్ మీద కాల్చి, రోట్లో దంచి జిల్లెలగూడ చెరువులో పారబోత
- సాంకేతిక ఆధారాలతో నిందితుడిని పట్టుకున్న పోలీసులు



విలేకరులతో మాట్లాడుతున్న రాచకొండ సీపీ సుధీర్‌బాబు



గురుమూర్తి నివాసం ఉన్న ఇంట్లో సీన్ రీకన్‌స్ట్రక్షన్

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో సంచలనం సృష్టించిన మీర్‌పేట హత్య కేసులో నిందితుడిని పోలీసులు అరెస్టు చేశారు. భార్యను అత్యంత కిరాతకంగా చంపి, ముక్కలుగా నరికి చెరువులో పడేసిన మాజీ ఆర్మీ జవాన్ గురుమూర్తి అరెస్టు, కేసు వివరాలను మంగళవారం రాచకొండ పోలీస్ కమిషనర్ సుధీర్‌బాబు మీడియాకు వెల్లడించారు.

పక్కా ప్లాన్‌తోనే..

ప్రకాశం జిల్లా జేపీ చెరువు గ్రామానికి చెందిన గురుమూర్తి, వెంకట మాధవి (35) దంపతులు తమ ఇద్దరు పిల్లలతో ఐదేళ్ల నుంచి జిల్లెలగూడ న్యూ వేంకటేశ్వర కాలనీలో అద్దెకు ఉంటున్నారు. గురుమూర్తి కంచన్‌బాగ్‌లోని డీఆర్‌డీఓలో సెక్యూరిటీ గార్డుగా పనిచేస్తున్నాడు. భార్యాభర్తల మధ్య తరచూ గొడవలు జరుగుతుండేవి. దీంతో ఆమెను ఎలాగైనా హత్యచేయాలని పథకం వేసిన గురుమూర్తి.. సంక్రాంతి సందర్భంగా ఈ నెల 14న భార్యా పిల్లలను తీసుకొని బడంగ్‌పేటలోని తన సోదరి సుజాత ఇంటికి వెళ్లాడు. పిల్లలను అక్కడే వదిలేసి అదే రాత్రి భార్యతో కలిసి తన ఇంటికి తిరిగి వచ్చేశాడు. మర్నాడు ఉదయం మళ్లీ సోదరి ఇంటికి వెళ్లి రాత్రి వరకూ అక్కడే గడిపారు. పిల్లలను మళ్లీ అక్కడే ఉంచేసి రాత్రి 10 గంటలకు ఇద్దరూ ఇంటికి వచ్చారు. పథకం ప్రకారం 16న ఉదయం 8 గంటలకు భార్యతో వాగ్వాదానికి దిగి, ఆమె తలను గోడకేసి బలంగా బాదాడు. దీంతో ఆమె స్పృహ తప్పి పడిపోయింది. ఆ తర్వాత ఆమె గొంతు నులిమి చంపేశాడు. మృతదేహాన్ని బాత్‌రూమ్‌లోకి తీసుకెళ్లి వివస్త్రను చేసి, మళ్లీ శవాన్ని బెడ్‌రూమ్‌లోకి తీసుకెళ్లి బెడ్‌పై పడేశాడు. పదునైన కత్తితో ముందుగా వెంకట మాధవి రెండు భుజాలు నరికాడు. తర్వాత కాళ్లు కోశాడు. కాళ్లు, చేతులను చిన్న ముక్కలుగా చేసి బకెట్‌లో వాటర్ హీటర్‌తో ఉడకబెట్టాడు. తర్వాత వాటిని బయటికి తీసి, సింగిల్ బర్నల్ గ్యాస్ స్టవ్ మీద బాగా కాల్చాడు. కాలిన ముక్కలను రోలులో వేసి పొడిగా దంచాడు. ఎముకల పొడి, చిన్న చిన్న మాంసం ముద్దలను టాయిలెట్‌లో వేసి ఫ్లష్ చేశాడు. చిన్న శరీర అవశేషాలను తర్వాత పారవేసేందుకు వీలుగా ఇంట్లోని చెత్త డబ్బాలో వేశాడు. మిగిలిన మృతదేహాన్ని విడతల వారీగా ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు జిల్లెలగూడ చెరువులో పడేశాడు. శరీర భాగాలను కాల్చుతున్నప్పుడు వాసన రాకుండా ఇంటి తలుపులు, కిటికీలు తెరిచి పెట్టాడు. బాత్‌రూమ్, ఇంట్లో రక్తం మరకలు, దుర్వాసన పోయేందుకు డిటర్జెంట్, ఫినాయిల్‌తో శుభ్రం చేశాడు.

ఏమీ తెలియనట్లుగా మిస్సింగ్ కేసు..

పండుగ తర్వాత ఇంటికొచ్చిన పిల్లలను నమ్మించేందుకు గురుమూర్తి ముందుగానే ఓ కట్టుకథను తయారుచేసుకున్నాడు. అమ్మ ఏదని పిల్లలు అడిగితే బయటికి వెళ్లిందని చెప్పాడు. తనకు చెప్పకుండా మాధవి ఇంట్లో నుంచి వెళ్లిపోయిందని అత్త కుప్పాల సుబ్బమ్మకు తెలిపాడు. ఆమెతో కలిసి 18న మీర్‌పేట పోలీస్‌స్టేషన్‌కు వెళ్లి మిస్సింగ్ కేసు పెట్టాడు.

ఎలా చిక్కాడంటే..

కేసు నమోదు చేసుకున్న పోలీసులు గురుమూర్తి అపార్ట్‌మెంట్‌లోని సీసీటీవీ ఫుటేజీను పరిశీలించారు. 15వ తేదీన రాత్రి 10:41 గంటలకు గురుమూర్తి, భార్య మాధవి ఇద్దరూ కలిసి ఇంటి లోపలికి వెళ్లడం గమనించారు. ఆ తర్వాత మాధవి బయటికి వెళ్లినట్లు సీసీటీవీ ఫుటేజ్‌లో నమోదు కాలేదు. దీంతో గురుమూర్తే ఇంట్లో భార్యను హత్య చేసి ఉంటాడని పోలీసులు ఓనిర్ధారణకు వచ్చారు. దీంతో వారు తమదైన పద్ధతిలో విచారించే సరికి భార్యను తానే హత్య చేసినట్లు నేరం ఒప్పుకున్నాడు. నిందితుడి ఇంట్లో నుంచి స్టవ్, కత్తి, రోలు, పాత్రం, బకెట్, వాటర్ హీటర్, హత్య సమయంలో వెంకటమాధవి ధరించిన దుస్తులు, ద్విచక్ర వాహనం, రెండు సెల్‌ఫోన్లు ఇతర వస్తువులను స్వాధీనం చేసుకున్నారు.

గురుమూర్తిలో ఏమాత్రం పశ్చాత్తాపం లేదు

భార్యను పాశవికంగా హత్య చేశానన్న పశ్చాత్తాపం గురుమూర్తిలో కనిపించలేదు. భార్య పొట్టిగా ఉండటంతో సులువుగా ముక్కలు చేశానని ఒప్పుకున్నాడు. విచారణలో పోలీసులను తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేశాడు. కానీ, సాంకేతిక ఆధారాలు, సీన్ రీ-కన్‌స్ట్రక్షన్‌తో ఆధారాలతో సహా దొరికిపోయాడు. మనిషిని ఇంత క్రూరంగా చంపుతారా? అని మేమే నివ్వెరపోయాం.
– జీ సుధీర్‌బాబు, రాచకొండ పోలీస్ కమిషనర్

వైరస్ సోకి 10 వేల కోళ్లు మృతి

పరిశీలించిన వెటర్నరీ అండ్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ సిబ్బంది



ఫారంలో మృతి చెందిన కోళ్లను పరిశీలిస్తున్న వీబీఆర్ఐ సిబ్బంది

పెనుబల్లి: ఖమ్మం జిల్లా పెనుబల్లి మండలం వీఎం బంజర్, కొత్తకారాయిగూడెం గ్రామాల్లో వైరస్ కారణంగా వేల సంఖ్యలో కోళ్లు మృతి చెందాయి. వీఎం బంజర్ కొండపల్లి ఉప్పయ్య ఫారంలో 4 వేలు, కొత్తకారాయిగూడెం బైగాని నాగేశ్వరరావు ఫారంలో 6 వేల కోళ్లు మృతి చెందాయి. రూ.10 లక్షలకు పైగా పెట్టుబడి నష్టపోయామని రైతులు వాపోయారు. ఈ మేరకు సమాచారం అందుకున్న హైదరాబాద్‌లోని వెటర్నరీ బయలాజికల్స్ అండ్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ (వీబీఆర్ఐ) ఉద్యోగులు మంగళవారం పరిశీలించారు. డాక్టర్ బి.విజయభాస్కర్‌రెడ్డి, డాక్టర్ శిరీషతో పాటు జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి డాక్టర్ వెంకటనారాయణతో కలిసి కోళ్లను పరిశీలించిన వారు.. కళేబరాలను పరీక్షల నిమిత్తం పంపిస్తున్నట్లు తెలిపారు. కాగా, ఈ కోళ్లకు సోకిన వైరస్ ప్రభావం పది కిలోమీటర్ల మేర ఉంటుందని వెల్లడించారు. వైరస్ సోకి మరణించిన కోళ్లను తినడం ప్రమాదకరమని, వీటిని మూడు అడుగుల గోయి తీసి సున్నం కలిపి పూడ్చి పెట్టాలని రైతులకు సూచించినట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వెటర్నరీ వైద్యులు కె.ప్రదీప్‌కుమార్, వి.సృజన పాల్గొన్నారు.





మహా పూజకు బయలుదేరిన మెస్రం వంశీయులు, మెస్రం వంశ పెద్దల నుంచి కుండ అందుకుంటున్న మెస్రం వంశ మహిళలు

నాగోబాకు మహాపూజలు

- భక్తిశ్రద్ధలతో కొలిచిన మెస్రం వంశీయులు
- ఉట్టిపడిన సాంప్రదాయ, ఆచార వ్యవహారాలు
- కేస్లాపూర్ జాతరకు వేలాదిగా తరలివచ్చిన భక్తులు

సాక్షి, ఆదిలాబాద్: నాగోబా మహాపూజలందుకుంది. తమ ఆరాధ్య దైవాన్ని మెస్రం వంశీయులు భక్తిశ్రద్ధలతో కొలిచారు. ఆదిలాబాద్ జిల్లా ఇంద్రవెల్లి మండలం కేస్లాపూర్‌లోని నాగోబా ఆలయం ఇందుకు వేదికైంది. మంగళవారం ఉదయం 11 గంటలకు పురుషులు కలిసికట్టుగా కాలినడకన బయల్దేరి నాగోబా ప్రతిమను ఊరేగిస్తూ సంప్రదాయ వాయిద్యాల నడుమ ఆలయానికి చేరుకున్నారు. వారు ధోవతి, చొక్కా, మెడలో కండువా, తలపాగతో పైనుంచి కింది వరకు తెల్లని వస్త్రాలు ధరించారు. మహిళలు సంప్రదాయ వస్త్రాలు ధరించి వచ్చినా, భుజం పైనుంచి తెల్లని వస్త్రాన్ని కప్పుకొని తలపై బిందెల్లో నీళ్లతో అందరూ కలిసికట్టుగా వచ్చారు. మురాడి నుంచి మెస్రం వంశీయులు ఇలా వేలాదిగా ఆలయానికి చేరుకుంటున్న ఘట్టం కన్నుల పండువగా సాగింది.

కొత్త కుండలు అందజేత

ఆలయానికి చేరుకున్న తర్వాత మెస్రం వంశీయులు తమ సంప్రదాయ పూజలు మొదలుపెట్టారు. మొదటగా మెస్రం పెద్దలు 22 కితల్లోని మహిళలు, ఆడపడుచులకు కొత్త కుండలను అందజేయగా, ఆడపడుచులు, మహిళలు, అల్లుళ్లు కలిసి ఒక వరుసలో తలపై కుండలను మోసుకుంటూ వెళ్లి కోనేరు వద్దకు చేరుకున్నారు. అక్కడ జలాన్ని సేకరించి అదే వరుసలో తిరిగి ఆలయానికి చేరుకున్నారు. ఆ తర్వాత మెస్రం అల్లుళ్లు పాత పుట్టలను తొలగించారు. ఆపై ఆడపడుచులు, మహిళలు పుట్ట మట్టి, పశువుల పేడ, కోనేరు నుంచి తీసుకొచ్చిన జలంతో కొత్త పుట్టలను తయారు చేశారు. ఇలా ఒక్కో ఘట్టంలో వారి సంప్రదాయం, ఆచార వ్యవహారాలు కొట్టొచ్చినట్టుగా కనిపించాయి. నాగోబా ఆలయంలోని బౌల సతీ దేవత ముందు ఏడు వరుసలతో తయారు చేసిన దేవతామూర్తులను ఉంచారు. రాత్రి 9 నుంచి 11 గంటల మధ్య నాగోబాకు మహాపూజ నిర్వహించారు. కొద్ది రోజుల ముందు పాదయాత్రగా వెళ్లి గోదావరినది నుంచి కలశాల్లో తీసుకొచ్చిన పవిత్ర జలంతో పూజలు చేశారు. ఇలా ఉదయం నుంచి సంప్రదాయ పూజలు, రాత్రి మహాపూజ నిర్వహించి నాగోబా జాతరను మొదలుపెట్టారు.

అర్ధరాత్రి కొత్త కోడళ్ల భేటింగ్

మహాపూజ అనంతరం అర్ధరాత్రి దాటిన తర్వాత తమ సంప్రదాయ పద్ధతిలో మెస్రం వంశీయులు భేటింగ్ కార్యక్రమం నిర్వహించారు. కొత్త కోడళ్ల పరిచయమే ఈ భేటింగ్. కొత్త కోడళ్లు నాగోబా సన్నిధికి వస్తారు. ఈ సన్నిధికి వచ్చిన తర్వాతే వారు తమ సంప్రదాయ పూజల్లో నిరంతరం పాల్గొనేందుకు అవకాశం ఉంటుంది. ఇలా మెస్రం వంశీయులు చేపట్టే ఈ కార్యక్రమంలో వారి ఆచార వ్యవహారాలు నిండుగా కనిపిస్తాయి. జిల్లా అధికారులు, ప్రజాప్రతినిధులు మహాపూజలో పాల్గొన్నారు. జాతరకు పలు రాష్ట్రాల నుంచి ఆదివాసీలు పెద్ద ఎత్తున తరలివస్తున్నారు.

కూతురితో చనువుగా ఉండగా..

- గమనించిన అమ్మాయి తండ్రి
- గోడదూకి పారిపోతున్న యువకుడిని పట్టుకున్న స్థానికులు
- యువకుడి గొంతుకు గాయంపై అనుమానాలు
- అవమానంగా భావించి ఆ అమ్మాయి ఆత్మహత్య



హసన్‌పర్తి: వారిద్దరూ ప్రేమించుకున్నారు. ఆమెతో ఆ యువకుడు చనువుగా ఉండగా, అమ్మాయి తండ్రి అప్పుడే తన ఇంటికొచ్చాడు. ఆయన్ను చూసిన ఆ యువకుడు గోడ దూకి పారిపోయే ప్రయత్నం చేయగా స్థానికులు పట్టుకున్నారు. దీనిని అవమానంగా భావించి ఆమె ఆత్మహత్య చేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. వరంగల్ నగరంలోని శ్రీనివాసనగర్‌కాలనీకి చెందిన వెంకటరమణారెడ్డి కూతురు(17) నగరంలోని ఓ ప్రైవేట్ కళాశాలలో ఇంటర్ సెకండియర్ చదువుతోంది. ఆమెకు పోచమ్మ మైదాన్‌కు చెందిన ఓ యువకుడి (17)తో ఏర్పడిన పరిచయం ప్రేమగా మారింది.

రెడ్ హ్యాండెడ్‌గా....

చిట్‌ఫండ్ కంపెనీలో పనిచేసే వెంకటరమణారెడ్డి మంగళవారం సాయంత్రం విధులు ముగించుకొని ఇంటికి చేరుకున్నాడు. అప్పటికే అతని కూతురు.. ఆ యువకుడితో కలిసి ఉండటాన్ని చూసి ఆగ్రహానికి గురయ్యాడు. దీంతో ఆ యువకుడు గోడదూకగా, చుట్టు పక్కల వారు అతన్ని పట్టుకున్నారు. ఈ క్రమంలో ఆ యువకుడి గొంతుపై గాయమైంది. అయితే తీవ్ర ఆగ్రహానికి గురైన వెంకటరమణారెడ్డి ఆ యువకుడి గొంతుకోశాడా? ఘర్షణలో గాయమైందా ?అనే విషయం సందిగ్ధంగా మారింది.

అవమానంగా భావించి....

ఓ వైపు ప్రియుడిని పట్టుకొని చితకబాదడం చూసిన ఆ విద్యార్థిని అవమానంగా భావించి ఇంటిలోనే ఉరి వేసుకుంది. గమనించిన తండ్రి, స్థానికులు ఆమెను ఎంజీఎంకు తరలించారు. అప్పటికే మృతి చెందినట్టుగా డాక్టర్లు చెప్పారు. సమాచారం అందుకున్న ఇన్‌స్పెక్టర్ రవికుమార్ సంఘటన స్థలాన్ని చేరుకుని పరిస్థితిని సమీక్షించారు. స్థానికంగా విచారించారు. కాగా, గాయపడిన యువకుడు నగరంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. దీనిపై పూర్తిస్థాయిలో విచారణ జరుపుతున్నట్టు రవికుమార్ తెలిపారు.

వర్షాధారిత వ్యవసాయంపై నేటి నుంచి ఐసీఏఆర్‌లో సదస్సు

సాక్షి, హైదరాబాద్: ప్రపంచవ్యాప్తంగా వర్షాధారిత వ్యవసాయం వల్ల కోట్లాది మంది ప్రజలకు ఆహారం లభించడంతో పాటు వ్యవసాయ అనుబంధ పరిశ్రమలు ఎంతో అభివృద్ధి చెందుతున్నాయి. మన దేశంలో పంటల సాగు విస్తీర్ణం 40 శాతం వర్షాధారంపైనే ఆధారపడి ఉంది. ఇక పప్పు ధాన్యాలు 88 శాతం, నూనె గింజల ఉత్పత్తి 77 శాతం కాగా జంతువులకు ఆహారం 72 శాతం వర్షాధారం ద్వారానే లభిస్తుంది. జాతి మనుగడకు కీలకంగా మారిన వర్షాధారిత వ్యవసాయంపై హైదరాబాద్ రాజేంద్రనగర్ వ్యవసాయ విశ్వవిద్యాలయంలోని ఐసీఏఆర్-సీఆర్ఐడీఏలో బుధవారం నుంచి ఈనెల 31వ తేదీ వరకు మూడు రోజులపాటు అంతర్జాతీయ సదస్సును నిర్వహించాలని నిర్ణయించారు. ఐసీఏఆర్-సీఆర్ఐడీఏ నిర్వహిస్తున్న ఈ సదస్సుకు జాతీయ, అంతర్జాతీయ వ్యవసాయ నిపుణులు, శాస్త్రవేత్తలు హాజరుకానున్నట్లు ఐసీఏఆర్ ఒక ప్రకటనలో తెలిపింది.

ఎన్‌కౌంటర్లపై సీపీఐ సదస్సు నేడు

సాక్షి, హైదరాబాద్: నక్సల్స్ అణచివేతే లక్ష్యంగా కేంద్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో మావోయిస్టులపై జరుగుతున్న ఎన్‌కౌంటర్లకు నిరసనగా సీపీఐ ఆధ్వర్యంలో బుధవారం హైదరాబాద్‌లో రాష్ట్ర స్థాయి సదస్సు జరగనుంది. 'నక్సల్స్‌పై కేంద్ర ప్రభుత్వ రాక్షస విధానాలను ఖండిద్దాం- ప్రశ్నించే గొంతుకలను కాపాడుకుందాం'అనే అంశంపై హైదరాబాద్‌లోని బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో బుధవారం ఉదయం 11 గంటలకు రాష్ట్ర స్థాయి సెమినార్ నిర్వహించనున్నట్లు సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు తెలిపారు.

మైనర్ డ్రైవింగ్.. ట్రిపుల్ రైడింగ్.. ఓవర్ స్పీడ్

హైదరాబాద్‌లో నలుగురు మైనర్ల దుర్మరణం


- ఓ ఘటనలో ముగ్గురు.. మరో ఘటనలో ఒకరు..
- తల్లి పేరు మీద మైనర్లు నడిపిన వాహనం
- ఆమెకు తెలిసి వాహనాన్ని తీసుకెళ్లినట్లు తేలితే.. నిందితురాలిగా కేసులో ఆమె పేరునూ చేర్చనున్న పోలీసులు



వాహనం ఢీకొట్టడంతో వంగిన స్ట్రీట్‌లైట్ పోల్

సాక్షి, హైదరాబాద్/అత్తాపూర్//మేడిపల్లి: హైదరాబాద్‌లో మంగళవారం జరిగిన రెండు వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో నలుగురు మైనర్లు అశువులు బాశారు. ఈ ఉదంతాల్లో మైనర్లే డ్రైవర్లు కావడం గమనార్హం. అప్పటి వరకు తమ కళ్ల ముందే తిరిగిన పిల్లలు అంతలోనే విగతజీవులుగా మారడంతో వారి కుటుంబాలు కన్నీరుమున్నీరవుతున్నాయి. అత్తాపూర్ ఇన్‌స్పెక్టర్ జి.వెంకట్రామిరెడ్డి కథనం ప్రకారం... పాతబస్తీలోని ఫతేదర్వాజాకు చెందిన సయ్యద్ ఖాద్రీ అలియాస్ మాజ్ (14), మహమ్మద్ అహ్మద్ (14), తలాబ్‌కట్ట ప్రాంతానికి చెందిన సయ్యద్ ఇమ్రాన్ (17) స్నేహితులు. మాజ్, అహ్మద్ ఎనిమిదో తరగతి చదువుతుండగా... ఇమ్రాన్ పదో తరగతి చదువుతున్నాడు. సోమవారం జగ్నేకీ రాత్ నేపథ్యంలో ఫతేదర్వాజాలో ఉన్న మసీదులో ప్రార్థనల కోసం వెళ్తున్నట్లు చెప్పిన మాజ్, అహ్మద్.. రాత్రి 11.30 గంటల ప్రాంతంలో మాజ్ తల్లి పేరుతో ఉన్న సుజుకీ యాక్సెస్ వాహనంపై బయలుదేరారు. అక్కడ నుంచి జహంగీర్‌నగర్‌కు వెళ్లి ఇమ్రాన్‌ను ఎక్కించుకున్నారు. ట్రిపుల్ రైడింగ్ చేసుకుంటూ ఫ్లైఓవర్ ఎక్కి ఆరాంఘర్ వరకు వెళ్లాలని భావించారు. మితిమీరిన వేగంతో ప్రయాణిస్తున్న వీరి వాహనం నేషనల్ పోలీసు అకాడమీ ప్రాంతంలో అదుపు తప్పి స్ట్రీట్‌లైట్ పోల్‌ను, డివైడర్‌ను ఢీ కొట్టింది. దీంతో ముగ్గురికీ తీవ్రగాయాలయ్యాయి. ఖాద్రి ఘటనాస్థలిలోనే చనిపోగా.. మిగిలిన ఇద్దరూ ఆస్పత్రికి తరలిస్తుండగా కన్నుమూశారు. మైనర్లు నడిపిన వాహనం ఖాద్రీ తల్లిపేరుతో ఉన్నట్లు పోలీసులు గుర్తించారు. ఆమెకు తెలిసి వాహనాన్ని తీసుకువెళ్లినట్లు నిర్ధారణ అయితే ఆమెనూ కేసులో నిందితురాలిగా చేర్చనున్నారు. మృతదేహాలకు ఉస్మానియా ఆస్పత్రిలో పోస్టుమార్టం నిర్వహించి కుటుంబీకులకు అప్పగించారు.

మరో ఘటనలో..



ఇంటి నుంచి ట్యూషన్‌కు వెళ్లి తిరిగి వస్తున్న విద్యార్థిని టిప్పర్ బలిగొంది. ఘట్‌కేసర్ మండలం కాచవాని సింగారం గ్రామానికి చెందిన మోతీరాం కుమారుడు తేజ చౌదరి (14) దివ్యానగర్‌లోని నల్ల మల్లారెడ్డి పాఠశాలలో పదో తరగతి చదువుతున్నాడు. మంగళవారం ఉదయం స్కూటీపై పర్వతాపూర్ స్వాంజిల్లా కమ్యూనిటీలో ట్యూషన్ కోసం వెళ్లాడు. అది ముగించుకుని ఉదయం 6.30 గంటల ప్రాంతంలో తిరిగి ఇంటికి వస్తున్నాడు. ముత్వెల్లిగూడెం వద్ద వెనుక నుంచి వచ్చిన మినీ లారీ యూ టర్న్ తీసుకుంటూ తేజ వాహనాన్ని ఢీకొట్టింది. తేజ కిందపడిపోగా... పైనుంచి మినీ లారీ వెళ్లడంతో అక్కడికక్కడే కన్నుమూశాడు. మేడిపల్లి పోలీసులు కేసు నమోదు చేశారు.

వచ్చే నెలలో అమెరికాకు మోదీ!

అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ వెల్లడి

అక్రమ వలసదార్ల విషయంలో మోదీ సరైన పనే చేస్తారని వ్యాఖ్య

- మాకు నష్టం కలిగిస్తున్న దేశాలపై అధిక సుంకాలు విధిస్తాం
- చైనా, ఇండియా, బ్రెజిల్‌లో టారిఫ్‌లు ఎక్కువగా ఉన్నాయని స్పష్టీకరణ


ఎయిర్‌ఫోర్స్ వన్‌లో మీడియాతో మాట్లాడుతున్న ట్రంప్

వాషింగ్టన్: అక్రమ వలసదార్లను వెనక్కితీసుకొనే విషయంలో భారత ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఏది సరైందో అదే చేస్తారని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ చెప్పారు. అక్రమ వలసల వ్యవహారంపై భారత ప్రభుత్వంతో చర్చలు కొనసాగుతున్నాయని తెలిపారు. స్థానిక కాలమానం ప్రకారం సోమవారం ఎయిర్‌ఫోర్స్ వన్ విమానంలో ట్రంప్ మీడియాతో మాట్లాడారు. ప్రధాని నరేంద్ర మోదీ వచ్చే నెలలో శ్వేత సౌధాన్ని సందర్శించే అవకాశం ఉందని వెల్లడించారు. ఇండియాతో తనకు చక్కటి స్నేహ సంబంధాలు ఉన్నాయని పేర్కొన్నారు. అంతకు ముందు ఫ్లోరిడా ఫ్లోరిడా రీట్రీట్‌లో హౌస్ ఆఫ్ రిపబ్లికన్స్‌ను ఉద్దేశించి ఆయన ప్రసంగించారు. అమెరికాకు నష్టం కలిగిస్తున్న దేశాల ఉత్పత్తులపై అధిక సుంకాలు(టారిఫ్స్) విధిస్తామని పునరుద్ఘాటించారు. బయటి దేశాలు, బయటి వ్యక్తులపై సుంకాలు విధించక తప్పదని తేల్చిచెప్పారు. చైనా, ఇండియా, బ్రెజిల్ దేశాల పేర్లను ప్రస్తావించారు. అమెరికా ఉత్పత్తులపై ఆయా దేశాలపై అధిక పన్నులు విధిస్తున్నారని ఆక్షేపించారు. అమెరికాకే ప్రథమ ప్రాధాన్యం ఇస్తున్నామని గుర్తుచేశారు. తమ దేశానికి నష్టం కలిగిస్తున్న విధానాలకు చరమగీతం పాడడం ఖాయమని తేల్చిచెప్పారు. తమకు ఆర్థికంగా నష్టం కలిగిస్తున్న దేశాల ఉత్పత్తులపై అధిక పన్నులు వసూలు చేస్తే తప్పేంటని ప్రశ్నించారు. కొలంబియా ఉత్పత్తులపై 25 శాతం టారిఫ్ విధిస్తామని ట్రంప్ హెచ్చరించడం సంచలనం సృష్టించింది. వెంటనే అప్రమత్తమైన కొలంబియా ప్రభుత్వం అమెరికాలో అక్రమంగా నివసిస్తున్న తమ పౌరులను వెనక్కి తీసుకెళ్లడానికి అంగీకరించింది. కెనడా, మెక్సికోపై ట్రంప్ ఇదే అస్త్రం ప్రయోగించబోతున్నారు. ఆ రెండు దేశాల ఉత్పత్తులపై సుంకాల మోత మోగించనున్నట్లు తెలుస్తోంది. అతిత్వరలో ఇది అమల్లోకి రానున్నట్లు సమాచారం. అయితే, విదేశీ వస్తువులపై సుంకాలు పెంచితే దేశ ఆర్థిక వ్యవస్థకు నష్టం జరుగుతుందని అమెరికా నిపుణులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

అమెరికన్లపై ఆదాయపు పన్ను ఉండదు!

డొనాల్డ్ ట్రంప్ సంకేతాలు

- ప్రజలను ధనవంతులు చేసే వ్యవస్థను పునరుద్ధరిస్తా
- విదేశాలపై పన్నుల వసూలుకు ఎక్స్‌టర్నల్ రెవెన్యూ సర్వీసు ప్రారంభించామని స్పష్టీకరణ

వాషింగ్టన్: అమెరికా పౌరులపై విధిస్తున్న ఆదాయపు పన్నును రద్దు చేసే దిశగా డొనాల్డ్ ట్రంప్ సంకేతాలిచ్చారు. ప్రజల వద్ద తగినంత డబ్బులు ఉండి, స్వేచ్ఛగా ఖర్చు చేస్తే ఆర్థిక వ్యవస్థలోకి నిధుల ప్రవాహం పెరుగుతుందని, తద్వారా దేశం అభివృద్ధి చెందుతుందని అన్నారు. అందుకే ఆ దిశగా అడుగులు వేస్తున్నామని చెప్పారు. అమెరికా ప్రజలను ధనవంతులను చేసే వ్యవస్థను పునరుద్ధరించాలన్నదే తమ ఉద్దేశమని తెలిపారు. అమెరికన్లను ధనవంతులుగా, మరింత శక్తివంతులుగా మార్చాల్సిన అవసరం ఉందన్నారు. ఇతర దేశాలను బాగు చేయడానికి తమ పౌరులపై పన్నులు వేయడం సరైన విధానం కాదని అభిప్రాయపడ్డారు. తమ ప్రజలపై పన్నుల భారం వేయడానికి బదులు విదేశాలపై పన్నులు విధించడమే సరైన పద్ధతి అని తేల్చిచెప్పారు. విదేశాల నుంచి పన్నులు వసూలు చేయడానికి ఎక్స్‌టర్నల్ రెవెన్యూ సర్వీసును ప్రారంభించినట్లు ట్రంప్ వెల్లడించారు. అమెరికాలో చరిత్రలో 1870 నుంచి 1913 మధ్య ప్రజలు సంపన్నులుగా ఉండేవారని గుర్తుచేశారు. అప్పట్లో సుంకాల ఆధారిత వ్యవస్థ ఉండేదని అన్నారు. దిగుమతి చేసుకొనే వస్తువులపై విధించే సుంకాలతో భారీగా ఆదాయం వచ్చేదన్నారు. అందుకే ఇప్పుడు అమెరికా వాణిజ్య వ్యవస్థను మార్చుకోవాలని స్పష్టంచేశారు.

'సెంచరీ'కి షార్ సిద్ధం

- నేడు శ్రీహరికోట నుంచి వందో ప్రయోగం
- జీఎస్‌ఎల్‌వీ–ఎఫ్15 రాకెట్ ప్రయోగానికి ఏర్పాట్లు పూర్తి
- నావిక్–2 ఉపగ్రహాన్ని భూస్థిర కక్ష్యలో ప్రవేశపెట్టనున్న ఇస్రో



సూళ్లూరుపేట/తిరుమల: ఆంధ్రప్రదేశ్‌లోని తిరుపతి జిల్లా సూళ్లూరుపేటలోని సతీష్ ధావన్ స్పేస్ సెంటర్ (షార్) నుంచి బుధవారం ఉదయం 6.23 గంటలకు ప్రతిష్టాత్మక వందో ప్రయోగానికి భారత అంతరిక్ష పరిశోధనా సంస్థ (ఇస్రో) ఏర్పాట్లు పూర్తి చేసింది. ఇందులో భాగంగా జీఎస్‌ఎల్‌వీ–ఎఫ్15 రాకెట్ ప్రయోగానికి మంగళవారం తెల్లవారుజామున 2.53 గంటలకు కౌంట్‌డౌన్ ప్రక్రియను ప్రారంభించింది. జీఎస్‌ఎల్‌వీ–ఎఫ్15 రాకెట్ ద్వారా 2,250 కిలోల బరువు కలిగిన నావిక్–02 ఉపగ్రహాన్ని కక్ష్యలోకి ప్రవేశపెట్టేందుకు శాస్త్రవేత్తలు సిద్ధమయ్యారు. కాగా, ఇస్రో శ్రీహరికోటలో రాకెట్ ప్రయోగ కేంద్రాన్ని స్థాపించిన తర్వాత ఇప్పటివరకు 99 ప్రయోగాలు నిర్వహించింది. ఇందులో కేవలం పది ప్రయోగాలు మాత్రమే విఫలమయ్యాయి. మిగిలిన 89 ప్రయోగాలు విజయవంతమయ్యాయి. బుధవారం నాటి ప్రయోగంతో సెంచరీ మైలురాయిని దాటేందుకు ఇస్రో శాస్త్రవేత్తలు ఎంతో ఉత్సాహంతో ఎదురు చూస్తున్నారు. 50.9 మీటర్ల పొడవున్న జీఎస్‌ఎల్‌వీ–ఎఫ్15 రాకెట్ భూమి నుంచి నింగికి ఎగసే సమయంలో 420.7 టన్నులు బరువు కలిగి ఉంటుంది. ఈ ప్రయోగాన్ని 19.17 నిమిషాల్లో పూర్తి చేయనున్నారు. 2,250 కిలోలు బరువు కలిగిన నావిక్–02 ఉపగ్రహాన్ని 170 కిలో మీటర్లు పెరిజీ(భూమికి అతి దగ్గరగా), 36,577 కిలో మీటర్లు అపోజీ(భూమికి దూరంగా) జియో ట్రాన్స్‌ఫర్ ఆర్బిట్ (జీటీవో)లోకి ప్రవేశపెట్టనున్నారు. ఆ తర్వాత ఉపగ్రహాన్ని బెంగళూరు సమీపంలోని హసన్‌లో ఉన్న మాస్టర్ కంట్రోల్ సెంటర్ వారు తమ ఆధీనంలోకి తీసుకుని, ఉపగ్రహాన్ని భూమికి 36 వేల కిలోమీటర్ల ఎత్తులోని భూస్థిర కక్ష్యలో ప్రవేశపెట్టే పనిని పూర్తిచేసే విధంగా ఇస్రో శాస్త్రవేత్తలు ఈ ప్రయోగాన్ని డిజైన్ చేశారు.

జీఎస్‌ఎల్‌వీ-ఎఫ్15 నమూనాకు ప్రత్యేక పూజలు

ఇస్రో చైర్మన్ వి.నారాయణన్ మంగళవారం తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. జీఎస్‌ఎల్‌వీ–ఎఫ్15 నమూనా రాకెట్‌ను శ్రీవారి పాదాల చెంత ఉంచి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయం వెలుపల మీడియాతో మాట్లాడుతూ అంతరిక్షంలో భారత్ మరో మైలురాయిని చేరుకోవడానికి సర్వం సిద్ధం చేశామని తెలిపారు. బుధవారం ఉదయం 6:23 నిమిషాలకు శ్రీహరికోట నుంచి వందో ప్రయోగమైన జీఎస్‌ఎల్‌వీ–ఎఫ్15 రాకెట్‌ను రోదసిలోకి పంపనున్నామని చెప్పారు. 2025లో ఇదే మొదటి శాటిలైట్ ప్రయోగమని తెలిపారు. శ్రీహరికోట నుంచి ఇప్పటికి 6 జనరేషన్‌ల రాకెట్లను విజయవంతంగా వినియోగించామని వివరించారు. మొత్తం 433 విదేశీ శాటిలైట్లను గగనతలంలోని కక్ష్యల్లో ప్రవేశపెట్టామన్నారు. నెక్స్ జనరేషన్ లాంచింగ్ వెహికల్‌కు ప్రధాని నరేంద్ర మోదీ ఆమోదం తెలిపారని చెప్పారు. లో ఎర్త్ ఆర్బిట్‌లో 30 వేల కేజీల సామర్థ్యం కలిగి 1,000 టన్నుల బరువు ఉన్న లాంచింగ్ వెహికల్‌ను తయారు చేస్తున్నట్లు తెలిపారు. శ్రీహరికోటలో రూ.4,000 కోట్లతో మూడో లాంచ్ ప్యాడ్‌ను నిర్మిస్తున్నామని, నాలుగు నెలల్లో ఇది పూర్తవుతుందని వి.నారాయణన్ వెల్లడించారు.

కేవలం ముడి సరుకుల ఎగుమతిని అంగీకరించను

- వాటికి విలువ జోడించి ఎగుమతి చేస్తేనే మనకు లాభం
- ఉత్కర్ష్ ఒడిశా సదస్సులో ప్రధాని నరేంద్ర మోదీ స్పష్టీకరణ



భువనేశ్వర్: మన దేశం నుంచి కేవలం ముడి సరుకులు ఎగుమతి చేయడాన్ని తాను అంగీకరించనని, వాటికి విలువ జోడించి ఎగుమతి చేయాలని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ చెప్పారు. మన ముడి సరుకులతో విదేశాల్లో తయారైన వస్తువులను దిగుమతి చేసుకొనే విధానం మారాలని అన్నారు. మంగళవారం ఒడిశా రాజధాని భువనేశ్వర్‌లో 'ఉత్కర్ష్ ఒడిశా: మేక్ ఇన్ ఇండియా సదస్సు'ను ఆయన ప్రారంభించారు. తూర్పు ఇండియాను గ్రోత్ ఇంజన్‌గా పరిగణిస్తున్నామని తెలిపారు. బహుముఖ అభివృద్ధికి ఇక్కడ ఎన్నో అవకాశాలు ఉన్నాయని ఉద్ఘాటించారు. దేశ ఆర్థిక వ్యవస్థ ప్రగతిలో ఒడిశా పాత్ర అత్యంత కీలకమని వెల్లడించారు. కేవలం ముడి సరుకుల ఎగుమతి వల్ల దేశం అభివృద్ధి చెందదని తేల్చిచెప్పారు. ఈ పరిస్థితి పూర్తిగా మారాలని, మనమంతా నూతన దార్శనికతతో పని చేయాలని సూచించారు. ''ఇక్కడ తవ్వితీసిన ముడి ఖనిజాలను విదేశాలకు ఎగుమతి చేయడం. అక్కడ వాటికి విలువను జోడించి, వస్తువులు తయారీ చేసి తిరిగి మన దేశానికి పంపడం సరైన విధానం కాదు. మన సముద్ర ఉత్పత్తులను ప్రాసెసింగ్ కోసం విదేశాలకు పంపుతున్నారు. వాటినే మనం దిగుమతి చేసుకోవాల్సి వస్తోంది. ఇదంతా నాకు నచ్చడం లేదు. అది నేను అంగీకరించను. మన ముడి సరుకులకు ఇక్కడే విలువను జోడించాలి. ఆ తర్వాత విదేశాలకు ఎగుమతి చేయాలి. దానివల్ల మన ఆర్థిక వ్యవస్థకు ఎంతో లాభం చేకూరుతుంది'' అని మోదీ స్పష్టంచేశారు. నానాటికీ మారుతున్న ఆధునిక ప్రపంచంలో గ్లోబల్ సప్లై చైన్‌కు ఎన్నో సవాళ్లు ఎదురవుతున్నాయని గుర్తుచేశారు. కేవలం దిగుమతుల ఆధారిత సప్లై చైన్‌పై ఆధారపడడం తెలివైన పని కాదని పేర్కొన్నారు. అంతర్జాతీయ తలెత్తే ఒడిదొడుకుల ప్రభావాన్ని తట్టుకోవడానికి మన దేశంలోనే పటిష్టమైన సప్లై, వాల్యూ చైన్‌ను అభివృద్ధి చేసుకోవాలని సూచించారు. ఈ బాధ్యత ప్రభుత్వాలతోపాటు పరిశ్రమ వర్గాలపైనా ఉందన్నారు.

కాన్సర్ట్ ఎకానమీని ప్రోత్సహిస్తాం..

భారత్ 5 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా ఎదగానికి ఇక ఎంతో దూరం లేదని ప్రధాని మోదీ వివరించారు. మన ఆర్థిక వ్యవస్థ ప్రధానంగా రెండు మూలస్తంభాలపై ఆధారపడి ఉందన్నారు. అవి వినూత్నమైన సేవా రంగం, నాణ్యమైన ఉత్పత్తులు అని తెలిపారు. గ్రీన్ టెక్నాలజీ, గ్రీన్ ఫ్యూచర్‌పై అధికంగా దృష్టి పెట్టామని అన్నారు. ఈ రంగంలో ఎన్నో ఉద్యోగ అవకాశాలు ఉన్నాయని, సద్వినియోగం చేసుకోవాలని యువతకు పిలుపునిచ్చారు. ముంబై, అహ్మదాబాద్‌లో ఇటీవల జరిగిన కోల్డ్‌ప్లే కార్యక్రమాల(కాన్సర్ట్స్) గురించి ప్రధానమంత్రి ప్రత్యేకంగా ప్రస్తావించారు. కోల్డ్‌ప్లే టూర్లు విజయవంతమయ్యాయని గుర్తుచేశారు. ఇండియాలో కాన్సర్ట్ ఎకానమీ ప్రగతికి అద్భుతమైన అవకాశాలు ఉన్నాయని తెలిపారు. ఈ రంగంలో మౌలిక సదుపాయాల కల్పనకు, నైపుణ్యాభివృద్ధికి పెట్టుబడులు పెట్టాలని రాష్ట్ర ప్రభుత్వాలకు, ప్రైవేట్ రంగానికి సూచించారు. కాన్సర్ట్ ఎకానమీని ప్రోత్సహిస్తామని వెల్లడించారు. లైవ్ ఈవెంట్లకు డిమాండ్ భారీగా పెరుగుతోందన్నారు. ప్రపంచవ్యాప్తంగా చాలా పేరున్న కళాకారులు ఇండియాలో ప్రదర్శనలు ఇవ్వడానికి ఆసక్తి చూపుతున్నారని నరేంద్ర మోదీ చెప్పారు. వచ్చే నెలలో మన దేశంలో తొలిసారిగా 'వరల్డ్ ఆడియో విజువల్, ఎంటర్‌టైన్‌మెంట్ సమ్మిట్' జరగబోతోందని వివరించారు. మన సృజనాత్మకు ప్రపంచానికి చాటడానికి ఇదొక చక్కటి వేదిక అని తెలిపారు. ఉత్కర్ష్ ఒడిశా సదస్సులో ఒడిశా గవర్నర్ కంభంపాటి హరిబాబు, ముఖ్యమంత్రి మోహన్ చరణ్ మాఝీతోపాటు పలువురు పారిశ్రామికవేత్తలు పాల్గొన్నారు.

సుప్రీంకోర్టు.. అసలైన ప్రజాకోర్టు

- రాజ్యాంగ హామీలను నిజం చేసిన అత్యున్నత న్యాయస్థానం
- కోర్టు తీర్పులతో దేశ ఆర్థిక వ్యవస్థ బలోపేతం
- సీజేఐ జస్టిస్ ఖన్నా స్పష్టీకరణ
- డైమండ్ జూబ్లీ సందర్భంగా ప్రత్యేకంగా కొలువుదీరిన బెంచ్


సీజేఐ జస్టిస్ సంజీవ్ ఖన్నా

న్యూఢిల్లీ: భారత సుప్రీంకోర్టు అసలు సిసలైన ప్రజా న్యాయస్థానం అని సీజేఐ జస్టిస్ సంజీవ్ ఖన్నా స్పష్టం చేశారు. సుప్రీంకోర్టు ఏర్పాటై 75 ఏళ్లు పూర్తయిన సందర్భంగా మంగళవారం ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. డైమండ్ జూబ్లీని పురస్కరించుకొని సీజేఐ నేతృత్వంలోని ధర్మాసనం ప్రత్యేకంగా కొలువుదీరింది. ఈ సందర్భంగా జస్టిస్ సంజీవ్ ఖన్నా మాట్లాడుతూ... ధర్మాసనం మన సుప్రీంకోర్టు 140 కోట్ల మంది ప్రజల ఆకాంక్షలను, మన సమాజంలోని వైవిధ్యాన్ని ప్రతిబింబిస్తూ ప్రపంచంలోనే అత్యుత్తమమైన, సమర్థవంతమైన న్యాయస్థానంగా ఎదిగిందని హర్షం వ్యక్తంచేశారు. ఏళ్ల క్రితం మన ప్రయాణం మొదలైందని అన్నారు. సుప్రీంకోర్టు 1950 జనవరి 28 నుంచి అమల్లోకి వచ్చిన సంగతి తెలిసిందే. నిజమైన ప్రజల కోర్టుగా ప్రదర్శించిన విశిష్టమైన గుణమే మన సుప్రీంకోర్టును ఉన్నత స్థానంలో నిలిపిందని జస్టిస్ ఖన్నా వివరించారు. 75 ఏళ్ల ప్రయాణం తర్వాత కూడా కాలానుగుణంగా మార్పులను అందిపుచ్చుకుంటూనే రాజ్యాంగం నిర్దేశించిన పరిధిలో మన సుప్రీంకోర్టు పనిచేస్తోందని వివరించారు. సామాజిక, ఆర్థిక, రాజకీయ న్యాయం చేకూరుస్తూ ప్రజల కలలను నిజం చేస్తోందని చెప్పారు. న్యాయ వ్యవస్థ ముందు ఎన్నో సవాళ్లు ఉన్నాయని, వాటని అధిగమిస్తూ ముందుకెళ్లాలని న్యాయవాదులు, న్యాయమూర్తులకు జస్టిస్ సంజీవ్ ఖన్నా పిలుపునిచ్చారు. మన అత్యున్నత న్యాయస్థానం ఎల్లప్పుడూ ప్రజలకు అందుబాటులోనే ఉందని వివరించారు.

ప్రాణంలేని శిల్పం కాదు.. సజీవ సంస్థ

న్యాయం అనేది కేవలం ఉత్తర్వుల్లోనో, నోటి మాటగానో కాకుండా ఆచరణాత్మకంగానూ ఉండాలన్నదే తమ ఉద్దేశమని జస్టిస్ ఖన్నా వివరించారు. ప్రజల హక్కులను కాపాడడంలో, వారికి చేరువకావడంలో సుప్రీంకోర్టు ముందంజలో ఉందన్నారు. ప్రస్తుతం మూడు రకాల సవాళ్లను పరిష్కరించాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడ్డారు. కోర్టు ఖర్చులు పెరిగిపోతుండడంతో ప్రజలు న్యాయం పొందడంలో ఆలస్యం జరుగుతోందని అన్నారు. చాలామంది ఖర్చులకు భయపడి కోర్టుల వరకు రావాలంటే సంకోచిస్తున్నారని తెలిపారు. అసత్యమే సత్యంగా చెలామణి అవుతున్న చోట న్యాయం బతికి బట్టకట్టడం కష్టమని వ్యాఖ్యానించారు. సవాళ్లను పరిష్కరించాల్సిన బాధ్యత అందరిపైనా ఉందన్నారు. కోర్టు రూమ్‌ల్లో న్యాయమూర్తుల్లోనూ వైవిధ్యం ఉందని, భిన్నప్రాంతాల నుంచి వచ్చినవారు జడ్జిలుగా సేవలందిస్తున్నారని తెలిపారు. తద్వారా న్యాయ వ్యవస్థలో ప్రజల గొంతుక వినిపించే అవకాశం దక్కుతోందని అభిప్రాయపడ్డారు. 7 దశాబ్దాలకుపైగా సాగుతున్న ప్రయాణంలో సుప్రీంకోర్టు ఎన్నో చరిత్రాత్మక తీర్పులు ఇచ్చిందన్నారు. సుప్రీంకోర్టు అంటే రాతి నుంచి చెక్కిన ప్రాణంలేని శిల్పం కాదని, ఇదొక సజీవ సంస్థ అని ఉద్ఘాటించారు. 1990వ దశకంలో పౌరుల హక్కుల పరిరక్షణతోపాటు శాసన వ్యవస్థ, కార్యనిర్వాహక వ్యవస్థ మధ్య అంతరాన్ని పూడ్చేందుకు కృషి చేసిందని వివరించారు. 21వ శతాబ్దంలో సుప్రీంకోర్టు పాత్ర మరింత పెరిగిందన్నారు. వ్యక్తిగత స్వేచ్ఛ నుంచి పర్యావరణ పరిరక్షణ దాకా.. మేధోసంపత్తి హక్కుల నుంచి గోప్యత దాకా.. ఇలా ఎన్నో అంశాలపై తీర్పులిచ్చిందని తెలిపారు. సుప్రీంకోర్టు నిర్ణయాలకు భారతదేశ ఆర్థికవ్యవస్థను సైతం బలోపేతం చేశాయన్నారు. రాజ్యాంగం ఇచ్చిన ఎన్నో హామీలు సుప్రీంకోర్టు తీర్పుల ద్వారా వాస్తవరూపం దాల్చాయని జస్టిస్ సంజీవ్ ఖన్నా వెల్లడించారు. ఈ కార్యక్రమంలో అటార్నీ జనరల్ ఆర్.వెంకటరమణి, సీనియర్ న్యాయవాది కపిల్ సిబల్ తదితరులు పాల్గొన్నారు.

జైనుల వేడుకలో కూలిన వేదిక

- చెక్క వేదిక కింద నలిగి ఏడుగురి దుర్మరణం
- యూపీలోని బాగ్‌పత్‌లో ఘటన

బాగ్‌పత్(యూపీ): జైనులు కొలిచే ఆదినాథ్ దేవునికి అభిషేకం కార్యక్రమంలో పాల్గొనేందుకు వచ్చిన భక్తులు అక్కడి చెక్క వేదిక కింద నలిగి ప్రాణాలు కోల్పోయారు. బాగ్‌పత్ జిల్లా బరౌత్ పట్టణంలోని శ్రీ దిగంబర్ జైన్ డిగ్రీ కళాశాల ప్రాంగణంలో మంగళవారం ఉదయం 8 గంటలకు ఈ ఘటన జరిగింది. ఈ దుర్ఘటనలో ఏడుగురు ప్రాణాలు కోల్పోయారు. దాదాపు 60 మంది గాయపడ్డారు. పెద్ద వేదిక కింద చిక్కుకుపోయిన వాళ్లలో పోలీసులు సైతం ఉన్నారు. శ్రీ 1008 ఆదినాథ్ భక్తాంబర్ ప్రచార్ ఆధ్వర్యంలో మోక్ష కల్యాణక్ నిర్వాణ మహోత్సవంలో భాగంగా అభిషేకం జరుగుతుండగా ఈ ప్రమాదం జరిగింది. 65 అడుగుల పొడవునా చెక్క వేదికను సిద్ధంచేయగా దాని మెట్లపై భక్తులు సామర్థ్యానికి మించి కిక్కిరిసి నిల్చోవడంతో బరువు ఆపలేక అది కూలింది. దీంతో మెట్ల మీది భక్తులుసహా మొత్తం వేదిక కింద ఉన్న భక్తులపై పడిందని ప్రత్యక్ష సాక్షులు చెబుతున్నారు. భక్తుల మరణవార్త తెల్సి ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ దిగ్భ్రాంతి వ్యక్తంచేశారు. గాయపడిన వారికి అత్యుత్తమ చికిత్స అందించాలని జిల్లా అధికారులకు సూచించారు.

డీప్‌సీక్‌పై సైబర్‌దాడి

కొద్దిసేపు సేవలకు అంతరాయం

లాస్ ఏంజెలెస్: కృత్రిమమేధ రంగంలో ఓపెన్ ఏఐ, గూగుల్, మైక్రోసాఫ్ట్ వంటి దిగ్గజ సంస్థలకు దీటుగా అధునాతన వెర్షన్ ఏఐ చాట్‌బాట్‌ను తీసుకొచ్చి సంచలనం సృష్టించిన చైనాకు చెందిన డీప్‌సీక్ సంస్థపై సోమవారం పెద్ద ఎత్తున సైబర్‌దాడులు జరిగాయి. దీంతో కొత్త యూజర్లు తమ వెబ్‌సైట్‌లో రిజిస్టర్ చేసుకోవడం వీలుపడలేదని డీప్‌సీక్ మంగళవారం తెలిపింది. అయితే ఇప్పటికే లాగిన్ అయిన పాత యూజర్లు ఎలాంటి ఇబ్బందుల్లేకుండా చాట్‌బాట్ వంటి సేవలను వినియోగించుకోవచ్చని సంస్థ పేర్కొంది. తాము అందించే అధునాతన ఏఐ సేవలకు ఇతర సంస్థలు చార్జీలు వసూలుచేస్తుంటే డీప్‌సీక్ మాత్రం ఉచితంగా సేవలు అందించి మరో సంచలనం సృష్టించింది. దీంతో డిసెంబర్ నుంచి అందుబాటులోకి వచ్చిన డీప్‌సీక్ ఉచిత సేవలకు ఫిదా అయిన జనం కోట్ల కొలదీ డౌన్‌లోడ్‌లు చేసుకుంటున్నారు. దీంతో సోమవారంనాటికి గూగుల్ ప్లే స్టోర్, యాపిల్ ఐఫోన్ స్టోర్‌లలో ప్రపంచవ్యాప్తంగా అత్యంత అధికంగా డౌన్‌లోడ్ అయిన ఉచిత యాప్‌గా ఇది అగ్రస్థానంలో నిలిచి ప్రత్యర్థి సంస్థలను సైతం ఆశ్చర్యంలో ముంచెత్తింది. ఇంతటి ఆదరణ సొంతం చేసుకున్న వేళ సంస్థ వెబ్‌సైట్లను లక్ష్యంగా చేసుకుని సైబర్‌దాడులు జరగడం గమనార్హం. దిగ్గజ సంస్థలు అధునాతన మోడళ్ల అభివృద్ధి కోసం వేల కోట్లు ఖర్చుచేస్తుంటే అత్యల్ప ఖర్చులో ఏఐ మోడల్‌ను తెచ్చి ప్రపంచవ్యాప్తంగా నిపుణులను సంభ్రమాశ్చర్యాలకుగురిచేయడం తెల్సిందే. దీంతో ఎన్విడియా వంటి సంస్థలు నిజంగానే తమ ఏఐ మోడళ్ల కోసం అంతటి భారీ ఖర్చుచేస్తున్నాయా? అన్న అనుమానం పెట్టుబడిదారుల్లో రావడం, దాంతో ఆ సంస్థ షేర్లవిలువ భారీగా తగ్గడం తెల్సిందే. తొలినుంచీ ఏఐ రంగంలో అమెరికా కంపెనీల హవా కొనసాగుతుండగా అకస్మాత్తుగా తెరమీదకొచ్చిన చైనాకు చెందిన ఏఐ సంస్థ ఒక్కసారిగా హట్‌టాప్‌గా మారింది. అమెరికా సంస్థలను తలదన్నేలా అత్యల్ప ఖర్చులో ఒక చైనా అంకుర సంస్థ సాధించిన ఘనతపై అమెరికా టెక్ పరిశ్రమలో విస్తృత చర్చ మొదలైంది.

భారత జాలర్లపై శ్రీలంక జవాన్ల కాల్పులు

- ఐదుగురికి గాయాలు
- తీవ్ర ఆగ్రహం వ్యక్తంచేసిన భారత్
- ఢిల్లీలో శ్రీలంక రాయబారిని పిలిపించి నిరసన తెలిపిన విదేశాంగ శాఖ

న్యూఢిల్లీ: శ్రీలంక సరిహద్దు సముద్రజలాల సమీపంలో చేపలవేటకు వెళ్లిన భారతీయ మత్స్యకారులపై శ్రీలంక నావికాదళ సభ్యులు కాల్పులు జరిపిన ఘటన తీవ్ర కలకలం సృష్టించింది. జీవనోపాధి కోసం వచ్చిన జాలర్లపై గస్తీదళాల కాల్పుల ఘటనను భారత్ సీరియస్‌గా తీసుకుంది. మిత్రదేశ పౌరులపై శత్రువుల తరహాలో కాల్పులు జరపడమేంటని తీవ్ర ఆగ్రహం వ్యక్తంచేసింది. ఢిల్లీలోని భారత విదేశాంగ శాఖ కార్యాలయానికి శ్రీలంక రాయబారిని పిలిపించి ఆయన ఎదుట తీవ్ర నిరసన వ్యక్తంచేసింది. ''క్షేత్రస్థాయిలో ఎలాంటి పరిస్థితులు నెలకొన్నాసరే బలగాలు ఆయుధాలకు పనిచెప్పడం లాంటి అసాధారణ చర్యలకు దిగడం ఏమాత్రం ఆమోదయోగ్యంకాదు. ఇలాంటివి పునరావృతమైతే శ్రీలంకతో సత్సంబంధాల కొనసాగింపుపై మేం మరోసారి తీవ్రంగా సమీక్ష జరపాల్సి ఉంటుంది'' అని భారత్ తీవ్రస్థాయిలో వ్యాఖ్యానించింది.

అసలేం జరిగింది?

మంగళవారం తెల్లవారుజామున శ్రీలంక సమీపంలోని డెల్ఫ్ట్ ద్వీపం సమీప సముద్రజలాల్లో 13 మంది భారతీయ జాలర్లు చేపలు పడుతుండగా అక్కడికి శ్రీలంక నావికాదళంలోని గస్తీ బృందం చేరుకుంది. ఇక్కడ చేపలు పట్టే అధికారం భారతీయులకు లేదంటూ ఆ జాలర్లను అదుపులోకి తీసుకునే ప్రయత్నంచేశారు. అయితే అరెస్ట్ నుంచి తప్పించుకునేందుకు ప్రయత్నించిన జాలర్లపై కాల్పులు జరపడంతో ఇద్దరికి తీవ్రగాయాలయ్యాయి. మరో ముగ్గురికి స్వల్పగాయాలయ్యాయి. గాయపడిన వారిని దగ్గర్లోని జాఫ్నా టీచింగ్ ఆస్పత్రిలో చికిత్స అందిస్తున్నారు. విషయం తెల్సుకున్న జాఫ్నాలోని భారత కాన్సులేట్ అధికారులు హుటాహుటిన ఆస్పత్రికి వెళ్లి జాలర్ల ఆరోగ్యం గురించి వాకబుచేశారు. అత్యుత్తమ చికిత్స అందేలా ఏర్పాట్లు చేశారు.

నేడే మౌని అమావాస్య

- కుంభమేళాలో నేడు పది కోట్ల మంది పుణ్యస్నానాలు ఆచరిస్తారని అంచనా
- విస్తృత ఏర్పాట్లు చేసిన యోగి ప్రభుత్వం


మంగళవారం కుంభమేళాకు పోటెత్తిన జనం

సాక్షి న్యూఢిల్లీ: మహా కుంభమేళాలో మరో కీలక ఘట్టానికి త్రివేణి సంగమ స్థలి సిద్ధమైంది. బుధవారం అత్యంత పవిత్రమైన మౌని అమావాస్య కావడంతో కుంభమేళా జరుగుతున్న త్రివేణి సంగమ ప్రాంతంలో పుణ్యస్నానాలు ఆచరించేందుకు భక్తజనకోటి మునుపెన్నడూలేనంత పెద్ద ఎత్తున తరలివస్తోంది. బుధవారం ఒక్కరోజే సుమారు పది కోట్ల మంది భక్తులు పవిత్రస్నానాలు ఆచరిస్తారని అంచనా. అందుకు తగ్గట్టుగానే ఉత్తర ప్రదేశ్ ప్రభుత్వం విస్తృతస్థాయిలో భారీ ఏర్పాట్లు చేసింది. రోజూ కోటి, కోటిన్నర మంది భక్తులు మేళాకు వస్తుండగా బుధవారం ఒక్కరోజే అత్యధిక స్థాయిలో వచ్చినాసరే తోపులాటల వంటి ఘటనలు సంభవించకుండా ప్రభుత్వం తగు ఏర్పాట్లుచేసింది. గంగానది ప్రవాహం పొడవునా ఎక్కడైనా స్నానం ఆచరించేలా మరిన్ని ఘాట్‌లను స్నానాలకు అనువుగా అందుబాటులోకి తెచ్చింది. త్రివేణి సంగమంలో పుణ్యస్నానం ఆచరిస్తే సకల పాపాలు తొలగిపోయి పుణ్యం లభిస్తుందని చాలా మంది నమ్ముతారు. అందుకే సామాన్యులు, సన్యాసులు, సంతులు, సాధువులు, నాగ సాధువులు, కిన్నెరలు తరలివస్తున్నారు. నేడు శ్రవణ నక్షత్రంలో మౌని అమావాస్య వస్తోంది. దీంతో ఈరోజుకు మరింత ప్రాధాన్యత ఏర్పడింది. ఈ శుభ ముహూర్తంలో పుణ్యస్నానం ఆచరించాలని కోట్లాది మంది ఆసక్తిగా కనబరుస్తున్నారు. అమృత స్నానం(రాజ స్నానం) తర్వాత దానధర్మాలు చేస్తే ఖచ్చితంగా శుభ ఫలితాలొస్తాయని భక్తుల విశ్వాసం. ఈ సందర్భంగా శివుడిని స్మరించుకుంటూ భక్తులు తమ పూర్వీకులకు నీరాజనాలు అర్పిస్తారు. ఇలా చేయడం వల్ల సకల శుభాలు కలుగుతాయని నమ్ముతారు. ఇప్పటి వరకు పుణ్య స్నానాలు ఆచరించిన వారి సంఖ్య 15 కోట్లు దాటగా బుధవారం మౌని అమావాస్య సందర్భంగా ఒక్కరోజే పది కోట్లు భక్తులు వచ్చే అవకాశముంది.

31నుంచి బడ్జెట్ సమావేశాలు

న్యూఢిల్లీ: జనవరి 31వ తేదీన పార్లమెంట్ బడ్జెట్ సమావేశాలు ప్రారంభంకానున్నాయి. శుక్రవారం పార్లమెంట్ ఉభయసభలనుద్దేశించి రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము ప్రసంగిస్తారు. ఆ తర్వాత కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ఆర్థికసర్వేను ప్రవేశపెట్టనున్నారు. సోమవారం రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యవాద తీర్మానంలో భాగంగా చర్చ ఇరు సభల్లో కొనసాగనుంది. ఫిబ్రవరి ఒకటో తేదీన అంటే శనివారం రోజు మంత్రి నిర్మలా కేంద్ర సాధారణ బడ్జెట్‌ను పార్లమెంట్‌లో ప్రవేశపెడతారు. రాష్ట్రపతి ప్రసంగంపై ధన్యవాద తీర్మానంపై చర్చ లోక్‌సభలో ఫిబ్రవరి 3, 4వ తేదీల్లో కొనసాగనుంది. రాజ్యసభలో రాష్ట్రపతి ప్రసంగంపై ధన్యవాద తీర్మానంపై చర్చ మూడు రోజులపాటు కొనసాగనుంది. ఫిబ్రవరి ఆరో తేదీన చర్చపై రాజ్యసభలో ప్రధాని మోదీ సమాధానం ఇవ్వనున్నట్లు తెలుస్తోంది.



బోటు ప్రమాదం..విషాదాంతం
గత ఆదివారం జరిగిన బోటు ప్రమాదం ఘటన తీవ్ర విషాదం మిగిల్చింది. హుస్సేన్ సాగర్‌లో గల్లంతైన అజయ్ మృతదేహం మంగళవారం లభించింది. -8లో



సెల'ప్రెట్టీ' లుక్..
ఒకప్పుడు సెలబ్రిటీలు తమ ఫ్యాషన్ డిజైనర్ అనగానే ముంబయి డిజైనర్ పేరు చెప్పేవారు. ఇప్పుడు నగరంలో టాప్ డిజైనర్లు సెలబ్రిటీ డిజైనర్లుగా పేరొందారు. - సిటీప్లస్‌లో

వాతావరణం
గరిష్ఠం/కనిష్ఠం
32.0/16.0
నగరంలో బుధవారం ఆకాశం మేఘావృతమై ఉంటుంది. ఉదయం పొగమంచు అలుముకుంటుంది. గరిష్ఠంగా 32, కనిష్ఠంగా 16 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదవుతాయి.







మారవోయి.. నగర జీవి..

భాగ్యనగర జీవనం... పొద్దున లేస్తే ఉరుకులు పరుగుల గమనం. ప్రమాదం అని తెలిసినా తగిన జాగ్రత్తలు తీసుకోవడంలో ఎందుకో ఏమరుపాటు.. సెల్‌ఫోన్ డ్రైవింగ్.. ట్రిపుల్ రైడ్.. కిక్కిరిసిన ఆటోలో స్కూల్‌కు వెళ్లే చిన్నారులు.. పిల్లాడు నిద్రపోతున్నా పట్టించుకోని ఆటో డ్రైవర్.. ఒకే బైక్‌పై నలుగురేసి ప్రయాణం.. హెల్మెట్ పెట్టుకోకపోవడం ఒక ఎత్తయితే చున్నీలో సెల్‌ఫోన్ చుట్టేసి మాట్లాడుతూ డ్రైవింగ్ చేయడం.. ఇలా నగర వాసులు తమ రక్షణను తామే మరుస్తున్నారు. తమ బాధ్యతను విస్మరిస్తున్నారు. ప్రమాదాల అంచున పయనిస్తున్నారు. అలాంటి ప్రమాదకర దృశ్యాలు కొన్ని మంగళవారం 'సాక్షి' కెమెరాకు చిక్కాయి. - సాక్షి, స్టాఫ్ ఫొటోగ్రాఫర్లు

మెట్రో కారిడార్లలో రవాణా ఆధారిత అభివృద్ధి

- 8 ప్రధాన మార్గాలను గుర్తించిన హెచ్ఎండీఏ
- రెండు వైపులా కిలో మీటర్ పరిధిలో టీవోడీ
- వాకింగ్, షాపింగ్, రవాణా సదుపాయాలు



సాక్షి, సిటీబ్యూరో: ప్రభుత్వం ప్రతిపాదించిన మెట్రో రెండో దశ కారిడార్‌లలోని ప్రధాన మార్గాల్లో రవాణా ఆధారిత అభివృద్ధి (ట్రాన్సిట్ ఓరియంటెడ్ డెవలప్‌మెంట్) జోన్‌లుగా హెచ్ఎండీఏ ప్రకటించింది. ప్రజారవాణా సదుపాయాల విస్తరణలో భాగంగా మాస్ ర్యాపిడ్ ట్రాన్స్‌పోర్ట్ వ్యవస్థ అభివృద్ధికి టీవోడీ దోహదం చేస్తుందని అధికారులు తెలిపారు. మెట్రో కారిడార్‌లకు రెండు వైపులా 500 మీటర్ల చొప్పున టీవోడీ జోన్‌లుగా నిర్ధారించారు. దీనివల్ల ఒక విధమైన రవాణా సదుపాయం నుంచి మరోవిధమైన రవాణా సదుపాయంలోకి తేలిగ్గా మారేందుకు అవకాశం ఉంటుంది. మెట్రో ప్రయాణికులకు ఇది ఫస్ట్‌మైల్, లాస్ట్‌మైల్ కనెక్టివిటీ సదుపాయాన్ని అందజేస్తుందని హెచ్ఎండీఏ అధికారి ఒకరు వివరించారు. ప్రయాణికులు మెట్రో స్టేషన్‌లలో దిగిన వెంటనే ఆటో, బస్, క్యాబ్, బైక్ వంటి వివిధ సదుపాయాలను పొందేలా.. సీమ్‌లెస్ జర్నీకి ఇది అవకాశం కల్పిస్తుంది. అలాగే రెండు వైపులా బహుళ వినియోగ సదుపాయాలు అందుబాటులో ఉంటాయి. ఈ మేరకు మియాపూర్-ఎల్బీనగర్, ఫలక్‌నుమా- చాంద్రాయణగుట్ట, జేబీఎస్-ఎంజీబీఎస్, నాగోల్-రామదుర్గం,మియాపూర్-పటాన్‌చెరు, వనస్థలిపురం-హయత్‌నగర్, మెట్టుగూడ-మల్కాజిగిరి, పటాన్‌చెరు-ఇస్నాపూర్ కారిడార్‌లను టీవోడీ జోన్‌లుగా నిర్ధారించారు.


ఇవీ ప్రయోజనాలు..

- టీవోడీ జోన్‌లలో వివిధ రకాల ప్రజారవాణా సదుపాయాలను అనుసంధానం చేస్తారు.
- ప్రయాణికులు కేవలం 500 మీటర్ల పరిధిలో ప్రజారవాణా సదుపాయాన్ని పొందవచ్చు. దీంతో సీమ్‌లెస్ జర్నీ లభిస్తుంది.
- మాస్‌రాపిడ్ ట్రాన్స్‌పోర్ట్ సిస్టమ్ (ఎంఆర్‌టీఎస్)కు దోహదం చేస్తుంది.
- ప్రజలకు బహుళ వినియోగ సదుపాయాలు అందుబాటులో ఉంటాయి.

ఫిల్మ్‌నగర్ పాపం..

ట్రాఫిక్ పోలీసులదే !

లారీల ప్రవేశంపై నిషేధం కాగితాలకే పరిమితం



కొందరు అవినీతి 'తెల్ల'ఖాకీల నిర్లక్ష్యం... ఓ లారీ డ్రైవర్ నిర్వాకం... వెరసీ.. ఓ కుటుంబాన్ని పెను విషాదంలో నింపాయి. ముక్కుపచ్చలారని చిన్నారిని చిదిమేసి కనీసం కన్నవారికి 'ముఖం' చూసే అదృష్టం కూడా లేకుండా చేశాయి. మంగళవారం ఉదయం షేక్‌పేట ఆంజనేయస్వామి దేవాలయం వద్ద చోటుచేసుకున్న రోడ్డు ప్రమాదం పదేళ్ల చిన్నారి అథర్వి ఉసురు తీసింది. ఈ పాపం కచ్చితంగా ట్రాఫిక్ పోలీసులదేనని చెప్పక తప్పదు. -సాక్షి, సిటీబ్యూరో

ఉత్తర్వులు ఉత్తవేనా?

నగరంలో నానాటికీ పెరిగిపోతున్న ట్రాఫిక్ ఇబ్బందుల దృష్ట్యా అధికారులు అనేక ఆంక్షలు విధించారు. ఈ మేరకు గత ఏడాది ఫిబ్రవరి 20న ఉత్తర్వులు జారీ చేశారు. నగరంలో ప్రవేశించే అనుమతి ఉన్న వాహనాలకు సైతం నిర్ణీత సమయాలు కేటాయించారు. నగరంలో ఉన్న రహదారుల్ని మొత్తం 91 రకాలైన రూట్లుగా పోలీసులు విభజించారు. వీటిలో కొన్నింటిలో కొన్ని రకాలైన వాహనాలను నిషేధించడం, నిర్దేశిత సమయాలు కేటాయించడం చేశారు. ఈ మార్గాల్లో ప్రత్యేక సందర్భాల్లో ఆయా వాహనాలు ప్రయాణించాలంటే తప్పనిసరిగా ముందస్తు అనుమతి తీసుకోవాలని అధికారులు స్పష్టం చేశారు.

10 టన్నుల కంటే మించొద్దు..

ఇతర జిల్లాలు, రాష్ట్రాల నుంచి వచ్చే 10 టన్నుల కంటే ఎక్కువ బరువుతో కూడిన కమర్షియల్ వాహనాలు నగరంలోకి ప్రవేశించడాన్ని పూర్తిగా నిషేధించారు. లోకల్ లారీలతో పాటు నిర్మాణ సామగ్రి తరలించే 10 టన్నుల కంటే ఎక్కువ బరువుతో కూడిన వాహనాలు రాత్రి 11 ఉదయం 7 గంటల మధ్య మాత్రమే నగరంలో సంచరించాలి. డీసీఎం, ఐచర్, స్వరాజ్ మజ్దా వంటి మధ్య తరహా గూడ్స్ వాహనాలు (3.5 టన్నులు-12 టన్నుల మధ్య బరువుతో కూడినవి) మధ్యాహ్నం 12 నుంచి సాయంత్రం 4 వరకు, రాత్రి 9 నుంచి ఉదయం 8 వరకు మాత్రమే తిరగాలి.

కాసులు కురిపించడమే కారణమా?

షేక్‌పేటలో చిన్నారిని చిదిమేసిన లారీ పంచదార లోడ్‌తో ప్రయాణిస్తోంది. ఇది కేవలం రాత్రి 11 నుంచి ఉదయం 7 వరకు మాత్రమే నగరంలో తిరగాలి. అయితే.. ప్రమాదం చోటు చేసుకున్న 8.10 గంటలకు అది నగరంలోనే ఉంది. ఈ తరహా లారీలే కాదు... నగరంలో మరికొన్ని వాహనాలు తిరుగుతూ కొందరు ట్రాఫిక్ పోలీసులకు కాసులు పండిస్తున్నాయి. అక్కడ నుంచి మట్టి తరలించే, నిర్మాణానికి అవసరమైన మెటీరియల్‌ను తీసుకు వచ్చే వాటిని 'వదిలేయడం' కోసం యజమానులతో ఒప్పందాలు కుదుర్చుకుని మరీ వసూళ్లకు పాల్పడుతున్నారనే ఆరోపణలు ఉన్నాయి.

రాత్రయితే చాలు రాకాసులే..

ప్రమాదం చోటు చేసుకున్న ప్రాంతం చాలా కీలకమైంది. నగర శివార్లలో ఉన్న, బంజారాహిల్స్, జూబ్లీహిల్స్‌లో ఉన్న అనేక కార్యాలయాలు, పాఠశాలలకు చెందిన బస్సులు, వాహనాలతో ఆ రోడ్లన్నీ కిక్కిరిసిపోతాయి. అలాంటి సమయంలోనూ ఓ లారీ మృత్యు శకటంగా దూసుకువచ్చిందంటే దానికి కారణం అయితే మామూళ్ల మత్తయినా అయి ఉండాలి.. లేదంటే నిబంధనలు అతిక్రమించిందంటూ 'ఉక్కుపాదం' మోపిన ట్రాఫిక్ పోలీసులు ఓ చలానా రాసి వదిలేసైనా ఉండాలనే వాదన వినిపిస్తోంది. ఈ రెంటిలో ఏది జరిగినా ఆ పాపం మాత్రం కచ్చితంగా ట్రాఫిక్ పోలీసులదే. నగరంలోకి పగలంతా లారీల ప్రవేశం లేకపోవడంతో రాత్రయిందంటే చాలు ఒక్కసారిగా రోడ్లపైకి వస్తాయి. వాయు వేగంతో దూసుకుపోయే ఇవి రాకాసులుగా మారుతున్నాయి. ఆ సమయంలో ట్రాఫిక్ పోలీసులు సైతం పాయింట్స్‌లో ఉండకపోవడంతో విజృంభిస్తున్నాయి.

ట్రిపుల్‌తో ట్రబులే!

- ద్విచక్ర వాహనంపై పరిమితికి మించి ప్రయాణాలు
- ప్రమాద హేతువులుగా మారుతున్న పరిణామాలు
- అత్తాపూర్ ఘటనకు ప్రధాన కారణం ఇలాంటి ఉల్లంఘనే
- సాంకేతికంగానూ ఈ డ్రైవింగ్‌తో ఇబ్బందులు ఎన్నో

'టు వీలర్ ఫర్ టు ఓన్లీ'.. మోటారు వాహన చట్టం స్పష్టం చేస్తున్న విషయం అందరికీ తెలిసిందే. అయినప్పటికీ ద్విచక్ర వాహనంపై ఇద్దరి కంటే ఎక్కువ మంది ప్రయాణించడం నగరంలో షరా మామూలుగా మారింది. ప్రధానంగా యువతే ఈ ఉల్లంఘనకు పాల్పడుతూ నిత్యం ప్రమాదాల బారినదుతున్నారు. మంగళవారం తెల్లవారుజామున డాక్టర్ మన్మోహన్‌సింగ్ ఫ్లైఓవర్‌పై ముగ్గురు మైనర్లు చనిపోవడానికి ప్రధాన కారణం ట్రిపుల్ రైడింగే. ఈ ఉల్లంఘనపై ట్రాఫిక్ విభాగం అధికారులు ఏటా వేలాది కేసులు నమోదు చేస్తున్నా.. వాహనదారుల వ్యవహార శైలిలో మాత్రం ఏ మార్పూ రావడం లేదు. -సాక్షి, సిటీబ్యూరో



మృతులు, బాధితుల్లో ఎక్కువ శాతం యువతే..

ద్విచక్ర వాహనాలపై ఒకరి కంటే ఎక్కువ మంది ప్రయాణించే వారిలో యువకులే ఎక్కువగా ఉంటున్నారు. సాధారణంగా టు వీలర్స్ వినియోగించేది యూతే ఎక్కువగా ఉండటంతో ప్రమాదాల బారిన పడుతున్న వారిలో విద్యార్థుల సంఖ్య అధికంగా ఉంటోంది. బంధువుల కంటే స్నేహితులతో కలిసే ఎక్కువగా ట్రిపుల్ రైడింగ్‌కు పాల్పడుతుంటారు. ఎక్కడైనా ట్రాఫిక్ పోలీసుల తనిఖీలు కనిపించినా.. జంక్షన్ వచ్చినా.. ఆఖరులో కూర్చున్న యువకుడు తక్షణం దిగిపోయి నడుస్తూ ముందుకు వెళ్లడం పరిపాటి. ఇలా చేస్తూ ట్రిపుల్ రైడర్లు అనేక సందర్భాల్లో పోలీసుల్నీ పక్కదారి పట్టిస్తున్నారు. ఇలా దూసుకుపోతూ తరచూ ప్రమాదాలకు లోనవుతున్నారు. బాధితుల్లో ఎక్కువ శాతం అవివాహితులే కావడంతో కన్నవారికి పుట్టెడు దుఃఖం మిగులుస్తున్నారు.

వాహన అదుపు అసాధ్యం..

ప్రతి వాహనానికీ దాన్ని తయారు చేసే కంపెనీ కొన్ని ప్రమాణాలను నిర్దేశిస్తుంది. ఇందులో భాగంగానే టు వీలర్‌ను కేవలం ఇద్దరు వినియోగించడానికి వీలుగానే రూపొందిస్తుంది. ముందు డ్రైవర్, వెనక పిలియన్ రైడర్ మాత్రమే ప్రయాణించాలంటూ తమ నిబంధనల్లో స్పష్టం చేస్తుంది. దీనికి సాంకేతికంగానూ ప్రత్యేక కారణాలు ఉన్నాయి. అవి ఏంటంటే..

- **ఇంజిన్ కెపాసిటీ:** మోటారు వాహనాలకు ఉండే ప్రతి ఇంజిన్‌కు ప్రత్యేక సామర్థ్యం ఉంటుంది. దీన్నే సాంకేతికంగా ఇంజిన్ కెపాసిటీ అంటారు. ఆ వాహనం ఎంతమంది ప్రయాణించడానికి అనువుగా రూపొందిస్తారో.. అదే సామర్థ్యంలో ఇంజిన్ అభివృద్ధి చేస్తారు. నిర్దేశించిన ప్రయణికుల కంటే ఎక్కువ మంది ఆ వాహనంపై ప్రయాణిస్తే దాని ప్రభావం ఇంజిన్‌పై పడుతుంది.

యాక్సిలరేటింగ్ కెపాసిటీ: ఓ వాహనం ఎంత వేగంతో దూసుకుపోవాలనేది స్పష్టం చేసేదే యాక్సిలరేటింగ్ కెపాసిటీ. సదరు వాహనంపై పరిమితికి మించి ప్రయాణికులు ఎక్కినప్పుడు ఈ కెపాసిటీ తగ్గుతుంది. సాధారణంగా గంటకు 60 కిమీ వేగంతో దూసుకుపోయే వాహనం ఇలాంటప్పుడు 40 కిమీ మించదు. ఈ ప్రభావం ఓవర్ టేకింగ్ తదితర సమయాల్లో ప్రమాదాలకు కారణమవుతుంది.

బ్రేకింగ్/బ్యాలెన్సింగ్ కెపాసిటీ: ఏదైనా వాహనం ప్రమాదానికి లోను కాకుండా ఉండాలంటే ఈ రెండూ అత్యంత కీలకం. సరైన సమయానికి బ్రేక్ వేయగలగటం, అవసరమైన స్థాయిలో బ్యాలెన్స్ చేసుకోవడం తప్పనిసరి. ట్రిపుల్ రైడింగ్ వంటివి చేసినప్పుడు ఈ ప్రభావం ఈ రెండు కెపాసిటీల పైనా పడి.. ఎదురుగా ముప్పును గుర్తించినా తక్షణం స్పందించి వాహనాన్ని ఆపలేరు.

సిటీలో ట్రిపుల్ రైడింగ్ కేసులు ఇలా..

సంవత్సరం	కేసులు
2021	1,19,987
2022	95,225
2023	1,21,956
2024	1,28,254

అనుమతే కీలకం!

- త్వరలో బడ్జెట్ ప్రవేశపెట్టనున్న కేంద్రం
- మెట్రో రెండో దశకు నిధులు దక్కేనా?
- సావరిన్ గ్యారంటీ ఉంటేనే రుణాలు

సాక్షి, సిటీబ్యూరో: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రతిపాదించిన మెట్రో రెండో దశకు కేంద్రం అనుమతి కీలకంగా మారింది. హైదరాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయంతో పాటు వివిధ మార్గాల్లో మెట్రో నిర్మాణానికి ప్రభుత్వం ప్రణాళికలను సిద్ధం చేసిన సంగతి తెలిసిందే. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సంయుక్త భాగస్వామ్యంతో చేపట్టనున్న రెండో దశ ప్రాజెక్టులో 5 కారిడార్‌లకు హైదరాబాద్ ఎయిర్‌పోర్ట్ మెట్రోరైల్ సంస్థ డీపీఆర్‌ను సైతం రూపొందించింది. రెండు నెలల క్రితమే రాష్ట్ర ప్రభుత్వ ఆమోదంతో కేంద్రం అనుమతి కోసం పంపించారు. ఈ రెండో దశలోనే ఫోర్త్‌సిటీతో పాటు ఉత్తరం వైపు మరో రెండు కారిడార్‌లను నిర్మించాలని ప్రభుత్వం భావిస్తోంది. ఈ మూడు కారిడార్‌ల డీపీఆర్ కోసం అధికారులు తాజాగా కసరత్తు ప్రారంభించారు. మరోవైపు పాతబస్తీలో భూసేకరణ, నిర్మాణాల కూల్చివేతల పనులు చురుగ్గా సాతున్నాయి. ఈ క్రమంలో త్వరలో ప్రవేశపెట్టనున్న బడ్జెట్‌లో కేంద్రం మెట్రో రెండోదశకు పచ్చజెండా ఊపుతుందా? లేక మొండిచేయి చూపుతుందా? అనేది ప్రస్తుతం చర్చనీయాంశంగా మారింది.

కేంద్రం వాటా 18 శాతం..

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల జాయింట్ వెంచర్‌గా ప్రతిపాదించిన రెండో దశలో మొదట 5 కారిడార్లలో మొత్తం 54 స్టేషన్లు, 76.4 కిలోమీటర్ల వరకు విస్తరించనున్నారు. ఇందుకోసం రూ.24,269 కోట్లతో అంచనాలు రూపొందించారు. ఇందులో రాష్ట్ర ప్రభుత్వం 30 శాతం నిధులను అంటే రూ.7,313 కోట్లు వెచ్చిస్తుంది. రూ.4,230 కోట్లతో కేంద్రం 18 శాతం నిధులను అందజేస్తుంది. మిగతా 48 శాతం నిధులను అంటే రూ.11,693 కోట్లను ప్రాజెక్ట్ రుణాలుగా సేకరించాలనేది ప్రతిపాదన. మరో 4 శాతం (రూ.1033కోట్లు) పీపీపీ పద్ధతిలో సమకూర్చుకోవాల్సి ఉంటుంది. ఈ మేరకు త్వరలో ప్రవేశపెట్టనున్న బడ్జెట్‌లో కేంద్రం తన వాటాగా ఏ మేరకు నిధులను కేటాయిస్తుందనేది ప్రశ్నార్థకంగా మారింది. దశలవారీగా ప్రాజెక్టు విస్తరణ పనులు కొనసాగనున్న దృష్ట్యా 18 శాతం వాటాలో ఈ బడ్జెట్‌లో కొద్ది మేరకైనా నిధులు లభించవచ్చని అధికారులు భావిస్తున్నారు. ఇటీవల నగరానికి వచ్చిన కేంద్ర మంత్రి మనోహర్‌లాల్ ఖట్టర్‌తోనూ సీఎం రేవంత్‌రెడ్డి సంప్రదింపులు జరిపారు. మెట్రోతోపాటు మూసీ ప్రక్షాళన, నగర అభివృద్ధి కోసం నిధులను అందజేయాలని కోరారు. ఈ మేరకు మెట్రోకు కేంద్రం నుంచి సముచితమైన నిధులు లభించవచ్చని మెట్రో అధికారులు అంచనా వేస్తున్నారు.



పూచీకత్తు ఎంతో ముఖ్యం..

మరోవైపు కేంద్ర ప్రభుత్వం పూచీకత్తుగా ఇచ్చే 'సావరిన్ గ్యారంటీ' కూడా మెట్రో రెండో దశకు కీలకంగా మారింది. సావరిన్ గ్యారంటీ ఉంటేనే జైకా, మల్టీలేటర్ డెవలప్‌మెంట్ బ్యాంకులు రుణాలను అందజేసేందుకు ముందుకొస్తాయి. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందజేసే నిధుల కంటే బ్యాంకులు, ఇతర సంస్థల నుంచి సేకరించే రూ.వేల కోట్ల రుణాలపైనే ఈ ప్రాజెక్టు ఆధారపడి ఉంది. 48 శాతం నిధులను రుణాలుగా సేకరించాలని ప్రభుత్వం భావిస్తున్న నేపథ్యంలో కేంద్రం ఇచ్చే పూచీకత్తు ఎంతో ముఖ్యం. ప్రస్తుతం పాతబస్తీలో ఎంజీబీఎస్ నుంచి చాంద్రాయణగుట్ట వరకు 7.5 కిలోమీటర్లలో రోడ్డు విస్తరణ పనులు మొదలయ్యాయి. ఇందుకోసం భూసేకరణ, నిర్మాణాల కూల్చివేత పనులు కొనసాగుతున్నాయి. ఈ క్రమంలో కేంద్రం నుంచి అనుమతి వస్తేనే రెండో దశ పనులు ముందుకు సాగుతాయి.

ఎవరి వ్యూహం వారిదే!

- రేపు బల్దియా కౌన్సిల్ సమావేశం
- 'అవిశ్వాసం' నేపథ్యంలో పొలిటికల్ హీట్
- మేయర్ సమావేశానికి కార్పొరేటర్లు డుమ్మా
- బడ్జెట్ కేటాయింపులపై నిలదీయాలని బీజేపీ ఉద్బోధ



సాక్షి, సిటీబ్యూరో: బల్దియా పాలకమండలి ఏర్పాటై వచ్చే నెల 10వ తేదీకి నాలుగేళ్లు పూర్తి కానుండటం.. ఆ తర్వాత మేయర్‌పై అవిశ్వాస తీర్మానం పెట్టేందుకు అవకాశం ఉన్న నేపథ్యంలో గురువారం జరగనున్న జీహెచ్ఎంసీ ప్రత్యేక బడ్జెట్, సాధారణ సర్వసభ్య సమావేశాలపై రాజకీయ వర్గాల్లో తీవ్ర ఉత్కంఠ నెలకొంది. కౌన్సిల్ ఈ సమావేశాల సందర్భంగా ఏం జరుగుతుందోనని ఆసక్తికరంగా మారింది. ఒకవేళ మేయర్‌పై అవిశ్వాస తీర్మానం పెట్టాలనుకున్నా అందుకు పాలకమండలి సమావేశం వేదిక కాకపోయినప్పటికీ, పొలిటికల్ హీట్ మాత్రం పెరిగింది. ఈ నేపథ్యంలో కౌన్సిల్ సమావేశాల సందర్భంగా అనుసరించాల్సిన వ్యూహంపై మంగళవారం బీజేపీ కార్పొరేటర్లతో ఆ పార్టీ రాష్ట్ర కార్యాలయంలో జాతీయ నాయకుడు, ఎంపీ కె.లక్ష్మణ్ నేతృత్వంలో సమావేశం నిర్వహించారు. పలువురు పార్టీ అగ్రనేతలు కూడా హాజరైన ఈ సమావేశంలో ప్రజా సమస్యలపై నిలదీయాలని ఉద్బోధించారు. కేంద్రం నిధులివ్వడం లేదని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పదే పదే అంటున్నందున జీహెచ్ఎంసీలో ప్రజలు వేల కోట్ల పన్నులు కడుతున్నా మీరెందుకు వారికి పనులు చేయడం లేదని ప్రశ్నించాలనే నిర్ణయానికి వచ్చారు. ఈ నిధులు ఎక్కడికి మళ్లిస్తున్నారో అడగాలని, ఆ నిధులన్నీ ఏం చేస్తున్నారో నిలదీయాలని సూచించారు. ముఖ్యంగా.. జీహెచ్ఎంసీ బడ్జెట్‌పైనా, ప్రజా సమస్యలపైనా గళమెత్తాలని ఆదేశించారు. సమస్యలపై ప్రశ్నించేందుకు బీజేపీ సభ్యులకు అవకాశమివ్వకపోవడం తగదన్నారు. ప్రశ్నల ద్వారా సమాధానాలు రాబట్టాలన్నారు. మేయర్‌పై అవిశ్వాసానికి సంబంధించి ఎలాంటి చర్చ జరగలేదని తెలిసింది.

హాజరైన కార్పొరేటర్లు ముగ్గురే..

మేయర్ గద్వాల్ విజయలక్ష్మి జీహెచ్ఎంసీ ప్రధాన కార్యాలయంలో తమ పార్టీ కార్పొరేటర్లతో సమావేశమయ్యారు. ఆమె బీఆర్ఎస్ నుంచి కార్పొరేటర్‌గా గెలిచి మేయర్ కావడం తెలిసిందే. పాలకమండలి తొలి ఎన్నికల్లో కాంగ్రెస్‌కు వచ్చింది కేవలం రెండు కార్పొరేటర్ స్థానాలే అయినప్పటికీ, ఏడాది క్రితం రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక జీహెచ్ఎంసీలోనూ కాంగ్రెస్ బలం పెరిగింది. ప్రస్తుతం ఆ పార్టీలో 24 మంది కార్పొరేటర్లు ఉన్నప్పటికీ, కౌన్సిల్‌లో అనుసరించాల్సిన వ్యూహంపై చర్చించేందుకు మేయర్ ఆహ్వానానికి కేవలం ముగ్గురు మాత్రమే హాజరు కావడం బల్దియాలో చర్చనీయాంశంగా మారింది. అనుసరించాల్సిన వ్యూహం కోసం పిలిస్తే కనీస సంఖ్యలో కూడా సభ్యులు రాలేదు.

అవగాహన లేకుండా 'అవిశ్వాసం'

తనపై ఏ పార్టీవారు అవిశ్వాస తీర్మానం పెట్టుకున్నా తనకు అభ్యంతరం లేదని మేయర్ విజయలక్ష్మి ఉప్పల్‌లో జరిగిన ఓ కార్యక్రమం సందర్భంగా మీడియా ఎదుట వ్యాఖ్యానించారు. చట్టం, నిబంధనల మేరకు వారికా అవకాశం ఉందంటూ ఫిబ్రవరి 11 తర్వాత మాత్రమే అది సాధ్యమన్నారు. ఆలోగా ఏయే పార్టీలు కలిసి అవిశ్వాసం పెడతాయో చూద్దామన్నారు. అసలు అవిశ్వాసం పెట్టాలంటే ఎంత బలం ఉండాలో వారికి తగిన అవగాహన లేదన్నారు. తనపై బీఆర్ఎస్ ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ చేసిన అవినీతి వ్యాఖ్యలపై స్పందిస్తూ, పదేళ్లుగా తాను, దాదాపు యాభయ్యేళ్లుగా తనతండ్రి కేశవరావు రాజకీయాల్లో ఉన్నా.. మా లైఫ్‌స్టైల్ ఏంటో, కొత్తగా ఎమ్మెల్యేలైన బీఆర్ఎస్ వారి లైఫ్ స్టైల్ ఏంటో ప్రజలు చూస్తూనే ఉన్నారన్నారు. ఎవరు అవినీతికి పాల్పడుతున్నారో దాన్ని బట్టే అర్థం చేసుకోవచ్చునన్నారు.

బీజేపీ చీఫ్ పదవిపై కాంగ్రెస్ ఫ్లోర్‌లీడర్ వ్యాఖ్య

జీహెచ్ఎంసీలో కాంగ్రెస్ పక్ష నాయకుడు దర్పల్లి రాజశేఖర్‌రెడ్డి జీహెచ్ఎంసీ ప్రధాన కార్యాలయంలో కలిసిన విలేకరులతో మాట్లాడుతూ.. బీజేపీ రాష్ట్ర పగ్గాలు ఈటల రాజేందర్‌కు దక్కకుండా ఉండేందుకు కేంద్రమంత్రి బండి సంజయ్ తెలివిగా ప్లాన్ చేశారని ఆరోపించారు. గద్దర్‌కు అవార్డు ఇవ్వకపోవడం గురించి చేసిన వ్యాఖ్య ద్వారా బీజేపీ అధ్యక్ష పదవికి ఈటల అర్హుడు కాదనే సంకేతాలిచ్చారన్నారు.

సాక్షి బుధవారం। 29। జనవరి। 2025

క్రిమిసంహారక మందు తాగి..సెల్ఫీ వీడియో తీసి..

- అత్తింటి వారి వేధింపులు భరించలేక మహిళా డాక్టర్ ఆత్మహత్యాయత్నం
- బర్త్ డే రోజునే ఘటన..

చైతన్యపురి: 'సారీ మమ్మీ..నా వల్ల మీరు కూడా ఎన్నో అవమానాలు పడుతున్నారు. ఓపిక పట్టు.. పరిస్థితులు మారుతాయని నాన్న నచ్చచెబుతున్నాడు. నా వల్ల కావడం లేదు. నా బాధలు మీకు చెప్పనివి కూడా చాలా వున్నాయి. పోలీసులు చెప్పినా పట్టించుకోలేదు. పోలీస్ డౌన్, డౌన్.... న్యాయం చేయాల్సిన పోలీసులే పట్టించుకోక పోతే నాకు న్యాయం ఎలా జరుగుతుంది? మా ఆయన, అత్త, మామలు హింస పెడుతున్నారు. నేను పోతే మీరంతా హ్యాపీగా ఉంటారు. నా బిడ్డను జాగ్రత్తగా చూసుకోండి...' అంటూ నాలుగు పేజీల సూసైడ్ నోట్ రాసి, తల్లిదండ్రులనుద్దేశించి సెల్ఫీ వీడియో తీసి ఓ మహిళా డాక్టర్ తన పుట్టిన రోజు నాడే ఆత్మహత్యాయత్నం చేసింది. సరూర్‌నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకున్న సంఘటనపై స్థానికులు, పోలీసులు తెల్పిన మేరకు..చంపాపేట ప్రెస్ కాలనీకి చెందిన కృష్ణారెడ్డి కూతురు ప్రణీతా రెడ్డి బీదర్‌లో ఎంబీబీఎస్ చేసింది. కోహెడకు చెందిన వెంకటరెడ్డి కుమారుడు సాఫ్ట్‌వేర్ ఉద్యోగి సికిందర్ రెడ్డిని ఆమె ఐదేళ్ల క్రితం ప్రేమ వివాహం చేసుకుంది. వీరికి నాలుగేళ్ల కూతురు వుంది. దంపతులు ఇద్దరూ అమెరికా వెళ్లి సికిందర్ ఎంఎస్ పూర్తిచేయగా, ప్రణీత ఎండీ పూర్తి చేసింది. తర్వాత నగరానికి వచ్చి ప్రెస్ కాలనీలో ఉంటున్నారు. నగరంలోని ఓ ఆసుపత్రిలో డాక్టర్‌గా విధులు నిర్వహిస్తుంది. సికిందర్ ఉద్యోగం లేకుండా తిరుగుతున్నాడు.


సెల్ఫీ వీడియోలో ప్రణీత

ఈ క్రమంలో వీరి మధ్య మనస్పర్థలు వచ్చాయి. కింద పోర్షన్‌లో అత్తమామలు ఉంటుండగా మొదటి అంతస్తులో సికిందర్ దంపతులు ఉంటున్నారు. తరచు భర్తతో పాటు అత్త, మామలు సూటిపోటి మాటలతో ప్రణీతను మానసికంగా వేధించారు. పలుమార్లు పెద్ద మనుషుల మధ్య పంచాయితీ జరిగింది. అయినా పరిస్థితి మారక పోవటంతో ఆత్మహత్య చేసుకునేందుకు నిర్ణయించుకుంది. మంగళవారం సాయంత్రం సెల్ఫీ వీడియో తీసుకుంటూ..నిద్రమాత్రలు మింగి, క్రిమిసంహారక మందు తాగింది. దీంతో వెంటనే ఆమెను కర్మన్‌ఘాట్‌లోని జీవన్ ఆసుపత్రిలో చేర్పించారు. విషయం తెలుసుకున్న ఆమె కుటుంబ సభ్యులు, లింగోజిగూడ కార్పొరేటర్ దర్పల్లి రాజశేఖర్‌రెడ్డి అక్కడికి చేరుకున్నారు. అనంతరం సరూర్‌నగర్ పోలీస్ స్టేషన్ వద్ద ఆందోళన చేపట్టడంతో ఉద్రిక్తత చోటుచేసుకుంది.

గోషామహల్‌లో మరోసారి కూలిన నాలా



అబిడ్స్: గోషామహల్ ప్రధాన రహదారిలో ఉన్న నాలా పైకప్పు మంగళవారం రాత్రి మరోసారి నేలమట్టమయ్యింది. నాలుగు నెలల వ్యవధిలో ఈ నాలా మూడోసారి కూలింది. గత కొన్ని నెలలుగా గోషామహల్-బారాదరికి వెళ్లే నాలా మరమ్మతు పనులు జరుగుతుండగా..ప్రధాన రహదారిలో మరోసారి నాలా పైకప్పు కూలడంతో స్థానిక ప్రజలు భయభ్రాంతులకు గురయ్యారు. నాలాలో ఓ కారుతో పాటు స్థానికుల సామాగ్రి సైతం పడిపోయింది. సమాచారం తెలుసుకున్న బీజేపీ నాయకుడు ఆల పురుషోత్తంరావు సంఘటనా స్థలానికి వచ్చి..పోలీసులు, జీహెచ్ఎంసీ అధికారులను పిలిపించి తగిన చర్యలు చేపట్టారు.

బోటు ప్రమాదం.. విషాదాంతం

'మహా హారతి' ప్రమాదంలో గల్లంతైన అజయ్ మృతదేహం లభ్యం • కాలిన గాయాలతో చికిత్స పొందుతూ మరొకరి మృతి

ఖైరతాబాద్: పీపుల్స్ ప్లాజా వేదికగా గత ఆదివారం భారతమాత ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన 'భారత మాత మహా హారతి' కార్యక్రమంలో బోటు చేసుకున్న అగ్నిప్రమాదం ఘటన తీవ్ర విషాదం మిగిల్చింది. ఈ ఘటనలో హుస్సేన్‌సాగర్‌లో గల్లంతైన అజయ్ మృతదేహం మంగళవారం లభించగా..ఇదే ఘటనలో గాయపడి చికిత్స పొందుతున్న గణపతి అనే యువకుడు కూడా మంగళవారం మృతిచెందాడు.

రెండు రోజులుగా గాలింపు..

నాగారంకు చెందిన అజయ్ మిస్సింగ్ అయ్యాడని కుటుంబ సభ్యులు సోమవారం తెల్లవారుజామున లేక్ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో

బాణసంచా కాలుస్తుండగా..

మహా హారతి ఇచ్చే క్రమంలో హుస్సేన్ సాగర్‌లో బోటులోంచి బాణసంచా కాలుస్తుండగా మంటలు అంటుకున్నాయి. దీంతో బోట్‌లో ఉన్న వారంతా నీటిలోకి దూకేశారు. ఈ క్రమంలో నీటిలోకి దూకిన వారిలో నాగారంకు చెందిన సిల్వేరు అజయ్(21) గల్లంతయ్యాడు. అదే బోటులో మంటల తాకిడికి తీవ్ర గాయాలై హాస్పిటల్‌లో చికిత్స పొందుతూ గణపతి (22) మంగళవారం ఉదయం మృతిచెందాడు. దీంతో ఈ సంఘటనలో ఇద్దరు మృత్యువాత పడటం విషాదాంతంగా మారింది.


గాంధీ మార్చురీలో అజయ్ మృతదేహం


చికిత్స పొందుతూ మృతి చెందిన గణపతి (ఫైల్)

సోమవారం నుంచి బోటు ప్రమాదం జరిగిన ప్రదేశం, ఆ పరిసర ప్రాంతాల్లో గాలింపు చేపట్టినా ఆచూకీ లభించలేదు. ఎన్డీఆర్ఎఫ్ బృందం సభ్యులు, లేక్ పోలీసులు, లుంబినీపార్క్ బోటింగ్ సిబ్బంది మరోసారి గాలింపు చేపట్టగా మంగళవారం సాయంత్రం సంజీవయ్య పార్కు వద్ద ఉన్న భారీ జాతీయ జెండా సమీపంలో మృతదేహం లభ్యమైంది.

అజయ్ కుటుంబంలో విషాదం

కన్న బిడ్డ క్షేమంగా ఉంటాడని గంపెడాశతో ఎదురు చూసిన అజయ్ తల్లిదండ్రులకు తీరని శోకం మిగిలింది. రెండు రోజులుగా హుస్సేన్ సాగర్ వద్దే పడిగాపులు కాస్తున్న ఆ కుటుంబ సభ్యులకు మంగళవారం సాయంత్రం మృతదేహం దొరికిందని తెలియగానే.. తల్లిదండ్రులు జానకిరాం, నాగలక్ష్మి దంపతులు శోకసంద్రంలో మునిగిపోయారు.

తూ.గో జిల్లా నుంచి వచ్చి..

టాటా ఏస్ డ్రైవర్ గణపతి (22) తూర్పు గోదావరి జిల్లా నుంచి బాణసంచా కాల్చే టీంతో కలిసి వచ్చాడు. ఆ సమయంలో జరిగిన అగ్నిప్రమాదంలో తీవ్ర గాయాలపాలై సికింద్రాబాద్ యశోద హాస్పిటల్‌లో చికిత్స పొందుతూ మంగళవారం ఉదయం మృతిచెందాడు.

అనుమతి తీసుకున్నారా?

కాగా సాధారణంగా బాణసంచా కాల్చేందుకు పోలీసు ఉన్నతాధికారుల నుంచి అనుమతి తీసుకోవాల్సి ఉంది. కానీ ఆదివారం రాత్రి హుస్సేన్‌సాగర్‌లో మహా హారతి కార్యక్రమంలో బాణసంచా కాల్చేందుకు పోలీసుల అనుమతి తీసుకోలేదని తెలుస్తోంది. లుంబినీ పార్కు మేనేజర్, బోటింగ్ ఇన్‌చార్జి, ఇతర అధికారుల అనుమతితో బోటులో బాణసంచా కాల్చేందుకు వెళ్లినట్లు తెలిసింది.

రెండు రోజులుగా బోటింగ్ నిలిపివేత

సాగర్‌లో బోటింగ్‌లో మంటలు చెలరేగి యువకుడు గల్లంతైన నేపథ్యంలో సోమ, మంగళ వారాల్లో సాగర్‌లో బోటింగ్ నిలిపివేశారు. బోటింగ్ సిబ్బంది మొత్తం అజయ్ మృతదేహం కోసం గాలింపు చేపట్టారు.

'సాఫ్ట్'గా దోచేశారు!

- సాఫ్ట్‌వేర్ ఉద్యోగాల పేరుతో నిరుద్యోగులకు ఎర
- నలుగురిని అరెస్టు చేసిన నార్త్‌జోన్ టాస్క్‌ఫోర్స్

సాక్షి, సిటీబ్యూరో: ఆన్‌లైన్ నుంచి సంగ్రహించిన డేటా... సాఫ్ట్‌వేర్ ఉద్యోగాల పేరుతో ఎర... ఫోన్ ద్వారా ఇంటర్వ్యూలు నిర్వహణ... యాప్ ద్వారా అపాయింట్‌మెంట్ ఆర్డర్లు తయారీ... నకిలీ మెయిల్ ఐడీల ద్వారా వీటి బట్వాడా...వెరసి అందినకాడికి దండుకుని టోకరా... ఈ పంథాలో రెచ్చిపోయిన ఘరానా ముఠాకు ఉత్తర మండల టాస్క్‌ఫోర్స్ పోలీసులు చెక్ చెప్పారు. ఇలా 13 మంది నిరుద్యోగుల నుంచి రూ.26.25 లక్షలు స్వాహా చేసిన నలుగురు నిందితులను అరెస్టు చేసినట్లు డీసీపీ వైవీఎస్ సుధీంద్ర మంగళవారం ప్రకటించారు. నగరంలోని వివిధ ప్రాంతాలకు చెందిన జి.పవన్ కుమార్, బి.రేవంత్, బి.రాజీవ్‌రెడ్డి, ఎస్.సుధీర్ ఓ ముఠాగా ఏర్పడ్డారు. ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేయడం ద్వారా, అడ్డదారిలో సాఫ్ట్‌వేర్ ఉద్యోగాలు పొందాలని భావించే వారిని వీళ్లు టార్గెట్‌గా చేసుకున్నారు. ఉద్యోగార్థులు వివిధ జాబ్ పోర్టల్స్‌లో అప్‌లోడ్ చేసిన బయోడేటాలను సుధీర్ సంగ్రహించేవాడు. వీటిని డౌన్‌లోడ్ చేసుకుని పవన్‌కు పంపేవాడు. ఇతగాడు వాటిలో ఉన్న వివరాల ఆధారంగా ఆయా ఉద్యోగార్థులను సంప్రదించే వాడు. ప్రముఖ సాఫ్ట్‌వేర్ కంపెనీల్లో ఉద్యోగాలు ఇప్పిస్తామంటూ నమ్మబలికే వాడు. ఆఫర్ లెటర్ లేదా అపాయింట్‌మెంట్ ఆర్డర్ వచ్చిన తర్వాత నిర్ణీత మొత్తం చెల్లించాలని షరతు విధించే వాడు. దీనికి అంగీకరించిన ఉద్యోగార్థుల వివరాలను రేవంత్‌కు పంపే వాడు. సాఫ్ట్‌వేర్ కంపెనీ హెచ్ఆర్ మేనేజర్ అవతారం ఎత్తే ఇతగాడు ఉద్యోగార్థులకు ఫోన్ చేసి ఇంటర్వ్యూ చేసే వాడు. ఒక్కోసారి ఒక్కో కంపెనీ పేరు చెప్తూ... కొన్ని సాధారణ ప్రశ్నలు అడిగి, వాటిని సమాధానాలు ఇచ్చిన వారితో ఉద్యోగానికి ఎంపికైనట్లు చెప్పేవాడు. వీరి వివరాలు పవన్ ద్వారా రాజీవ్‌రెడ్డికి అందించే వాడు. ఇతగాడు కొన్ని యాప్స్‌లో పవన్ నుంచి అందిన అభ్యర్థి పేరు, అతడు ఎంపికైన పోస్టు, కంపెనీ.. ఇలాంటి వివరాలను పొందుపరిచే వాడు. దీంతో సదరు అభ్యర్థికి ఆ కంపెనీ లోగో, పేరు, వివరాలతో ఆఫర్ లెటర్/అపాయింట్‌మెంట్ లెటర్ సిద్ధమయ్యేది. దీన్ని డౌన్‌లోడ్ చేసుకునే రాజీవ్‌రెడ్డి ఆయా కంపెనీల పేరు కలిగి ఉండే నకిలీ ఈ-మెయిల్ ఐడీలు సృష్టించేవాడు. ఇవి దాదాపుగా సదరు కంపెనీకి చెందిన అధికారిక మెయిల్ ఐడీల మాదిరిగానే ఉండేవి. దీని ద్వారా ఉద్యోగార్థులకు ఆఫర్/అపాయింట్‌మెంట్ లెటర్ పంపే వాడు. వీటిని అందుకున్న ఉద్యోగార్థులు తమకు ఆ ప్రముఖ కంపెనీలోనే ఉద్యోగం వచ్చినట్లు భావించే వారు. ఆపై మళ్లీ తెరపైకి వచ్చే పవన్ ఆ అభ్యర్థులకు ఫోన్ చేసి వివిధ చార్జీలు, డిపాజిట్ల పేరుతో డబ్బు డిమాండ్ చేసే వాడు. ఒక్కొక్కరి నుంచి గరిష్ఠంగా రూ.2 లక్షల చొప్పున మొత్తం 13 మంది నుంచి రూ.26.25 లక్షలు కాజేశారు. ఈ ముఠా వ్యవహారాలపై నార్త్‌జోన్ టాస్క్‌ఫోర్స్‌కు సమాచారం అందింది. ఇన్‌స్పెక్టర్ కె.సైదులు నేతృత్వంలో ఎస్సైలు శ్రీనివాసులు దాసు, పి.గగన్‌దీప్, సి.రాఘవేంద్రరెడ్డి తమ బృందాలతో వలపన్నారు. నలుగురు నిందితుల్నీ పట్టుకుని వారి నుంచి రూ.5.67 లక్షలు నగదు, నకిలీ జాబ్ ఆఫర్ లెటర్లు, సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. తదుపరి చర్యల నిమిత్తం నిందితులను మారేడ్‌పల్లి పోలీసులకు అప్పగించారు.

చిన్నారిని బలితీసుకున్న లారీ

- తండ్రితో కలిసి స్కూల్‌కు వెళ్తుండగా ప్రమాదం
- షేక్‌పేట ప్రధాన రహదారిలో ఘటన


మృతి చెందిన బాలిక అథర్వి


ప్రమాదానికి కారణమైన లారీ..

ఫిలింనగర్: 'మమ్మీ బాయ్..' అంటూ తండ్రితో కలిసి ద్విచక్ర వాహనంపై స్కూలుకు బయలుదేరిన చిన్నారిని అక్రమంగా నగరంలోకి ప్రవేశించిన లారీ బలితీసుకుంది. తన కళ్లెదుటే కుమార్తె లారీ చక్రాల కిందపడి ఛిద్రం కావడాన్ని జీర్ణించుకోలేకపోయిన ఆ తండ్రి తల్లడిల్లిపోయాడు. ఈ హృదయవిదారకమైన ఘటన ఫిల్మ్‌నగర్ పోలీసుస్టేషన్ పరిధిలోని షేక్‌పేట ప్రధాన రహదారిలో మంగళవారం చోటు చేసుకుంది. షేక్‌పేట మైహోం రెయిన్ బో రెసిడెన్స్‌లో నివసించే గడ్డం హేమ సుందర్‌రెడ్డి కుమార్తె అథర్వి (10) మణికొండలోని ఢిల్లీ స్కూల్ ఆఫ్ ఎక్సలెన్స్‌లో ఐదో తరగతి చదువుతోంది. ఎప్పటిలాగే మంగళవారం ఉదయం 8.00 గంటల సమయంలో హేమ సుందర్‌రెడ్డి తన కుమార్తెను స్కూల్‌లో దింపడానికి యాక్టీవా వాహనంపై బయలుదేరారు. వీరి వాహనం 8.10 గంటలకు షేక్‌పేటలోని ఆంజనేయస్వామి ఆలయం వద్దకు చేరుకుంది. అదే సమయంలో వెనుక వైపు నుంచి చక్కెర లోడ్‌తో వచ్చిన లారీ హేమ సుందర్‌రెడ్డి నడుపుతున్న బైక్‌ను ఢీ కొట్టింది. ఈ ధాటికి తండ్రీకుమార్తె వాహనం పైనుంచి ఇద్దరు కిందపడ్డారు. అథర్వి లారీ వెళ్తున్న వైపు పడటంతో దాని వెనుక చక్రాలు ఆమె పైనుంచి వెళ్లాయి. దీంతో శరీరం ఛిద్రమై అక్కడికక్కడే చనిపోయింది. హేమ సుందర్‌రెడ్డికి ఎలాంటి గాయాలు కాలేదు. ఆ ప్రాంతంలోని రోడ్డంతా రక్తసిక్తమైంది. మరికొద్దిసేపట్లో కూతుర్ని స్కూల్ దగ్గర దింపాల్సి ఉండగా కళ్లెదుటే ఆమె రక్తపు మడుగులో పడి ఉండటాన్ని ఆయన జీర్ణించుకోలేకపోయారు. ఈ ప్రమాద విషయం తెలుసుకున్న అథర్వి కుటుంబీకులు ఘటనా స్థలానికి చేరుకుని కన్నీరుమున్నీరయ్యారు. ఫిల్మ్‌నగర్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు. అనుమతి లేని వేళల్లో అక్రమంగా సిటీలోకి లారీతో ప్రవేశించి, చిన్నారి మృతికి కారణమైన లారీ డ్రైవర్ యాసిన్ ఖురేషిని అరెస్ట్ చేశారు.

సైబర్ నేరాలపై వేగంగా స్పందించాలి: సీపీ

సాక్షి, సిటీబ్యూరో: సైబర్ నేరాల ముప్పును సమర్థవంతంగా ఎదుర్కోవడంలో వేగంగా స్పందించటం అత్యంత అవసరమని నగర కమిషనర్ సీవీ ఆనంద్ అభిప్రాయపడ్డారు. మంగళవారం డిజిటల్ మోసాలు-పరిష్కార మార్గాలపై ఆర్‌బీఐ-పోలీసు అధికారులు ఏర్పాటు చేసిన ఉన్నతస్థాయి సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. బ్యాంకులు, లా ఎన్‌ఫోర్స్‌మెంట్ ఏజెన్సీల మధ్య సమర్థవంతమైన సమన్వయం అవసరమని పేర్కొన్నారు. సైబర్ నేరాలను ఛేదించే సమయంలో ఎదురయ్యే ప్రధాన సవాళ్లను ఆయన వివరించారు. బ్యాంకుల నుండి ఖాతా వివరాల వంటి కీలక సమాచారం పొందడంలో జాప్యాలు, దర్యాప్తు వేగం బాధితులపై ప్రభావం చూపుతున్నాయని పేర్కొన్నారు. మోసగాళ్ల ఖాతాల్లోకి నిధుల బదిలీని నిరోధించేందుకు వేగంగా స్పందించిన బ్యాంకు అధికారులను అభినందించిన విషయాన్ని ఆయన గుర్తుచేశారు. సైబర్ నేర విభాగం రూపొందించిన సిఫారసులను ప్రస్తావించారు. అందులో జియో-బేస్డ్ అకౌంట్ వెరిఫికేషన్, రియల్-టైం మానిటరింగ్, మల్టీ-ఫ్యాక్టర్ అథెంటికేషన్ ప్రోటోకాల్స్ వంటి అంశాలు ఉన్నాయని వివరించారు. ఈ కార్యక్రమంలో ఆర్‌బీఐ ప్రాంతీయ డైరెక్టర్ కమల్ ప్రసాద్ పట్నాయక్, జనరల్ మేనేజర్ రుచి అస్తానా తదితరులు ప్రసంగించారు.

దూకుడు పెంచండి

కార్పొరేటర్లకు దిశానిర్దేశం చేసిన ఎంపీ లక్ష్మణ్

సాక్షి, సిటీబ్యూరో: 'వచ్చే ఏడాది జీహెచ్ఎంసీకి ఎన్నికలు రాబోతున్నాయి. ఇప్పటి నుంచే పక్కా ప్లాన్ ప్రకారం నడుచుకోవాలి. ప్రజా సమస్యలపై దూకుడుగా వ్యవహరించాలి' అని ఎంపీ లక్ష్మణ్ పేర్కొన్నారు. మంగళవారం బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో ఎంపీ లక్ష్మణ్ అధ్యక్షతన జీహెచ్ఎంసీ కార్పొరేటర్లతో బడ్జెట్ సమావేశంలో అనుసరించాల్సిన వ్యూహంపై చర్చించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బల్దియా బడ్జెట్ సమావేశాల్లో కేటాయింపులపై అధికార పక్షాన్ని నిలదీయాలని సూచించారు. గోషామహల్‌లో ఉస్మానియా ఆసుపత్రి నిర్మాణాన్ని వ్యతిరేకించాలని సూచించారు. అనంతరం ఫ్లోర్ లీడర్ శంకర్‌యాదవ్, పలువురు కార్పొరేటర్లు మీడియాతో మాట్లాడుతూ ఉస్మానియాను గోషామహల్‌కు తరలిస్తే తీవ్ర ట్రాఫిక్ ఇబ్బందులు ఎదురవుతాయన్నారు. బడ్జెట్‌లో బీజేపీ కార్పొరేటర్లు ఉన్న ప్రాంతాలకు కేటాయింపులు అడ్డుకుంటున్నారని ఆరోపించారు. జీహెచ్ఎంసీ, తాగునీటి సరఫరా విభాగాల మధ్య సమన్వయం లేకపోవడంతో నిధులు వృథా అవుతున్నాయన్నారు. నిధుల కేటాయింపుల్లో ఓల్డ్ సిటీకే అధిక



ప్రాధాన్యం ఇస్తున్నారన్నారు. మా ప్రాంతాల్లో వీధి లైట్లు, తాగునీటి సరఫరా పరిస్థితి ఘోరంగా మారిందని తెలిపారు. అవిశ్వాసం పెట్టాలా వద్దా అనేది పార్టీ నిర్ణయంపై ఆధారపడి ఉంటుందని ఆయన అభిప్రాయపడ్డారు.

హైడ్రాకు వ్యతిరేకం కాదు

నగరంలో సుందరీకరణ, ఆస్తుల పరిరక్షణకు ఏర్పాటు చేసిన హైడ్రాకు బీజేపీ వ్యతిరేకం కాదని పలువురు కార్పొరేటర్లు స్పష్టం చేశారు. అయితే పనితీరులోనే తేడాలు ఉన్నాయన్నారు. ఒక్కో వర్గాన్ని ఒక్కోలా చూస్తున్నారని ఆరోపించారు. జీహెచ్ఎంసీ ప్రకటనల విభాగంలో భారీ అవినీతి జరుగుతోందని మైలార్‌దేవ్‌పల్లి కార్పొరేటర్ శ్రీనివాస్‌రెడ్డి ఆరోపించారు.

లగచర్ల నిందితుడు సురేశ్‌కు బెయిల్

సిటీ కోర్టులు: వికారాబాద్ జిల్లా లగచర్లలో అధికారులపై దాడి కేసులో అరెస్టై రెండు నెలలకుపైగా రిమాండ్‌లో ఉన్న ఏ-2 సురేశ్‌కు నాంపల్లి ఏసీబీ కోర్టు బెయిల్ మంజూరు చేయగా మంగళవారం జైలు నుంచి విడుదలయ్యారు. బెయిల్ మంజూరు చేసిన ప్రిన్సిపల్ ఏసీబీ కోర్టు జడ్జి అఫ్రోజ్ అక్తర్ రూ.50 వేలతో రెండు పూచీకత్తులు కోర్టులో అందజేయాలని, అదేవిధంగా వారంలో రెండుమార్లు తాండూరు పోలీస్‌స్టేషన్‌లో మూడు నెలల వరకు లేదా ఈ కేసులో చార్జిషీటు దాఖలు అయ్యేవరకు హాజరుకావాలని షరతులు విధించింది. ఈ మేరకు సురేశ్ తరఫు న్యాయవాదులు మంగళవారం ఏసీబీ కోర్టులో రూ.50 వేలతో రెండు పూచీకత్తులు దాఖలు చేశారు. ఈ మేరకు విచారణ చేపట్టిన ఏసీబీ కోర్టు ఫిబ్రవరి 7వ తేదీన సురేశ్ కోర్టులో హాజరుకావాలని ఆదేశించింది.

ఫోన్ ట్యాపింగ్ కేసులో తిరుపతన్నకు బెయిల్

సిటీ కోర్టులు: రాష్ట్రంలో సంచలనంగా మారిన ఫోన్ ట్యాపింగ్ కేసులో పలువురు నిందితులను అరెస్ట్ చేసి రిమాండ్ చేసిన విషయం తెలిసిందే. ఈ కేసులో ఏ-4గా ఉన్న తిరుపతన్నకు నాంపల్లి కోర్టు, హైకోర్టులో బెయిల్ లభించకపోవడంతో సుప్రీం కోర్టు సోమవారం బెయిల్ మంజూరు చేసింది. రూ.లక్షతో రెండు పూచీకత్తులను సంబంధిత కోర్టులో దాఖలు చేయాలని ఆదేశాలు జారీ చేసింది. సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు మంగళవారం తిరుపతన్న తరుపు న్యాయవాదులు రెండు పూచీకత్తులను నాంపల్లిలోని 14వ అదనపు చీఫ్ మెట్రోపాలిటన్ మెజిస్ట్రేట్ కోర్టులో అందజేశారు. దీంతో చంచల్‌గూడ జైలులో ఉన్న ఆయన విడుదలయ్యారు. ప్రతి విచారణకు ఆయన కోర్టుకు హాజరు కావాలని నాంపల్లి కోర్టు పేర్కొంది.

872 కిలోల నార్కోటిక్ డ్రగ్స్ ధ్వంసం


ధ్వంసం చేసేందుకు సిద్ధం చేసిన నార్కోటిక్స్ డ్రగ్స్

రాయదుర్గం: సైబరాబాద్ పోలీసుల పర్యవేక్షణలో మంగళవారం డ్రగ్స్ డిస్పోజల్ కమిటీ ఆధ్వర్యంలో 872 కిలోల రూ.2,25,93,285 విలువైన నార్కోటిక్ డ్రగ్స్‌ను ధ్వంసం చేశారు. తెలంగాణ స్టేట్ యాంటీ నార్కోటిక్స్ బ్యూరో (టీఎస్ఎన్ఏబీ) డైరెక్టర్ సందీప్ శాండిల్య, సైబరాబాద్ సీపీ అవినాష్ మహంతి పర్యవేక్షణలో రంగారెడ్డి జిల్లా నందిగామ మండలం ఈదులపల్లిలోని మాకస్ బయో మెడికల్ వేస్ట్ ట్రీట్‌మెంట్ అండ్ డిస్పోజల్ ఫెసిలిటీ లిమిటెడ్‌లో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో డ్రగ్స్ డిస్పోజల్ కమిటీ చైర్మన్ డీసీపీ క్రైమ్స్ కె.నరసింహ, ఏసీపీ సైబర్ క్రైమ్స్ రవీందర్‌రెడ్డి, సీసీఆర్‌బీ ఏసీపీ కళింగరావు, నార్కోటిక్స్ ఇన్‌స్పెక్టర్ శివ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

విదేశీ యువతులతో వ్యభిచారం

గచ్చిబౌలి: విదేశీ యువతులతో వ్యభిచారం నిర్వహిస్తున్న ముఠా గుట్టురట్టయ్యింది. మంగళవారం రాత్రి టీఎన్‌జీవోస్ కాలనీలోని ఓ ఇంట్లో గచ్చిబౌలి పోలీసులు, ఎస్ఓటీ పోలీసులు దాడి చేశారు. ఒక విటుడు, 9 మంది యువతులను అదుపులోకి తీసుకున్నారు. టాంజానియా, కజికిస్తాన్‌కు చెందిన యువతులతో వ్యభిచారం నిర్వహిస్తున్నట్లు విశ్వసనీయ సమాచారం అందడంతో పోలీసులు దాడులు చేశారు. నిర్వాహకులు పరారైనట్లు పోలీసులు తెలిపారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

ఎంబీఏ విద్యార్థిని ఆత్మహత్య


పూజిత (ఫైల్)

మల్లాపూర్: ప్రియుని వేధింపులు భరించలేక ఓ ఎంబీఏ విద్యార్థిని ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన నాచారం పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. ఈ సంఘటన మంగళవారం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. మల్కాజ్‌గిరి ఏసీపీ చక్రపాణి తెలిపిన వివరాల ప్రకారం..మల్లాపూర్ ఎస్వీనగర్‌కు చెందిన గుండె సత్యనారాయణ కూతురు పూజిత (21) ఘట్కేసర్‌లోని వీబీఐటీ కాలేజీలో ఎంబీఏ చదువుతోంది. నాచారం రాఘవేంద్రనగర్ కాలనీకి చెందిన శ్రీనివాస్‌రెడ్డి కుమారుడు ఇంద్ర చరణ్‌రెడ్డి (22) వీబీఐటీ కాలేజీలో బీటెక్ ఫైనల్ ఇయర్ చదువుతున్నాడు. వీరిద్దరూ కొంత కాలంగా ప్రేమించుకుంటున్నారు. నెలరోజుల క్రితం వీరిద్దరూ మనస్పర్థలతో విడిపోయారు. కాగా ఇంద్రచరణ్‌రెడ్డి గతంలో ఇద్దరు కలిసి తీసుకున్న ఫొటోలు చూపిస్తూ బ్లాక్‌మెయిల్ చేయడం, వేధించడంతో మనస్తాపానికి గురైన పూజిత సోమవారం ఇంట్లో ఎవ్వరూ లేని సమయంలో ఫ్యానుకు ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడింది. తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు మంగళవారం ఇంద్రచరణ్‌ను రిమాండ్‌కు తరలించారు.

'హైదరాబాద్- బీజాపూర్' రోడ్డు విస్తరణ చేపట్టాలి

చేవెళ్ల: హైదరాబాద్ -బీజాపూర్‌రహదారి విస్తరణ వెంటనే చేపట్టాలని కోరుతూ మల్లారెడ్డి అనే వ్యక్తి రిలే దీక్షకు దిగాడు. చేవెళ్లలోని షాబాద్ చౌరస్తా సమీపంలో మంగళవారం దీక్షకు కూర్చున్నాడు. షాబాద్ మండలం పోతుగల్ గ్రామానికి చెందిన మల్లారెడ్డి సామాజిక అంశాలపై తరచూ స్పందిస్తుంటాడు. ఈ రోడ్డు విషయంలో పలుమార్లు అధికారులతో మాట్లాడి పోలీసుల నుంచి అనుమతి తీసుకొని స్వచ్ఛందంగా రిలే దీక్ష చేపట్టాడు.

‘పద్మశ్రీ అవార్డులు బీజేపీ అవార్డులు కాదు’

లిబర్టీ: పద్మశ్రీ అవార్డులు బీజేపీ అవార్డులు కావని, అవి జాతీయ అవార్డులను దళిత బహుజన పార్టీ జాతీయ అధ్యక్షులు సుప్రీంకోర్టు న్యాయవాది వి.కృష్ణస్వరూప్ అన్నారు. వివిధ రంగాల్లో విశిష్ట సేవలు అందించిన వారికి ప్రతిఏటా కేంద్ర ప్రభుత్వం అవార్డులు అందజేస్తుందని ఆయన గుర్తు చేశారు. మంగళవారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ పద్మశ్రీ అవార్డులను బీజేపీ అవార్డులుగా భావించడం సిగ్గుచేటని వ్యాఖ్యానించారు. గద్దర్ జీవితాంతం పేద అణగారిన దళిత బహుజనుల కోసం తన ఆటపాటతో స్ఫూర్తిని నింపారని, అలాంటి ప్రజాకవికి పద్మశ్రీ అవార్డు ఇవ్వకపోవడం కేంద్ర ప్రభుత్వ మనువాద, అవకాశవాద సిద్ధాంతానికి నిదర్శనమన్నారు. అజ్ఞాతంలో ఉండి అనంతరం జనజీవన స్రవంతిలోకి వచ్చి అనేక పాటలు రాసి తన ఆటపాటతో జనచైతన్యం కల్పించిన యుద్ధనౌక గద్దర్‌కు పద్మశ్రీ అవార్డు అర్హత ఉన్న ఎందుకు కేంద్ర ప్రభుత్వం ఇవ్వలేదని సూటిగా ప్రశ్నించారు. గద్దర్‌పై కేంద్రమంత్రి బండి సంజయ్ చేసిన వ్యాఖ్యలను వెంటనే ఉపసంహరించుకుని, తెలంగాణ జాతికి క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. బండి సంజయ్ గద్దర్‌ను అవమానించలేదని యావత్తు తెలంగాణ ప్రజలను అవమానించారన్నారు.

యువతి అదృశ్యం

వెంగళరావునగర్: కూరగాయలు కొనడానికి వెళ్లిన యువతి అదృశ్యమైన సంఘటన మధురానగర్ పీఎస్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం... దుర్గాభవానీ, భీమేశ్వ ర్‌రెడ్డి దంపతులు ఎల్లారెడ్డిగూడలో ఉంటూ వాచ్‌మెన్‌గా పని చేస్తుంటారు. ఈనెల 26న దుర్గాభవానీ పెద్దక్క పుష్పావతి, బావ నాగేంద్ర బాబు, వారి కొడుకు, 22 ఏళ్ల కూతురు దుర్గాభవానీ ఇంటికి వచ్చారు. ఈ క్రమంలో అక్క కూతురు కూరగాయలు కొనడానికి వెళ్లింది. ఎంతకూ తిరిగి రాకపోవడంతో దుర్గాభవానీ ఆమెకు ఫోన్ చేయగా స్విచ్ఛాఫ్ వచ్చింది. చుట్టుపక్కల వెతకగా కారులో వెళ్లినట్టుగా ఆమెకు ఒక దుకాణదారుడు తెలియజేశాడు. దీంతో దుర్గాభవానీ మధురానగర్ పీఎస్‌లో ఫిర్యాదు చేయడంతో కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఉద్యోగుల ఆందోళనలతో కమ్ముకున్న చీకట్లు

రహమత్‌నగర్: జీహెచ్ఎంసీలో ఏజెన్సీ కింద వీధిదీపాల విభాగంలో విధులు నిర్వహించే ఉద్యోగులకు జీతాలు ఇవ్వకపోవడం బాధాకరమని వరల్డ్ హ్యూమన్ రైట్స్ ప్రొటెక్షన్ అసోసియేషన్ సౌత్ ఇండియా వర్కింగ్ ప్రెసిడెంట్ మామిళ్ల నాగేష్ వాపోయారు. హెచ్ఎఫ్‌నగర్‌లో మంగళవారం ఆయన మాట్లాడుతూ జీతాలు ఇవ్వని కారణంగా ఉద్యోగులు ఆందోళన చేస్తుండటంతో చాలా ప్రాంతాల్లో వీధిదీపాలు వెలగక ప్రజలు రాత్రిళ్లు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆయన అన్నారు. చీకట్లో మహిళలు తమ నివాసాలకు వెళ్లాలంటే భయపడుతున్నారని, దానికి తోడు దొంగలుతనాలు, దోపిడీలు జరిగే అవకాశాలు ఉన్నాయని ఆయన వాపోయారు. నగర మేయర్ స్పందించి సమస్యను పరిష్కరించాలని ఆయన కోరారు.

‘వేలగొంతులు, లక్ష డప్పులు’ సభను విజయవంతం చేయాలి

రహమత్‌నగర్: ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో ఫిబ్రవరి 7 ట్యాంక్‌బండ్‌పై జరిగే ‘వేలగొంతులు లక్ష డప్పులు సభను విజయవంతం చేయాలని ప్రముఖ రచయిత మిట్టపల్లి సురేందర్ కోరారు. రహమత్‌నగర్ డివిజన్ రాజీవ్‌గాంధీనగర్‌లో జూబ్లీహిల్స్ నియోజకవర్గం ఎమ్మార్పీఎస్ ఇన్‌చార్జి చిట్యాల ఆనంద్ మాదిగ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సన్నాహక సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా సురేందర్ మాట్లాడుతూ మందకృష్ణ మాదిగ 30 ఏండ్ల పోరాటానికి కులమతాలకు అతీతంగా నాయకులు మద్దతు పలుకుతున్నారని చెప్పారు. వర్గీకరణతో దళిత హక్కులు సాధించబడతాయని తెలిపారు. ఎస్సీ వర్గీకరణ అమలు చేయడంలో తెలుగు రాష్ట్రాలు 30 ఏండ్లు కాలయాపన చేశారని ఆరోపించారు. ఆనంద్ మాదిగ మాట్లాడుతూ ఫిబ్రవరి 7వ తేదీన జరిగే సభకు జూబ్లీహిల్స్ నియోజకవర్గం నుంచి మాదిగలు పెద్ద ఎత్తున తరలిరావాలని కోరారు. ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు బిక్షపతి మాదిగ, నియోజకవర్గ పరిశీలకులు శివ మాదిగ, పల్లె నర్సింగ్‌రావు మాదిగ తదితరులు పాల్గొన్నారు.


కర్పూరి ఠాకూర్ జీవితం ఆదర్శం

పంజగుట్ట: బిహార్‌లోని ఒక మారుమూల గ్రామంలో మంగలి సామాజికవర్గంలో పుట్టి ముఖ్యమంత్రి స్థాయికి ఎదిగిన కర్పూరి ఠాకూర్‌ను బీసీలు ఆదర్శంగా తీసుకుని రాజ్యాధికారం దిశగా ముందుకుపోవాలని బహుజన్ సమాజ్ పార్టీ ఏపీ కో ఆర్డినేటర్, రిటైర్డ్ డీజీపీ డాక్టర్ జుజ్జవరపు పూర్ణచంద్రరావు అన్నారు. కులాధిపత్య రాజకీయాల్లో ఆయన అంకితభావమే ఆయనను ముఖ్యమంత్రి స్థాయికి తీసుకువచ్చిందని ఆయన పేర్కొన్నారు. మంగళవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో బీసీ సమాజ్ ఆధ్వర్యంలో అధ్యక్షుడు సంగెం సూర్యారావు అధ్యక్షతన కర్పూరి ఠాకూర్ జయంతి సందర్భంగా ఆయన జీవితచరిత్ర పుస్తకావిష్కరణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన పూర్ణచంద్రరావు మాట్లాడుతూ మట్టిలో మాణిక్యాలను వెలికితీసినట్లుగా బీసీ మాణిక్యాల చరిత్రను మరింత ప్రచారం చేస్తూ, వారిని ఆదర్శంగా తీసుకుని ముందుకుపోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సత్యం వంశరాజ్, మోదల శ్రీనివాస్ సాగర్, బొడ్డుపల్లి చంద్రశేఖర్, నరెడ్ల శ్రీనివాసులు, పాల్వాయి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

అక్రమ పార్కింగ్‌లతో అగచాట్లు!

హోటళ్ల ముందు ఇష్టానుసారంగా వాహనాల నిలుపుదల

- కుంచించుకుపోతున్న రోడ్లు.. వాహనదారులకు ఇబ్బందులు
- పోలీసులు హెచ్చరిస్తున్నా పెడచెవిన పెడుతున్న యజమానులు



పంజగుట్ట ప్రధాన రోడ్డులో మెరీడియన్ హోటల్ ఎదుట అక్రమ పార్కింగ్‌లు

నగరంలో ప్రధాన రోడ్లు అయిన సోమాజిగూడ, ఖైరతాబాద్, పంజగుట్ట ప్రాంతాల్లో ట్రాఫిక్ సమస్య పోలీసులకు తలనొప్పిగా మారింది. అయితే ట్రాఫిక్ సమస్యకు ప్రధానంగా అక్రమ పార్కింగ్‌లే కారణమవుతున్నాయి. ముఖ్యంగా పలు హోటళ్లకు వచ్చే వారు అక్కడ పార్కింగ్ సౌకర్యం లేకపోవడంతో హోటళ్ల ముందే పార్కింగ్ చేస్తున్నారు. దీంతో ఆ ప్రాంతంలో రోడ్డు కుంచించుకునిపోయి ట్రాఫిక్ సమస్యకు దారితీస్తోంది. అయితే పోలీసులు ఎన్నిసార్లు హెచ్చరించినా యజమానులు పట్టించుకోవడం లేదు.


రాజ్‌భవన్ రోడ్డులో ఆర్యభవన్ ఎదుట అక్రమ పార్కింగ్‌లు

బంజారాహిల్స్: నగరంలోనే పంజగుట్ట ప్రధాన రహదారితో పాటు సోమాజిగూడ, ఖైరతాబాద్ రహదారులు వాహనాల రాకపోకలతో తెల్లవారుజాము నుంచి అర్ధరాత్రి వరకు అత్యంత రద్దీగా మారుతున్నాయి. అయితే రోడ్లపక్కన అక్రమ పార్కింగ్‌లతో రోడ్డంతా కుంచించుకుపోతూ ట్రాఫిక్ జామ్‌లు ఏర్పడుతున్నాయి. ట్రాఫిక్ పోలీసులు ఎప్పటికప్పుడు ఆపరేషన్ రోప్ పేరుతో అక్రమ అడ్డంకులు తొలగిస్తున్నా నాలుగు రోజులు గడిచేసరికి యథా ప్రకారం హోటళ్ల యజమానులు అక్రమ పార్కింగ్‌లు చేస్తున్నారు. పంజగుట్ట ప్రధాన రహదారిలోని మెరీడియన్ హోటల్ మధ్యాహ్నం 12.30 గంటల నుంచి అర్ధరాత్రి ఒంటిగంట దాకా రోడ్డు పక్కనే అక్రమ పార్కింగ్‌లతో స్థానికంగా న్యూసెన్స్‌గా మారింది. ఈ హోటల్‌కు పార్కింగ్ సదుపాయం లేకపోవడంతో వ్యాలెట్ పార్కింగ్ ఏర్పాటు చేశారు. హోటల్‌కు వచ్చే కస్టమర్ల కార్లను వ్యాలెట్ డ్రైవర్లు సీఎం క్యాంప్ ఆఫీస్ వెనుకాల, రోడ్ల పక్కనే అక్రమ పార్కింగ్‌లు చేస్తున్నారని ఫిర్యాదులు అందుతున్నాయి. దీనికి తోడు మెరీడియన్ హోటల్ ముందు కూడా కార్లు, బైక్‌లు ఇష్టారాజ్యంగా పార్కింగ్ చేస్తుండటంతో రోడ్డు కుంచించుకుపోయి వాహనాలు ముందుకు వెళ్లలేని పరిస్థితులు నెలకొంటున్నాయి. పంజగుట్ట ట్రాఫిక్‌పోలీస్ స్టేషన్‌కు కూతవేటు దూరంలోనే ఈ పరిస్థితి నెలకొనగా ట్రాఫిక్ పోలీసులు తరచూ ఫొటోలు తీస్తూ జరిమానాలు విధిస్తున్నా పరిస్థితిలో మార్పు రావడం లేదు. సోమాజిగూడ నుంచి రాజ్‌భవన్‌కు వెళ్లేరోడ్డులో పౌరసరఫరాల శాఖ కార్యాలయం దాటిన తర్వాత వీధిలో ఆర్యభవన్ ఎదుట సైతం అక్రమ పార్కింగ్‌లు స్థానికంగా ట్రాఫిక్ జామ్‌కు కారణమవుతున్నాయి. ఈ హోటల్ సెల్లార్‌లను కూడా అద్దెలకు ఇచ్చారు. పార్కింగ్ సదుపాయం లేకుండా ఇక్కడ నడుస్తున్న హోటళ్లు అన్ని కస్టమర్ల వాహనాలను రోడ్లపక్కన పార్కింగ్ చేసుకోవాలంటూ దర్జాగా సూచిస్తున్నారు. ఫలితంగా ఈ రోడ్డుగుండా వెళ్లాలంటే ట్రాఫిక్ జామ్‌లు ఎక్కువగా తప్పడం లేదు. ఎన్నోసార్లు ట్రాఫిక్ పోలీసులు హెచ్చరికలు జారీ చేసినా సదరు హోటల్ యజమానులు వినిపించుకోవడం లేదు. కీలకమైన ఈ రహదారిలోనే అక్రమంగా వాహనాల పార్కింగ్‌తో తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి మెరీడియన్ హోటల్ ఎదుట, అటు ఆర్యభవన్ ముందు ఆపరేషన్ రోప్ నిర్వహించి ట్రాఫిక్‌కు ఇబ్బందులు లేకుండా చూడాలని పలువురు కోరుతున్నారు. అంతే కాకుండా పార్కింగ్‌లు ఏర్పాటు చేసుకోవాల్సిన సెల్లార్లలో వ్యాపారాలు చేస్తుండటంతో జీహెచ్ఎంసీ అధికారులు కూడా వీటిపై దృష్టి పెట్టాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

బసవతారకం ఫుట్‌పాత్, బస్‌షెల్టర్లలోని

నిరాశ్రయుల తరలింపు

- ఎక్కువ మంది కావడంతో న్యూసెన్స్ సమస్య
- జీహెచ్ఎంసీ షెల్టర్‌కు తరలించిన పోలీసులు

బంజారాహిల్స్: బంజారాహిల్స్ రోడ్ నెం. 10లోని బసవతారకం కేన్సర్ ఆస్పత్రి ముందు కేబీఆర్ పార్కును ఆనుకొని ఫుట్‌పాత్‌లు, బస్ షెల్టర్లు, జీహెచ్ఎంసీ షెల్టర్లలో వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన వందలాది మంది నిరాశ్రయులు ఇక్కడే పడుకుంటున్నారు. వీరందరికీ పలు ప్రాంతాల నుంచి వచ్చే వారంతా తమ దాతృత్వాన్ని చాటుకునేందుకు భోజనాలు అందజేస్తున్నారు. దీంతో నిరాశ్రయులు ఇక్కడ భోజనాలు లభిస్తుండటంతో పెద్ద ఎత్తున ఇక్కడికి చేరుకుంటూ ఇప్పటికే 400 మంది దాటారు. దీంతో న్యూసెన్స్, పారిశుద్ధ్య సమస్యతోపాటు ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం ఏర్పడుతుంది. దీన్ని దృష్టిలో పెట్టుకొని బంజారాహిల్స్ సీఐ రాఘవేంద్ర మూడు రోజుల నుంచి ఇక్కడ పోలీస్ పికెటింగ్ ఏర్పాటు చేశారు. ఎవరైనా భోజనాలు అందజేయడానికి వస్తే వారిని అనాథశ్రమాల్లో, దేవాలయాల వద్ద, ఆస్పత్రుల్లో అందజేయాలని పంపిచేస్తున్నారు. ఇక్కడ ప్రమాదకరంగా ఫుట్‌పాత్‌లపై ఉంటున్న వారందరనీ జీహెచ్ఎంసీ షెల్టర్లకు పంపించారు. ఇక్కడున్న రెండు షెల్టర్లు కూడా అసాంఘిక కార్యక్రమాలకు అడ్డాగా మారడంతో జీహెచ్ఎంసీ సహకారంతో వారందరినీ షెల్టర్లకు తరలించి వీటిని క్లీన్ చేయించారు. మరోవైపు ఇక్కడ పార్కింగ్ స్థలంలో ఓ వ్యక్తి తను రోజూ అన్నం పెడతానంటూ ఓ గదిని సైతం నిర్మించాడు. దీన్ని కూడా పోలీసులు నేలమట్టం చేయించారు. గత మూడు రోజుల నుంచి ఇక్కడ నుంచి యాచకులందరినీ పంపించడంతో ఫుట్‌పాత్‌లన్నీ క్లీన్ అయ్యాయి.


బసవతారకం కేన్సర్ ఆస్పత్రి ముందు షెల్టర్లను క్లీన్ చేయిస్తున్న బంజారాహిల్స్ పోలీసులు

నిమ్స్‌కు మరో బ్యాటరీ కారు

లక్డీకాపూల్: నిమ్స్ రోగుల రవాణా ప్రయోజనార్థం కోసం మరో బ్యాటరీ కారు అందుబాటులోకి వచ్చింది. రాజ్యసభ సభ్యులు రవిచంద్ర తన ఎంపీ నిధుల నుంచి సమకూర్చిన ఎలక్ట్రిక్ బగ్గీని మంగళవారం ఆస్పత్రికి అప్పగించారు. అనంతరం నిమ్స్ అడిషనల్ మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ ఎన్. లక్ష్మి భాస్కర్‌తో కలిసి జెండా ఊపి కార్‌ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆస్పత్రి ప్రాంగణంలో వద్దిరాజు ఎలక్ట్రిక్ బగ్గీని స్వయంగా నడిపారు. తొలుత డీఎంఎస్ లక్ష్మీ భాస్కర్ ఆస్పత్రి తరపున వద్దిరాజుని శాలువాతో ఘనంగా సత్కరించి మాట్లాడారు. రవిచంద్ర తన దాతృత్వాన్ని మరోసారి చాటుకున్నారని చెప్పారు. ఈ కార్యక్రమంలో బండి సంజీవ్, యాదా క్రాంతి, బండారి అనిల్, వెంకట్ గౌడ్, శ్రీరామ్, అరుణ్ తదితరులు పాల్గొన్నారు.


నిమ్స్‌లో ఎలక్ట్రిక్ బగ్గీని ప్రారంభిస్తున్న రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్ర

కార్మికుల సంక్షేమానికి కేంద్ర ప్రభుత్వం కృషి


సెక్యూరిటీ ప్రింటింగ్ ప్రెస్‌ను ఉద్యోగులతో ఎంపీ ఈటల రాజేందర్

ఖైరతాబాద్: కార్మికుల సంక్షేమానికి కేంద్ర ప్రభుత్వం కృషి చేస్తుందని ఎంపీ ఈటల రాజేందర్ అన్నారు. మింట్ కాంపౌండ్‌లోని సెక్యూరిటీ ప్రింటింగ్ ప్రెస్‌లో మంగళవారం నిర్వహించిన మజ్దూర్ సంఘ్ క్యాడర్ సమావేశానికి ఈటల రాజేందర్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఈటల రాజేందర్ మాట్లాడుతూ నిరుద్యోగులకు ఉద్యోగాల కల్పనే లక్ష్యంగా ప్రతి ఆరునెలలకు ఉద్యోగ నియామక నోటిఫికేషన్లు ఇస్తున్నామన్నారు. ఈ కాలంలో పిల్లలందరూ చదువుకుంటున్నారని, వారందరికి ఉపాధి కల్పించేందుకు కేంద్ర ప్రభుత్వం బడ్జెట్‌లో నాలుగు లక్షల కోట్ల రూపాయాలు కేటాయించిందన్నారు. కార్మికుల, ఉద్యోగుల బాధలు నాకు తెలుసని వారికి అన్ని విధాలుగా అందుబాటులో ఉంటానన్నారు. కార్మిక సంఘాలతో పనిచేసే వారు కుటుంబంతో పాటు వారు పనిచేస్తున్న కంపెనీ ఎదుగుదల, కార్మికుల శ్రేయస్సు కోసం పనిచేయాలన్నారు. రాబోయే ఎన్నికల్లో సెక్యూరిటీ ప్రింటింగ్ ప్రెస్ మజ్దూర్ సంఘ్‌ని గెలిపించాలని కోరారు. ఈ సందర్భంగా మేనేజర్ ఎస్ఆర్ వాజిప్ ఈటలను సన్మానించారు.

మహనీయుల అడుగుజాడల్లో నడవాలి

లిబర్టీ: దేశం కోసం పాటుపడిన మహనీయులను అడుగుజాడల్లో యువత నడవాలని లోక్‌దళ్ పార్టీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు జాతీయ కార్యదర్శి పి.వి.రాజేశ్వరరావు కోరారు. స్వాతంత్ర్య సంగ్రామంలో ముందు వరుసలో నిలబడిపోరాడిన యోధులను త్యాగధనులను విస్మరించకూడదని అన్నారు. స్వాతంత్ర్య సమరయోధుడు లాలా లజపతిరాయ్ జయంతి పురస్కరించుకొని పార్టీ కార్యాలయంలో మంగళవారం సభను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లజపతిరాయ్ బ్రిటిష్ పాలకుల గుండెల్లో నిద్రపోయాడని గుర్తు చేశారు. తల్లిదండ్రుల నుంచి ప్రేరణ పొంది అంకితభావం, క్రమశిక్షణతో దేశానికి జీవితాంతం పనిచేశారని రాజేశ్వరరావు పేర్కొన్నారు. స్వామి దయానంద్ సరస్వతీ స్ఫూర్తితో జాతీయ భావాలను లజపతిరాయ్ జీర్ణించుకున్నారని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో నాగేందర్, పి.వి.శ్రీనివాస్‌రావు తదితరులు పాల్గొన్నారు.

వివాహిత అదృశ్యం

వెంగళరావునగర్: భర్త కూలీ పనికి వెళ్లి వచ్చేలోగా భార్య కనిపించకుండా పోయిన సంఘటన మధురానగర్ పీఎస్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం... ఎస్.లక్ష్మణ్ తన భార్య, ముగ్గురు పిల్లలతో కలిసి రహమత్‌నగర్‌లో కొంతకాలంగా నివాసం ఉంటున్నాడు. భార్యాభర్తలు ఇద్దరూ దినసరి కూలీలుగా పని చేస్తుంటారు. ఈనెల 24వ తేదీన భర్త ఒక్కడే పనికివెళ్లగా, భార్య కడుపునొప్పిగా ఉందంటూ ఇంట్లోనే ఉంది. పిల్లలు స్కూల్‌కు వెళ్లారు. సాయంత్రం 6 గంటలకు లక్ష్మణ్ ఇంటికి వచ్చి చూడగా ఆమె కనిపించలేదు. దీంతో భార్యకోసం చుట్టుపక్కల వెతికినా ప్రయోజనం లేకపోవడంతో మధురానగర్ పీఎస్‌లో ఫిర్యాదు చేశాడు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదాల కారణాలపై జెడ్సీ ఆరా

- యాక్సిడెంట్ ప్రోన్‌లో స్ట్రీట్ లైట్లు ఏర్పాటు చేయాలని ఆదేశం


డార్క్‌స్పాట్‌ను పరిశీలిస్తున్న జోనల్ కమిషనర్ అనురాగ్ జయంతి

బంజారాహిల్స్: బంజారాహిల్స్ రోడ్డునెంబర్-10లోని బసవతారకం కేన్సర్ ఆస్పత్రి సమీపంలో కేబీఆర్ పార్కును ఆనుకుని మలుపు వద్ద వరుసగా జరుగుతున్న ప్రమాదాలను దృష్టిలో పెట్టుకుని కారణాలను తెలుసుకోవడానికి జీహెచ్ఎంసీ ఖైరతాబాద్ జోనల్ కమిషనర్ అనురాగ్ జయంతి మంగళవారం ట్రాఫిక్ పోలీసులు, స్ట్రీట్ లైట్స్ ఇంజినీర్లతో కలిసి పర్యటించారు. ఇక్కడ వీధిదీపాలు వెలగకపోవడంతో డార్క్‌స్పాట్‌లో రోడ్డు ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయని ఫిర్యాదులు రావడంతో వెంటనే లైట్లు ఏర్పాటు చేయాలని ఏఈ సుష్మను ఆదేశించారు. వెంటనే యాక్సిడెంట్ ప్రోన్ అనే బోర్డును ఏర్పాటు చేయడంతో పాటు హెచ్చరికగా రేడియం బ్లింకర్స్‌ను ఏర్పాటు చేయాలన్నారు. వెంటవెంటనే ఈ పనులు పూర్తి చేయాలని ఆదేశించారు. బంజారాహిల్స్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ బి.సాయిప్రకాష్‌గౌడ్ కూడా ఈ పర్యటనలో ఉన్నారు.

సిగ్నల్ పనుల పరిశీలన

బంజారాహిల్స్: బంజారాహిల్స్ రోడ్డునెంబర్ 1/12లోని విరించి చౌరస్తాలో జంక్షన్ డెవలప్‌మెంట్‌లో భాగంగా సిగ్నల్ మరమ్మతులు, ఇతర పనులు 20 రోజుల పాటు జరగనున్నాయి. ప్రస్తుతం ఉన్న ట్రాఫిక్‌కు అనుగుణంగా ఇక్కడ సిగ్నల్‌ను కొంత మేర మార్చడం జరుగుతుంది. ఈ పనులను మంగళవారం వెస్ట్‌జోన్ ట్రాఫిక్ ఏసీపీ హరిప్రసాద్ కట్టా, ట్రాఫిక్ ఇంజినీరింగ్ విభాగం సీఐలు కోటేశ్వరరావు, భరత్‌లతో కలిసి ఆయన పర్యటించి, పనులను పరిశీలించారు. మాసబ్‌ట్యాంక్ వైపు నుంచి వచ్చే వాహనాలతో పాటు విరించి పక్క రోడ్డు నుంచి వెళ్లే వాహనాలు కూడా సజావుగా సాగేందుకు వీలుగా సిగ్నల్స్‌ను కొంతమేర ముందుకు మార్చడం జరుగుతుంది. రెండు రోజుల పాటు సిగ్నలింగ్ పనులు, మరో 20 రోజులపాటు కూడళ్లలో ఇతర ట్రాఫిక్ నివారణ పనులు జరుగుతాయని పోలీసులు తెలిపారు. వాహనదారులు ట్రాఫిక్ పోలీసులకు సహకరించాలని కోరారు.


విరించి చౌరస్తాలో పర్యటిస్తున్న వెస్ట్‌జోన్ ట్రాఫిక్ ఏసీపీ హరిప్రసాద్ కట్టా

రోడ్డు ప్రమాదంలో ఇద్దరు మైనర్లకు తీవ్ర గాయాలు

ఫిలింనగర్: అదుపుతప్పిన వేగంతో బైక్‌తో కారును ఢీకొట్టడంతో ఇద్దరు మైనర్లకు తీవ్ర గాయాలపాలై ఉస్మానియా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న ఘటన ఫిలింనగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళ్తే... బంజారాహిల్స్ రోడ్ నెం.12లోని ఫస్ట్‌లాన్సర్ సయ్యద్‌నగర్‌కు చెందిన ఇద్దరు మైనర్లు (17) జూబ్లీహిల్స్ రోడ్ నెం 92 నుంచి అదుపు తప్పిన వేగంతో దూసుకెళ్తూ ఓ కారును ఢీకొట్టారు. ఈ ప్రమాదంలో కిందపడ్డ ఇద్దరికీ తీవ్ర గాయాలయ్యాయి. ఘటనకు కారకులైన వారిపై చర్యలు తీసుకోవాలని కానిస్టేబుల్ పి.సాయిచంద్ర ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఫిలింనగర్ పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

జాగ్రత్తలు పాటిస్తే ప్రమాదాలు నియంత్రించొచ్చు



అవగాహనా ర్యాలీ నిర్వహిస్తున్న డ్రైవర్లు

పంజగుట్ట: రోడ్డు భద్రతా వారోత్సవాల్లో భాగంగా రవాణాశాఖ అధికారుల ఆదేశాల మేరకు యూనిటీ తెలంగాణ ఆటో డ్రైవర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మంగళవారం ఆటోడ్రైవర్లు రోడ్డు సేఫ్టీ అవేర్‌నెస్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పెద్దెత్తున ఆటో డ్రైవర్లు ఆటోలతో ఖైరతాబాద్ రవాణాశాఖ కార్యాలయం నుంచి పంజగుట్ట పోలీస్‌స్టేషన్ వరకు అక్కడ నుంచి తిరిగి రవాణాశాఖ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా యూనియన్ ప్రతినిధులు సలీమ్, వెంకటేష్‌లు మాట్లాడుతూ ఆటో డ్రైవర్ల ట్రాఫిక్ నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని కోరారు. మద్యం తాగి ఎవ్వరూ ఆటోలు నడపరాదని సూచించారు. ముఖ్యంగా స్కూల్ పిల్లల్ని తీసుకువెళ్లే సమయంలో జాగ్రత్తలు పాటించాలన్నారు. రోడ్డు నిబంధనలు పాటిస్తే ప్రమాదాలు నియంత్రించవచ్చునని వారు సూచించారు. ఈ కార్యక్రమంలో రవాణాశాఖ అధికారలు తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న ‘ప్రేరణ’ కార్యక్రమం

ఫిలింనగర్: జూబ్లీహిల్స్ రోడ్డునెంబర్-45లోని భారతీయ విద్యాభవన్ ఆత్మకూరి రామారావు స్కూల్‌లో ‘ప్రేరణ’ పేరిట నిర్వహించిన ఓపెన్ హౌస్ కార్యక్రమం ఉత్సాహంగా జరిగింది. గ్రేడ్-2 విద్యార్థులు, వారి తల్లిదండ్రులు ఇందులో పాల్గొని వెజిటబుల్ కార్వింగ్, పెయింటింగ్ ఏ సీనరీ, ఇకెబెనా, త్రివర్ణ థీమ్ ఆధారంగా వ్యర్థాలకు ఆకర్షణీయమైన రూపాన్ని ఇచ్చి అబ్బురపరిచారు. ఈ సందర్భంగా అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు.



కేన్సర్ బాధిత పిల్లలకు వసతి కల్పనే లక్ష్యం


కార్యక్రమంలో సెయింట్ జూడ్ ఇండియా ప్రతినిధులు

బంజారాహిల్స్: కేన్సర్ బాధిత చిన్నారులకు సురక్షితమైన, పరిశుభ్రమైన వాతావరణంతో వసతిని అందించే లక్ష్యంగా సెయింట్ జూడ్ ఇండియా చైల్డ్ కేర్ సెంటర్స్ హైదరాబాద్ సేవలను విస్తరించింది. దీనిలో భాగంగా యాక్సిస్ బ్యాంక్ సెంటర్ పేరిట వసతితోపాటు రవాణా, విద్య, కౌన్సెలింగ్ వంటి సమగ్ర సంరక్షణ సేవలను ప్రారంభించింది. ఈ సందర్భంగా సెయింట్ జూడ్ ఇండియా సీఈఓ అనిల్‌నాయర్ మాట్లాడుతూ కేన్సర్ బాధిత పిల్లలకు కుటుంబ వాతావరణాన్ని కలిగించేలా వసతి సౌకర్యం అందిస్తున్నట్లు చెప్పారు. బోన్‌మారో ట్రాన్స్‌ప్లాంట్ చికిత్స తీసుకుంటున్న పిల్లలకు ప్రత్యేకంగా వసతి అందించడానికి కేంద్రం నాలుగు యూనిట్లను కలిగి ఉందన్నారు. ఎంఎన్‌జే ఇనిస్టిట్యూట్ ఆఫ్ అంకాలజీ అండ్ రీజనల్ కేన్సర్ సెంటర్, బసవతారకం ఇండో-అమెరికన్ కేన్సర్ హాస్పిటల్, రెయిన్‌బో చిల్డ్రన్స్ హాస్పిటల్, ఎల్వీ ప్రసాద్ ఐ ఇనిస్టిట్యూట్, లిటిల్‌స్టార్ చిల్డ్రన్స్ హాస్పిటల్, నిమ్స్ ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్న పిల్లలు ఈ సెంటర్ వసతి వినియోగించుకుంటున్నారని చెప్పారు. కేన్సర్ చికిత్స కోసం గ్రామీణ ప్రాంతాల నుంచి నగరాలకు వచ్చే నిరుపేద కుటుంబాలకు సెయింట్ జూడ్స్ సేవలు ఎంతగానో దోహదపడుతున్నాయన్నారు.

మహిళల ఆర్థికాభివృద్ధికి సమాఖ్యలు కృషి చేయాలి

- యూసీడీ అధికారులు
- రసాభాసగా ముగిసిన మహిళా సమాఖ్యల సమావేశం


మహిళా సమాఖ్యల సమావేశంలో మాట్లాడుతున్న అధికారులు

బంజారాహిల్స్: మహిళలు ఆర్థికంగా ఎదిగేందుకు ప్రభుత్వం తీసుకొచ్చిన ఇందిరా మహిళా శక్తితో పాటు పలు పథకాలను మహిళా సమాఖ్యలు సద్వినియోగం చేసుకోవాలని జీహెచ్ఎంసీ యూసీడీ పీవో సురేష్, డీఎంసీ భాను సూచించారు. మంగళవారం బంజారాహిల్స్ రోడ్ నెం. 12లోని ఎన్బీటీనగర్ కమ్యూనిటీ హాల్‌లో సర్కిల్-18 మహిళా సమాఖ్యల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా యూసీడీ డీపీవో ఆశా విరానికతో కలిసి ప్రధాన కార్యాలయం నుంచి వచ్చిన అధికారులు మహిళా సమాఖ్యల సభ్యులకు, ప్రతినిధులకు పలు సూచనలు చేశారు. పొదుపు గ్రూపులు ఏర్పడిన ఆరునెలల తర్వాత వారికి బ్యాంకులు రుణాలు ఇచ్చే అవకాశం ఉన్నందున బ్యాంకు లింకేజీ పనులు త్వరితగతిన పూర్తి చేసుకోవాలని సూచించారు. ఈ ఆర్థిక సంవత్సరం పూర్తయ్యేనాటికి ఒక్కో సమాఖ్య పది గ్రూపులు ఏర్పాటు చేసుకోవాలని, ట్రాన్స్‌జెండర్లతో పాటు వికలాంగులతో సైతం గ్రూపులు ఏర్పాటు చేయాలని సూచించారు. ఇందిరా మహిళా శక్తి పథకం ద్వారా క్యాంటీన్ల ఏర్పాటుతో పాటు కుట్టు శిక్షణా కేంద్రాల ఏర్పాటుకు రుణాలు మంజూరు అవుతున్నాయని వాటిపై అవగాహన కలిగి ఉండటంతో పాటు అర్హత ఉన్న వారంతా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ప్రతినెలా సమాఖ్య సమావేశాలు నిర్వహించుకోవడంతో పాటు ప్రతియేటా ఒకసారి మహిళా సమాఖ్య మహాసభ నిర్వహించుకోవాలని సూచించారు.

రసాభాసగా ముగిసిన సమావేశం...

గత కొద్ది రోజులుగా సర్కిల్-18లోని మహిళా సమాఖ్యల్లో కొంత గందరగోళం నెలకొంది. గత ఏడాది కాలంలో మహిళా సమాఖ్యల టౌన్ లెవల్ ఫెడరేషన్(టీఎల్ఎఫ్) నాయకత్వ లేమితో కొట్టుమిట్టాడుతుంది. అధ్యక్షురాలు లేకుండా సెక్రటరీతో సమాఖ్యను కొనసాగించడం సమంజసం కాదంటూ ఫిలింనగర్‌కు చెందిన మహిళా సమాఖ్యల ప్రతినిధులు పేర్కొన్నారు. దీనికి తోడు గత కొద్ది రోజుల క్రితం మహిళా సమాఖ్యలకు రుణాలు ఇప్పించే విషయంలో ఓ అధికారిణికి ఫోన్‌పే, గూగుల్‌పే ద్వారా డబ్బులు పంపిన వైనాన్ని సమాఖ్యల మహిళలు జీహెచ్ఎంసీ అధికారుల దృష్టికి ఈ సమావేశంలో తీసుకురావడంతో ఒక్కసారిగా వాతావరణం వేడెక్కింది. త్వరలోనే ఎన్నికలు నిర్వహించి సమస్యలకు పరిష్కారం చెబుతామని అధికారులు చెప్తున్నప్పటికీ మహిళా సమాఖ్యల ప్రతినిధులు అరుపులు కేకలతో సమావేశం నుంచి వెళ్లిపోయారు.

సాక్షి బుధవారం । 29 । జనవరి । 2025

గద్దర్‌పై అనుచిత వ్యాఖ్యలు దారుణం


మాట్లాడుతున్న పాశం యాదగిరి చిత్రంలో కొల్లూరి సత్తయ్య, డాక్టర్ పసునూరి రవీందర్ తదితరులు

- కేంద్ర మంత్రి బండి సంజయ్ క్షమాపణ చెప్పాలి
- గద్దర్ గళం అసోసియేషన్ ఖండన

కాచిగూడ: ప్రజాయుద్ధనౌక గద్దర్‌కు పద్మశ్రీ అవార్డు ఎట్లా ఇస్తం? ఆయన మా కార్యకర్తల్ని చంపించాడు అని అనుచితంగా మాట్లాడిన బీజేపీ నేత, కేంద్రమంత్రి బండి సంజయ్ వ్యాఖ్యల్ని గద్దర్ గళం అసోసియేషన్ తీవ్రంగా ఖండించింది. ఈ మేరకు బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో గద్దర్ గళం అసోసియేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు కొల్లూరి సత్తయ్య, ప్రధాన కార్యదర్శి డాక్టర్ పసునూరి రవీందర్, సీనియర్ పాత్రికేయులు పాశం యాదగిరి, కరుణాకర్‌రెడ్డి, శైలేష్, సమ్మిరెడ్డి మాట్లాడుతూ బండి సంజయ్ కేంద్రమంత్రి స్థాయిలో ఉండి మాట్లాడాల్సిన మాటలు కావని, తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమంతో పాటు అనేక ఉద్యమాల్లో గద్దర్ ముందు నడిచి నిలబడ్డారని తెలిపారు. తన విలువైన జీవితాన్ని ప్రజల కోసం ధారపోశారని వారు గుర్తు చేశారు. బండి సంజయ్ వ్యాఖ్యలు సిగ్గుచేటని అన్నారు. ఆయన తక్షణమే తన వ్యాఖ్యల్ని ఉపసంహరించుకోవాలని, అలాగే బహిరంగంగా క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. గద్దర్ చనిపోయినప్పుడు స్వయంగా దేశప్రధాని నరేంద్రమోదీ లేఖ రాసి తన సంతాపాన్ని వ్యక్తం చేశారని అన్నారు.

బీఐఎస్‌ను మరింత పటిష్టం చేస్తాం

- డైరెక్టర్ జనరల్ ప్రమోద్‌కుమార్



బీఐఎస్ డైరెక్టర్ జనరల్ ప్రమోద్‌కుమార్ తివారీ

మల్కాజిగిరి: బ్యూరో ఆఫ్ ఇండియన్ స్టాండర్డ్స్‌ను మరింత పటిష్టం చేస్తామని బీఐఎస్ డైరెక్టర్ జనరల్ ప్రమోద్‌కుమార్ తివారీ అన్నారు. మౌలాలిలోని బీఐఎస్ హైదరాబాద్ కార్యాలయంలో నూతనంగా ఏర్పాటు చేసిన వస్త్ర, ఆభరణాల పరీక్షా కేంద్రాలను మంగళవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారతీయ ప్రమాణాల రూపకల్పన, నాణ్యత నిర్ధారణలో కీలక పాత్ర బీఐఎస్ పోషిస్తోందన్నారు. నాణ్యమైన వస్తువులను వినియోగదారులకు చేర్చేందుకు, ఉత్పత్తులు ప్రమాణాలకు అనుగుణంగా తీర్చిదిద్దేందుకు అన్ని చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. సుమారు 750 వస్తువులు తప్పనిసరి ప్రమాణాలు అమలు జాబితాలో ఉన్నాయని, రాబోయే రోజుల్లో మరిన్ని వస్తువులు చేర్చేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. వినియోగదారులను అప్రమత్తం చేసేందుకు అవగాహన కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో బీఐఎస్ ప్రయోగశాల డీడీజీ నిషాద్, దక్షిణ విభాగం డీడీజీ మీనాక్షి, హైదరాబాద్‌శాఖ డైరెక్టర్ పీవీ శ్రీకాంత్ పాల్గొన్నారు.

పర్యావరణ హిత.. పురస్కార గ్రహీత



సాక్షి, సిటీబ్యూరో: పర్యావరణ అనుకూల పద్ధతిలో వ్యర్థాల నిర్వహణను ప్రోత్సహించేందుకు ఐటీసీ లిమిటెడ్ ఆధ్వర్యంలో ఇటీవల వెల్బీయింగ్ అవుట్ ఆఫ్ వేస్ట్(డబ్ల్యూ ఓ డబ్ల్యూ) ఇంటర్ స్కూల్ రీసైక్లింగ్ చాంపియన్‌షిప్ పోటీలను నిర్వహించారు. పోటీ ద్వారా పలు పాఠశాలలు, విద్యార్థుల్ని విజేతలుగా ఎంపిక చేశారు. వ్యర్థాల నిర్వహణ ద్వారా క్లీన్ ఇండియా మిషన్, స్వచ్ఛ భారత్ లక్ష్యాన్ని ముందుకు తీసుకెళ్తున్న విద్యార్థులకు రవీంద్రభారతి ఆడిటోరియంలో మంగళవారం పురస్కారాలను అందజేశారు. అర్హులైన విద్యార్థులు, పాఠశాలలకు అవార్డులు పతకాలను ప్రముఖులు అందజేశారు. అనంతరం స్వచ్ఛత ప్రతిజ్ఞ చేయించారు. సాంస్కృతిక ప్రదర్శనలు అలరించాయి. ముఖ్య అతిథిగా పురపాలకశాఖ సంచాలకులు డాక్టర్ టీకే శ్రీదేవి, గౌరవ అతిథులుగా పాఠశాల విద్యా కమిషనర్ డైరెక్టర్ ఈవీ నరసింహారెడ్డి, ఐటీసీ లిమిటెడ్ పేపర్‌బోర్డ్స్, స్పెషాలిటీ పేపర్స్ డివిజన్ డివిజనల్ చీఫ్ ఎగ్జిక్యూటివ్ రాజేష్ పాల్గొన్నారు.

సీజ్ చేసినా ఆగని నిర్మాణాలు

యథేచ్ఛగా కొనసాగుతున్న పనులు

- అటువైపు కన్నెత్తి చూడని అధికారులు
- గతంలో పక్కకు ఒరిగిన ఓ భవనం
- నేలమట్టం చేసి మిగతా భవనాలకు సీల్
- అధికారుల అండదండలతో మళ్లీ పనులు
- ఆగ్రహం వ్యక్తం చేస్తున్న స్థానికులు



సీల్ చేసినట్లు జీహెచ్‌ఎంసీ ఏర్పాటు చేసిన బ్యానర్

గచ్చిబౌలి: యథేచ్ఛగా అక్రమ నిర్మాణాలు కొనసాగుతున్నా అధికారులు అటువైపు కన్నెత్తి చూడకపోవడంతో జీ ప్లస్–3 నుంచి జీ ప్లస్–6 ఇలా ఇష్టానుసారంగా నిర్మాణాలు చేపట్టారు. అధికారుల అండదండలు పుష్కలంగా ఉండటంతో నిర్మాణదారులు ఆడిందే ఆట పాడిందే పాటగా కొనసాగింది. గతంలో సిద్ధిఖీనగర్‌లో నాలుగంతస్తుల భవనం పక్కకు ఒరగడంతో పెద్దఎత్తున అధికారులపై విమర్శలు వెల్లువెత్తాయి. వెంటనే జీహెచ్‌ఎంసీ అధికారులు ఆ భవనాన్ని నేలమట్టం చేశారు. అనంతరం ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు దాదాపు 20 అక్రమ నిర్మాణాలకు సీల్ వేశారు. ఆ భవనాలకు బ్యానర్లు కట్టి వాటిని సీల్ చేశామని చెప్పారు. అయితే నిర్మాణదారులు మాత్రం పనులు ఆపకపోవడం గమనార్హం. కొండాపూర్ డివిజన్‌లోని సిద్ధిఖీనగర్‌లో అక్రమ భవనాలకు సీల్ చేసిన శేరిలింగంపల్లి సర్కిల్ అధికారులు నిర్మాణపు పనులు కొనసాగుతున్నా ఏమీ పట్టనట్లు వ్యవహరించడం విమర్శలకు తావిస్తోంది. నిర్మాణాలకు సీల్ వేసినా యథేచ్ఛగా నిర్మాణాలు చేపడుతూ అధికారులకు సవాల్ విసురుతున్నారు. టౌన్‌ప్లానింగ్‌లోని కిందిస్థాయి సిబ్బందితో కుమ్మక్కై జోరుగా నిర్మాణ పనులు పూర్తి చేస్తున్నట్లు తెలుస్తోంది. 100 చదరపు గజాల స్థలంలో జీ ప్లస్ ఆరు అంతస్తుల నిర్మాణం చేపట్టడం ఆందోళన కలిగిస్తోంది. ఈ క్రమంలోనే శేరిలింగంపల్లి సర్కిల్ టౌన్ ప్లానింగ్ అధికారులు చర్యలు చేపట్టారు.

అభాసుపాలవుతున్న అధికారులు

సిద్ధిఖీనగర్‌లో నిబంధనలకు విరుద్ధంగా చేపడుతున్న అక్రమ నిర్మాణాలపై శేరిలింగంపల్లి టౌన్ ప్లానింగ్ అధికారులపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. రెండు దఫాలుగా 20 భవనాలను సీజ్ చేసినట్లుగా ప్రకటించారు. మరో 20 భవనాలపై ఎలాంటి చర్యలు తీసుకోలేదు. అందరికీ ఒకే న్యాయం ఉండాలని, సీజ్ చేసిన భవనాల యజమానులు పేర్కొంటున్నారు. సీజ్ చేసిన భవనాల నిర్మాణపు పనులకు ఎలాంటి ఆటంకం లేకుండా కొనసాగుతున్నాయి. సీజ్ చేసిన అన్ని భవనాల్లో గుట్టుచప్పుడు కాకుండా పనులు పూర్తి చేస్తున్నారు. కొద్ది రోజుల్లో భవన నిర్మాణ పనులు పూర్తి కానున్నాయి. వీటిపై అధికారులు ఎలా వ్యవహరిస్తారో వేచి చూడాల్సిందే..

పనులు చేపడుతున్నట్లు తన దృష్టికి వచ్చిందని, సీజ్ చేసిన భవనాల్లో నిర్మాణ పనులపై తదుపరి చర్యలు తీసుకుంటామని టౌన్ ప్లానింగ్ ఏసీపీ వెంకటరమణ తెలిపారు. గేట్లు బిగించిన తర్వాత అన్నింటికీ తాళాలు వేసి మళ్లీ సీల్ వేస్తామని ఆయన పేర్కొన్నారు.

ఈఎస్‌ఐని సొసైటీగా మార్చొద్దు


నాచారం ఈఎస్‌ఐ ఆస్పత్రి వద్ద నిరసన చేస్తున్న జేఏసీ నేతలు

మల్లాపూర్: రాష్ట్ర ప్రభుత్వం ఆధీనంలో ఉన్న ఈఎస్‌ఐని కేంద్ర ప్రభుత్వం ఈఎస్‌ఐ సొసైటీగా మార్చాలని ప్రయత్నిస్తోందని, వెంటనే విరమించుకోవాలని తెలంగాణ ఈఎస్‌ఐ జేఏసీ చైర్మన్ డాక్టర్ చీమ శ్రీనివాస్ అన్నారు. తెలంగాణ ఈఎస్‌ఐ జేఏసీ ఆధ్వర్యంలో ఆస్పత్రి ప్రాంగణంలో సిబ్బంది, వైద్యులు నల్లబ్యాడ్జీలు ధరించి మంగళవారం నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం అనేక ప్రభుత్వరంగ సంస్థలను ప్రైవేటీకరణ చేస్తూ ఉద్యోగులకు వ్యతిరేకంగా పనిచేస్తోందని ఆరోపించారు. సీఎం రేవంత్‌రెడ్డి తెలంగాణ ఈఎస్‌ఐని కాపాడాలన్నారు. ఈఎస్‌ఐ జేఏసీ నేతలు, వైద్యులు మోహతాడ, శ్రీనయ్య, వెంకటేష్ బాబు, విక్టోరియా, ధన్‌రామ్, కృష్ణ, డాక్టర్ విజయ్‌కుమార్, డాక్టర్ అరుణ్‌బాబు, సుధాకర్, డాక్టర్ రాజన్న, ఖాజా సిబ్బంది పాల్గొన్నారు.

అపాయింట్‌మెంట్ ఆర్డర్ కోసం నిరీక్షణ

- ప్రజాభవన్‌కు తరలివచ్చిన డీఎస్సీ–2008 బాధితులు
- ఇందిరమ్మ ఇళ్ల కోసం భారీగా దరఖాస్తులు


దరఖాస్తు స్వీకరిస్తూ సమస్య తెలుసుకుంటున్న ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు చిన్నారెడ్డి

లక్డీకాపూల్: ఉద్యోగాలు ఇస్తామన్నారు సరే.. అపాయింట్‌మెంట్ ఆర్డర్లు మాత్రం ఇవ్వడం లేదంటూ డీఎస్సీ–2008 అభ్యర్థులు ఆందోళన వ్యక్తం చేశారు. మహాత్మా జ్యోతిబా పూలే ప్రజాభవన్‌లో మంగళవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి రాష్ట్రవ్యాప్తంగా ఉన్న డీఎస్సీ 2008 బాధితులు తరలివచ్చారు. తమకు నియామక పత్రాలు అందించేలా షెడ్యూల్ ప్రకటించాలని డిమాండ్ చేస్తూ.. ప్రజావాణి వద్ద నిరసన వ్యక్తం చేశారు. తమకు ఉద్యోగాలు ఇస్తామని ప్రభుత్వం మంత్రివర్గంలో నిర్ణయం తీసుకొని ఏడాది గడిచిందన్నారు. ఈ మేరకు గతేడాది సెప్టెంబర్‌లో సర్టిఫికెట్ వెరిఫికేషన్ ప్రక్రియను ప్రభుత్వం పూర్తి చేసిందన్నారు. కానీ అపాయింట్‌మెంట్ ఆర్డర్లు ఇవ్వడంలో మాత్రం ప్రభుత్వం ఉదాసీన వైఖరిని అవలంబిస్తోందన్నారు.

6,354 దరఖాస్తులు ఇందిరమ్మ ఇళ్ల కోసమే..

ప్రజావాణిలో మొత్తం 8,070 దరఖాస్తులు అందాయి. ఎక్కువగా ఇందిరమ్మ ఇళ్ల కోసమే వచ్చాయి. 6,354 మంది లబ్ధిదారులు ఇళ్ల కోసం దరఖాస్తు పెట్టుకున్నారు. రేషన్ కార్డుల కోసం 1,248 మంది దరఖాస్తు చేసుకున్నారు. పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖకు సంబంధించి 192, విద్యుత్‌శాఖకు 135, రెవెన్యూ శాఖకు 46, ఇతర శాఖలకు 95 దరఖాస్తులు అందాయి. ప్రజావాణి ఇన్‌చార్జి, రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు డాక్టర్ జి.చిన్నారెడ్డి, స్టేట్ నోడల్ అధికారి దివ్య దేవరాజన్ దరఖాస్తులు స్వీకరించారు.

తెలంగాణ జైళ్లలో సంస్కరణలు మెరుగుపరుస్తాం

- డీజీ డాక్టర్ సౌమ్యా మిశ్రా


రిట్రీట్ ప్రారంభిస్తున్న జైళ్ల శాఖ డీజీ డాక్టర్ సౌమ్యా మిశ్రా

సైదాబాద్: తెలంగాణలోని జైళ్లలో పరిపాలన, సంస్కరణలను మరింత మెరుగు పరుస్తామని జైళ్ల శాఖ డీజీ డాక్టర్ సౌమ్యా మిశ్రా తెలిపారు. చంచల్‌గూడలోని స్టేట్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ కరక్షనల్ అడ్మినిస్ట్రేషన్(సీకా) కార్యాలయంలో తెలంగాణ జైళ్ల శాఖ రిట్రీట్–2024ను డీజీ జ్యోతి ప్రజ్వలన చేసి మంగళవారం ప్రారంభించారు. రెండు రోజుల పాటు సాగే ఈ రిట్రీట్ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా రాష్ట్ర ఆర్థిక, ప్రణాళికల శాఖల ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణారావు హాజరయ్యారు. తెలంగాణలోని జైళ్లలో పరిపాలన, సంస్కరణలను మెరుగు పరిచేందుకు, డీ అడిక్షన్ సెంటర్ల ఏర్పాటు, ఖైదీల భద్రత సంక్షేమం, మహిళా జైళ్లలో తీసుకోవాల్సిన చర్యలు గురించి రిట్రీట్‌లో ప్రధానంగా చర్చిస్తామని ఆమె వివరించారు. కార్యక్రమంలో తెలంగాణ జైళ్ల శాఖ ఐజీలు వై.రాజేష్, ఎస్.మురళీబాబు, డీఐజీలు డాక్టర్ శ్రీనివాస్, ఎం.సంపత్ పాల్గొన్నారు.

పోరాటాలతోనే సమస్యలకు పరిష్కారం



సాక్షి, సిటీబ్యూరో: తెలంగాణ వాణిజ్య పన్నుల శాఖ పదోన్నతుల్లో తమ పట్ల చూపుతున్న వివక్షకు నిరసనగా ఆ శాఖ కమిషనర్ కార్యాలయం ఎదుట ఎస్సీ, ఎస్టీ ఉద్యోగ సంఘాలు మంగళవారం మధ్యాహ్న భోజన విరామ సమయంలో నిరసన ప్రదర్శన నిర్వహించాయి. ఈ నిరసనలో తెలంగాణ గెజిటెడ్ అధికారుల కేంద్ర సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సత్యనారాయణ మాట్లాడుతూ.. ఉద్యోగుల న్యాయమైన డిమాండ్ల సాధనకు తమ సంఘం ఎప్పుడూ అండగా ఉంటుందని, పదోన్నతులు, విభాగాల పునర్విభజన విషయంలో ప్రభుత్వంతో కూడా చర్చించి సమస్యను పరిష్కరించే దిశగా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. సహ అధ్యక్షుడు బి.శ్యామ్ మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీలు ఐక్యంగా ఉంటే తమ ఆటలు సాగవని భావించిన బాహ్యశక్తులు తమ మధ్య విభేదాలు సృష్టించాలని చూస్తున్నాయని విమర్శించారు. ప్రాథమిక సభ్యులు ఇటువంటి ప్రయత్నాలను ఎండగడుతూ ఐక్యత కోసం కృషి చేయాలని అభ్యర్థించారు. పోరాటాల ద్వారా మాత్రమే సమస్యలు పరిష్కారం అవుతాయని, ఇందుకు సభ్యులంతా ఎప్పటికీ సిద్ధంగా ఉండాలని కోరారు. సంఘం అధ్యక్షుడు కె.భీక్యా, సంఘ ప్రధాన కార్యదర్శి కె.నాగేందర్ మాట్లాడుతూ ఉద్యోగ విరమణ సమయానికి చేరుకున్న ఉద్యోగులు తమకు రావాల్సిన ప్రమోషన్ల సాధనలో ఆలస్యం జరుగుతోందని ఆవేదన వ్యక్తం చేశారు.

అర్జున అవార్డు గ్రహీత దీప్తికి సన్మానం



దీప్తిని సన్మానిస్తున్న వికలాంగుల కో ఆపరేటివ్ కార్పొరేషన్ చైర్మన్ ముత్తినేని వీరయ్య

గచ్చిబౌలి: బలమైన సంకల్పంతో మొక్కవోని ఆత్మస్థైర్యంతో జీవాంజి దీప్తి తెలంగాణ ఖ్యాతిని విశ్వవ్యాప్తం చేశారని తెలంగాణ వికలాంగుల కో ఆపరేటివ్ కార్పొరేషన్ చైర్మన్, పారా స్పోర్ట్స్ అసోసియేషన్ ఆఫ్ తెలంగాణ గౌరవాధ్యక్షుడు ముత్తినేని వీరయ్య పేర్కొన్నారు. గచ్చిబౌలిలోని జీఎంసీ బాలయోగి స్టేడియంలో మంగళవారం పారా అథ్లెటిక్ అసోసియేషన్ ఆఫ్ తెలంగాణ ఆధ్వర్యంలో ఆమెను ఘనంగా సత్కరించారు. అనంతరం 23వ జాతీయ స్థాయి పారా అథ్లెటిక్ ఛాంపియన్‌షిప్ పోటీలు వచ్చేనెల 17 నుంచి 20వ తేదీ వరకు చెన్నైలోని జవహర్‌లాల్ స్టేడియంలో జరిగే పోటీలకు అర్హత కోసం 7వ రాష్ట్రస్థాయి పారా అథ్లెటిక్స్ క్రీడలను ఆయన ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దీప్తి పారా ఒలింపిక్‌లో కాంస్యం సాధించి ప్రస్తుత అర్జున అవార్డు అందుకొని ప్రతి ఒక్కరూ గర్వించేలా తెలంగాణ సత్తాను చాటారన్నారు. ప్రతి పారా క్రీడాకారుడు ఆమెను ఆదర్శంగా తీసుకొని భవిష్యత్తులో అంతర్జాతీయ స్థాయిలో మరిన్ని పతకాలు సాధించాలని కోరారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆమెకు రూ.కోటి నగదు, 500 గజాల స్థలం, గ్రూప్–2 ఉద్యోగం ప్రకటించి వికలాంగుల ఆత్మబంధువుగా మారారని పేర్కొన్నారు. అనంతరం అథ్లెటిక్స్ పోటీల్లో పలు పారా క్రీడాకారులకు మెడల్స్, సర్టిఫికెట్లను అందజేశారు. కార్యక్రమంలో హెలెన్ కిల్లర్ విద్యాసంస్థ చైర్మన్ ఉమర్‌ఖాన్, పారా అథ్లెటిక్ అసోసియేషన్ అధ్యక్షుడు శేఖర్, ప్రధాన కార్యదర్శి ప్రశాంత్, సలహాదారు సంజీవయ్య, పారా స్పోర్ట్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు సిగార పుబా, కోచ్‌లు కబీర్‌దాస్, సురేష్ పాల్గొన్నారు.

ఆపద మిత్ర శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

సాక్షి, సిటీబ్యూరో: ఆపద మిత్ర శిక్షణకు అర్హులైన యువతీ యువకుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నామని అదనపు కలెక్టర్, నోడల్ అధికారి జి.ముకుందరెడ్డి తెలిపారు. ప్రకృతి వైపరీత్యాలు సంభవించినప్పుడు స్వచ్ఛందంగా సేవ చేసేందుకు శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. శిక్షణ కాలంలో ఉచిత భోజనం, వసతి ఉంటుందన్నారు. అర్హత, ఆసక్తిగల అభ్యర్థులు జిల్లా యువజన క్రీడా కార్యాలయం, కలెక్టరేట్ కాంప్లెక్స్, లక్డీకాపూల్, హైదరాబాద్ జిల్లా కార్యాలయంలో దరఖాస్తు ఫారాలను తీసుకొని, వచ్చేనెల 2వ తేదీలోపు సమర్పించాలన్నారు.

సిటీలో పెరుగుతున్న ఉష్ణోగ్రత

సాక్షి, సిటీబ్యూరో: నగరంలో ఉష్ణోగ్రతలు పెరుగుతున్నాయి. రెండు రోజులుగా పగటి ఉష్ణోగ్రత 32 డిగ్రీలు దాటింది. మంగళవారం గరిష్ట ఉష్ణోగ్రత 33.1 డిగ్రీలు నమోదైంది. రాబోయే రెండు మూడు రోజుల్లో పగటి ఉష్ణోగ్రత మరింత పెరిగే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ శాఖ వెల్లడించింది. పదేళ్ల క్రితం జనవరి చివరి వారంలో గరిష్ట ఉష్ణోగ్రతలు 34 డిగ్రీలు నమోదై రికార్డు సృష్టించింది. తాజాగా అదే దిశలో పెరిగే అవకాశాలున్నట్లు తెలుస్తోంది. పెరుగుతున్న ఉష్ణోగ్రతలు చూస్తుంటే వచ్చే వేసవిలో ఎండలు దంచి కొట్టే అవకాశాలు కనిపిస్తున్నాయి.

భారతమాత ఫౌండేషన్‌పై చర్యలు తీసుకోవాలి

- సీనియర్ కాంగ్రెస్ నేత, మాజీ ఎంపీ వి.హనుమంతరావు


మాట్లాడుతున్న సీనియర్ కాంగ్రెస్ నేత, మాజీ ఎంపీ హనుమంతరావు

కాచిగూడ: భారతమాత మహా హారతి సందర్భంగా హుస్సేన్‌సాగర్‌లో జరిగిన బోటు ప్రమాదంపై విచారణ జరిపి భారతమాత ఫౌండేషన్‌పై రాష్ట్ర ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలని సీనియర్ కాంగ్రెస్ నేత, మాజీ ఎంపీ వి.హనుమంతరావు అన్నారు. బషీర్‌బాగ్‌లో మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడారు. గల్లంతైన ఇంజినీరింగ్ విద్యార్థి అజయ్ కుటుంబానికి కేంద్రమంత్రి జి.కిషన్‌రెడ్డి రూ.2 కోట్ల పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. అనుమతులు లేకుండా బాణాసంచా పేల్చడం వల్లే ఈ బోటు ప్రమాదం జరిగిందని ఆయన ఆరోపించారు. అజయ్ తండ్రి నాగారంలో ఆటో నడుపుతూ కుటుంబాన్ని పోషిస్తున్నాడని, ఆ కుటుంబానికి కేంద్ర ప్రభుత్వం ఉద్యోగం కల్పించాలని డిమాండ్ చేశారు. బోటులో ప్రమాదంలో గాయాలపాలైన వారికి కూడా పరిహారం చెల్లించాలన్నారు. పుష్ప సినిమా హీరోపై రాష్ట్ర ప్రభుత్వం ఏవిధంగా చర్యలు తీసుకుందో.. అదే తరహాలో భారతమాత ఫౌండేషన్‌పై కూడా కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ ఖైరతాబాద్ జిల్లా ప్రధాన కార్యదర్శి తొలుపునూరి కృష్ణగౌడ్, నాగభూషణం, శంభుల శ్రీకాంత్‌గౌడ్, కె.శ్రీకాంత్, దాత్రిక్ చందులాల్ పటేల్ తదితరులు పాల్గొన్నారు.

నాచారం ఢిల్లీ పబ్లిక్ స్కూల్‌కు బాంబు బెదిరింపు

మల్లాపూర్: నాచారం ఢిల్లీ పబ్లిక్ స్కూల్లో బాంబు పెట్టినట్లు ఉదయం 9 గంటలకు ఓ ఆగంతకుడి నుంచి మెయిల్ వచ్చింది. దీంతో వెంటనే బాంబు స్క్వాడ్‌తో స్కూల్ మొత్తం తనిఖీలు చేపట్టారు. విషయం తెలుసుకున్న తల్లిదండ్రులు ఆందోళనకు గురయ్యారు. సాయంత్రం వరకు బాంబు స్క్వాడ్ పోలీసులు తనిఖీలు చేపట్టారు. ఏమీ దొరకకపోవడంతో బాంబు స్క్వాడ్ బృందం వెనుదిరిగి వెళ్లిపోయారు. గత నెల 20వ తేదీన కూడా పాఠశాలకు మెయిల్ రావడంతో తనిఖీ చేశారు. బెదిరింపు మెయిల్‌పై పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. మల్కాజిగిరి ఏసీపీ చక్రపాణి పాఠశాలను సందర్శించారు. బాంబు పేరుతో విద్యార్థుల జీవితాలతో చెలగాటం ఆడుతున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని భారత విద్యార్థి ఫెడరేషన్ ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా ప్రధాన కార్యదర్శి రాథోడ్ సంతోష్ డిమాండ్ చేశారు.

హైడ్రాపై న్యాయ పోరాటం చేస్తాం

- విద్యా సంస్థల చైర్మన్ నల్ల మల్లారెడ్డి


హైడ్రా కూల్చివేసిన తీరు వివరిస్తున్న నల్ల మల్లారెడ్డి

పంజగుట్ట: ఏకపక్ష వైఖరితో తమ గోడు వినకుండా, కనీసం తమ డాక్యుమెంట్లు పరిశీలించకుండా కోర్టు ఇంజక్షన్ ఆర్డర్‌ను సైతం లెక్క చేయకుండా తమ పట్టా భూముల్లోని ప్రహరీ గోడను కూల్చివేసిన హైడ్రా చర్యలపై న్యాయపోరాటం చేస్తామని విద్యా సంస్థల అధినేత నల్ల మల్లారెడ్డి, దివ్యానగర్ ప్లాట్ ఓనర్స్ అసోసియేషన్ ప్రతినిధులు పేర్కొన్నారు. సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో నల్ల మల్లారెడ్డి, అసోసియేషన్ అధ్యక్షుడు సంపత్‌రెడ్డి మాట్లాడుతూ.. మేడ్చల్ జిల్లా ఘట్‌కేసర్ మండలం, పోచారం మున్సిపాల్టీలోని కొర్రెములలో దివ్యానగర్ ఫేజ్ నెం.1 నుంచి 6 వరకు 3,500 ప్లాట్లలో సుమారు వందల కుటుంబాలు నివాసం ఉంటున్నాయని తెలిపారు. ఈ కాలనీ ఇరువైపులా నిర్మానుష్య ప్రాంతం, అటవీ ప్రాంతం ఉండటంతో రక్షణ కోసం రూ.కోట్లు వెచ్చించి సుమారు 250 ఎకరాల పొడవునా నాలుగు కిలోమీటర్ల మేర ప్రహరీగోడ నిర్మించుకున్నామని తెలిపారు. ఎవరో ఇచ్చిన ఫిర్యాదును ఆధారంగా చేసుకుని హైడ్రా అధికారులు ఈ నెల 25, 26వ తేదీల్లో కూల్చివేతలు ప్రారంభించారని ఆవేదన వ్యక్తం చేశారు. హైడ్రా అధికారి రంగనాథ్ తనను మాఫియా డాన్ అని, తాను 4 కిలోమీటర్ల మేర కేజీఎఫ్ గోడలు కట్టానని అంటున్నాడని, తాను ఎక్కడ మాఫియా చేశానో ఆయన వివరించాలని ప్రశ్నించారు. తన వ్యక్తిత్వాన్ని దెబ్బతీసినందుకు పరువు నష్టం దావా వేస్తానని హెచ్చరించారు. కోర్టు ఇంజక్షన్ ఆర్డర్ ఉన్నా స్థలాలు కూల్చినందుకు కోర్టు ధిక్కరణ కేసు కూడా వేస్తామన్నారు.

నగరంలో నేడు

- నాంపల్లి ఎగ్జిబిషన్ గ్రౌండ్స్‌లో సాయంత్రం 4 నుంచి రాత్రి 9 గంటల వరకు ఇండస్ట్రియల్ ఎగ్జిబిషన్ అందుబాటులో ఉంటుంది.
- మాదాపూర్‌లోని చిత్రమయి స్టేట్ ఆర్ట్ గ్యాలరీలో ఇన్నోవేటివ్ హ్యాండ్స్ పేరిట ఏర్పాటు చేసిన చిత్ర ప్రదర్శన ఉదయం 10.30 నుంచి సాయంత్రం 6 గంటల వరకు అందుబాటులో ఉంటుంది.
- మాదాపూర్‌లోని శిల్పారామంలో హైదరాబాద్ త్యాగరాజ ఆరాధన మ్యూజిక్ ఫెస్టివల్ సాయంత్రం 5 గంటల నుంచి అందుబాటులో ఉంటుంది.
- హెచ్‌సీయూలోని డీన్ స్టూడెంట్స్ వెల్ఫేర్ కార్యాలయం, తెలంగాణ సైబర్ సెక్యూరిటీ టీమ్, తెలంగాణ రాష్ట్ర కౌన్సిల్ ఆఫ్ హయ్యర్ ఎడ్యుకేషన్(టీజీసీహెచ్‌ఈ) సంయుక్త ఆధ్వర్యంలో గచ్చిబౌలిలోని హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీలో 'సైబర్ క్రైమ్'పై అవగాహన కార్యక్రమం మధ్యాహ్నం 3 గంటలకు నిర్వహిస్తారు.

గ్రేటర్ సిటీ నలుమూలలా ప్రతిరోజూ నిర్వహించే ఈవెంట్ల వివరాలను ఒక రోజు ముందే మాకు పంపండి. 'సాక్షి' ఎంగేజ్‌మెంట్ కాలం (నగరంలో నేడు)లో ప్రచురిస్తాం. మీ ఈవెంట్ల వివరాలను sakshiupdates123@gmail.com కు మెయిల్ చేయగలరు.

31 నుంచి బిజినెస్ ఎక్స్‌పో

సాక్షి, సిటీబ్యూరో: వివిధ వ్యాపార రంగాలకు చెందిన సంస్థల ఆధ్వర్యంలో ఈ నెల 31 నుంచి వచ్చేనెల 2 వరకు బిజినెస్ ఎక్స్‌పో నిర్వహిస్తున్నట్లు ఆర్గనైజర్ ఇజాజ్ అహ్మద్ మంగళవారం మీడియాకు వెల్లడించారు. గుడిమల్కాపూర్‌లోని కింగ్స్ క్రౌన్ కోహినూర్ కన్వెన్షన్‌లో జరిగే ఎక్స్‌పోలో టెక్నాలజీ, రిటైల్, హాస్పిటాలిటీ, రియల్ ఎస్టేట్, మాన్యుఫ్యాక్చరింగ్ సహా 12 విభిన్న రంగాల వాణిజ్య సంస్థలు పాల్గొంటాయని తెలిపారు. ఆరోగ్య సంరక్షణ, టూరిజం, ఫైనాన్స్, ఫ్యాషన్, జ్యువెలరీ, వ్యవసాయం, ఇంధనం తదితర రంగాల్లో కొత్త అవకాశాలను వివరించేందుకు ఈ ఎక్స్‌పో ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ మేరకు ఆయా సంస్థల స్టాల్స్ ఏర్పాటు చేస్తారని పేర్కొన్నారు. ఔత్సాహిక వ్యాపారవేత్తలు, వ్యవస్థాపకులను వ్యాపార రంగంలో ప్రోత్సహించడమే లక్ష్యమన్నారు. మరిన్ని వివరాలకు ఫోన్: 88588 43344, 88588 45599.

నగర విద్యార్థికి 'కేంబ్రిడ్జ్ ఔట్ స్టాండింగ్ లెర్నర్స్ అవార్డు'



సాక్షి, సిటీబ్యూరో: కేంబ్రిడ్జ్ ఇంటర్నేషనల్ ఆధ్వర్యంలో ప్రతిష్టాత్మకంగా అందించే 'కేంబ్రిడ్జ్ ఔట్ స్టాండింగ్ లెర్నర్స్' అవార్డును హైదరాబాద్ మంథన్ హైస్కూల్‌కు చెందిన విద్యార్థిని హన్సిని అందుకుంది. ప్రపంచవ్యాప్తంగా అత్యుత్తమ ప్రతిభ కనబరిచే విద్యార్థులకు అందించే ఈ పురస్కారాన్ని.. హన్సిని ఏఎస్ లెవెల్‌లో ఆర్థిక శాస్త్రంలో ప్రపంచశ్రేణి ఉత్తీర్ణురాలిగా అందుకుంది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. తన విజయంలో పాఠశాల సహకారం, రుచికా మేడం మార్గనిర్దేశం ప్రోత్సాహాన్ని అందించాయన్నారు. ఈ విజయం ఆమె అంకితభావానికి నిదర్శనమని మంథన్ స్కూల్ వైస్ ప్రిన్సిపాల్ రుచికా ఉపాధ్యాయ్ తెలిపారు.

అధునాతన హెమటైజర్లు అవసరం


సాక్షి, సిటీబ్యూరో: కేన్సర్ బాధితుల సంఖ్య పెరుగుతున్న నేపథ్యంలో వ్యాధి గుర్తింపులో కీలకమైన అధునాతన హెమటైజర్ల ఆవశ్యకత ఉందని వైద్య నిపుణులు అభిప్రాయపడ్డారు. ప్రముఖ ఇన్–విట్రో డయాగ్నోస్టిక్(ఐవిడి) కంపెనీ ఎర్బా ట్రాన్సాసియా గ్రూప్ తమ అధునాతన హెమటాలజీ ఎనలైజర్–ఎర్బా హెచ్7100ను పరిచయం చేస్తూ 'క్లినికల్ లాబొరేటరీలు ఎదుర్కొంటున్న సవాళ్లు–హై ఎండ్ హెమటాలజీ ఎనలైజర్స్ ఆవశ్యకత'పై నగరంలోని మారియట్ హోటల్‌లో క్లినికల్ సింపోజియం నిర్వహించింది. మణిపాల్ హాస్పిటల్స్‌కి చెందిన కన్సల్టెంట్ హెమటోపాథాలజిస్ట్ డాక్టర్ స్వాతి పాయ్ ఈ సదస్సులో కీలకోపన్యాసం చేశారు. బసవతారకం ఇండో–అమెరికన్ కేన్సర్ హాస్పిటల్‌కి చెందిన సీనియర్ కన్సల్టెంట్ పాథాలజిస్ట్, డాక్టర్ సుశీల కోదండపాణి, ఎయిమ్స్‌కు చెందిన డిప్యూటీ మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ పరాగ్ పాటిల్, కేర్ హాస్పిటల్స్‌కు చెందిన లేబొరేటరీ డైరెక్టర్ డాక్టర్ శ్రీకాంత్ పంకంటి, సీనియర్ కన్సల్టెంట్ పాథాలజిస్ట్ ఏఐజీ హాస్పిటల్స్‌కు చెందిన పాథాలజీ అండ్ మాలిక్యులర్ పాథాలజీ హెడ్ డైరెక్టర్ డాక్టర్ అనురాధ శేఖరన్ తదితరులు పాల్గొని మాట్లాడారు.

సాక్షి సిటీ ప్లస్
11
హైదరాబాద్, బుధవారం, 29, జనవరి, 2025



ఢిల్లీలో ఇటీవల జరిగిన ఓ ఫ్యాషన్ షోలో సోనమ్ కపూర్ ర్యాంప్‌వాక్ చేశారు. వావ్.. డ్రెస్.. హూ ఈజ్ ద డిజైనర్? ఇలా ప్రశ్నలకు ఓహ్.. షీ ఈజ్ జయంతిరెడ్డి ఫ్రమ్ హైదరాబాద్.. ఇలాంటి సమాధానాలలో నగరం పేరు వినిపించడం ముంబయి, ఢిల్లీ, చెన్నై, గోవా, బెంగళూరు.. తదితర చోట్ల సర్వసాధారణంగా మారుతోంది. ఒకప్పుడు సెలిబ్రిటీలు తమ ఫ్యాషన్ డిజైనర్ అనగానే ముంబయి డిజైనర్ పేరు చెప్పేవారు. ఇప్పుడు నగరంలో టాప్ డిజైనర్లు సెలిబ్రిటీ డిజైనర్లుగా పేరొందారు.

- సాక్షి, సిటీబ్యూరో





బాలీవుడ్ బాద్‌'షా'..

నగరం నుంచి బాలీవుడ్ తారలకు డిజైన్లు అందించిన ఘనతను గౌరంగ్ షా సొంతం చేసుకున్నారు. దేశంలోని వివిధ ప్రాంతాలకు చెందిన నేత కార్మికుల పనితనానికి పట్టం కడుతూ చేతితో నేసిన చీరలకు ప్రసిద్ధి చెందాడు. విద్యాబాలన్, సోనమ్ కపూర్, అదితీరావ్ హైదరీ సహా మరెందరో ఆయన డిజైన్లకు జై కొట్టారు. మహానటి సినిమా ద్వారా జాతీయ పురస్కారం అందుకున్నారు.





సెలప్రెట్టీ లుక్..

- ప్రముఖుల దుస్తులకు నగర డిజైన్లు
- టాప్ షోస్‌లో తళుక్కుమంటున్న మన ఫ్యాషన్
- మహానటి, కల్కి సినిమాలకూ మన డిజైనర్లే
- యువ డిజైనర్లకు స్ఫూర్తిగా నిలుస్తున్న వైనం



నగర డిజైనర్ల విజయాలు ఔత్సాహిక డిజైనర్లకు స్ఫూర్తిని అందిస్తున్నాయి. ఫ్యాషన్ డిజైనింగ్ ఇన్‌స్టిట్యూట్ విద్యార్థులకు గెలుపు పాఠాలను వినిపిస్తున్నాయి. ఈ నేపథ్యంలో నగరానికి చెందిన హామ్‌స్టెక్ ఫ్యాషన్ డిజైనింగ్ ఇన్‌స్టిట్యూట్ ఫ్యాకల్టీలు నగరానికి చెందిన పలువురు టాప్ సెలిబ్రిటీ డిజైనర్ల గురించిన విశేషాలను అందిస్తున్నారు.

'సోమ్'.. ఫేమ్..

నగరానికి చెందిన డిజైనర్ శ్రియా సోమ్ ఆధునిక మహిళ డ్రీమ్ డ్రెస్సింగ్‌ను అందిస్తారు. సున్నితమైన హస్తకళ, క్లిష్టమైన అలంకారాలు, సొగసైన ఛాయాచిత్రాలకు ఆమె లేబుల్ శ్రియా సోమ్ ప్రసిద్ధి చెందింది. పీవీ సింధు, జాన్వీ కపూర్, లీసా హేడన్ తదితరులు ఆమె జాబితాలో ఉన్న కొందరు సెలిబ్రిటీలు.. అంతేకాక ఆమె సోషల్ మీడియా ఇన్‌ఫ్లుయెన్సర్ కూడా.

అందానికి వన్నెలు.. అనుశ్రీ..



క్లిష్టమైన పనితనం, ఆకర్షణీయమైన సిల్హౌట్‌లు ఉన్న ఎథెరియల్ లెహంగాలకు అనుశ్రీ రెడ్డి లేబుల్ పర్యాయపదంగా మారింది. లెహంగా సిల్హౌట్‌లు వాటి డీప్ కట్‌వర్క్ నెక్‌లైన్‌లు, ఎంబ్రాయిడరీ కట్‌వర్క్ అంచులతో ఉన్న దుపట్టాలకు ఆమె హాఫ్ శారీస్ ప్రసిద్ధి చెందాయి. అందమైన గులాబీలు, పాస్టెల్‌ల నుంచి రాయల్ వైలెట్లు, బంగారు పసుపు వరకూ రంగుల మిశ్రమాన్ని ఆమె చాకచక్యంగా ఉపయోగిస్తారు. ఇటీవలి లాక్మే ఫ్యాషన్ వీక్‌లో ఆమె కలెక్షన్స్.. అందమైన ఆర్గాన్జా, పూల ఎంబ్రాయిడరీ కట్‌వర్క్, తక్కువ చతురస్రాకార నెక్‌లైన్‌లు అన్ని షేడ్స్ న్యూడ్‌లు పింక్‌లతో మెరిపించాయి. ఆమె వర్క్ చేసిన సెలిబ్రిటీలలో అలియాభట్, కత్రినాకైఫ్, తాప్సీ పన్ను.. తదితరులు ఉన్నారు.

ఆకా'సమంత'.. అర్చన..

ఇటీవల నగరం నుంచి జాతీయస్థాయికి ఎదిగిన డిజైనర్లలో అర్చనరావు ముందు వరుసలో ఉన్నారు. 2012లో లాక్మే ఫ్యాషన్ వీక్‌లో తన లేబుల్‌ను ప్రారంభించారు. ఆ మరుసటి ఏడాదే 'వోగ్ ఇండియన్ ఫ్యాషన్ ఫండ్'ను గెలుచుకున్నారు. ఇటీవల విడుదలైన ప్రభాస్ కల్కి సినిమాకు ఆమె చేసిన వర్క్ ప్రశంసలకు నోచుకుంది.





మనదే 'జయం'..

జయంతి రెడ్డి డిజైన్‌లు రాయల్ అద్భుత కథల వైబ్‌లను అందించడం ఖాయం. ఆమె డిజైన్‌లు సంప్రదాయ స్కర్ట్‌లు/లెహంగాలతో జత చేసిన ఆధునిక క్రాప్-టాప్ సిల్హౌట్‌లు ఆసక్తికరమైన మిక్స్. గోల్డెన్, సిల్వర్‌జరీతో కూడిన ఆమె ఎంబ్రోయిడరీ వర్క్ ఎప్పుడూ టాక్ ఆఫ్ ద టౌన్.

- అర్చనరావు డిజైన్ చేసిన న్యూడ్ కలర్ లేత గోధుమరంగు చీరకు బేబీ పింక్ కట్ వర్క్ బోట్ నెక్ బ్లౌజ్ మెటాలిక్ సిల్వర్ బెల్ట్‌తో జత చేసి, నటి సమంతా మెరిశారు.
- ఫెమినా వెడ్డింగ్ టైమ్స్‌లో ప్రదర్శించబడిన టూ-టోన్డ్ కార్సెట్ రఫిల్ డ్రెస్‌లో జాన్వీ కపూర్ మెరిశారు.
- స్టార్ ప్లేయర్ పీవీ సింధు, డిజైనర్ శ్రియా సోమ్ మొదటి సోలో షో కోసం ర్యాంప్ వాక్ చేసింది.
- లాక్మే ఫ్యాషన్ వీక్‌లో షో స్టాపర్‌గా లీసా హేడన్ డిజైనర్ శ్రియా సోమ్ మెరిసే, పొడవాటి చేతుల చోళీ అద్భుతమైన లెహంగా ధరించి.. అందరినీ ఆకట్టుకుంది.
- ఇటీవల సోనమ్ కపూర్ గౌరంగ్ షా డిజైన్ చేసిన పసుపు రంగు కుర్తా లెహంగా స్కర్ట్‌తో మ్యాచింగ్ దుపట్టా ధరించి ఒక ఈవెంట్‌కు హాజరయ్యారు.
- ఇటీవల జరిగిన ఉత్సవాల్లో, బాలీవుడ్ నటి మలైకా అరోరా ఖాన్ డిజైనర్ గౌరంగ్‌షా తీర్చిదిద్దిన ఆల్ ఇన్ ఆల్ అనార్కలీ సూట్ ధరించారు.
- ఓ సినిమా సక్సెస్ ప్రెస్ మీట్ ఈవెంట్‌కి రకుల్ ప్రీత్ సింగ్ అర్చనా రావు డిజైన్లు ధరించి హాజరై అందరి దృష్టినీ ఆకర్షించారు.

నగరంలో బ్యాంబూ బట్టలు..

సరికొత్త ఫ్యాషన్‌కు నాంది

- పర్యావరణహితంతో పాటు చర్మసంరక్షణ
- వినూత్నంగా 'హౌస్ ఆఫ్ స్వాషా'

సాక్షి, సిటీబ్యూరో: ప్రతి ఒక్కరూ అధునాతన జీవనశైలి కోసం పరుగెడుతున్న రోజులివి. ఈ ప్రయాణంలో ఫాస్ట్‌ఫార్వర్డ్ ఫ్యాషన్ అందరినీ ఆకర్షించడంతో పాటు ఎన్నో వినూత్న మార్పులకు నాంది పలుకుతోంది. ప్రస్తుత కాలంలో సుస్థిరత, మన్నిక తగ్గిపోతుందని, ముఖ్యంగా ఫ్యాషన్, ఫ్యాబ్రిక్ రంగాల్లో ఈ ధోరణి ఎక్కువగా కనిపిస్తోందన్నది నిపుణుల మాట. ఇందులో భాగంగా నగరవాసులకు మన్నికతో పాటు పర్యావరణహితమైన దుస్తులను అందిస్తామంటున్నారు స్వాతి, షాచి. వీరు ప్రారంభించిన హౌస్ ఆఫ్ స్వాషా వినూత్నంగా బేంబూ ఫ్యాబ్రిక్‌తో తయారు చేసిన టీ షర్టులు, సాక్స్‌లు అందిస్తున్నారు. వివిధ రాష్ట్రాలల్ల ఆన్‌లైన్ వేదికగా తమ సేవలందిస్తూనే హైదరాబాద్‌లో మాత్రం భౌతికంగానూ స్టోర్ ప్రారంభించి సరికొత్త సంస్కృతికి నాంది పలికారు.

నూతనత్వానికి వేదిక..

బ్యాంబూ ఫ్యాబ్రిక్ అనేది చర్మానికి సున్నితత్వాన్ని, అలర్జీల నుంచి రక్షణతో పాటు స్కూల్ చిన్నారులకు ఈ ఫ్యాబ్రిక్ సాక్సులు యాంటీబ్యాక్టీరియల్ సంరక్షణను అందిస్తాయని వ్యవస్థాపకులు తెలిపారు. వినూతనత్వాన్ని అందిపుచ్చుకోవడంలో హైదరాబాద్ ముందుంటుందని, ఈ నేపథ్యంలోనే నగరంలోని జూబ్లీహిల్స్ వేదికగా స్టోర్ ప్రారంభించారని పేర్కొన్నారు. పర్యావరణహితమైన బ్యాంబూ ఫ్యాబ్రిక్‌తో పాటు రసాయనాలు వినియోగించని పంటల నుంచి సేకరించిన కాటన్, కాలిఫోర్నియాలో మాత్రమే లభించే పీమా కాటన్‌తో హౌస్ ఆఫ్ స్వాషా ఉత్పత్తులను తయారు చేస్తున్నారు. ఈ పీమా కాటన్ ప్రపంచవ్యాప్తంగా ఒక శాతం మాత్రమే ఉంటుంది.



అంతా హ్యాండ్‌మేడ్..

ఆఫర్లలో వస్తున్నాయని నాణ్యతలేని దుస్తులు కొని రెండు, మూడు సార్లు ధరించి పక్కన పడేయడం ఈ తరం అలవాటుగా మారింది. దీని వల్ల పర్యావరణానికి హాని కలుగుతోంది. దీనికి స్వస్తి పలకాలనే లక్ష్యంతో హౌస్ ఆఫ్ స్వాషా ప్రారంభించాం. ఎలాంటి ప్రచారాలు చేయకపోవడం వల్ల తక్కువ ధరకే కస్టమర్లకు అందించగలుగుతున్నాం. మిషనరీ వాడకుండా చేనేతకారులతో వీటిని తయారు చేస్తున్నాం. కుట్టడం, కలరింగ్, డిజైనింగ్ అన్నీ మనుషులతోనే చేయిస్తున్నాం. వస్త్రరంగ ఉత్పత్తులపై జైపూర్, అహ్మదాబాద్, కోయంబత్తూర్ వంటి విభిన్న ప్రదేశాల్లో పర్యటించి పలు అంశాలను సేకరించి నాణ్యతలో మెళకువలు పాటిస్తున్నాం. ఈ మధ్య నగరంలోని రాష్ట్రపతి నిలయంలో జరిగిన ఉద్యాన్ ఉత్సవ్‌లో ప్రశంసలు పొందాం.

- స్వాతి, వ్యవస్థాపకురాలు

హ్యాండ్‌బాల్.. డిఫెండర్స్..



- సనత్ నగర్ గ్రౌండ్ వేదికగా శిక్షణ
- అసోసియేషన్‌గా ఏర్పడి క్రీడాకారులకు తర్ఫీదు
- ఇక్కడి నుంచే జిల్లా స్థాయి క్రీడాకారుల ఎంపిక

క్రికెట్.. ఫుట్‌బాల్.. బ్యాడ్మింటన్.. ఈ సరసన హ్యాండ్‌బాల్‌కూ ఎనలేని ప్రాచుర్యం తీసుకొచ్చేందుకు ఇక్కడి కోచ్‌లు నిర్విరామంగా కృషి చేస్తున్నారు. క్రీడలపై ఉన్న ప్రీతితో నేటి తరం వారిని జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయి క్రీడాకారులుగా తీర్చిదిద్దేందుకు చిన్ననాటి నుంచే బీజాలు వేస్తున్నారు. ఇందు కోసం స్కూల్ స్థాయి నుంచే విద్యార్థులను ప్రోత్సహిస్తూ హ్యాండ్‌బాల్ క్రీడలో శిక్షణ ఇస్తున్నారు. వారే సనత్‌నగర్ కార్మిక సంక్షేమ మైదానం కేంద్రంగా దశాబ్దాల కాలంగా హ్యాండ్‌బాల్ శిక్షణ ఇస్తున్న అసోసియేషన్ సభ్యులు.

- సనత్‌నగర్



వారే కోచ్‌లుగా..

ఇక్కడి గ్రౌండ్‌లోనే శిక్షణ పొందిన వారే కోచ్‌లుగా వ్యవహరిస్తూ ఉచిత శిక్షణ అందిస్తుండడం గమనార్హం.

స్పోర్ట్స్ కోటాలో సీట్లు సాధించిన వారు ఎందరో..

జనరల్ కోటాలో సీటు రానివారికి హ్యాండ్‌బాల్ క్రీడే ఆపన్నహస్తంగా మారుతోంది. ఈ క్రీడలో గతంలో జిల్లా, రాష్ట్ర స్థాయిలో ఆడినవారు పదుల సంఖ్యలో స్పోర్ట్స్ కోటాలో సులభంగా సీట్లు సాధించడం గమనార్హం.

సనత్‌నగర్ లేబర్ వెల్ఫేర్ గ్రౌండ్ హ్యాండ్‌బాల్ క్రీడలో ఎందరో ఆణిముత్యాలను అందించింది. పారిశ్రామికవాడగా కార్మికుల ఆవాసంగా ఉన్న సనత్‌నగర్‌లో పలువురు హ్యాండ్‌బాల్ ఆటలో ఆసక్తి చూపిస్తున్న క్రమంలో 1975లో స్థానిక ఎస్ఆర్‌టీ కాలనీలోని కార్మిక సంక్షేమ సంఘం భవనం ఆవరణలో ప్రత్యేక క్రీడా శిబిరం నిర్వహించారు. అలా మొదలైన శిబిరం క్రీడాకారుల్లో మరింత ఆసక్తిని రేకెత్తించింది. ఇక్కడ శిక్షణ పొందిన ఎంతోమంది జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొని క్రీడాస్ఫూర్తిని రగిలించారు. వారిలో సనత్‌నగర్ మాజీ కార్పొరేటర్ అయూబ్‌ఖాన్, మక్సూద్, జగన్నాథం, సుభోద్ విల్సన్, ప్రబోద్ విల్సన్, డాక్టర్ నగేశ్, విద్య, ఏఎస్ మునవర్, పీవీ నాగార్జున, ధన్‌రాజ్ తదితరులు హ్యాండ్‌బాల్ క్రీడాకారులుగా వెలుగులోకి వచ్చినవారే. అలాగే సనత్‌నగర్‌కు చెందిన ఎంఏ అజీజ్ ఏకంగా అంతర్జాతీయ స్థాయిలో పాల్గొన్న ఘనతను దక్కించుకున్నారు. మరో క్రీడాకారుడు బాసిత్ ఆసియా క్రీడల ప్రాబబుల్స్‌లో స్థానం కైవసం చేసుకున్నాడు. వీరంతా వృత్తిపరంగా వేర్వేరు రంగాల్లో ఉన్నప్పటికీ హ్యాండ్‌బాల్ క్రీడపై అభిమానాన్ని విడవలేదు. ఇక్కడే శిక్షణ తీసుకుని కోచ్‌లుగా ఎదిగిన వారు ఎందరో ఉన్నారు.

నిరంతర శిక్షణనిస్తూ..

జాతీయ స్థాయిలో రాణించిన ఆనాటి మేటి క్రీడాకారులంతా సంఘటితమై 1980లో అప్పటి రంగారెడ్డి జిల్లా (ప్రస్తుత మేడ్చల్ జిల్లా) హ్యాండ్‌బాల్ అసోసియేషన్ (రిజిస్టర్డ్ నెంబర్: 1859)ను ఏర్పాటు చేశారు. అప్పటి నుంచి ఇప్పటి వరకూ కొన్ని వేల మంది హ్యాండ్‌బాల్ క్రీడాకారులను తీర్చిదిద్దారు. ఎక్కడ ఏ పోటీ జరిగినా జిల్లా నుంచి పాల్గొనే టీమ్‌ను సన్నద్ధం చేసేది ఈ అసోసియేషనే సభ్యులే. ఇక్కడ శిక్షణ పొందేవారు జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయికి ఎంపిక అవుతున్నారు. అండర్-12, అండర్-16, అండర్-19, సీనియర్స్ విభాగాల్లో ఇక్కడ శిక్షణ అందిస్తున్నారు. మొదట స్కూల్ లెవల్ క్యాంపులు నిర్వహించి హ్యాండ్‌బాల్ క్రీడలో ఉచిత శిక్షణ ఇస్తారు. ఆ తరువాత వారిలో నుంచి జిల్లా స్థాయి పోటీలకు ఎంపిక చేసి క్రీడలో మెళకువలు నేర్పిస్తారు. ఆ తరువాత వారి ప్రతిభ ఆధారంగా రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాణించేలా తగిన ప్రోత్సాహాన్ని కల్పిస్తున్నారు.

డిజైనర్.. డిజైర్..

ఆర్ట్, క్రాఫ్ట్, ప్రొడక్ట్ డిజైనింగ్, ఫ్యాషన్ డిజైనింగ్, ఆర్కిటెక్చర్‌గా గుర్తింపు

పేటెంట్ల సాధనలో తనకంటూ ప్రత్యేకత సాధించిన ఎఫ్‌డీడీఐ ఫ్యాకల్టీ డాక్టర్ రాంబాబు

కష్టేఫలి.. కృషి ఉంటే ఏదైనా సాధ్యమే అని నిరూపితమైన సత్యం. చిన్న తనం నుంచే అదే సూత్రాన్ని తూచ తప్పకుండా పాటిస్తూ.. కష్టపడి పనిచేయడానికి అలవాటుపడి యువడిజైనర్‌గా డాక్టర్ ముప్పిడి రాంబాబు గుర్తింపు సాధించాడు. బొమ్మల తయారీలో కళాకారుడు తన కళకు నైపుణ్యాన్ని జతచేసి అద్భుతాలు సృష్టిస్తున్నాడు. అంతే కాకుండా శిల్పకారుడు, రచయిత, అధ్యాపకుడుగానూ పనిచేస్తున్నాడు. శిల్పకారుల కుటుంబానికి చెందిన ముప్పిడి చెక్క, తాటి ఆకు, జనపనార, రాతి ఉత్పత్తులపై ఆధారపడి జీవనం సాగిస్తున్నారు. అనేక కళాకృతులను రూపొందించడంలో దిట్టగా పేరొందారు. ప్రస్తుతం రాయదుర్గంలోని ఎఫ్‌డీడీఐ హైదరాబాద్‌లో ఫ్యాకల్టీగా పనిచేస్తూ ఆర్ట్, క్రాఫ్ట్, డిజైన్ ప్రొడక్ట్ డిజైనింగ్, ఫ్యాషన్ డిజైనింగ్, ఆర్కిటెక్చర్‌గా గుర్తింపు సాధించారు.

- రాయదుర్గం









పేద కళాకారుల ఆర్థికాభివృద్ధికి..

పేటెంట్ పొందిన డిజైన్లను పేద కళాకారుల ఆర్థికాభివృద్ధికి చేయూతను అందించాలనేదే నా తపన. మాది కళాకారుల కుటుంబం. కళాకారుల పరిస్థితులు నాకు బాగా తెలుసు. పేటెంట్ పొందిన డిజైన్లు ఉచితంగానే అందిస్తా. వాటి తయారీ గురించి వివరిస్తాను. నిర్మల్, కొండపల్లి బొమ్మల తయారీ దారులు కూడా నూతన డిజైన్లలో బొమ్మలు తయారు చేసేలా తగిన సూచనలు అందించాలన్న లక్ష్యంతో కృషి చేస్తున్నా..

- డాక్టర్ ముప్పిడి రాంబాబు, డిజైనర్, ఎఫ్‌డీడీఐ ఫ్యాకల్టీ రాయదుర్గం

ఓ వైపు కళాత్మక వృత్తి అయిన డిజైనింగ్‌లో కొనసాగుతూనే.. మరో వైపు ఆయా రంగాల్లో విద్యార్థులను తీర్చిదిద్దడం అతనికి వెన్నతో పెట్టిన విద్యగా మారింది. దీంతో పాటు పలు రకాల పేటెంట్ల సాధనలోనూ విశేష ప్రతిభను కనబరుస్తున్నారు డాక్టర్ రాంబాబు. ఇప్పటి వరకూ 18 రకాల పేటెంట్ల కోసం దరఖాస్తు చేసుకోగా వాటిలో తొమ్మిది మంజూరయ్యాయి. మరో తొమ్మిది పరిశీలనలో ఉన్నాయి. భారత ప్రభుత్వంలోని మేధో సంపత్తి కార్యాలయం ద్వారా 2024 సంవత్సరంలోనే ఏడు పేటెంట్లు మంజూరు కాగా, 2025లో ఇప్పటి వరకూ రెండు పేటెంట్లు మంజూరయ్యాయి.

మంజూరైన పేటెంట్స్..

- 2025లో టేబుల్‌టాప్ ఆర్టిక్రాఫ్ట్స్, ఫిల్లింగ్
- 2024లో లెదర్, వుడ్‌బర్డ్ టాయ్, ఫిల్లింగ్, వుడ్ పెన్‌స్టాండ్, ఫిల్లింగ్, డాల్, లెదర్ వాల్ హ్యాంగింగ్, న్యూస్‌పేపర్ బాస్కెట్, డెకరేటివ్ యాక్సెసరీస్ ఫర్ టేబుల్ టాప్ టాయ్స్, ట్రెక్కింగ్ బ్యాక్‌ప్యాక్, జ్యువెలరీ బాక్స్‌కేస్.

పీహెచ్‌డీ పూర్తి చేసి..

ఆంధ్రప్రదేశ్‌లోని జంగారెడ్డిగూడెంలో నిరుపేద కళాకారుల కుటుంబంలో పుట్టి ఉన్నత విద్యను అభ్యసించారు. మొదటి, రెండో తరాలకు చదువులేదు. కానీ మూడో తరం వారు జీవనోపాధి కోసం చేతి వృత్తులు చేస్తున్నా, తండ్రి సూచన మేరకు పీహెచ్‌డీ పూర్తి చేశారు. రచయిత, కళాకారుడు, అసిస్టెంట్ ప్రొఫెసర్, హెచ్‌ఓడీ, అకడమిక్ కన్సల్టెంట్, జూట్‌బోర్డు ప్యానెల్ డిజైనర్, ఆర్ట్ అండ్ క్రాఫ్ట్ టీచర్, తెలుగు ఫిల్మ్ డైరెక్టర్, ప్రొడక్షన్ డిజైనర్ వంటి ఉద్యోగాలు చేశారు. కేంద్ర జూట్ బోర్డులో జైనర్‌గా పనిచేశాడు. ప్రస్తుతం ఎఫ్‌డీడీఐలో ఫ్యాకల్టీగా చేస్తున్నాడు.

అవార్డులు, పురస్కారాలు..

- 2024లో పీహెచ్‌డీలో గోల్డ్‌మెడల్ (పొట్టి శ్రీరాములు తెలుగు వర్సిటీ)
- 2023లో పికాక్ అవార్డు (తిరుపతి ఆర్ట్ సొసైటీ, ఎక్సలెన్స్ ఇన్ రివ్యూ అవార్డు)
- 2018 జాతీయ సంజీవ్‌దేవ్ అవార్డు, 2017లో ప్రమోద్ కుమార్ చటర్జీ జాతీయ అవార్డు
- 2016లో విశిష్ట కళా సేవారత్న, రోటరీ యువజన అవార్డు, గురు బ్రహ్మ అవార్డు. వీటితో పాటు మరి కొన్ని అవార్డులు..

క్లుప్తంగా...

సీఎం నిర్ణయాలతో రాష్ట్రానికి నష్టం

రేవంత్‌రెడ్డిపై కేసు నమోదు చేయాలని నార్సింగి పీఎస్‌లో ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్ ఫిర్యాదు



మణికొండ: సీఎం రేవంత్‌రెడ్డి అనాలోచిత నిర్ణయాలతో రాష్ట్రానికి వచ్చే పెట్టుబడులు, ఉద్యోగాలు పక్క రాష్ట్రాలకు తరలిపోతున్నాయని, ఆయన అధికార దుర్వినియోగానికి పాల్పడుతున్నందున కేసు నమోదు చేయాలని బీఆర్‌ఎస్ నేత ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్ డిమాండ్ చేశారు. మంగళవారం ఆయన నార్సింగి పోలీసులకు సీఎం రేవంత్‌రెడ్డిపై ఫిర్యాదు చేశారు. రాష్ట్రానికి రావాల్సిన పెట్టుబడులు ముఖ్యమంత్రి వ్యవహారంతో పక్క రాష్ట్రాలకు పోతున్నాయనే ఆవేదనతోనే రాష్ట్రానికి పన్ను చెల్లిస్తున్న పౌరునిగా అతనిపై కేసు నమోదు చేయాలని పోలీసులకు ఫిర్యాదు చేశానన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇటీవల సంక్రాంతి పండుగను పురస్కరించుకొని నిర్వహించిన కైట్ ఫెస్టివల్, ప్రజాపాలన విజయోత్సవాల సందర్భంగా ఎయిర్ షో, ఏఐ సమ్మిట్ వంటి కార్యక్రమాలకు కోట్లు ఖర్చు పెట్టడం వృథా కాదా అని ప్రశ్నించారు. కేటీఆర్ రాష్ట్రానికి పెట్టుబడులను ఆకర్షించేందుకు తీసుకొచ్చిన ఫార్ములా ఈ-రేస్ తప్పు అయినప్పుడు ఇవీ తప్పే అన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి అని చూడకుండా, రాజ్యాంగంలోని ఆర్టికల్ 14 ప్రకారం అందరూ సమానులేనని భావించి పోలీసులు అతనిపై బీఎన్‌ఎస్ 316 ప్రకారం కేసు నమోదు చేసి విచారణ చేయాలన్నారు. ఆర్‌ఎస్ వెంట ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్, ఎమ్మెల్సీ నవీన్‌రెడ్డి ఉన్నారు.

రాబందుల సమితిని వెనకేసుకొస్తున్నాడు

ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్‌పై ప్రభుత్వ విప్ రామచంద్ర నాయక్ ధ్వజం

సాక్షి, హైదరాబాద్: ఫామ్‌హౌస్ గోడలను బద్ధలు కొడతానని చెప్పిన ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్... ఇప్పుడు రాబందుల సమితిని వెనకేసుకొస్తున్నాడని ప్రభుత్వ విప్ రామచంద్ర నాయక్ ధ్వజమెత్తారు. మంగళవారం ఆయన సీఎల్పీ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. ఫార్ములా–ఈ రేసులో తెలంగాణ ఆదాయానికి సీఎం రేవంత్‌రెడ్డి గండికొట్టారని పిచ్చిపిచ్చిగా మాట్లాడుతున్న ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్‌ను ఎర్రగడ్డ పిచ్చాసుపత్రిలో చూపించాలన్నారు. ఈ కేసులో ఏసీబీ, ఈడీ వద్ద అవినీతిపై ప్రాథమిక ఆధారాలున్నాయని చెప్పారు. కేసీఆర్, కేటీఆర్ దగ్గర మార్కులు కొట్టేయడానికి మతి తప్పి మాట్లాడుతున్నారని, బీఆర్‌ఎస్ పార్టీకి ప్రవీణ్‌కుమార్ తాబేదారుగా తయారయ్యాడని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. కేసీఆర్ ఇచ్చే నాలుగు పైసలకు కక్కుర్తిపడి మాట్లాడుతున్న ప్రవీణ్ కుమార్ పైన ఇప్పటివరకు ఉన్న గౌరవం పోయిందన్నారు.

మహారాష్ట్రతో పోటీ పడు

సీఎంకు పొన్నాల సూచన

సాక్షి, హైదరాబాద్: పెట్టుబడుల విషయంలో దేశాలతో కాదని, మహారాష్ట్రతో సీఎం రేవంత్ రెడ్డి పోటీ పడాలని మాజీ మంత్రి పొన్నాల లక్ష్మయ్య వ్యాఖ్యానించారు. ఆయన మంగళవారం తెలంగాణ భవన్‌లో విలేకరులతో మాట్లాడారు. మహారాష్ట్రకు రూ.18 లక్షల కోట్ల పెట్టుబడులు వచ్చాయంటే.. అది సీఎం ఫడ్నవీస్ గొప్పతనమన్నారు. దావోస్ పెట్టుబడులపై సీఎం రేవంత్, మంత్రి శ్రీధర్ బాబు పరస్పర విరుద్ధంగా మాట్లాడుతున్నారని విమర్శించారు.



వారధి.. సంధ్యాహారతి

సస్పెన్షన్ వారధి.. సుందర సంధ్యాహారతి.. ఎరుపెక్కిన గగనంతో పులకించింది ప్రకృతి. ఈ అందమైన దృశ్యానికి వేదికైంది.. సిద్దిపేట కోమటిచెరువులోని సస్పెన్షన్ బ్రిడ్జి. కనువిందు చేసే ఈ ప్రాంతంలో సెల్ఫీలు దిగేందుకు పర్యాటకులు ఆసక్తి కనబరుస్తున్నారు.

– సాక్షి స్టాఫ్ ఫొటోగ్రాఫర్, సిద్దిపేట.

దళిత నేతకు సీపీఎం పగ్గాలు

ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శిగా జాన్‌వెస్లీ నియామకం

- కార్యదర్శివర్గ సభ్యులుగా జూలకంటి, వీరయ్య సహా 14 మందికి అవకాశం
- ముగిసిన సీపీఎం రాష్ట్ర మహాసభలు



సమావేశంలో జాన్‌వెస్లీతో రాఘవులు, తమ్మినేని

సాక్షి, హైదరాబాద్/సాక్షి ప్రతినిధి, సంగారెడ్డి: సీపీఎం రాష్ట్ర కార్యదర్శిగా దళిత సామాజిక వర్గానికి చెందిన జాన్‌వెస్లీ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. సంగారెడ్డి వేదికగా జరిగిన సీపీఎం నాలుగో రాష్ట్ర మహాసభల్లో ఆయన పేరును అధికారికంగా ప్రకటించారు. రాష్ట్రం ఏర్పాటైన నాటి నుంచి ఆ పార్టీకి కార్యదర్శిగా వ్యవహరించిన మాజీ ఎంపీ తమ్మినేని వీరభద్రంకు ఈసారి విరామం ఇచ్చారు. బడుగు, బలహీనవర్గాలకు అవకాశం ఇవ్వాలనే ఉద్దేశంతో తొలిసారి దళిత కుటుంబానికి చెందిన జాన్‌వెస్లీకి అవకాశం కల్పించారు. సీపీఎం రాష్ట్ర కార్యదర్శిగా మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి, పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఎస్.వీరయ్య పేర్లు ప్రముఖంగా వినిపించాయి. కానీ అనూహ్యంగా వెస్లీకి పదవి దక్కడంతో అంచనాలన్నీ తారుమారు అయ్యాయి. వనపర్తి జిల్లా అమరచింతకు చెందిన జాన్‌వెస్లీ డీవైఎఫ్ఐ, కులవివక్ష వ్యతిరేక పోరాట సమితి (కేవీపీఎస్) రాష్ట్ర అధ్యక్షుడిగా పనిచేశారు. విద్యార్థి దశ నుంచే వామపక్ష భావజాలంతో ఉన్న ఆయన పలు హోదాల్లో పనిచేశారు. కాగా, సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులుగా జూలకంటి రంగారెడ్డి, ఎస్.వీరయ్య, జి.నాగయ్య, పోతినేని సుదర్శన్, టి.జ్యోతి, మల్లు లక్ష్మి, ఎండీ అబ్బాస్, చుక్క రాములు, పాలడుగు భాస్కర్, టి.సాగర్, పి.ప్రభాకర్, బి.రవికుమార్, నున్నా నాగేశ్వరరావు, ఎండీ జహంగీర్‌లను ఎన్నుకొన్నారు. అలాగే, మహాసభ 60 మందితో రాష్ట్ర కమిటీని ఎన్నుకొంది.

ఐదుగురు సభ్యులతో కంట్రోల్ కమిషన్
– వివరాలు సాక్షి ప్లస్‌లో

ముగిసిన సీపీఎం రాష్ట్ర మహాసభలు

సంగారెడ్డిలో నాలుగు రోజుల పాటు జరిగిన సీపీఎం నాలుగో రాష్ట్ర మహాసభలు మంగళవారంతో ముగిశాయి. ఈనెల 25న ప్రారంభమైన ఈ మహాసభల్లో ప్రజా సమస్యలపై నాయకులు విస్తృతంగా చర్చించి, భవిష్యత్‌లో అనుసరించబోయే పోరాట పంథాపై కార్యాచరణ రూపొందించారు. రాష్ట్ర, జాతీయ స్థాయి నాయకులు మహాసభలకు హాజరై పార్టీ దిశానిర్దేశం చేశారు. రాష్ట్రంలో మూడు పర్యాయాలు రాష్ట్ర కార్యదర్శిగా పనిచేసిన తమ్మినేని, కేంద్ర కమిటీ సభ్యులుగా పనిచేసిన చెరుపల్లి సీతారాములు, సుదీర్ఘకాలం రాష్ట్ర కార్యదర్శివర్గంలో పనిచేసిన డీజీ నర్సింగరావులు వయసురీత్యా మహాసభల్లో రిలీవ్ అయినట్లు పార్టీ పేర్కొంది.

పార్టీని బలోపేతం చేస్తాం: జాన్ వెస్లీ

రాష్ట్రంలో సీపీఎం పార్టీని బలోపేతం చేస్తామని జాన్ వెస్లీ పేర్కొన్నారు. కార్యదర్శిగా ఎన్నికైన తర్వాత ఆయన మీడియాతో మాట్లాడుతూ.. 'వామపక్ష పార్టీల బలాన్ని ఓట్లు, సీట్లతో కొలవడం సరైంది కాదు. ప్రజా సమస్యలు రైతులు, కార్మికులు, మైనార్టీలు, దళితులు, గిరిజనుల హక్కుల కోసం పార్టీ పోరాటం చేస్తుంది. ఈ వర్గాలను సంఘటితం చేయడం ద్వారా పార్టీని మరింత బలంగా చేస్తాం'అని పేర్కొన్నారు.

హైదరాబాద్ శివార్లలో రెండు కొత్త ఐటీ పార్కులు

- పరిశ్రమలకు భూకేటాయింపులపై ప్రత్యేక పాలసీ
- రూ.100 కోట్ల పెట్టుబడిపై 'డ్యూ' సాఫ్ట్‌వేర్ ఆసక్తి
- మంత్రి శ్రీధర్‌బాబును కలిసిన డ్యూసాఫ్ట్ ప్రతినిధులు



సాక్షి, హైదరాబాద్: హైదరాబాద్ శివార్లలో కొత్తగా రెండు ఐటీ పార్కులను ఏర్పాటు చేసేందుకు ప్రణాళికలు రూపొందిస్తున్నట్లు రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు తెలిపారు. హైదరాబాద్‌లో రూ.100 కోట్ల పెట్టుబడి పెట్టేందుకు ముందుకొచ్చిన 'డ్యూ'సాఫ్ట్ వేర్ కంపెనీ ప్రతినిధులతో మంగళవారం సచివాలయంలో మంత్రి ప్రత్యేకంగా సమావేశమయ్యారు. 'ఐటీ రంగంలో వేగంగా అభివృద్ధి చెందుతున్న హైదరాబాద్‌లో పెట్టుబడుల కోసం ప్రముఖ కంపెనీలు ముందుకు వస్తున్నాయి. ఈ నేపథ్యంలో హైటెక్ సిటీ తరహాలో నగర శివార్లలో కొత్తగా మరో రెండు ఐటీ పార్కులను ఏర్పాటు చేస్తాం. వీటి ఏర్పాటుకు అనుకూలంగా ఉన్న ప్రాంతాలపై అధికారులు అధ్యయనం చేస్తారు. ఐటీ పార్కుల్లో పనిచేసే ఉద్యోగులకు అవసరమైన మౌలిక సదుపాయాల అభివృద్ధితో పాటు రవాణా సౌకర్యాలు కల్పిస్తాం. నగరంలోని నలుమూలల నుంచి ఈ పార్కులకు చేరుకునేలా ఏర్పాట్లు చేస్తాం. ఈ పార్కుల్లో కొత్తగా పెట్టుబడులు పెట్టేందుకు ముందుకొచ్చే సాఫ్ట్‌వేర్ కంపెనీలకు అవకాశం కల్పిస్తాం'అని మంత్రి శ్రీధర్ బాబు ప్రకటించారు. 'పెట్టుబడులతో ముందుకొచ్చే పరిశ్రమలకు భూకేటాయింపులపై ఇప్పటివరకు ప్రత్యేక పాలసీ లేకపోవడంతో పారిశ్రామికవేత్తలు ఇబ్బంది పడుతున్నారు. అందుకే ప్రత్యేక పాలసీని రూపొందించి పెట్టుబడి, కల్పించే ఉద్యోగాల సంఖ్య ఆధారంగా భూమిని కేటాయిస్తాం. హైదరాబాద్‌లో రూ.100 కోట్లు పెట్టుబడి పెట్టేందుకు ముందుకొచ్చిన డ్యూ సాఫ్ట్ వేర్ కంపెనీకి ప్రభుత్వం తరఫున అన్ని రకాలుగా సహకరిస్తాం'అని శ్రీధర్‌బాబు వివరించారు. కార్యక్రమంలో సీఎం ప్రత్యేక కార్యదర్శి అజిత్‌రెడ్డి, టీజీఐఐసీ ఎండీ డా.విష్ణువర్ధన్‌రెడ్డి, టీజీఐఐసీ సీఈవో మధుసూదన్, 'డ్యూ'వెంచర్స్ ప్రెసిడెంట్ సురేశ్, పాలకుర్తి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి ఝాన్సీరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

'అలెరియా ఏఐ'తో పన్నుల రాబడిలో పెరుగుదల

రాష్ట్ర ప్రభుత్వ పన్నుల వసూలు, ఇతర రాబడి మార్గాల్లో ఆదాయం నష్టపోకుండా 'అలెరియా ఏఐ'టెక్నాలజీ దోహదపడుతుందని శ్రీధర్‌బాబు పేర్కొన్నారు. అలెరియా ఏఐ సంస్థ ప్రతినిధులు మంగళవారం సచివాలయంలో మంత్రి ఎదుట 'అలెరియా ఏఐ' సాంకేతికతపై ప్రజెంటేషన్ ఇచ్చారు. ఆఫ్‌లైన్‌లో పనిచేసే ఈ టూల్‌ను ప్రభుత్వ విభాగాలతో అనుసంధానం చేస్తే పన్ను, ఆదాయ రాబడిలో నష్టపోతున్న 30 శాతాన్ని తిరిగి పొందవచ్చని సంస్థ ప్రతినిధులు ఆయనకు వివరించారు.

5 అంశాల్లో మార్పుతోనే పురోగతి

'భారత ఆర్థికవ్యవస్థకు మరమ్మతులు' అంశంపై ఆర్థికవేత్త ప్రొఫెసర్ రతిన్‌రాయ్ ప్రధానోపన్యాసం



సాక్షి,హైదరాబాద్: రైతులకు తగిన ప్రతిఫలంతో వ్యవసాయాన్ని లాభసాటి చేయడం, చౌక ధరలకే దుస్తులు, అందరికీ గృహవసతి కల్పన, విద్య, వైద్యం అందుబాటులోకి తీసుకురావడం ద్వారా భారత ఆర్థికవ్యవస్థకు మరమ్మతులు చేసి మళ్లీ పట్టాలపైకి ఎక్కించవచ్చునని ప్రధానమంత్రి ఆర్థిక సలహామండలి మాజీ సభ్యుడు, ఆర్థికవేత్త ప్రొఫెసర్ రతిన్‌రాయ్ చెప్పారు. ప్రాధాన్యతరంగాల్లో ఫలితాలనిచ్చే కార్యకలాపాలు చేపడితే.. అదే ఉద్యోగాలు, ఉపాధి కల్పనకు దారిచూపుతుందన్నారు. గత 20 ఏళ్లలో దేశంలో ఎక్కడైనా ఒక్కటంటే ఒక్కటైనా ఎస్ఈజెడ్ విజయవంతమైందా అని సవాల్ విసిరారు. మంగళవారం గురుస్వామిసెంటర్ ఆధ్వర్యంలో 'భారత ఆర్థికవ్యవస్థకు మరమ్మతులు' అనే అంశంపై ప్రధానవక్తగా రతిన్‌రాయ్ మాట్లాడారు. రాంగ్‌రూట్‌లో ద్విచక్ర వాహనాలపై వెళ్లేవారిని, హెల్మెట్లు పెట్టుకోకుండా వెహికిల్స్ నడిపే వారిని నియంత్రించలేని రాష్ట్రాలు దేశం ఆర్థికంగా బలోపేతం అయ్యేందుకు పెద్దపెద్ద పనులెలా చేయగలవని ప్రశ్నించారు. ఉత్తరాది రాష్ట్రాలను పక్కన పెడితే కేరళ, తమిళనాడు, ఏపీ, తెలంగాణ వంటి అధికాదాయ రాష్ట్రాలూ ఇదే కోవలోకి రావడం శోచనీయమన్నారు.

అద్దంలా అంకెలు.. అబద్ధాల రంకెలు!

ఏపీ అప్పులు తీర్చే స్థోమత సున్నా స్థాయికి చేరింది బాబు పాలనలోనే

నీతి అయోగ్ నివేదికలపై తనదైన రీతిలో వక్రభాష్యాలు

- ఈ ఆర్థిక ఏడాది ఇప్పటికే రూ.73 వేల కోట్లకుపైగా అప్పులు
- రాజధాని అమరావతి అప్పులు దీనికి అదనం..
- మూలధన వ్యయం మాత్రం కేవలం రూ.8,894.98 కోట్లే
- హామీలను ఎగ్గొడుతూ నిస్సిగ్గుగా గత ప్రభుత్వంపై నిందలు
- మూలధన వ్యయం, సామాజిక రంగాలపై వ్యయం, సొంత పన్నుల రాబడి వైఎస్సార్ సీపీ హయాంలోనే అధికం



- ఈదఫా చంద్రబాబు సర్కారు ఏడు నెలల్లో చేసిన అప్పులు రూ.73,635.92 కోట్లు (అమరావతి పేరుతో చేసిన అప్పులు దీనికి అదనం..)

మరి.. అప్పుల మోత మోగిస్తున్నదెవరు?.. ఆర్థిక విధ్వంసకారుడెవరు?

- జగన్ హయాంలో వార్షిక సగటు మూలధన వ్యయం రూ.15,632.86 కోట్లు..!
- టీడీపీ పాలనలో దీనికి వెచ్చించింది రూ.13,860.60 కోట్లు మాత్రమే!

మరి.. సంపద సమకూర్చిందెవరు?.. ఆస్తుల కల్పన, పునర్నిర్మాణం చేసిందెవరు?

టీడీపీ హయాంలో ప్రభుత్వ అప్పుల సగటు వార్షిక వృద్ధి రేటు (సీఏజీఆర్) **19.54%**

వైఎస్సార్ సీపీ పాలనలో సీఏజీఆర్ **15.61%**

అప్పుల వృద్ధి రేటు ఎవరి హయాంలో ఎక్కువగా ఉంది?

వైఎస్సార్ సీపీ పాలనలో సామాజిక రంగంపై సగటు వార్షిక వ్యయం **₹5,224.83 కోట్లు**

టీడీపీ పాలనలో సామాజిక రంగంపై సగటు వార్షిక వ్యయం **₹2,437.43 కోట్లు**

కాగ్ లెక్కల ప్రకారమే.. మానవతా కోణంలో పాలన సాగించిందెవరు?

మరిన్ని వివరాలకు ఈ క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయండి

మురిపించేనా.. మొండిచెయ్యేనా..

▶ మొదటి పేజీ తరువాయి

అనే ఆశతో రాష్ట్ర ప్రభుత్వం ఉంది.

గ్రాంట్లు, పన్నుల్లో వాటా ఏం చేస్తారో?

రాష్ట్రాలకు కేంద్రం నేరుగా ఇచ్చే నిధుల్లో కూడా కొన్నేళ్లుగా కోతలు పడుతున్నాయి. జనాభా ప్రాతిపదికన ఇచ్చే పన్నుల్లో వాటాను 41 శాతంగా 15వ ఆర్థిక సంఘం ప్రతిపాదించినా బడ్జెట్‌లో కేవలం 32 శాతానికి కుదిస్తున్నారన్న ఆరోపణలున్నాయి. ప్రస్తుతం ఏడాదికి రూ.15 వేల కోట్లకు పైగా మాత్రమే పన్నుల్లో వాటా కింద తెలంగాణకు వస్తుండగా, పూర్తిస్థాయిలో ఇస్తే మరో రూ.5-8వేల కోట్లు అధికంగా వస్తాయని రాష్ట్రం ఆశిస్తోంది. ఇక గత మూడేళ్ల కాలంలో తెలంగాణకు కేంద్రం ఇచ్చిన గ్రాంట్ ఇన్ ఎయిడ్ వివరాలను పరిశీలిస్తే.. 2022-23లో రూ.41,001.73 కోట్లు ఇస్తారని ఆశిస్తే అందులో 32.14 శాతం అంటే కేవలం రూ.13,179.21 కోట్లు మాత్రమే వచ్చాయి. 2023-24లో రూ.41,259.17 కోట్లు అంచనా వేస్తే అందులో 23.58 శాతం అంటే రూ.9,729.91 కోట్లు మాత్రమే వచ్చాయి. కేంద్ర ప్రాయోజిత పథకాలైన ఉపాధి హామీ, ఇళ్లు, స్మార్ట్‌సిటీలు, రోడ్లు..తదితరాల కింద కూడా ఆశించిన మేర నిధులు రాకపోవడం గమనార్హం.

ప్రతిష్టాత్మక ప్రాజెక్టులపై ఇప్పటికే ప్రతిపాదనలు

రాష్ట్ర ప్రభుత్వం చేపట్టనున్న ప్రతిష్టాత్మక ప్రాజెక్టులకు కేంద్ర సహకారం కోరుతూ ఇప్పటికే ప్రతిపాదనలు వెళ్లాయి. 2025-26 బడ్జెట్‌లో నిధుల కేటాయింపు కోరుతూ ప్రాజెక్టుల వారీగా నివేదికను రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే పంపింది. రీజినల్ రింగు రోడ్డు, మూసీ పునరుజ్జీవ ప్రాజెక్టు, మెట్రో ప్రాజెక్టు విస్తరణ, హైదరాబాద్‌లో సీవరేజి మాస్టర్‌ప్లాన్, వరంగల్‌లో భూగర్భ డ్రైనేజీ, రేడియల్ రోడ్లు, గ్రీన్‌ఫీల్డ్ హైవే, ఇండస్ట్రియల్ హబ్‌లు, లాజిస్టిక్, రిక్రియేషన్ పార్కులు, ఫ్యూచర్ సిటీలో మౌలిక సదుపాయాల కల్పనకు నిధులు, పారిశ్రామిక కారిడార్ల ఏర్పాటు, కరీంనగర్, జనగామ జిల్లాల్లో లెదర్ పార్కులకు సంబంధించిన ప్రతిపాదనలు కేంద్రానికి వెళ్లాయి. అలాగే తెలంగాణలోని గోదావరి వ్యాలీ బొగ్గు బ్లాక్‌లను సింగరేణి కాలరీస్ కంపెనీ లిమిటెడ్‌కు కేటాయింపు, సెమీకండక్టర్ మిషన్ కేంద్రంగా హైదరాబాద్ అభివృద్ధి, కేంద్రీయ విద్యాలయాలు, జిల్లాకో నవోదయ పాఠశాల, పాలమూరు-రంగారెడ్డికి జాతీయ హోదా, రాష్ట్రంలో ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్ (ఐఐఎం) ఏర్పాటు తదితరాలు కూడా వాటిల్లో ఉన్నాయి. వీటితో పాటు గత ఆరేళ్లుగా రాని వెనుకబడిన జిల్లాల అభివృద్ధి నిధులు (బీఆర్‌జీఎఫ్) రూ.1,800 కోట్లు, 2014-15లో కేంద్ర ప్రాయోజిత పథకాల బకాయిలు రూ.495 కోట్లు, ఉమ్మడి సంస్థల నిర్వహణకైన ఖర్చులో ఏపీ వాటా కింద రూ.408.49 కోట్లు ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వం కోరింది. ఈ ప్రతిపాదనల్లో వేటికి ఎంత కేటాయింపులు జరుగుతాయో, అసలు జరుగుతాయో లేదో, ఆశించిన మేర ప్రయోజనం చేకూరుతుందో లేదో ఒకటవ తేదీన తేలనుంది.

ట్రిపుల్ ఆర్ చూపెట్టి తప్పించుకునే చాన్స్?

ఈసారి కేంద్ర బడ్జెట్ పరిమాణం 10 శాతం పెరిగి రూ.55 లక్షల కోట్లకు చేరుకుంటుందనే అంచనాలున్నాయి. ఆ మేరకు రాష్ట్రాలకు కేటాయింపులు పెరగాలి. డివిడెండ్ కింద ఆర్‌బీఐ ఈసారి కేంద్రానికి రూ.2 లక్షల కోట్లు ఇవ్వొచ్చు. ఆ డివిడెండ్, సెస్సులు, అదనపు ఆదాయాన్ని రాష్ట్రాలకు బదిలీ చేయాలి. తెలంగాణ రాష్ట్రం విషయానికి వస్తే ప్రాణహిత లేదంటే పాలమూరు ప్రాజెక్టులో ఒకదానికి ఖచ్చితంగా జాతీయ హోదా ఇవ్వాలి. కానీ కేంద్రం ఈసారి ట్రిపుల్ ఆర్‌కి అరకొర నిధులు చూపెట్టి చేతులు దులుపుకునే అవకాశముంది. ఈ ఏడాది జీడీపీ తగ్గినందున ఆదాయ పన్ను పరిమితి పెంచాలని అటు ప్రభుత్వం, ఇటు కార్పొరేట్ వర్గాల నుంచి వినిపిస్తోంది. ప్రజల్లో కొనుగోలు శక్తి తగ్గినందునే జీడీపీ తగ్గిపోతోందని ఆర్‌బీఐ కూడా ధ్రువీకరించింది. ఈ నేపథ్యంలో ప్రజల కొనుగోలు శక్తి పెరగాలంటే అసంఘటిత రంగంలోని కార్మికుల వేతనాలను నెలకు కనీసం రూ.28 వేలకు పెంచాలి. వేతన సవరణ కమిషన్‌ల సిఫారసులను త్వరితగతిన అమలు చేయడం వల్ల ఉద్యోగుల కొనుగోలు శక్తి కూడా పెరుగుతుంది. కేవలం రాయితీలకే పరిమితం కాకుండా ప్రజల నిజమైన ఆదాయం పెరిగే విధంగా కేంద్రం బడ్జెట్ ప్రతిపాదనలకు రూపకల్పన చేయాలి.

– డాక్టర్ అందె సత్యం, ప్రముఖ ఆర్థిక విశ్లేషకులు

కేంద్రం నుంచి రాష్ట్రం ఆశిస్తున్న నిధుల వివరాలు

కార్యక్రమం	ఆశిస్తున్న నిధులు (రూ. కోట్లలో)
రీజినల్ రింగ్ రోడ్డు	34,367
రేడియల్ రోడ్ల అభివృద్ధి	45,000
మెట్రో రైల్ ఫేజ్-2	24,269
మూసీ పునరుజ్జీవం	14,100
గోదావరి-మూసీ అనుసంధానం	7,440
హైదరాబాద్ సీవరేజ్ మాస్టర్ ప్లాన్	17,212
వరంగల్ భూగర్భ డ్రైనేజీ	4,170
బందర్-హైదరాబాద్ గ్రీన్‌ఫీల్డ్ హైవే	17,000
మొత్తం	1,63,558

ఎన్నికల ముందు పథకాల డ్రామా

- నల్లగొండ రైతు మహాధర్నాలో ప్రభుత్వంపై కేటీఆర్ ధ్వజం
- స్థానికసంస్థల ఎన్నికలు పూర్తయితే రైతు భరోసా బంద్ అవుతుందని వ్యాఖ్య
- ఆరు గ్యారంటీల అమల్లో సీఎం రేవంత్‌ది మోసమేనంటూ మండిపాటు



క్లాక్‌టవర్ సెంటర్‌లో నిర్వహించిన రైతు మహా ధర్నాలో మాట్లాడుతున్న కేటీఆర్



నల్లగొండలో నిర్వహించిన ర్యాలీ

సాక్షి ప్రతినిధి, నల్లగొండ: స్థానికసంస్థల ఎన్నికలు వస్తుండటంతో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పథకాల డ్రామా ఆడుతున్నారని బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కె. తారక రామారావు మండిపడ్డారు. ఆ ఎన్నికలు పూర్తయితే రైతుభరోసా బంద్ అవుతుందన్నారు. మంగళవారం నల్లగొండ గడియారం సెంటర్‌లో బీఆర్‌ఎస్ ఆధ్వర్యంలో నిర్వహించిన రైతు మహాధర్నాలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయనకు పార్టీ నాయకులు, కార్యకర్తలు ఘన స్వాగతం పలికారు. ఎన్జీ కాలేజీ నుంచి గడియారం సెంటర్ వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. అక్కడే నిర్వహించిన మహాధర్నాలో కేటీఆర్ ప్రసంగించారు.

మేం నాట్లకు ముందు.. కాంగ్రెస్ ఓట్లకు ముందు

'రేవంత్‌కు.. ఎన్నికలప్పుడే పథకాలు గుర్తుకొస్తాయి. అవి పూర్తయితే పట్టించుకోరు. సర్పంచ్, ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికలు వస్తుండటంతో ఓట్ల కోసం కొత్త డ్రామా ఆడుతున్నారు. బీఆర్‌ఎస్ హయాంలో నాట్లకు ముందు రైతుబంధు ఇచ్చాం. కానీ రేవంత్ ప్రభుత్వం రైతుభరోసా డ్రామా ఆడుతోంది'అని కేటీఆర్ దుయ్యబట్టారు.

ఒక్క హామీనీ పూర్తిగా అమలు చేయలేదు

ఆరు గ్యారంటీల పేరుతో మోసపూరిత వాగ్దానాలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ ఏ ఒక్క హామీని కూడా పూర్తిగా అమలు చేయలేదని కేటీఆర్ విమర్శించారు. రూ. 2 లక్షల మేర రైతు రుణాలను డిసెంబర్ 9న మాఫీ చేస్తానని ప్రకటించి మోసం చేశారని ఆరోపించారు. ఏ ఊళ్లోనూ 100 శాతం రుణమాఫీ చేయలేదని.. యాసంగి రైతు భరోసా సైతం ఇవ్వలేదన్నారు. ఎన్నికల ముందు కేసీఆర్ రైతుబంధు ఇస్తానంటే రేవంత్‌రెడ్డి ఎన్నికల సంఘానికి లేఖ రాసి ఆపించారని కేటీఆర్ విమర్శించారు. వానాకాలం రైతు భరోసాను ఎగ్గొట్టారని, ఇప్పటివరకు ఒక్కో ఎకరానికి రూ.17,500 రేవంత్ రెడ్డి బాకీ పడ్డారన్నారు.

మోసం చేయడంలోనూ చరిత్రాత్మకమే

బీఆర్‌ఎస్ రూ.12 వేలు రైతుబంధు ఇస్తానంటే, తాను రూ.15 వేలు ఇస్తానని చెప్పి రేవంత్‌రెడ్డి ప్రజలను మభ్య పెట్టారని కేటీఆర్ విమర్శించారు. ఓట్లు వేయించుకొని గెలిచాక సిగ్గులేకుండా రూ.12 వేలకు కుదించారన్నారు. ప్రజలను మోసం చేయడంలోనూ కాంగ్రెస్‌ది చరిత్రాత్మకమేనని ఎద్దేవా చేశారు. ధాన్యానికి రూ.500 బోనస్ ఇస్తానని చెప్పి, చివరకు సన్నాలకే ఇస్తానని మెలిక పెట్టి మోసం చేశారన్నారు. . కేసీఆర్ హయాంలో 11 విడతలుగా రైతుబంధు కింద రూ.73 వేల కోట్లు రైతుల అకౌంట్లలో వేశారని గుర్తు చేశారు.

రైతులు తిరగబడాలి: తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట స్ఫూర్తితో రైతులు కాంగ్రెస్ ప్రభుత్వ మోసాలపై తిరగబడాలని కేటీఆర్ పిలుపునిచ్చారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక విద్యార్థులు, రైతులు, చేనేత కార్మికులు చనిపోయే పరిస్థితి ఏర్పడిందన్నారు. రైతుబంధు, రైతుభరోసా, రుణమాఫీ విషయంలో ప్రజలు తిరుగబడాలని, నల్లగొండ నుంచే పోరుబాట పట్టాల్సిన అవసరం ఉందన్నారు.

రైతులకు అండగా ఉండేందుకే..: జగదీశ్‌రెడ్డి

రైతులను మోసం చేస్తున్న రేవంత్‌రెడ్డి ప్రభుత్వంలో రైతులకు అన్యాయం జరుగుతోందని మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి పేర్కొన్నారు. ఆ అన్యాయంపై పోరాడేందుకు బీఆర్‌ఎస్ ముందుంటుందన్నారు. రాహుల్ గాంధీ, రేవంత్‌రెడ్డి చేస్తున్న మోసాన్ని ప్రజలకు చెప్పేందుకే కేటీఆర్ నల్లగొండ వచ్చారన్నారు. ప్రశ్నిస్తున్న రైతులకు బీఆర్‌ఎస్ అండగా నిలుస్తుందన్నారు.

పలువురు నేతల ఫోన్లు, గొలుసులు చోరీ

నల్లగొండలో కేటీఆర్ పాల్గొన్న రైతు మహాధర్నాలో దొంగలు రెచ్చిపోయారు. ఎన్జీ కాలేజీ నుంచి బీఆర్‌ఎస్ నేతలు చేపట్టిన ర్యాలీలో హుజూరాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి, స్థానిక నేత హమీద్ సెల్‌ఫోన్లతోపాటు అరుగురు నేతల నుంచి సుమారు 11 తులాల బంగారు గొలుసులు కొట్టేశారు. దొంగల ముఠాలోని ఒకరిని టూటౌన్ పోలీసులు అదుపులోకి తీసుకొని విచారిస్తున్నారు.

ఆరోగ్యశ్రీ అంటే వై.ఎస్.. రైతుబంధు అంటే కేసీఆర్

ఆరోగ్యశ్రీ పథకం పేరు చెప్పగానే ప్రజలందరికీ ఉమ్మడి ఏపీ దివంగత సీఎం వైఎస్ రాజశేఖరరెడ్డి గుర్తుకొస్తారని కేటీఆర్ చెప్పారు. అలాగే రైతుబంధు పథకం అనగానే మాజీ సీఎం కేసీఆర్ గుర్తుకొస్తారన్నారు. ఈ పథకాలను ఎవరూ చెరపలేరన్నారు. కానీ రాష్ట్రంలో కేసీఆర్ ఆనవాళ్లు లేకుండా చేస్తానని పదేపదే చెబుతున్న సీఎం రేవంత్‌రెడ్డి రైతుబంధు పథకాన్ని బంద్ చేయాలని చూస్తున్నారని కేటీఆర్ ఆరోపించారు. సామాన్యులకు రేషన్‌కార్డు కావాలన్నా, రైతుబంధు కావాలన్నా ప్రభుత్వం కేవలం దరఖాస్తులే తీసుకుంటోందని విమర్శించారు.

సాక్షి ఫ్యామిలీ
హైదరాబాద్
బుధవారం ॥ 29-1-2025



త్రిష గొంగడి

'కలలు కనడం కష్టం కాదు. కాణీ ఖర్చు కాదు' లాంటి వెటకారాల మాట ఎలా ఉన్నా....
ఆ కలలే భవిష్యత్తుని నిర్దేశిస్తాయి.
వందమందిలో ఒకరిగా ప్రత్యేకతతో వెలిగిపోయేలా చేస్తాయి.
'నా కూతురు ఆడితే పరుగులు వెల్లువెత్తాల్సిందే'
'మ్యాచ్ గెలవడానికి ప్రధాన కారణం... అంటూ నా కూతురు గురించి అందరూ ఘనంగా చెప్పుకోవాలి'... ఇలాంటి కలలు ఎన్నో కనేవాడు భద్రాచలానికి చెందిన రామిరెడ్డి.
అయితే అయన కలలకు మాత్రమే పరిమితం కాలేదు.
నిరంతరం తన కలల సాకారానికి ప్రయత్నించాడు. ఆ ఫలితమే స్టార్ క్రికెటర్... త్రిష గొంగడి. మలేషియాలో జరుగుతున్న ఇంటర్నేషనల్ విమెన్ అండర్ 19, టీ 20 వరల్డ్ కప్‌లో స్కాట్లాండ్‌తో జరిగిన మ్యాచ్‌లో 53 బంతుల్లో సెంచరీ చేసి ప్రపంచ రికార్డు సృష్టించింది.



నాన్న కల నెరవేర్చింది

భద్రాచలం పట్టణానికి చెందిన గొంగడి రామిరెడ్డి క్రికెట్‌లో ఉన్నత స్థానానికి చేరుకోవాలని ఆశించినా పరిస్థితుల ప్రభావం వల్ల ఆ కల నెరవేరలేదు. దీంతో ఫిట్‌నెస్ ట్రైనర్‌గా పనిచేస్తూనే పట్టణంలో జిమ్ సెంటర్ నిర్వహించేవాడు.

'మా అమ్మాయిని బాగా చదివించాలి'... అనేది సగటు తండ్రి కోరిక.

రామిరెడ్డి మాత్రం అలా కాదు... 'మా అమ్మాయిని బాగా ఆడించాలి. క్రికెట్‌లో స్టార్‌ని చేయాలి' అనుకునేవాడు. సినిమాలు, కామేడీ షోలు కాకుండా టీవీలో క్రికెట్ మ్యాచ్ హైలెట్స్ ఎక్కువగా చూపించేవాడు. చిన్నప్పుడే ఇలా చేయడం వల్ల బ్రెయిన్, మజిల్స్ ఆటకు తగ్గట్టుగా మౌల్డ్ అవుతాయని ఫిట్‌నెస్ ట్రైనర్‌గా ఆయన బలంగా నమ్మాడు. ఆ నమ్మకాన్ని నిజం చేస్తూ చిన్నతనం నుంచే త్రిష క్రికెట్‌లో ప్రతిభ కనబరిచేది.

దీంతో తన కల విషయంలో మరింత పట్టుదల పెరిగింది. కూతురిని ప్రొఫెషనల్ క్రికెటర్‌గా చూడాలనే లక్ష్యంతో కుటుంబంతో సహా హైదరాబాద్‌కు మకాం మార్చాడు రామిరెడ్డి. అప్పుడు త్రిష వయసు ఏడేళ్లు. సికింద్రాబాద్‌లోని 'సెయింట్ జాన్స్ క్రికెట్ అకాడమీలో కోచింగ్ తీసుకునేది.

ఎంతో ఆశ... చివరికి నిరాశ!

ప్రొఫెషనల్ ట్రెనింగ్‌లో ఆరితేరిన త్రిష పన్నెండేళ్ల వయసులో హైదరాబాద్ అండర్ 19 జట్టుకు ఎంపికైంది. ఆ తర్వాత అండర్ 19 ఇండియా తరఫున సౌత్ ఆఫ్రికాలో జరిగిన టోర్నమెంట్‌లో పాల్గొంది. ఆ టోర్నీలో భారత్ విశ్వవిజేతగా నిలిచింది. బ్యాటింగ్‌తో పాటు లెగ్ స్పిన్నర్‌గా టోర్నీ గెలుపులో త్రిష తనవంతు పాత్ర పోషించింది. అయితే త్రిషకు ఈ టోర్నీలో ప్రత్యేక గుర్తింపు దక్క లేదు. ఆ ఫలితం ఆ తర్వాత జరిగిన ఐపీఎల్ వేలంలో స్పష్టంగా కనిపించింది. విమెన్ ఐపీఎల్ వేలంలో త్రిషాను తీసుకునేందుకు ఐపీఎల్ యాజమాన్యాలు ఆసక్తి చూపించలేదు. దీంతో గత ఐపీఎల్ సీజన్‌కు ఆమె దూరంగా ఉండాల్సి వచ్చింది. అ గెలుపులో తాను ఒకరిగా ఉండటం కంటే 'గెలుపుకు మూలం' అనిపించేలా ప్రదర్శన చేయాలనే పట్టుదల త్రిషలో పెరిగింది.

ఇక చూస్కోండి

విమెన్ ఐపీఎల్‌లో ఎదురైన చేదు అనుభవం 'పవర్ హిట్టింగ్'పై పట్టు సాధించేందుకు త్రిషకు తోడ్పడింది. గత డిసెంబరులో జరిగిన అండర్ 19, టీ 20 ఏషియా కప్ టోర్నమెంట్‌లో వరుసగా 58 నాటౌట్, 32, 52 పరుగులు సాధించింది. ఆ టోర్నీ ఫైనల్‌లో 'ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్'తో పాటు 'ప్లేయర్ ఆఫ్ ది టోర్నమెంట్' అవార్డులు సొంతం చేసుకుంది. ప్రస్తుత వరల్డ్ కప్‌లో ఐదు మ్యాచ్‌లలో బ్యాటింగ్ చేసిన త్రిష 230 పరుగులు సాధించింది. ఇందులో స్కాట్‌లాండ్‌పై చేసిన 110 నాటౌట్ సెంచరీ కూడా ఉంది. ఇందులో 13 ఫోర్లు, నాలుగు సిక్సులు ఉన్నాయి. ఈ సెంచరీతో అండర్ 19 టోర్నీలో తొలి సెంచరీ చేసిన ప్లేయర్‌గా రికార్డు సృష్టించింది. బౌలింగ్‌లోనూ రాణించి మూడు వికెట్లు తీసింది.

విమెన్ వరల్డ్ కప్‌లో ఇండియాకు ఆడాలి

అండర్ 19, విమెన్ టీ20లో తొలి సెంచరీ చేయడం ద్వారా వరల్డ్ రికార్డు సాధించినందుకు ఆనందంగా ఉంది. విమెన్ అండర్ 19 టోర్నీలో మంచి పెర్‌ఫార్మెన్స్ చూపించి ఇండియా మహిళల జట్టుకు ఎంపిక కావాలి. రాబోయే వరల్డ్ కప్ టీమిండియా స్క్వాడ్‌లో నా పేరు ఉండాలనే లక్ష్యంతోనే ఈ టోర్నీకి వచ్చాను. నా లక్ష్యానికి తగ్గట్టుగా ఆడుతున్నాను.

– గొంగడి త్రిష

అందనంత ఎత్తులో...

టోర్నీలో మిగతా అమ్మాయిలకు అందనంత ఎత్తులో బ్యాటింగ్ యావరేజ్ 76.77తో త్రిష కొనసాగుతోంది. ఆమె తర్వాత రెండోస్థానంలో ఇంగ్లాండ్ ప్లేయర్ డావినా పేరిన్ ఉంది. ఈ టోర్నీలో రెండుసార్లు త్రిష 40కి పైగా స్కోర్లు సాధించింది. అయితే అప్పటికే ప్రత్యర్థి జట్లు ముందుగా బ్యాటింగ్ చేయడంతో భారీ స్కోరు సాధించే అవకాశం త్రిషకు దక్కలేదు. కానీ స్కాట్‌ల్యాండ్‌తో జరిగిన మ్యాచ్‌లో ముందుగా బ్యాటింగ్ చేయడంతో త్రిష బ్యాట్ నుంచి ఫాస్టెస్ట్ సెంచరీ (53 బంతుల్లో) జాలువారింది. బ్యాటింగ్ యావరేజ్‌తో పాటు మోస్ట్ రన్స్, హయ్యెస్ట్ స్కోర్ విభాగంలోనూ త్రిష టాప్‌లో కొనసాగుతోంది. ఇప్పటికే భారత్ మహిళల అండర్ 19 జట్టు సెమీస్‌కు చేరుకుంది.

ఏజెన్సీ ప్రాంతం నుంచి మొదలైన త్రిష విజయపరంపర అంతర్జాతీయ స్థాయిలో అప్రతిహతంగా కొనసాగుతోంది. ఆమె మరిన్ని విజయాలు సాధించాలని ఆశిద్దాం.

– తాండ్ర కృష్ణగోవింద్,
సాక్షి ప్రతినిధి, భద్రాద్రి కొత్తగూడెం

మహా కుంభమేళాలో మన సాంస్కృతిక పరిమళాలు

అనేక శాస్త్రీయ నృత్యప్రదర్శనలు మహా కుంభమేళాలో జరుగుతున్నాయి. వీటిలో భరతనాట్యం, కూచిపూడి, ఒడిస్సీ, కథక్, మణిపురి, సత్రియా.. ఇతర నృత్యరూపాలు ఉన్నాయి. దేశవ్యాప్తంగా 160 మంది నృత్యకారులు ప్రదర్శన ఇవ్వడానికి ఎంపికయ్యారు. వారిలో హైదరాబాద్ నుంచి ఎంపికైన ప్రతిభావంతులైన కూచిపూడి నృత్యకారిణులు పద్మజా రెడ్డి, దీపికారెడ్డిలు ఉన్నారు.

నయనానందం



ప్రయాగ్ రాజ్‌లో జరుగుతున్న మహాకుంభమేళాలో గణతంత్ర దినోత్సవం రోజున గంగా పండాల్‌లో పెద్దస్టేజీపై ప్రదర్శన ఇచ్చాం. యు.పి. ప్రభుత్వంతోపాటు కేంద్ర సాంస్కృతిక శాఖ వారు అన్ని ఏర్పాట్లు చేశారు. గణతంత్ర దినోత్సవం రోజున ఉదయం మా శిష్య బృందంతో కలిసి నదీ స్నానాలు చేశాం. చిన్నా, పెద్దా తేడా లేకుండా లక్షలాదిగా భక్తులు ఒక ప్రవాహంలా కదలి వెళ్లడం చూస్తుంటే మాకందరికీ రోమాంచితం అయ్యింది. దారిలో ఖిలా ఘాట్ దగ్గర జనగణమన, వందేమాతరం వినిపిస్తూ ఉంటే మాటల్లో చెప్పలేని అనుభూతి. దాదాపు ఎనిమిది కిలోమీటర్లు అలుపు లేకుండా నడిచాం. నదీ స్నానం చేసి, రూమ్‌కి వచ్చి, సాయంత్రం ప్రదర్శన చేశాం. గంగామాతగా నా కూతురు శ్లోకారెడ్డి, పార్వతిగా నేను, రుత్విక అనే అమ్మాయి శివుడిగా, 12 మంది శిష్యబృందంతో ప్రదర్శన ఇచ్చాం. డి.ఎస్.శాస్త్రి సంగీతం అందించారు. అక్కడికి వచ్చిన భక్తులు ఎంతోమంది తమ హర్షధ్వానాలతో మా ప్రదర్శనను అభినందించారు. జవాన్లు వచ్చి ఫొటోలు తీసుకున్నారు. 50 నిమిషాలపాటు జరిగిన ఈ నృత్య ప్రదర్శనలో శివపార్వతి కళ్యాణం, గంగను భగీరథుడు భూమికి తీసుకురావడంలో చేసిన తపస్సు ప్రధానాంశాలు. కుంభమేళాకు తగినట్టు కొన్ని మార్పులు చేసి, ఇందులో ప్రదర్శన ఇచ్చాం. పవిత్ర నదీస్నానం సందర్భంగా ఈ కార్యక్రమంలో పాల్గొనడం ఆనందంగా ఉంది. ఇన్నేళ్లుగా కళాసేవ చేయడం వల్ల మహాకుంభమేళాలో ప్రదర్శించే అవకాశం వచ్చిందనుకుంటున్నాను. మా శిష్యబృందం చాలా ఆనందించారు. అన్ని కోట్లమందిని చూడటమే నయనానందకరం అనుకుంటే, మా నృత్యం ద్వారా అక్కడకు వచ్చినవారికి మేం నేత్రానందం కలిగించడం అదృష్టంగా భావిస్తున్నాం.



దీపికారెడ్డి

– దీపికారెడ్డి, కూచిపూడి నృత్యకారిణి

నమామి గంగే





డాక్టర్ పద్మజారెడ్డి

గంగ పారే చోటుకి యాత్రలకు వెళితే ఆ నీటిని ఇంటికి తెచ్చుకుంటాం. మన ఇళ్లలో అందరూ తలపై చల్లుకుంటారు. బంధుమిత్రులకు కూడా ఆ నీటిని ఇస్తుంటారు. ఎందుకంటే, గంగ స్వచ్ఛమైనది కాబట్టి. మనం ఒక దేవతను కలుషితం చేసి, మన బిడ్డలకు ఇస్తున్నామా.. ఇది కరెక్టేనా.. ప్రభుత్వమే అన్ని చర్యలు తీసుకోవాలా, మనకి బాధ్యత లేదా.. ఈ విషయాన్నే ఆలోచించి 'నమామి గంగే' పేరుతో మహా కుంభమేళాలో 30 మంది శిష్యబృందంతో కలిసి కూచిపూడి నృత్యం చేస్తున్నాను. కేంద్ర సాంస్కృతిక శాఖ నుంచి కుంభమేళాకు రెండు వారాల ముందే ఆహ్వానం అందింది. ఫిబ్రవరి 9న పాల్గొనబోయే ఈ కార్యక్రమం గురించే కాదు ఏ కాన్సెప్ట్ అనుకున్నా దానికి ముందు నాకు కొన్ని నిద్రలేని రాత్రులే ఉంటాయి. కాన్సెప్ట్ ఎలా ఉండాలి, దానికి తగిన కొరియోగ్రఫీ, ఎంతమంది, డ్రెస్సింగ్... అన్నింటి గురించి అర్ధరాత్రులు కూర్చొని నోట్స్ రాసుకుంటాను. గ్రాఫ్స్ గీస్తూ, ప్లాన్స్ రాసుకుంటూ ఉంటాను. టాపిక్ గురించి ఎవరూ నన్నేం అడగలేదు. కుంభమేళా నదీస్నానం. కాబట్టి నేనే 'గంగానది' గురించి టాపిక్ ఎంచుకున్నాను. నృత్యమంతా గంగ, శివుడు, శక్తి ప్రధానంగా ఉంటుంది. గతంలో స్వచ్ఛగంగలో భాగంగా దేశంలో మొత్తంలో ప్రధానంగా గంగానది పారే ఐదు చోట్లలో నృత్య ప్రదర్శన ఇచ్చాను. కళ సామాజిక చైతన్యానికి తోడ్పడాలి. ఆ తపనతోనే పురాణాల నుంచి ఎన్నో కథనాలు తీసుకొని చేశాను. 'భ్రూణ హత్యలు, హెచ్ఐవి పట్ల అవగాహన, ప్రకృతిని కాపాడుకోవడం... వంటి సామాజిక అంశాలమీద నృత్యప్రదర్శనలు ఇచ్చాను. ఇందుకు భారత ప్రభుత్వం నుంచి పద్మశ్రీ పురస్కారాన్ని అందుకున్నాను. ఈసారి మహా కుంభమేళాలలో నా నృత్యాన్ని ప్రదర్శించే అవకాశం కలగడం అదృష్టంగా భావిస్తున్నాను. 50 ఏళ్ల నా నృత్య జీవనంలో 30 ఏళ్లుగా సామాజిక అంశాలలో ప్రజలకు అవగాహన కలిగించేలా వేలాది ప్రదర్శనలు ఇస్తూ వచ్చాను. ఈ కార్యక్రమం తర్వాత ప్రభుత్వం చేస్తున్న మూసీ ప్రక్షాళనలో 'నమామి మూసీ' కథనాన్ని నృత్యరూపకంగా తీసుకురాబోతున్నాను.

– డాక్టర్ పద్మజారెడ్డి, కూచిపూడి నృత్యకారిణి

– నిర్మలారెడ్డి, సాక్షి ఫీచర్స్ ప్రతినిధి

లీగల్

అలాంటి పెట్టుబడుల్లో జాగ్రత్త అవసరం

నేను ఒక విశ్రాంత ఉద్యోగిని. నా సర్వీస్ మొత్తం కష్టపడి దాచుకున్న డబ్బుని ఒక ప్రైవేటు స్టాక్ బ్రోకింగ్ కంపెనీ వారు లిస్టింగుకు సిద్ధంగా ఉన్న కంపెనీలలో పెట్టుబడి పెడితే బ్యాంకు వడ్డీ కన్నా ఎక్కువ వస్తుందని నమ్మించడంతో అందులో పెట్టుబడులు పెట్టాను. 18 నెలల లోపు సదరు కంపెనీలు స్టాక్ లిస్టింగ్ అవ్వకపోతే, తామే తిరిగి మా స్టాక్ కొనుక్కుంటాము అని అగ్రిమెంట్లు కూడా రాసి ఇచ్చారు. నాలాగే చాలామంది చేత కూడా పెట్టుబడులు పెట్టించారు. ఇప్పటికి మూడు సంవత్సరాలు అవుతోంది కానీ ఏం లాభం లేదు పైగా మా స్టాక్ అమ్మేస్తాము అంటే తిరిగి కొనుక్కోవట్లేదు. ఎలా ముందుకు వెళ్ళాలో చెప్పగలరు.

– ఒక విశ్రాంత ఉద్యోగి, హైదరాబాద్

పూర్వ అనుభవం, వ్యాపార పెట్టుబడులలో నైపుణ్యం కలిగిన వారు అన్‌లిస్టెడ్ షేర్లు కొంటూ ఉండటం, స్టార్టప్ కంపెనీలలో ముందుచూపుతో పెట్టుబడులు పెట్టడం కూడా ఒక వ్యాపారమే. ఏంజెల్ ఇన్వెస్టర్స్, క్యాపిటల్ ఇన్వెస్టర్స్ అంటూ వివిధ రకాల ఇన్వెస్ట్‌మెంట్ పద్ధతులు అవలంబిస్తుంటారు. నచ్చిన సంస్థలలో వారు పెట్టుబడులు పెట్టుకోవచ్చు. అది వారి హక్కు.

అన్‌లిస్టెడ్ కంపెనీలలో కొన్న షేర్లకు రిస్కు కూడా అధికంగానే ఉంటుంది. దీనిని ఒక వ్యాపారం లాగా చేసే వారు నష్టాలకు కూడా సిద్ధపడి పెట్టుబడులు పెడుతుంటారు. కానీ మీలాగా జీవితం మొత్తం కష్టపడి సంపాదించి రిటైర్ అయిన తర్వాత, కేవలం లాభాలు ఆశించి మాత్రమే అధిక మొత్తంలో ఇలాంటి పెట్టుబడులు పెట్టడం అంత మంచిది కాదు.

స్టాక్ మార్కెట్లో లిస్ట్ ఐన కంపెనీలు ఏమైనా ఆర్థిక నేరాలు చేసినా, అవకతవకలు జరిగినా, సెబీకి ఫిర్యాదు చేయవచ్చు. వారిపై కఠిన చర్యలు ఉంటాయి. కంపెనీ నష్టపోతే లేదా దివాలా తీస్తే దానికి ఎవరూ ఏమీ చేయలేరు. మీకు అగ్రిమెంట్ రాసి ఇచ్చింది మీరు షేర్లు కొన్న కంపెనీ అయి ఉండి, మీకు, సదరు కంపెనీ మేనేజ్‌మెంట్ వ్యవహారాలకు మధ్య ఏదైనా సమస్యలు తలెత్తితే, మీరు కంపెనీ లా అప్పిలేట్ ట్రిబ్యునల్ ద్వారా కూడా కేసు వేయవచ్చు. మీకు అగ్రిమెంట్లు చేసింది మధ్యలో వున్న బ్రోకింగ్ కంపెనీ అయితే, NCLT ని ఆశ్రయించలేరు. ఇటీవలే ఒక కంపెనీ వారు మీలాంటి వారి వద్ద అధిక మొత్తంలో పెట్టుబడులను సేకరించి, అగ్రిమెంట్లు చేసి కూడా ఎవరికీ డబ్బులు తిరిగి ఇవ్వకపోవడంతో, హైదరాబాద్ సెంట్రల్ క్రైమ్ స్టేషన్‌లో కేసు నమోదయి, కొందరిని అరెస్టు కూడా చేశారు. ఆ కేసు ఇంకా విచారణ దశ లోనే ఉంది. మీరు కూడా పోలీసులను ఆశ్రయించవచ్చు. మీరు ఏ కంపెనీ షేర్లు అయితే కొన్నారు, వారి పాత్ర కూడా ఏమైనా ఉందా అనే దిశలో దర్యాప్తు చేయవలసిందిగా కోరండి. సివిల్ కేసు ద్వారా కూడా మీ డబ్బులు తిరిగి పొందవచ్చు.

గమనిక

ఇటీవల కాలంలో ఒక్క హైదరాబాదులోనే సైబర్ నేరగాళ్లు కూడా స్టాక్ మార్కెట్లలో ఇన్వెస్ట్‌మెంట్ల పేరుతో అధిక మొత్తంలో డబ్బులు వసూలు చేశారు అంటూ చాలా కేసులే నమోదయ్యాయి. ఆర్థికంగా ఎక్కడైనా పెట్టుబడులు పెడితే అనుభవం కలిగిన వారి సలహా మేరకు, చట్టరీత్యా చేస్తే మంచిది.



- శ్రీకాంత్ చింతల, హైకోర్టు న్యాయవాది

మీకున్న న్యాయపరమైన సమస్యలు, సందేహాలకోసం sakshifamily3@gmail.comకు మెయిల్ చేయవచ్చు.

పురస్కారం

పచ్చని పల్లెలో మెచ్చే సర్పంచులు

'ఒక దేశ ఉజ్వల భవిష్యత్ ఆ దేశ గ్రామీణాభివృద్ధిపై ఆధారపడి ఉంటుంది' అనేది తిరుగులేని చారిత్రక సత్యం.
పల్లెపచ్చగా కళ కళలాడాలంటే, ఆకలి దొక్కలతో పట్నానికి వలస పోకుండా ఉండాలంటే.. పల్లెతల్లిని కంటిపాపలా కాపాడుకోవాలి.
ఈ మహిళా సర్పంచులు అదే పని చేశారు. గ్రామ ఆర్థికవృద్ధి నుంచి సర్వతోముఖాభివృద్ధి వరకు అంకితభావంతో పనిచేశారు.
వారి సేవలకు గుర్తింపుగా ఢిల్లీలో జరిగిన రిపబ్లిక్ డే వేడుకల్లో పాల్గొనే అవకాశం రావడమే కాదు, అక్కడకు వెళ్లి రాష్ట్రపతి ద్రౌపది ముర్ము సమక్షంలో 'ఉత్తమ గ్రామ సర్పంచ్' అవార్డ్ అందుకున్నారు.
ప్రతిష్ఠాత్మకమైన వేదికపై ప్రసంగించారు.

ఘనత అనేది 'నేను ఈ ఊరి సర్పంచుని' అని ఘనంగా చెప్పుకోవడంలో ఉండదు. సర్పంచుగా ఆ ఊరికి ఎలాంటి మంచి పనులు చేశారనేదే అసలు సిసలు ఘనత. కృష్ణా జిల్లా కంకిపాడు మండలం మేజర్ పంచాయతీల్లో ఒకటైన ఈడుపుగల్లు గ్రామ పంచాయతీ సర్పంచ్‌గా పి.ఇందిర ప్రాధాన్య క్రమంలో అభివృద్ధి పనులను చేపడుతోంది. సమస్యలను పూర్తిస్థాయిలో పరిష్కరించే దిశగా ప్రణాళికాబద్ధంగా వ్యవహరిస్తోంది.

అర్హులకు సంక్షేమ పథకాలు అందించటం, హర్‌ఘర్ జల్ యోజన, మిషన్ ఇంద్రధనుష్, ప్రధాన మంత్రి జన్ ఆరోగ్య యోజన, ప్రధాన మంత్రి ఉజ్వల యోజన, పీఎం మాతృ వందన యోజన, పీఎం విశ్వకర్మ యోజన, పీఎం పోషణ యోజన, పీఎం ముద్ర యోజన, జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం సద్వినియోగంలో 90 శాతానికి పైగా ప్రగతి సాధించారు.

'ఉత్తమ సర్పంచ్‌గా ఢిల్లీలో రాష్ట్రపతి సమక్షంలో అవార్డు అందుకోవడం, ప్రసంగించే అవకాశం దక్కటం అదృష్టంగా భావిస్తున్నా. ఇది నా బాధ్యతను రెట్టింపు చేసింది. ప్రజలకు అందుబాటులో ఉంటూ సమస్యల పరిష్కారం దిశగా మరింత అంకితభావంతో పని చేస్తాను' అంటోంది ఇందిర.



ఉత్తమ గ్రామపంచాయతీ సర్పంచ్‌గా ఢిల్లీలో అవార్డు అందుకున్న కృష్ణా జిల్లా కంకిపాడు మండలం ఈడుపుగల్లు సర్పంచ్ పి. ఇందిర



ఉత్తమ గ్రామ పంచాయతీ సర్పంచ్‌గా ఢిల్లీలో అవార్డు అందుకున్న ఎన్టీఆర్ జిల్లా, మైలవరం మండల పరిధి పొందుగల గ్రామ పంచాయతీ సర్పంచ్ గుగులోతు కోటమ్మ

మా అమ్మ ఎప్పుడూ బాగుండాలి...

గ్రామ పంచాయతీలో లేబర్ కాంట్రాక్టరుగా, గుమస్తాగా పనిచేసిన తన భర్త అనుభవాన్ని కూడగట్టుకొని తన ఊరిని ఉత్తమ గ్రామ పంచాయతీగా తీర్చిదిద్దడంలో విజయం సాధించింది ఎన్టీఆర్ జిల్లా, మైలవరం మండలం పొందుగల గ్రామ పంచాయతీ సర్పంచ్ గుగులోతు కోటమ్మ. ఉత్తమ గ్రామ సర్పంచ్‌గా ఢిల్లీలో జరిగిన గణతంత్ర దినోత్సవ వేడుకలలో అవార్డ్ అందుకుంది. వేదిక ఎక్కి ప్రసంగించింది.

జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంతోపాటు ఎంపీ, ఎమ్మెల్యే నిధులు, టాటాట్రస్టు సహకారం, జల జీవన్ మిషన్ నిధులు... ఇలా ప్రతి అవకాశాన్ని సద్వినియోగపరుచుకొని రూ.40 కోట్లతో గ్రామ అభివృద్ధి, సంక్షేమంపై ఖర్చు చేసింది. జలజీవన్ మిషన్‌లో భాగంగా రెండు వాటర్ ట్యాంకులు, ఇంటింటికి సురక్షితమైన నీటిని అందించేందుకు గ్రామంలో 350 ఇళ్లకు కుళాయిలు ఏర్పాటు చేసింది. టాటా ట్రస్టు సహకారంతో ఐఓటీ సిస్టమ్ ఏర్పాటు చేసి నీటి సరఫరా లెక్కింపుతోపాటు క్లోరినేషన్ ప్రక్రియపై నిరంతర పర్యవేక్షణ ఉండేలా చేసిన మొదటి గ్రామంగా పొందుగలను నిలిపింది. నీటి వినియోగం, పరిశుభ్రతపై అవగాహన కార్యక్రమాలను ఎప్పటికప్పుడు నిర్వహిస్తోంది. వేస్ట్ మేనేజ్‌మెంట్ యూనిట్ ఏర్పాటు, సేంద్రియ ఎరువుల తయారీలో విజయం సాధించింది.

'ఊరు అంటే సొంత తల్లిలాంటిది. మా అమ్మ ఎప్పుడూ బాగుండాలి. అందుకోసం ఎంతైనా కష్టపడతాను' అంటుంది గుగులోతు కోటమ్మ.

– ఇ.శివప్రసాద్, సాక్షి, కంకిపాడు,
వేమిరెడ్డి రామకృష్ణారెడ్డి, సాక్షి, జి.కొండూరు

కార్పొరేట్ వరల్డ్ నుంచి పల్లె ప్రపంచానికి...



చేబ్రోలు లక్ష్మీమౌనిక, సర్పంచ్, కేసరపల్లి మేజర్ గ్రామ పంచాయతీ

ఎంబీఏ చేసిన చేబ్రోలు లక్ష్మీమౌనిక మెడికల్ ట్రాన్స్‌స్క్రిప్షన్ సంస్థలో ఉద్యోగం చేసింది. ఆ తరువాత పంచాయితీ ఎన్నికల బరిలోకి దిగి పదివేల జనాభా, నాలుగు శివారు గ్రామాలతో కూడిన కృష్ణాజిల్లా గన్నవరం మండలం కేసరపల్లి మేజర్ గ్రామపంచాయతీకి సర్పంచ్‌గా ఎన్నికయ్యింది. హెచ్‌సీఎల్ క్యాంపస్ ఏర్పాటు, గృహసముదాయాల పన్నుల ద్వారా గ్రామపంచాయతీ వార్షిక ఆదాయాన్ని రూ. 45 లక్షల నుంచి రూ. 2 కోట్లకు పెంచింది. గ్రామంలో పారిశుధ్య వ్యవస్థను మరింత మెరుగు పరచడంతో పాటు సుమారు రూ. 2 కోట్ల వ్యయంతో సీసీ రోడ్లు, డ్రెయిన్ల నిర్మాణం, కొత్తగా తాగునీటి పైపులైన్లను ఏర్పాటు చేసింది. మహిళా ప్రజాప్రతినిధిగా ఆమె సేవలను గుర్తించిన పంచాయతీరాజ్ ఉన్నతాధికారులు ఢిల్లీలో జాతీయస్థాయిలో జరిగిన గ్రామపంచాయతీల అభివృద్ధి ప్రణాళికలపై జరిగిన వర్క్‌షాప్‌కు ఆంధ్రప్రదేశ్ నుండి లక్ష్మీమౌనికను ఎంపిక చేశారు. డాక్టర్ బీఆర్ అంబేద్కర్ ఇంటర్నేషనల్ సెంటర్‌లో జరిగిన ఈ వర్క్‌షాపుకు హాజరైన లక్ష్మీ మౌనిక తన అభిప్రాయాలను తెలియజేసింది. మైసూర్‌లో జరిగిన 'పంచాయతీరాజ్ వ్యవస్థల్లో మహిళా ప్రజాప్రతినిధుల భాగస్వామ్యం'పై జరిగిన జాతీయ సదస్సుకు కూడా లక్ష్మీమౌనిక ఎంపికయింది.

– కొడాలి ప్రేమ్‌చంద్,
సాక్షి, గన్నవరం



2036 ఒలింపిక్స్ నిర్వహించేందుకు భారత్ సిద్ధంగా ఉంది: నరేంద్ర మోదీ

డెహ్రాడూన్: 2036 ఒలింపిక్స్ ఆతిథ్య హక్కులు దక్కించుకునేందుకు భారత్ సర్వశక్తులా ప్రయత్నిస్తోందని... ఇది భారత క్రీడారంగాన్ని కొత్త శిఖరాలకు తీసుకెళ్తుందని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఆశాభావం వ్యక్తం చేశారు. ఉత్తరాఖండ్ రాజధాని డెహ్రాడూన్ వేదికగా మంగళవారం 38వ జాతీయ క్రీడలను ప్రధాని అట్టహాసంగా ప్రారంభించారు. 18 రోజుల పాటు జరగనున్న జాతీయ క్రీడల్లో 32 క్రీడాంశాల్లో పోటీలు నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా ప్రధాని మాట్లాడుతూ... 'విశ్వక్రీడలకు ఆతిథ్యమిచ్చేందుకు ఆసక్తిగా ఉన్నాం. ఒలింపిక్స్ ఎక్కడ జరిగినా అన్నీ రంగాలు లాభపడతాయి. ఇలాంటి మెగా టోర్నీలతో అథ్లెట్లకు మరింత మెరుగైన సౌకర్యాలు అందుబాటులోకి వస్తాయి' అని అన్నారు. రెండేళ్ల క్రితం ముంబై వేదికగా జరిగిన అంతర్జాతీయ ఒలింపిక్ కమిటీ సెషన్‌లో ప్రధాని మోదీ 2036 ఒలింపిక్స్ ఆతిథ్యానికి సిద్ధం అని ప్రకటించగా... దీనికి సంబంధించిన నివేదికను భారత ఒలింపిక్ సంఘం.. అంతర్జాతీయ ఒలింపిక్ కమిటీకి అందించింది.



త్రిష సెంచరీ అభివాదం

త్రిషాన్‌దార్...

- టి20 ప్రపంచకప్ చరిత్రలో సెంచరీ సాధించిన తొలి ప్లేయర్‌గా గొంగడి త్రిష రికార్డు
- స్కాట్లాండ్‌తో సూపర్ సిక్స్ మ్యాచ్‌లో చెలరేగిన తెలంగాణ అమ్మాయి
- 59 బంతుల్లో 13 ఫోర్లు, 4 సిక్స్‌లతో 110 నాటౌట్
- బౌలింగ్‌లో 3 వికెట్లు సొంతం
- వరుసగా ఐదో మ్యాచ్‌లోనూ గెలిచిన టీమిండియా

భారత మహిళల క్రికెట్‌కు భవిష్యత్ తార దొరికింది. అటు బ్యాట్‌తో అదరగొడుతూ... ఇటు బంతితో మెరిపిస్తూ... తెలంగాణ అమ్మాయి గొంగడి త్రిష అందరి దృష్టిని ఆకర్షిస్తోంది. ఈ క్రమంలో మహిళల అండర్–19 ప్రపంచకప్ టోర్నీ చరిత్రలో సెంచరీ సాధించిన తొలి ప్లేయర్‌గా 19 ఏళ్ల త్రిష గుర్తింపు పొందింది. 2023లో తొలిసారి జరిగిన అండర్–19 ప్రపంచ కప్‌లో భారత జట్టుకు టైటిల్ దక్కడంలో కీలకపాత్ర పోషించిన త్రిష 2025 ఈవెంట్‌లోనూ తన ముద్ర వేస్తోంది. ఇప్పటికే సెమీఫైనల్ బెర్త్ ఖరారు చేసుకున్న టీమిండియా... స్కాట్లాండ్‌తో మంగళవారం జరిగిన తమ చివరి 'సూపర్ సిక్స్' మ్యాచ్‌లోనూ చెలరేగిపోయింది. ఏకంగా 150 పరుగుల తేడాతో గెలిచి వరుసగా ఐదో విజయం నమోదు చేసుకొని ఈనెల 31న జరిగే సెమీఫైనల్లో ఇంగ్లండ్‌తో పోరుకు భారత్ 'సై' అంటోంది.

కౌలాలంపూర్: డిఫెండింగ్ చాంపియన్ హోదాలో భారత మహిళల జట్టు అండర్–19 టి20 ప్రపంచకప్‌లో తమ జైత్రయాత్ర కొనసాగిస్తోంది. లీగ్ దశలో ఆడిన మూడు మ్యాచ్‌ల్లో నెగ్గిన టీమిండియా... 'సూపర్ సిక్స్' దశలో ఆడిన రెండు మ్యాచ్‌ల్లోనూ విజయం సాధించింది. స్కాట్లాండ్‌తో మంగళవారం జరిగిన 'సూపర్ సిక్స్' గ్రూప్–1 మ్యాచ్‌లో నికీ ప్రసాద్ సారథ్యంలోని భారత జట్టు 150 పరుగుల తేడాతో ఘనవిజయం అందుకుంది. 'టీనేజ్ స్టార్' గొంగడి త్రిష ఆల్‌రౌండ్ ప్రదర్శనతో ఆకట్టుకొని భారత విజయంలో కీలకపాత్ర పోషించింది. స్కాట్లాండ్ జట్టు టాస్ గెలిచి ఫీల్డింగ్ ఎంచుకోగా... మొదట బ్యాటింగ్‌కు దిగిన భారత జట్టు నిర్ణీత 20 ఓవర్లలో 1 వికెట్ నష్టానికి 208 పరుగులు చేసింది. ఓపెనర్ గొంగడి త్రిష స్కాట్లాండ్ బౌలర్ల భరతం పట్టింది. ఈ క్రమంలో ఈ టోర్నీ చరిత్రలోనే తొలి శతకం నమోదు చేసిన ప్లేయర్‌గా చరిత్ర పుటల్లోకి ఎక్కింది. తెలంగాణకు చెందిన 19 ఏళ్ల త్రిష 59 బంతుల్లో 13 ఫోర్లు, 4 సిక్స్‌లతో 110 పరుగులు చేసి అజేయంగా నిలిచింది. త్రిష 53 బంతుల్లో 12 ఫోర్లు, 4 సిక్స్‌లతో సెంచరీ మైలురాయిని అందుకుంది. మరో ఓపెనర్ కమలిని (42 బంతుల్లో 51; 9 ఫోర్లు)తో కలిసి త్రిష తొలి వికెట్‌కు 13.3 ఓవర్లలో 147 పరుగులు జోడించింది. కమలిని అవుటయ్యాక సనిక చాల్కె (20 బంతుల్లో 29 నాటౌట్; 5 ఫోర్లు)తో కలిసి త్రిష రెండో వికెట్‌కు అజేయంగా 61 పరుగులు జత చేసింది. 209 పరుగుల విజయలక్ష్యంతో బరిలోకి దిగిన స్కాట్లాండ్ జట్టు భారత బౌలర్ల ధాటికి చేతులెత్తేసింది. 14 ఓవర్లు ఆడి కేవలం 58 పరుగులకే స్కాట్లాండ్ ఆలౌటైంది. 10 వికెట్లను భారత స్పిన్నర్లే తీయడం విశేషం. ఎడంచేతి వాటం స్పిన్నర్ ఆయుషి శుక్లా 8 పరుగులిచ్చి 4 వికెట్లు పడగొట్టగా... మరో ఎడంచేతి వాటం స్పిన్నర్ వైష్ణవి శర్మ 5 పరుగులిచ్చి 3 వికెట్లు... లెగ్ స్పిన్నర్ గొంగడి త్రిష 6 పరుగులిచ్చి 3 వికెట్లు తీశారు. ఈనెల 31న జరిగే సెమీఫైనల్లో ఇంగ్లండ్ జట్టుతో భారత్ తలపడుతుంది. అదే రోజున జరిగే మరో సెమీఫైనల్లో దక్షిణాఫ్రికాతో ఆస్ట్రేలియా ఆడుతుంది. ఫిబ్రవరి 2న ఫైనల్ జరుగుతుంది.

భారత్‌ను ముంచిన బ్యాటర్లు

ఇంగ్లండ్ స్కోరు 7 వద్దే తొలి వికెట్‌ను కోల్పోయింది. కానీ రెండో వికెట్ 83 పరుగుల వద్ద పడింది. అప్పటికి 9 ఓవర్లే ముగిశాయి. ఇలా పుంజుకున్న ప్రత్యర్థి ఇన్నింగ్స్‌ను వరుణ్ చక్రవర్తి (5/24) తిప్పేయడంతో అనూహ్యంగా 127 పరుగులకే 8 వికెట్లు కోల్పోయింది. హమ్మయ్య పట్టు సాధించామనుకుంటే... డెత్ ఓవర్లు, మిగతా బౌలర్ల వైఫల్యంతో ఇంగ్లండ్ 170 పైచిలుకు పరుగులు చేసింది. కానీ భారత్ మొదటి వికెట్ 16 పరుగుల వద్ద పడింది. ఆ తర్వాతా పడిపోతూనే 85/5 స్కోరు వద్ద సగం వికెట్లను సమర్పించుకొని ఓటమికి స్వాగతం పలికింది. దీంతో తప్పక గెలిచి తీరాల్సిన మ్యాచ్‌లో ఇంగ్లండ్ సత్తా చాటితే... ఈ ఒక్కటి గెలిస్తే సిరీస్ వశమయ్యే మ్యాచ్‌లో నిలువెత్తు నిర్లక్ష్యం భారత్‌ను ముంచింది.

- మూడో టి20లో టీమిండియా ఓటమి
- 26 పరుగులతో నెగ్గిన ఇంగ్లండ్
- బట్లర్, లివింగ్‌స్టోన్ మెరుపులు
- వరుణ్ మాయాజాలం వృథా
- 31న పుణేలో నాలుగో టి20

రాజ్‌కోట్: సిరీస్‌ను గెలిపించే మ్యాచ్‌ను భారత్ సీరియస్‌గా తీసుకున్నట్లు లేదు. అందుకే తగిన మూల్యం ఓటమిగా చెల్లించుకుంది. రేసులో నిలవాలనుకున్న ప్రత్యర్థి జట్టు ఇంగ్లండ్... వరుణ్ బిగించిన స్పిన్ ఉచ్చు నుంచి బయటపడి... అనంతరం ఆతిథ్య జట్టును బంతితో ఎక్కడికక్కడ కట్టడి చేసింది. ఫలితంగా సిరీస్ రేసులో నిలిచేందుకు ఇంగ్లండ్ 26 పరుగులతో భారత్‌ను ఓడించి గెలుపు బోణీ కొట్టేసింది. ముందుగా ఇంగ్లండ్ నిర్ణీత 20 ఓవర్లలో 9 వికెట్ల నష్టానికి 171 పరుగులు చేసింది. బెన్ డకెట్ (28 బంతుల్లో 51; 7 ఫోర్లు, 2 సిక్స్‌లు), లివింగ్‌స్టోన్ (24 బంతుల్లో 43; 1 ఫోర్, 5 సిక్స్‌లు) మెరిపించారు. 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' వరుణ్ చక్రవర్తి (5/24) తిప్పేశాడు. హార్దిక్ పాండ్యాకు 2 వికెట్లు దక్కాయి. తర్వాత లక్ష్యఛేదనకు దిగిన భారత్ 20 ఓవర్లలో 9 వికెట్లకు 145 పరుగులే చేసి ఓడింది. హార్దిక్ పాండ్యా (40; 1 ఫోర్, 2 సిక్స్‌లు) ఒక్కడే రాణించాడు.

లివింగ్‌స్టోన్ భారీ సిక్సర్లు

సాల్ట్ (5)ను పాండ్యా త్వరగానే పెవిలియన్ చేర్చాడు. కానీ డకెట్, బట్లర్ (24; 1 ఫోర్, 1 సిక్స్) ఇంగ్లండ్ ఇన్నింగ్స్‌ను గాడిన పెడితే వరుణ్ ఉచ్చులో ఇంగ్లండ్ చిక్కుకుంది. బట్లర్ సహా, స్మిత్ (6), ఓవర్టన్ (0), కార్స్ (3), ఆర్చర్ (0)లు వికెట్లు పారేసుకున్నారు. కానీ లివింగ్‌స్టోన్ భారీ సిక్సర్లతో విరుచుకుపడటంతో కూలుతున్న పర్యాటక జట్టు కోలుకుంది. 127/8 నుంచి 171/9 స్కోరుకు చేరుకుంది.

లక్ష్యంపై నిర్లక్ష్యం!

భారత్ ముందున్నది సాధారణ లక్ష్యం కానేకాదు. ఇలాంటి ఛేదనకు చక్కని శుభారంభం, తదనంతరం మిడిలార్డర్ బాధ్యత ఎంతో ముఖ్యం... కానీ ఈ ఒక్కటీ ఓడితే పోయేదేముంది అన్నట్లు భారత బ్యాటర్ల ఆటతీరు సాగింది. సంజూ సామ్సన్ (3), అభిషేక్ (14 బంతుల్లో 24; 5 ఫోర్లు), కెప్టెన్ సూర్యకుమార్ (14), తిలక్ వర్మ (18), సుందర్ (6), అక్షర్ (15), జురేల్ (2) ఇలా అంతా... మా వల్లకాదంటూ ప్రత్యర్థి బౌలింగ్‌కు తలొగ్గారు. హార్దిక్ చేసిన ఆ మాత్రం స్కోరు భారత్ పరువు నిలిపింది... కానీ ఒడ్డున పడేయలేకపోయింది.



ఆదిల్ రషీద్ బౌలింగ్‌లో తిలక్ వర్మ క్లీన్ బౌల్డ్



ఆర్చర్, బట్లర్

స్కోరు వివరాలు

ఇంగ్లండ్ ఇన్నింగ్స్: సాల్ట్ (సి) అభిషేక్ (బి) పాండ్యా 5; డకెట్ (సి) అభిషేక్ (బి) అక్షర్ 51; బట్లర్ (సి) సామ్సన్ (బి) వరుణ్ 24; హ్యారీ బ్రూక్ (బి) బిష్ణోయ్ 8; లివింగ్‌స్టోన్ (సి) జురేల్ (బి) పాండ్యా 43; స్మిత్ (సి) జురేల్ (బి) వరుణ్ 6; ఓవర్టన్ (బి) వరుణ్ 0; కార్స్ (సి) తిలక్‌వర్మ (బి) వరుణ్ 3; ఆర్చర్ (బి) వరుణ్ 0; రషీద్ నాటౌట్ 10; మార్క్‌వుడ్ నాటౌట్ 10; ఎక్స్‌ట్రాలు 11; **మొత్తం (20 ఓవర్లలో 9 వికెట్లకు) 171. వికెట్ల పతనం:** 1–7, 2–83, 3–87, 4–108, 5–115, 6–115, 7–127, 8–127, 9–147. **బౌలింగ్:** షమీ 3–0–25–0, హార్దిక్ పాండ్యా 4–0–33–2, సుందర్ 1–0–15–0, వరుణ్ 4–0–24–5, రవి బిష్ణోయ్ 4–0–46–1, అక్షర్ పటేల్ 3–0–19–1, అభిషేక్ 1–0–4–0.

భారత్ ఇన్నింగ్స్: సామ్సన్ (సి) రషీద్ (బి) ఆర్చర్ 3; అభిషేక్ (సి) ఆర్చర్ (బి) కార్స్ 24; సూర్య (సి) సాల్ట్ (బి) వుడ్ 14; తిలక్ వర్మ (బి) రషీద్ 18; హార్దిక్ పాండ్యా (సి) బట్లర్ (బి) ఓవర్టన్ 40; సుందర్ (సి) బట్లర్ (బి) ఓవర్టన్ 6; అక్షర్ (సి) రషీద్ (బి) ఆర్చర్ 15; జురేల్ (సి) సాల్ట్ (బి) కార్స్ 2; షమీ (సి) బ్రూక్ (బి) ఓవర్టన్ 7; రవి బిష్ణోయ్ నాటౌట్ 4; వరుణ్ నాటౌట్ 1; ఎక్స్‌ట్రాలు 11; **మొత్తం (20 ఓవర్లలో 9 వికెట్లకు) 145. వికెట్ల పతనం:** 1–16, 2–31, 3–48, 4–68, 5–85, 6–123, 7–131, 8–140, 9–140. **బౌలింగ్:** ఆర్చర్ 4–0–33–2, వుడ్ 3–0–29–1, బ్రైడన్ కార్స్ 4–0–28–2, లివింగ్‌స్టోన్ 1–0–11–0, రషీద్ 4–0–15–1, జేమీ ఓవర్టన్ 4–0–24–3.

భళా... బుమ్రా

ఐసీసీ 2024 'క్రికెటర్ ఆఫ్ ద ఇయర్'గా ఎంపిక



దుబాయ్: భారత బౌలింగ్ తురుపుముక్క, స్టార్ పేసర్ జస్‌ప్రీత్ బుమ్రా రోజు వ్యవధిలోనే రెండు 'ఐసీసీ' అవార్డులకు ఎంపికయ్యాడు. 2024 సంవత్సరానికి 'ఐసీసీ క్రికెటర్ ఆఫ్ ద ఇయర్' అవార్డును బుమ్రా దక్కించుకున్నాడు. గతేడాది టెస్టు, టి20 ఫార్మాట్లలో ఇంటా బయటా నిలకడగా రాణించడంతో ఈ అవార్డు బుమ్రాకే లభించింది. ఈ అవార్డుకు ఎంపికైన ఐదో భారత ఆటగాడిగా బుమ్రా ఘనతకెక్కాడు. గతంలో రాహుల్ ద్రవిడ్ (2004), సచిన్ టెండూల్కర్ (2010), అశ్విన్ (2016), విరాట్ కోహ్లి (2017, 2018) 'ఐసీసీ క్రికెటర్ ఆఫ్ ద ఇయర్' అవార్డులు అందుకున్నారు. సోమవారం బుమ్రాను ఐసీసీ 'టెస్టు క్రికెటర్ ఆఫ్ ద ఇయర్' అవార్డుకు ఎంపిక చేశారు. గతేడాది బుమ్రా 21 మ్యాచ్‌లు ఆడి మొత్తం 86 వికెట్లు తీశాడు. మహిళల కేటగిరీలో న్యూజిలాండ్ ఆల్‌రౌండర్ అమెలియా కెర్ 'ఐసీసీ క్రికెటర్ ఆఫ్ ద ఇయర్' అవార్డుకు ఎంపికైంది. 24 ఏళ్ల కివీ క్రికెటర్ అన్ని ఫార్మాట్లలోనూ అద్భుతంగా రాణించడంతో ఈ పురస్కారం అందుకోనుంది.

మరిన్ని క్రీడా వార్తలు సాక్షి ప్లస్ స్పోర్ట్స్ ఈ-పేపర్‌లో

సాక్షి సినిమా



● వరలక్ష్మీ శరత్ కుమార్, అంజలి

తెలుగు ప్రేక్షకులకూ నచ్చుతుంది

– అంజలి

విశాల్ హీరోగా సుందర్. సి దర్శకత్వంలో రూపొందిన తమిళ చిత్రం 'మద గజరాజా'. ఈ చిత్రంలో వరలక్ష్మీ శరత్ కుమార్, అంజలి హీరోయిన్లుగా నటించారు. సుందర్. సి దర్శకత్వంలో జెమిని ఫిల్మ్ సర్క్యూట్ నిర్మించిన ఈ చిత్రం జనవరి 12న తమిళంలో విడుదలైంది. ఈ సినిమా తమిళంలో హిట్ మూవీగా నిలిచి, రూ. 50 కోట్లకు పైగా కలెక్షన్స్‌ను సాధించిందని చిత్రబృందం పేర్కొంది. కాగా ఈ యాక్షన్ కామెడీ ఫిల్మ్‌ను అదే టైటిల్‌తో సత్యకృష్ణన్ ప్రొడక్షన్స్ సంస్థ ఈ నెల 31న తెలుగులో విడుదల చేస్తోంది. హైదరాబాద్‌లో జరిగిన ఈ సినిమా ప్రీ రిలీజ్ ఈవెంట్‌లో అంజలి మాట్లాడుతూ– ''మంచి కమర్షియల్ ఫిల్మ్ ఇది. ఈ సినిమాను ఎంజాయ్ చేస్తూ చేశాను. ఈ మూవీ, తెలుగు ప్రేక్షకులకూ నచ్చుతుందని ఆశిస్తున్నాను'' అని అన్నారు. ''హీరోయిన్‌గా నా ఫస్ట్ కమర్షియల్ ఫిల్మ్ ఇది. ఈ చిత్రంలో వెస్టర్న్ హీరోయిన్‌గా కనిపిస్తాను'' అని తెలిపారు వరలక్ష్మీ శరత్ కుమార్. ''విశాల్‌గారు 'మద గజరాజా'తో తమిళంలో పెద్ద విజయాన్ని అందుకున్నారు. తెలుగులోనూ ఈ సినిమా విజయం సాధిస్తుందన్న నమ్మకం ఉంది'' అని అన్నారు నిర్మాత జెమిని కిరణ్.

బాపులాంటి మూవీని సపోర్ట్ చేయాలి

– విశ్వక్ సేన్



● బ్రహ్మాజీ, విశ్వక్ సేన్, ఆమని


''బాపు' టీజర్ చాలా బాగుంది. నిజాయతీగా తీసిన సినిమా ఇది... మంచి విజయం సాధిస్తుంది. ఇలాంటి చిత్రం సక్సెస్ అయితేనే మేకర్స్‌కు ఉత్సాహం వస్తుంది. అలాగే ఇలాంటి సినిమాలు చేయాలనుకునే మిగతావాళ్లకు కూడా ధైర్యం వస్తుంది'' అన్నారు హీరో విశ్వక్ సేన్. బ్రహ్మాజీ లీడ్ రోల్‌లో నటించిన చిత్రం 'బాపు'. 'ఎ ఫాదర్స్ సూసైడ్ స్టోరీ' అనేది ట్యాగ్‌లైన్. 'బలగం' సుధాకర్ రెడ్డి, ఆమని, అవసరాల శ్రీనివాస్, ధన్య బాలకృష్ణ ఇతర ప్రధాన పాత్రల్లో నటించారు. దయ దర్శకత్వంలో రాజు, సీహెచ్ భాను ప్రసాద్ రెడ్డి నిర్మించిన ఈ చిత్రం ఫిబ్రవరి 21న విడుదల కానుంది. ఈ మూవీ టీజర్ లాంచ్ ఈవెంట్‌కు విశ్వక్ సేన్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. మధుర ఆడియో ద్వారా ఈ సినిమాను విడుదల చేస్తున్న నిర్మాత 'మధుర' శ్రీధర్ మాట్లాడుతూ– ''చిన్న సినిమాలకు ప్రేక్షకులు రావడంలేదని చాలామంది అన్నారు. కానీ, 'పెళ్లి చూపులు, కేరాఫ్ కంచెరపాలెం' సినిమాలకు ఎలా వచ్చారో... 'బాపు'కి కూడా అలానే వస్తారనే గట్టి నమ్మకంతో ఉన్నాం'' అన్నారు. ''టీజర్‌ని మించి సినిమా చాలా బాగుంటుంది'' అని చెప్పారు దయ. ''ఒక డిఫరెంట్ స్టోరీతో యూనిట్ అంతా మంచి సినిమా చేశాం'' అన్నారు బ్రహ్మాజీ.



● కృతీ సనన్

ఈ పాలి యాట గురి తప్పేదేలేదేస్

– నాగచైతన్య



● నాగచైతన్య, అల్లు అరవింద్

నాగచైతన్య, సాయిపల్లవి జంటగా నటించిన చిత్రం 'తండేల్'. చందు మొండేటి దర్శకత్వంలో అల్లు అరవింద్ సమర్పణలో గీతా ఆర్ట్స్ పతాకంపై బన్నీ వాసు నిర్మించిన ఈ చిత్రం ఫిబ్రవరి 7న విడుదల కానుంది. ఈ సందర్భంగా 'తండేల్' సినిమా ట్రైలర్ లాంచ్ ఈవెంట్‌ను వైజాగ్‌లోని రామా టాకీస్ రోడ్డులోని శ్రీరామ పిక్చర్ ప్యాలెస్‌లో నిర్వహించింది చిత్రం యూనిట్. ఈ వేడుకలో నాగచైతన్య మాట్లాడుతూ– ''మన పుష్పకా బాప్ అల్లు అరవింద్‌గారు. ఏడాదిన్నర నుంచి నా లైఫ్‌లో నిజమైన తండేల్ ఆయనే. ఈ సినిమాకి ఆయన ఇచ్చిన గైడెన్స్ చాలా విలువైనది. ఏ సినిమా రిలీజ్ తర్వాత అయినా వైజాగ్ టాక్ ఏంటి? అని కనుక్కుంటాను. ఎందుకంటే... వైజాగ్‌లో సినిమా ఆడిందంటే ప్రపంచంలో ఎక్కడైనా ఆడాల్సిందే. వైజాగ్ నాకు ఎంత క్లోజ్ అంటే నేను వైజాగ్ అమ్మాయి (శోభిత)ని ప్రేమించి, పెళ్లి చేసుకుని, ఇప్పుడు... నా ఇంట్లో కూడా వైజాగ్ ఉంది. నా ఇంట్లో రూలింగ్ పార్టీ వైజాగే. 'తండేల్' సినిమాకు వైజాగ్‌లో కలెక్షన్స్ షేక్ అవ్వాలి. లేకపోతే ఇంట్లో నా పరువు పోతుంది (సరదాగా). దద్దా... గుర్తెట్టుకో... ఈ పాలి యాట గురి తప్పేదేలేదేస్. ఫిబ్రవరి 7న రాజులమ్మ జాతరే'' అని అన్నారు. అల్లు అరవింద్ మాట్లాడుతూ– ''శ్రీకాకుళంలో ఒక చిన్న ఊర్లో జరిగిన కథను సినిమాగా తీశాం. నాగచైతన్య ఏ సినిమాలోనూ ఇంతవరకు నటించని స్థాయిలో ఈ సినిమాలో నటించారు. కొన్ని సీన్స్ చూస్తే మన గుండె కరిగిపోయేలా నటించారు. ఈ కథను చందు మొండేటి అత్యద్భుతంగా మలిచి, చాలా బాగా తీశారు. సాయిపల్లవిగారు అద్భుతంగా నటించారు. దేవిశ్రీ ప్రసాద్ మ్యూజిక్ చించిపడేశాడు'' అని తెలిపారు.

యాక్షన్... థ్రిల్



● అదితీ శంకర్, ఆకాశ్ మురళి, విష్ణువర్ధన్

ఆకాశ్ మురళి, అదితీ శంకర్ జంటగా 'పంజా' ఫేం విష్ణువర్ధన్ దర్శకత్వం వహించిన రొమాంటిక్ యాక్షన్ థ్రిల్లర్ 'ప్రేమిస్తావా'. 'నేసిప్పాయా' పేరుతో తమిళంలో విడుదలై, హిట్‌గా నిలిచింది. ఈ చిత్రాన్ని మైత్రీ మూవీ మేకర్స్ తెలుగులో 'ప్రేమిస్తావా' పేరుతో ఈ నెల 30న విడుదల చేస్తోంది. హైదరాబాద్‌లో నిర్వహించిన ఈ మూవీ ట్రైలర్ లాంచ్‌లో మైత్రీ మూవీ డిస్ట్రిబ్యూటర్స్ శశి మాట్లాడుతూ– ''ఈ సినిమా మేకింగ్, ఆర్ఆర్ చాలా బాగున్నాయి'' అని చెప్పారు. ''ప్రస్తుతం సమాజంలో బంధాలు ఎలా ఉన్నాయి? అనేది మా చిత్రం చూపిస్తుంది'' అన్నారు విష్ణువర్ధన్. ''ప్రేమిస్తావా'ని అందరూ సపోర్ట్ చేయాలి'' అని సహ నిర్మాత స్నేహ బ్రిట్టో కోరారు. ''నా తొలి సినిమాను తెలుగులో మైత్రీ మూవీ డిస్ట్రిబ్యూటర్స్ విడుదల చేయడం నా అదృష్టం'' అని చెప్పారు ఆకాశ్ మురళి. ''ఈ చిత్రంలో ప్రేమ, యాక్షన్, రొమాన్స్ ఉన్నాయి'' అని తెలిపారు అదితీ శంకర్.

నా పని అయిపోయిందన్నారు

– 'అమ్మ' రాజశేఖర్



● రాగిణ్ రాజ్, 'అమ్మ' రాజశేఖర్, అంకిత

''మా అమ్మకు ఒంట్లో బాగోలేకపోవడం వల్ల ఇండస్ట్రీలో కాస్త విరామం వచ్చింది. దీంతో అందరూ నా పనైపోయిందని చెప్పారు. ప్రస్తుతం నేను ఫ్రీ. ఇప్పుడు 'తల' సినిమాతో వస్తున్నా. నా కొడుకు రాగిణ్ రాజ్‌తో సినిమా చేయాలనే నా కోరిక 'తల'తో నెరవేరింది. కొత్తదనం కావాలనుకునే వాళ్లు మా సినిమాని హ్యాపీగా చూడొచ్చు'' అని 'అమ్మ' రాజశేఖర్ చెప్పారు. ఆయన తనయుడు అమ్మ రాగిణ్ రాజ్ హీరోగా, అంకిత నాన్సర్ హీరోయిన్‌గా తెరకెక్కిన చిత్రం 'తల'. రోహిత్, ఎస్తేర్ నోరోన్హా, 'సత్యం' రాజేశ్, రాజీవ్ కనకాల, ఇంద్రజ కీలక పాత్రలు పోషించారు. 'అమ్మ' రాజశేఖర్ దర్శకత్వంలో పి. శ్రీనివాస్ గౌడ్ నిర్మించారు. రాధా రాజశేఖర్ ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్. ఈ సినిమా ఫిబ్రవరి 14న తెలుగు, తమిళ భాషల్లో విడుదల కానుంది. హీరోలు సోహైల్, అశ్విన్ చేతుల మీదుగా ఈ మూవీ ట్రైలర్ రిలీజ్ చేశారు. ''మా అమ్మానాన్న ఈ సినిమా కోసం చాలా కష్టపడ్డారు'' అని అమ్మ రాగిణ్ రాజ్ తెలిపారు.

అమ్మాయిలూ ప్రాణాలర్పించగలరు

ప్రేమ కోసం ప్రాణాలర్పించే ధైర్యం అమ్మాయిలకూ ఉంటుందని చెబుతున్నారు హీరోయిన్ కృతీ సనన్. 'రాంఝూణా (2013), అత్రంగి రే (2021)' చిత్రాల తర్వాత హీరో ధనుష్, దర్శకుడు ఆనంద్ ఎల్. రాయ్ కాంబినేషన్‌లో రూపొందుతున్న రొమాంటిక్ లవ్‌స్టోరీ 'తేరే ఇష్క్ మే'. 2023లోనే ఈ సినిమాను అధికారికంగా ప్రకటించినప్పటికీ కొన్ని కారాణాల వల్ల ఇంకా చిత్రీకరణ ఆరంభించ లేదు. ఈ ఏడాది ఈ చిత్రం షూటింగ్ మొదలు పెట్టాలనుకుంటున్నారు. కాగా ఈ మూవీలో ధనుష్ సరసన హీరోయిన్‌గా ముక్తి అనే పాత్రలో కృతీ సనన్ నటించనున్నట్లు మంగళవారం వెల్లడించి, ఈ పాత్ర తాలుకూ వీడియోను రిలీజ్ చేశారు. ''శంకర్... (ధనుష్ పాత్రను ఉద్దేశించి కావొచ్చు) ప్రేమ కోసం అబ్బాయిలే ప్రాణాలర్పిస్తారా? కొంతమంది అమ్మాయిలకు కూడా ఆ ధైర్యం ఉంది' అని అర్థం వచ్చేలా కృతీ సనన్ హిందీలో డైలాగ్స్ చెబుతూ, ఒంటిపై పెట్రోల్ పోసుకుని, ఆత్మహత్యాయత్నానికి రెడీ అవుతున్న విజువల్స్ కనిపిస్తాయి. నవంబరు 28న హిందీ, తమిళ భాషల్లో ఈ చిత్రం రిలీజ్ కానుంది.

మోహన్‌లాల్ మూవీలో..?



● మాళవికా మోహనన్

మోహన్‌లాల్ హీరోగా సత్యన్ అంతికాడ్ దర్శకత్వంలో 'హృదయపూర్వం' అనే మూవీ తెరకెక్కనున్న సంగతి తెలిసిందే. ఆంటోనీ పెరుంబవూర్ ఈ సినిమాను నిర్మించనున్నారు. కాగా ఈ సినిమాలో హీరోయిన్‌గా మాళవికా మోహనన్‌కు అవకాశం లభించిందని మాలీవుడ్ సమాచారం. కథ నచ్చడం, పైగా మోహన్‌లాల్ మూవీ కూడా కావడంతో ఈ సినిమాకు మాళవికా మోహనన్ గ్రీన్ సిగ్నల్ ఇచ్చారట. ఈ సినిమా రెగ్యులర్ షూటింగ్ ఫిబ్రవరి 10 నుంచి ప్రారంభం కానుందని, నాలుగు రోజుల తర్వాత ఈ మూవీ షెడ్యూల్‌లో మోహన్‌లాల్ జాయిన్ అవుతారని తెలిసింది.

వేట మొదలైంది



● తేజస్

తేజస్ వీరమాచినేని హీరోగా, రోమి, దేవిక, ప్రత్యూష హీరోయిన్లుగా రూపొందిన చిత్రం 'రాజా మార్కండేయ'. 'వేట మొదలైంది' అనేది ఉప శీర్షిక. బన్నీ అశ్వంత్ దర్శకత్వంలో సామా శ్రీధర్, పంజాల వెంకట్ గౌడ్ నిర్మించారు. సత్యదీప్, యస్‌కే మీరావలి, రాయారావు విశ్వేశ్వరరావు సంగీతం అందించిన ఈ చిత్రం ఆడియో, టీజర్, ట్రైలర్ ఆవిష్కరణ హైదరాబాద్‌లో నిర్వహించారు. హైకోర్ట్ అడ్వొకేట్ రాపోలు భాస్కర్ టీజర్‌ని లాంచ్ చేశారు. ట్రైలర్ రిలీజ్ చేసిన నటుడు సుమన్ మాట్లాడుతూ– ''టీజర్, ట్రైలర్ చూస్తుంటే సినిమాలో మంచి కంటెంట్ ఉందనిపిస్తోంది'' అన్నారు. ''శివుడి భక్తుడైన మార్కండేయ జీవితంలో ఎలాంటి కష్టాలు ఎదురయ్యాయి? వాటిని శివానుగ్రహంతో ఎలా అధిగమించాడు? అనేది ఈ కథ'' అన్నారు బన్నీ అశ్వంత్ .

సాక్షి బిజినెస్
బుధవారం
29-1-2025

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు		
సెన్సెక్స్ ▲	535	75,901
నిఫ్టీ ▲	128	22,957

విదేశీ సూచీలు (సోమవారం రాత్రి 11.30 గంటలకు)

సూచీ	విలువ	మార్పు
నాస్‌డాక్	19,663	▲ 318
డోజోన్స్	44,831	▲ 118
ఎఫ్‌టీఎస్‌ఈ 100	8,534	▲ 30
డాక్స్	21,431	▲ 148
షాంఘై (సోమవారం ముగింపు)	3,251	▽ 2
నికాయ్	39,017	▽ 549

•అమెరికా •బ్రిటన్ •జర్మనీ •చైనా •జపాన్

బులియన్ రూ.లలో — ముంబై

	ధర	మార్పు
బంగారం (24 క్యారట్)	80,313	▽ 84
బంగారం (22 క్యారట్)	79,991	▽ 84
వెండి (కిలో)	89,750	▽ 524

ఫారెక్స్ రేట్లు రూ.లలో

	కరెన్సీ		కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	ఎస్‌బీఐ	81.10	82.77
£	బ్రిటన్ పౌండ్	ఎస్‌బీఐ	88.71	91.81
€	యూరో	ఎస్‌బీఐ	99.82	103.20
¥	జపాన్ ఎన్ (100)	ఎస్‌బీఐ	62.71	64.78
AUS	ఆస్ట్రేలియా డాలర్	ఎస్‌బీఐ	57.37	59.77
S$	సింగపూర్ డాలర్	ఎస్‌బీఐ	61.81	63.86
SAR	సౌదీ రియాల్	థామస్‌కుక్	20.92	22.59
UAE D	యూఏఈ దిర్హామ్	థామస్‌కుక్	21.48	23.27
¥	చైనా యువాన్	థామస్‌కుక్	11.01	13.11

హ్యుందాయ్ లాభాలకు బ్రేక్

క్యూ3లో రూ. 1,161 కోట్లు



న్యూఢిల్లీ: కార్ల తయారీ దిగ్గజం హ్యుందాయ్ మోటార్ ఇండియా ప్రస్తుత ఆర్థిక సంవత్సరం(2024–25) మూడో త్రైమాసికంలో ఆసక్తికర ఫలితాలు ప్రకటించింది. కన్సాలిడేటెడ్ ప్రాతిపదికన అక్టోబర్–డిసెంబర్(క్యూ3)లో నికర లాభం 19 శాతం క్షీణించి రూ. 1,161 కోట్లకు పరిమితమైంది. రాజకీయ, భౌగోళిక అనిశ్చితులు, డిమాండ్ మందగమనం ప్రభావం చూపాయి. గతేడాది(2023–24) ఇదే కాలంలో రూ. 1,425 కోట్లు ఆర్జించింది. మొత్తం ఆదాయం రూ. 16,875 కోట్ల నుంచి రూ. 16,648 కోట్లకు స్వల్ప వెనకడుగు వేసింది. ఈ కాలంలో 2 శాతం తక్కువగా 1,86,408 ప్రయాణికుల వాహనాలను విక్రయించింది. వీటిలో దేశీ విక్రయాలు 1,46,022 యూనిట్లుగా నమోదయ్యాయి. ఎస్‌యూవీ విభాగం ఇందుకు సహకరించింది. 40,386 వాహనాలను ఎగుమతి చేసింది. కొత్తగా విడుదల చేసిన క్రెటా ఎలక్ట్రిక్ మోడల్ భారీ విజయాన్ని సాధించనున్నట్లు కంపెనీ విశ్వాసాన్ని వ్యక్తం చేసింది.

బీఎస్‌ఈలో హ్యుందాయ్ షేరు 1.3 శాతం నష్టంతో రూ. 1,623 వద్ద ముగిసింది.

బజాజ్ ఆటో లాభం ప్లస్

క్యూ3లో రూ. 2,196 కోట్లు



న్యూఢిల్లీ: ద్విచక్ర, త్రిచక్ర వాహన దిగ్గజం బజాజ్ ఆటో ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2024–25) మూడో త్రైమాసికంలో పటిష్ట ఫలితాలు సాధించింది. కన్సాలిడేటెడ్ ప్రాతిపదికన అక్టోబర్–డిసెంబర్(క్యూ3)లో నికర లాభం 8 శాతం పుంజుకుని రూ. 2,196 కోట్లను తాకింది. ప్రధానంగా ఎగుమతులు ఇందుకు సహకరించాయి. గతేడాది(2023–24) ఇదే కాలంలో రూ. 2,033 కోట్లు ఆర్జించింది. మొత్తం ఆదాయం సైతం రూ. 12,165 కోట్ల నుంచి రూ. 13,169 కోట్లకు బలపడింది. ఈ కాలంలో మొత్తం వాహన విక్రయాలు 2 శాతం వృద్ధితో 12,24,472 యూనిట్లను తాకాయి. వీటిలో దేశీ అమ్మకాలు 9 శాతం క్షీణించి 7,07,105 యూనిట్లకు పరిమితమయ్యాయి. అయితే ఎగుమతులు 22 శాతం జంప్‌చేసి 5,17,367 యూనిట్లకు చేరాయి. ఫైనాన్సింగ్ అనుబంధ సంస్థకు రూ. 1,600 కోట్ల మూలధనాన్ని అందించడంతోపాటు.. రూ. 450 కోట్ల పెట్టుబడులు చేపట్టింది. అయినప్పటికీ 2024 డిసెంబర్‌కల్లా రూ. 15,001 కోట్ల మిగులు నగదుతో పటిష్ట బ్యాలన్స్‌షీట్‌ను కలిగి ఉన్నట్లు కంపెనీ వెల్లడించింది.

బీఎస్‌ఈలో బజాజ్ ఆటో షేరు స్వల్ప లాభంతో రూ. 8,393 వద్ద ముగిసింది.

మార్జిన్లు నిలుపుకుంటాం

కెనరా బ్యాంక్ ఎండీ, సీఈవో సత్యనారాయణ రాజు



హైదరాబాద్: ప్రభుత్వ రంగ సంస్థ కెనరా బ్యాంక్ తాజాగా ఈ ఆర్థిక సంవత్సరం(2024–25) మూడో త్రైమాసిక ఫలితాలు విడుదల చేసింది. అక్టోబర్–డిసెంబర్(క్యూ3)లో నికర లాభం 12 శాతం ఎగసి రూ. 4,104 కోట్లను తాకింది. ఈ సందర్భంగా వర్చువల్‌గా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎండీ, సీఈవో కె.సత్యనారాయణ రాజు బ్యాంక్ ఫలితాలపై స్పందించారు. నికర వడ్డీ ఆదాయం మందగించినప్పటికీ తదుపరి దశలో నెమ్మదిగా పుంజుకుంటుందని చెప్పారు. డిపాజిట్ సమీకరణలో సవాళ్ల కారణంగా నికర వడ్డీ మార్జిన్లపై ఒత్తిడి పడుతున్నట్లు తెలియజేశారు. అయితే 2.8 శాతం స్థాయిలో వీటిని నిలుపుకోనున్నట్లు తెలియజేశారు.

ఆటోమొబైల్‌కు ఇంధనం కావాలి



అమ్మకాల వృద్ధి బలహీనతను, ఎన్నో సవాళ్లను ఎదుర్కొంటున్న ఆటోమొబైల్ రంగంలో జోష్ నింపేందుకు బడ్జెట్‌లో పలు రకాల ప్రోత్సాహక చర్యలకు చోటు కల్పించాలని పరిశ్రమ గట్టిగా డిమాండ్ చేస్తోంది. 2025 బడ్జెట్‌పై ఆటోమొబైల్ పరిశ్రమ ఎన్నో అంచనాలతో ఉంది. వినియోగదారుల చేతుల్లో ఆదాయం మిగులు దిశగా చర్యలు చేపట్టాలని, ఇది వాహన విక్రయాల వృద్ధికి ఊతం ఇస్తుందని భావిస్తున్నాయి. ఎలక్ట్రిక్ వాహన (ఈవీ) కొనుగోలుకు వినియోగదారులు ఆసక్తి చూపిస్తుండడంతో చార్జింగ్ వసతులు సహా, ఈవీ ఎకోసిస్టమ్ బలోపేతానికి మరిన్ని చర్యలు అవసరమని పరిశ్రమ వర్గాలు కోరుతున్నాయి. అదే సమయంలో పర్యావరణ అనుకూల గ్రీన్ టెక్నాలజీలకు, ప్రత్యామ్నాయ ఇంధనాలకు విధానపరమైన మద్దతు అవసరమని పేర్కొన్నాయి.

- వినియోగదారులకు ఆదాయం మిగులు దిశగా చర్యలు
- పర్యావరణ అనుకూల ఇంధనాలు, టెక్నాలజీలకు ప్రోత్సాహం
- సానుకూల పన్నుల విధానం తీసుకురావాలి
- ఆటోమొబైల్ పరిశ్రమ డిమాండ్లు

- పాత వాహనాల తుక్కు విధానానికి బడ్జెట్‌లో మరిన్ని ప్రోత్సాహకాలు కల్పించాలి. దీనివల్ల కొత్త తరం వాహనాల డిమాండ్ పెరుగుతుంది.
- ఈవీల తయారీకి ప్రోత్సాహకాల పరంగా బలమైన మద్దతు అవసరం. కేవలం వినియోగదారులకే కాకుండా, పర్యావరణ అనుకూల పరిష్కారాలను అనుసరించే వ్యాపార సంస్థలకూ ప్రోత్సాహకాలు ప్రకటించాలి.
- ఆవిష్కరణలకు, టెక్నాలజీకి ఊతమిచ్చేలా పీఎల్‌ఐ పథకాలను మరింతగా అందుబాటులోకి తీసుకురావాలి.
- ఈవీ కొనుగోలు, ఈవీ సదుపాయాలకు సంబంధించి రుణాలపై అధిక వడ్డీ రేట్లు సవాలుగా మారాయి. వీటిని అందుబాటులోకి తీసుకురావాలి. రుణ వితరణ పరిస్థితులను సులభతరంగా మార్చాలి.
- ఎలక్ట్రిక్ వాహనాల చార్జింగ్ స్టేషన్ల ఏర్పాటుకు, సురక్షిత రహదారుల కోసం బడ్జెట్‌లో మరిన్ని నిధులు కేటాయించాలి.

– సాక్షి, బిజినెస్ డెస్క్



పూర్తిస్థాయి గ్రీన్ టెక్నాలజీలకు, ప్రత్యామ్నాయ ఇంధనాలకు ప్రాచుర్యం కల్పించేందుకు ఫలితాన్నిచ్చే విధానాలను ప్రభుత్వం తీసుకురావాలి. దీనివల్ల ఒకటికి మించిన మొబిలిటీ పరిష్కారాలను పెద్ద ఎత్తున వినియోగంలోకి తీసుకురావచ్చు.

– విక్రమ్ గులాటీ, టయోటా కిర్లోస్కర్ మోటార్ కంట్రీ హెడ్



భిన్నమైన ఆటోమోటివ్ టెక్నాలజీలకు సానుకూలమైన పన్నుల విధానంపై దీర్ఘకాలిక దృష్టి అవసరం. వివిధ రకాల వాహనాలకు, విడి భాగాలకు సులభతర జీఎస్‌టీ రేట్లను ప్రకటించాలి. ఉత్పత్తుల అభివృద్ధికి సుదీర్ఘకాలం పడుతుంది. ఇందుకు గణనీయమైన పెట్టుబడులు అవసరం అవుతాయి. ఈ అంశాలను ప్రభుత్వం పరిగణనలోకి తీసుకోవాలి.

– పియూష్ అరోరా, ఫోక్స్‌వ్యాగన్ ఇండియా సీఈవో



వినియోగదారుల వ్యయాలను ప్రోత్సహించే దిశగా బడ్జెట్‌లో చర్యలు ఉంటాయని ఆశిస్తున్నాం. అలాగే, ఈవీల వినియోగాన్ని పెంచేందుకు తగిన ప్రోత్సాహకాలు, మౌలిక సదుపాయాల అభివృద్ధి, పరిశ్రమ అవసరాలను తీర్చే దిశగా నైపుణ్య అభివృద్ధి కార్యక్రమాలపై పెట్టుబడులు పెట్టాలి.

– జ్యోతి మల్హోత్రా, వోల్వో కార్ ఇండియా ఎండీ

బ్యాంకులు, ఫైనాన్స్ షేర్ల జోరు



- ఆర్‌బీఐ ద్రవ్య లభ్యత పెంపు ప్రకటన ప్రభావం
- రెండు రోజుల నష్టాలకు చెక్
- సెన్సెక్స్ 535 పాయింట్లు ప్లస్

ముంబై: ఆర్థిక వ్యవస్థలో ద్రవ్య లభ్యత పెంచేందుకు ఆర్‌బీఐ చర్యలు చేపట్టడంతో బ్యాంకులు, ఫైనాన్స్ షేర్లు రాణించాయి. వచ్చే నెల ద్రవ్య పరపతి సమావేశంలో వడ్డీరేట్ల తగ్గింపు ఉండొచ్చనే అంచనాలూ మరింత ఉత్సాహాన్నిచ్చాయి. ఫలితంగా మంగళవారం సెన్సెక్స్ 535 పాయింట్లు పెరిగి 75,901 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 128 పాయింట్లు బలపడి 22,957 వద్ద నిలిచింది. దీంతో సూచీలు రెండు రోజుల వరుస నష్టాల నుంచి గట్టెక్కినట్టైంది. ఉదయం లాభాలతో మొదలైన సూచీలు రోజంతా అదే ట్రెండ్ కొనసాగించాయి. బ్యాంకులు, ఫైనాన్స్‌తో పాటు వడ్డీరేట్ల సంబంధిత షేర్లైన ఆటో, రియల్టీ, కన్జూమర్ షేర్లకూ కొనుగోళ్ల మద్దతు లభించింది. ఒక దశలో సెన్సెక్స్ 1,145 పాయింట్లు బలపడి 76,513 వద్ద, నిఫ్టీ 308 పాయింట్లు ఎగసి 23,138 వద్ద ఇంట్రాడే గరిష్టాన్ని తాకాయి. అయితే ట్రేడింగ్ చివర్లో ఫార్మా, ఇండస్ట్రియల్, యుటిలిటీస్, క్యాపిటల్ గూడ్స్, విద్యుత్, ఆయిల్‌అండ్‌గ్యాస్, ఇంధన, ఐటీ షేర్లలో అమ్మకాల ఒత్తిడి కారణంగా సూచీలు కొంత లాభాలు కోల్పోయాయి. ట్రంప్ వాణిజ్య విధానాలపై అనిశ్చితులు, ఫెడ్ రిజర్వ్ వడ్డీ రేట్ల తగ్గింపుపై అనుమానాలు, చైనా ఏఐ స్టార్టప్ డీప్‌సీక్ ప్రకంపనల ప్రభావంతో అంతర్జాతీయ ఈక్విటీ మార్కెట్లు నష్టాల్లో ట్రేడవుతున్నాయి.

- ట్రంప్ వాణిజ్య సుంకాల పెంపు భయాలతో డాలర్‌తో రూపాయి మారకం విలువ 26 పైసలు క్షీణించి 86.57 వద్ద ముగిసింది.
- ఆర్థిక వ్యవస్థలోకి రూ.1.50 లక్షల కోట్లు జొప్పించేందుకు ఆర్‌బీఐ పలు చర్యలు ప్రకటించడంతో బ్యాంకింగ్ రంగ షేర్లు మెరిశాయి. యాక్సిస్ బ్యాంకు 3.20%, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకు 3%, ఐసీఐసీఐ బ్యాంకు 2.15%, ఇండస్‌ఇండ్ బ్యాంక్ 2% లాభపడ్డాయి. బ్యాంకు ఆఫ్ బరోడా, ఎస్‌బీఐ, కోటక్ మహీంద్రా బ్యాంకు షేర్లు 1–0.50% పెరిగాయి. మరోవైపు ఫెడరల్ బ్యాంక్ 5%, యస్ బ్యాంక్ 1.5%, కెనరా బ్యాంకు 1% మేర నష్టపోయాయి.

జీఎంఆర్ ఎయిర్‌పోర్ట్స్ లాభాల బాట



హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: విమానాశ్రయాల వ్యాపారంలో ఉన్న జీఎంఆర్ ఎయిర్‌పోర్ట్స్ (గతంలో జీఎంఆర్ ఎయిర్‌పోర్ట్స్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్) డిసెంబర్ త్రైమాసికం కన్సాలిడేటెడ్ ఫలితాల్లో రూ.202 కోట్ల నికరలాభం ప్రకటించింది. అంతక్రితం ఏడాది ఇదే కాలంలో కంపెనీ రూ.486 కోట్ల నష్టం చవిచూసింది. ఎబిటా 37% దూసుకెళ్లి రూ.1,087 కోట్లు నమోదైంది. టర్నోవర్ 17 శాతం అధికమై రూ.2,748 కోట్లకు చేరింది. బీఎస్‌ఈలో కంపెనీ షేరు ధర 0.85 శాతం పెరిగి రూ.71.13 వద్ద స్థిరపడింది.

'సాక్షి ప్లస్' ఈ-పేపర్‌లో ..
రియల్టీపైనే కుబేరుల కన్ను
హిందుస్తాన్ జింక్ లాభం జూమ్

భవిత

స్పర్ధయా వర్ధతే విద్య



బీఈసీఐఎల్, న్యూఢిల్లీలో 170 నర్సింగ్ ఆఫీసర్ పోస్టులు

న్యూఢిల్లీలోని బ్రాడ్‌కాస్ట్ ఇంజనీరింగ్ కన్సల్టెంట్స్ ఇండియా లిమిటెడ్(బీఈసీఐఎల్).. నర్సింగ్ ఆఫీసర్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- » **మొత్తం పోస్టుల సంఖ్య:** 170.
- » **అర్హత:** పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో బీఎస్సీ నర్సింగ్ ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం ఉండాలి. వయసు 30ఏళ్లు ఉండాలి.
- » **వేతనం:** నెలకు రూ.28,000.
- » **ఎంపిక విధానం:** స్కిల్ టెస్ట్, ఇంటర్వ్యూ ఆధారంగా ఎంపికచేస్తారు.
- » **దరఖాస్తు విధానం:** ఆఫ్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి. దరఖాస్తును బ్రాడ్‌కాస్ట్ ఇంజనీరింగ్ కన్సల్టెంట్స్ ఇండియా లిమిటెడ్ (బీఈసీఐఎల్), బీఈసీఐఎల్ భవన్, సీ–56/అ17, సెక్టార్–62, నోయిడా–201307(యూపీ) చిరునామకు పంపించాలి.
- » **దరఖాస్తులకు చివరితేది:** 04.02.2025.
- » **వెబ్‌సైట్:** www.becil.com

ఎయిమ్స్ భువనేశ్వర్‌లో 51 ఫ్యాకల్టీ పోస్టులు

ఆల్ ఇండియా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్(ఎయిమ్స్).. వివిధ విభాగాల్లో ఫ్యాకల్టీ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- » **మొత్తం పోస్టుల సంఖ్య:** 51.
- » **పోస్టుల వివరాలు:** ప్రొఫెసర్–81, అడిషనల్ ప్రొఫెసర్–04, అసోసియేట్ ప్రొఫెసర్–10, అసిస్టెంట్ ప్రొఫెసర్–19.
- » **అర్హత:** పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో ఎండీ/ఎంఎస్/ఎంసీహెచ్ /డీఎం ఉత్తీర్ణతతోపాటు పని అనుభవం ఉండాలి. **వయసు:** 21.02.2025 నాటికి 58 ఏళ్లు మించకూడదు.
- » **వేతనం:** నెలకు ప్రొఫెసర్ పోస్టుకు రూ.1,68,900, అడిషనల్ ప్రొఫెసర్‌కు రూ.1,48,200, అసోసియేట్ ప్రొఫెసర్‌కు రూ.1,38,300, అసిస్టెంట్ ప్రొఫెసర్‌కు రూ.1,01,500.
- » **ఎంపిక విధానం:** ఇంటర్వ్యూ ఆధారంగా.
- » **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా
- » **దరఖాస్తులకు చివరితేది:** 21.02.2025.
- » **వెబ్‌సైట్:** https://aiimsbhubaneswar.nic.in

బీసీపీఎల్‌లో 70 అప్రెంటిస్‌లు

బ్రహ్మపుత్ర క్రాకర్ అండ్ పాలిమర్ లిమిటెడ్(బీసీపీఎల్)..వివిధ విభాగాల్లో గ్రాడ్యుయేట్,టెక్నీషియన్ అప్రెంటిస్‌ల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- » **మొత్తం ఖాళీల సంఖ్య:** 70.
- » **విభాగాలు:** మెకానికల్, కెమికల్, టెలికాం, ఎలక్ట్రికల్, ఎలక్ట్రానిక్స్, కంప్యూటర్ సైన్స్, ఇన్‌స్ట్రుమెంటేషన్, సివిల్, హ్యూమన్ రిసోర్స్.
- » **అర్హత:** డిప్లొమా, డిగ్రీ, బీటెక్(సివిల్, ఎలక్ట్రికల్, ఎలక్ట్రానిక్స్)లో ఉత్తీర్ణులవ్వాలి. **వయసు:** 31.01.2025 నాటికి 28 ఏళ్లు మించకూడదు.
- » **స్టైపెండ్:** గ్రాడ్యుయేట్ అప్రెంటిస్‌కు నెలకు రూ.9000, టెక్నీషియన్‌కు రూ.8000.
- » **ఎంపిక విధానం:** విద్యార్హతల్లో సాధించిన మెరిట్ ఆధారంగా ఎంపికచేస్తారు.
- » **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా
- » **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 12.02.2025
- » **వెబ్‌సైట్:** https://bcplonline.co.in

ఎన్‌హెచ్‌ఏఐ, ఢిల్లీలో డిప్యూటీ మేనేజర్ పోస్టులు

ఢిల్లీలోని నేషనల్ హైవేస్ అథారిటీ ఆఫ్ ఇండియా(ఎన్‌హెచ్‌ఏఐ).. డైరెక్ట్ రిక్రూట్‌మెంట్ ప్రాతిపదికన డిప్యూటీ మేనేజర్(టెక్నికల్) పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- » **మొత్తం పోస్టుల సంఖ్య:** 60.
- » **అర్హత:** బ్యాచిలర్ డిగ్రీ(సివిల్ ఇంజనీరింగ్) ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం ఉండాలి.
- » **వయసు:** 30 ఏళ్లు మించకూడదు. ఓబీసీలకు మూడేళ్లు, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు ఐదేళ్లు, దివ్యాంగులకు పదేళ్లు సడలింపు ఉంటుంది.
- » **వేతనం:** నెలకు రూ.56,100 నుంచి రూ.1,77,500.
- » **ఎంపిక విధానం:** గేట్ స్కోరు–2024, ఇంటర్వ్యూ ఆధారంగా ఎంపికచేస్తారు.
- » **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా
- » **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 24.02.2025
- » **వెబ్‌సైట్:** https://nhai.gov.in

ఈ స్పెషలైజేషన్స్.. వెరీ స్పెషల్!

మాస్టర్ ఆఫ్ బిజినెస్ అడ్మినిస్ట్రేషన్.. సంక్షిప్తంగా ఎంబీఏ! బ్యాచిలర్ డిగ్రీ ఉత్తీర్ణుల్లో ఎక్కువ మంది ఆసక్తి చూపే కోర్సు ఇది! ఎంబీఏలో సాంప్రదాయ ఫైనాన్స్, హెచ్‌ఆర్, మార్కెటింగ్‌తోపాటు ఇప్పుడు ఎన్నో స్పెషలైజేషన్లు అందుబాటులోకి వస్తున్నాయి. వీటిని ఐఐఎంలతోపాటు పలు ప్రముఖ బీ స్కూల్స్ అందిస్తున్నాయి. ప్రస్తుతం ఐఐఎంల్లో ఎంబీఏ ప్రవేశాల ప్రక్రియ ప్రారంభమైంది. ఈ నేపథ్యంలో.. ఎంబీఏలో వినూత్న స్పెషలైజేషన్స్, భవిష్యత్తు అవకాశాలపై ప్రత్యేక కథనం..

- » ఎంబీఏలో వినూత్న స్పెషలైజేషన్స్
- » మార్కెట్ డిమాండ్‌కు అనుగుణంగా కొత్త ప్రోగ్రామ్స్
- » రిటైల్ నుంచి రూరల్ మేనేజ్‌మెంట్ వరకు విభిన్న స్పెషలైజేషన్స్
- » ఐఐఎంలు సహా పలు బీస్కూల్స్‌లో కొత్త స్పెషలైజేషన్లు



ఎంబీఏ అనగానే ఫైనాన్స్, హ్యూమన్ రిసోర్స్ మేనేజ్‌మెంట్, మార్కెటింగ్ మేనేజ్‌మెంట్ వంటి స్పెషలైజేషన్స్ గుర్తొస్తాయి. కానీ నేటి కార్పొరేట్ యుగంలో అనేక సరికొత్త స్పెషలైజేషన్లు అందుబాటులోకి వస్తున్నాయి. ముఖ్యంగా ఇంటర్నేషనల్ బిజినెస్, రూరల్ మేనేజ్‌మెంట్, హాస్పిటల్ అడ్మినిస్ట్రేషన్, రిటైల్ మేనేజ్‌మెంట్ తదితర స్పెషలైజేషన్స్ ఎంబీఏ అభ్యర్థుల కెరీర్‌కు మరింత ఊతమిస్తున్నాయి.

ఎంబీఏ ఇంటర్నేషనల్ బిజినెస్

ఇటీవల కాలంలో అత్యంత ఆదరణ పొందుతున్న స్పెషలైజేషన్.. ఇంటర్నేషనల్ బిజినెస్. గ్లోబలైజేషన్ నేపథ్యంలో అంతర్జాతీయంగా వివిధ దేశాలతో వాణిజ్య కార్యకలాపాలు విస్తరిస్తున్నాయి. అంతర్జాతీయ వాణిజ్యంలో అమలవుతున్న విధానాలు, వ్యూహాలకు సంబంధించి నైపుణ్యాలు అందించే స్పెషలైజేషన్‌గా ఇంటర్నేషనల్ బిజినెస్‌కు పేరుంది. ఈ స్పెషలైజేషన్‌తో ఎంబీఏ పూర్తి చేసుకుంటే.. బహుళ జాతి సంస్థల్లో ఇంటర్నేషనల్ బిజినెస్ డెవలప్‌మెంట్ మేనేజర్, ఇంటర్నేషనల్ మార్కెటింగ్ మేనేజర్, గ్లోబల్ బిజినెస్ మేనేజర్, ఇన్వెస్ట్‌మెంట్ బ్యాంకింగ్ మేనేజర్ వంటి కొలువులు సొంతం చేసుకోవచ్చు.

రూరల్ మేనేజ్‌మెంట్

సామాజిక సేవా దృక్పథం, సహనం, వైవిధ్యం కోరుకునే వారికి సంతృప్తితోపాటు సంపాదనను అందించే స్పెషలైజేషన్.. రూరల్ మేనేజ్‌మెంట్! దేశంలోని గ్రామీణ ప్రజలకు ప్రభుత్వాలు అనేక పథకాలు అమలు చేస్తున్నాయి. అదే విధంగా యూనిసెఫ్ వంటి అంతర్జాతీయ సంస్థలు పలు పథకాలు రూపొందిస్తున్నాయి. అంతేకాకుండా ఐక్యరాజ్యసమితి మిలీనియం డెవలప్‌మెంట్ గోల్స్‌లో భాగంగా గ్రామీణాభివృద్ధికి పెద్దపీట వేసి.. పలు సంక్షేమ పథకాలకు శ్రీకారం చుట్టి ప్రత్యేక విభాగాలను ఆవిష్కరించింది(ఉదా: ఫుడ్ అండ్ అగ్రికల్చర్ ఆర్గనైజేషన్ ఆఫ్ ది యునైటెడ్ నేషన్స్). వాటి సమర్థ నిర్వహణకు నిపుణుల అవసరం ఏర్పడుతోంది.

ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలతోపాటు, పలు స్వచ్ఛంద సంస్థలు చేపట్టే కార్యకలాపాల నిర్వహణపై అవగాహన పెంచేలా రూరల్ మేనేజ్‌మెంట్ స్పెషలైజేషన్ స్వరూపం ఉంటుంది.ప్రతిష్టాత్మక ఇన్‌స్టిట్యూట్‌లుగా పేరొందిన ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్(అహ్మదాబాద్), టాటా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సోషల్ సైన్సెస్(ముంబై), ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ రూరల్ మేనేజ్‌మెంట్(ఆనంద్),కేంద్ర ప్రభుత్వ పరిధిలోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ రూరల్ డెవలప్‌మెంట్(హైదరాబాద్)లు పూర్తిస్థాయిలో రూరల్ మేనేజ్‌మెంట్ కోర్సును అందిస్తున్నాయి.

హాస్పిటల్ అడ్మినిస్ట్రేషన్

జాబ్ మార్కెట్‌లో డిమాండ్ నెలకొన్న మరో వినూత్న స్పెషలైజేషన్.. హెల్త్‌కేర్, హాస్పిటల్ అడ్మినిస్ట్రేషన్. హెల్త్‌కేర్ మేనేజ్‌మెంట్, హాస్పిటల్ అడ్మినిస్ట్రేషన్ స్పెషలైజేషన్లుగా పలు ఇన్‌స్టిట్యూట్స్ ఎంబీఏ ప్రోగ్రామ్‌ను అందిస్తున్నాయి.ఈ స్పెషలైజేషన్ ద్వారా హెల్త్‌కేర్ రంగంలో హాస్పిటల్స్‌కు సంబంధించి ఆదాయ–వ్యయ నిర్వహణ, పేషెంట్ మేనేజ్‌మెంట్ వంటి నైపుణ్యాలు లభిస్తాయి. ఈ స్పెషలైజేషన్‌తో కోర్సు పూర్తి చేసుకున్న వారు హాస్పిటల్ అడ్మినిస్ట్రేటర్స్, హాస్పిటల్ మేనేజర్స్,ఆపరేటింగ్ ఆఫీసర్స్ వంటి కొలువులు దక్కించుకోవచ్చు.

హాస్పిటాలిటీ మేనేజ్‌మెంట్

ఆకర్షణీయ అవకాశాలు కల్పిస్తున్న మరో స్పెషలైజేషన్.. హాస్పిటాలిటీ మేనేజ్‌మెంట్. ఎకోటూరిజం ,హెల్త్/మెడికల్ టూరిజం, కల్చరల్ టూరిజం తదితర కాన్సెప్ట్‌లతో విదేశీ పర్యాటకులను ఆకర్షించి.. తద్వారా విదేశీ మారక నిల్వలను పెంచుకునేందుకు ప్రభుత్వం కృషి చేస్తోంది. ఫలితంగా ఈ రంగం కార్యకలాపాలు వేగంగా విస్తరిస్తున్నాయి. దీంతో ఈ రంగంలో మానవ వనరుల కొరత నెలకొంది. దీన్ని గుర్తించిన పలు ఇన్‌స్టిట్యూట్‌లు పీజీ స్థాయిలో టూరిజం అండ్ హాస్పిటాలిటీ లేదా హాస్పిటాలిటీ మేనేజ్‌మెంట్ పేరుతో కోర్సులను అందిస్తున్నాయి. తెలంగాణలో డాక్టర్ వైఎస్‌ఆర్ నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టూరిజం అండ్ హాస్పిటాలిటీ మేనేజ్‌మెంట్.. ఎంబీఏ హాస్పిటాలిటీ కోర్సును అందిస్తోంది. ప్రయాణాలు చేయడంపై ఆసక్తి, ఎదుటివారిని మెప్పించే నేర్పు ఉన్న వారికి సరైన కోర్సు ఇది.

రిటైల్ మేనేజ్‌మెంట్

దేశంలో వ్యాపార, వాణిజ్యం పరంగా శరవేగంగా దూసుకెళ్తున్న విభాగం.. రిటైల్ మేనేజ్‌మెంట్! బహుళ జాతి సంస్థల ప్రవేశంతో దేశ వ్యాప్తంగా వేల సంఖ్యలో రిటైల్ ఔట్‌లెట్స్ ఏర్పాటవుతున్నాయి. వాటి సమర్థ నిర్వహణకు సుశిక్షితులైన మానవ వనరుల అవసరం నెలకొంది. ప్రస్తుతం పలు ఇన్‌స్టిట్యూట్‌లు ఏడాది, రెండేళ్ల వ్యవధిలో ఎంబీఏ, పీజీ డిప్లొమా పేరుతో రిటైల్ మేనేజ్‌మెంట్ కోర్సులను అందిస్తున్నాయి. మరికొన్ని ఇన్‌స్టిట్యూట్‌లు, రాష్ట్ర స్థాయి యూనివర్సిటీలు రిటైల్ మేనేజ్‌మెంట్‌ను ఒక స్పెషలైజేషన్‌గా రూపొందిస్తున్నాయి. ఈ కోర్సుల్లో రిటైల్ అవుట్‌లెట్‌కు సంబంధించి ప్యాకింగ్, కస్టమర్ రిలేషన్‌షిప్, స్ట్రాటజిక్ మేనేజ్‌మెంట్ ఆఫ్ అవుట్‌లెట్, మర్కండైజింగ్ వంటి వాటిపై అవగాహన కల్పిస్తారు.

ఫార్మాస్యుటికల్ మేనేజ్‌మెంట్

దేశంలో ఫార్మా రంగం విస్తరిస్తోంది. ఫార్మా సంస్థల కార్యకలాపాలు ఊపందుకుంటున్నాయి. ఈ నేపథ్యంలో అందుబాటులోకి వచ్చిన స్పెషలైజేషన్.. ఫార్మాస్యుటికల్ మేనేజ్‌మెంట్! ఈ స్పెషలైజేషన్‌తో ఎంబీఏ పూర్తి చేసుకున్న వారికి ఫార్మా కంపెనీలు, మెడికల్ డివైజ్ సంస్థలు, మార్కెట్ రీసెర్చ్, హెల్త్‌కేర్, మెడికల్ కమ్యూనికేషన్ తదితర ఫార్మా అనుబంధ సంస్థల్లో ఉద్యోగాలు లభిస్తాయి. బిజినెస్ అనలిస్ట్, ప్రాజెక్ట్ మేనేజ్‌మెంట్ ఎగ్జిక్యూటివ్స్, ఇంటర్నేషనల్ మార్కెటింగ్ మేనేజర్స్ వంటి హోదాల్లో కొలువుదీరొచ్చు. ప్రస్తుతం ఈ కోర్సును నర్సీమోంజీ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్ స్టడీస్, నైపర్, సింబయాసిస్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్, ఐఐహెచ్‌ఎంఆర్ వంటి ఇన్‌స్టిట్యూట్‌లు అందిస్తున్నాయి.

అగ్రి బిజినెస్ మేనేజ్‌మెంట్

సాగుకు సంబంధించి నిర్వహణ నైపుణ్యాలు అందించే స్పెషలైజేషన్.. అగ్రి బిజినెస్ మేనేజ్‌మెంట్. వ్యవసాయ ఉత్పత్తుల మార్కెటింగ్, ఆపరేషన్స్, సప్లయ్ చైన్ మేనేజ్‌మెంట్, మొబిలైజేషన్ వంటి మేనేజ్‌మెంట్ నైపుణ్యాలను అగ్రి బిజినెస్ మేనేజ్‌మెంట్ కోర్సు ద్వారా సొంతం చేసుకోవచ్చు. ఈ కోర్సు ఉత్తీర్ణులకు సీడ్ ఇండస్ట్రీస్, ఫెర్టిలైజర్స్, ఫుడ్ ఇండస్ట్రీలలో కొలువులు లభిస్తాయి. ఐఐఎం–అహ్మదాబాద్, లక్నో క్యాంపస్‌లలో ఫుడ్ అండ్ అగ్రి బిజినెస్ మేనేజ్‌మెంట్ పీజీ ప్రోగ్రామ్, అగ్రి బిజినెస్ మేనేజ్‌మెంట్ ప్రోగ్రామ్‌లు అందుబాటులో ఉన్నాయి. క్యాట్‌లో ఉత్తీర్ణత ఆధారంగా వీటిలో చేరొచ్చు. అగ్రి బిజినెస్ మేనేజ్‌మెంట్‌లో పీజీ పూర్తి చేసిన అభ్యర్థులు ఫెర్టిలైజర్, పెస్టిసైడ్స్ సంస్థలు, ఫుడ్ ఆఫీసర్స్ వంటి ఉద్యోగాలు సొంతం చేసుకోవచ్చు.

ఫ్యామిలీ బిజినెస్ మేనేజ్‌మెంట్

బీఎస్‌ఈ లిస్టెడ్ కంపెనీల్లో టాప్–500లో 60 నుంచి 70 శాతం వరకు కుటుంబ యాజమాన్యంలో కార్యకలాపాలు సాగిస్తున్నాయి. బిర్లా గ్రూప్, రిలయన్స్, డాబర్ ఇండియా లిమిటెడ్ వంటివే ఇందుకు ఉదాహరణ. కుటుంబ పరిధిలోని సంస్థలకు అవసరమైన సుశిక్షితులను తీర్చిదిద్దే స్పెషలైజేషన్.. ఫ్యామిలీ బిజినెస్ మేనేజ్‌మెంట్. కుటుంబ యాజమాన్యాల పరిధిలోని సంస్థలు సైతం సమర్థ నిర్వహణ, అభివృద్ధి దిశగా నిపుణులను నియమించుకుంటున్నాయి. ఫ్యామిలీ బిజినెస్ మేనేజ్‌మెంట్‌కు సంబంధించి తెలంగాణలోని ఇండియన్ స్కూల్ ఆఫ్ బిజినెస్ 15 నెలల కోర్సును అందిస్తోంది. అదే విధంగా నర్సీమోంజీ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్ స్టడీస్, ఎస్.పి.జైన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్ అండ్ రీసెర్చ్ వంటివి కూడా ఈ స్పెషలైజేషన్‌ను అందిస్తున్నాయి.

వ్యక్తిగత ఆసక్తి ముఖ్యం

ఎంబీఏలో ఒక్కో స్పెషలైజేషన్‌కు వ్యక్తిగతంగా ఒక్కో లక్షణం ఉండాలి. ఉదాహరణకు.. రూరల్ మేనేజ్‌మెంట్, హెల్త్‌కేర్ మేనేజ్‌మెంట్ స్పెషలైజేషన్లలో ఎక్కువ శాతం ఫీల్డ్ వర్క్, ప్రజలతో మమేకం అవ్వాల్సి ఉంటుంది. స్వతహాగా ఈ లక్షణాలు ఉన్న అభ్యర్థులకే ఇవి సరితూగుతాయి. కాబట్టి స్పెషలైజేషన్ ఎంపికలో తమ వ్యక్తిగత లక్షణాలను స్వాట్ అనాలిసిస్ చేసుకుని ఎంపిక చేసుకోవడం ఉపయుక్తంగా ఉంటుంది.

కెరీర్ కౌన్సెలింగ్
మీ సందేహాలు, సలహాలు పంపించాల్సిన ఈ- మెయిల్ sakshieducation@gmail.com

నేటి భవిత ఈ పేపర్‌లో..
» సివిల్స్, గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం–ఇండియన్ హిస్టరీ » టెట్/డీఎస్సీ ప్రత్యేకం– సోషల్ స్టడీస్
» గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం–జనరల్ స్టడీస్– ఫిజిక్స్ » బ్యాంక్ ఎగ్జామ్స్ ప్రత్యేకం– జనరల్ అవేర్‌నెస్

క్లుప్తంగా...



ఒకే విద్యార్థి.. ఒకే ఉపాధ్యాయిని

జహీరాబాద్: పేరుకది ప్రభుత్వ పాఠశాల.. ఒకే విద్యార్థి బడికి వస్తాడు.. ఏకైక ఉపాధ్యాయిని ఆ విద్యార్థికి బోధిస్తారు. సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ మండలం మోడ్ తండా ప్రాథమిక పాఠశాల పరిస్థితి ఇది. ఈ పాఠశాలలో ముగ్గురు విద్యార్థులు ప్రవేశం పొందగా.. ఒకటో తరగతి విద్యార్థి అఖిల్ మాత్రమే.. నిత్యం పాఠశాలకు వెళ్తున్నాడు. అదే తరగతికి చెందిన జయ్.. తలసేమియా వ్యాధితో బాధపడుతున్నందున పాఠశాలకు హాజరు కావడం లేదు. ఐదో తరగతి విద్యార్థి ప్రకాశ్ పాఠశాలకు రాకుండా.. తండ్రి విజయ్‌నాథ్‌తో కలసి మేకలు మేపేందుకు వెళ్తున్నాడు. తండాకు చెందిన మరో ఐదుగురు విద్యార్థులు కిలోమీటర్ దూరంలోని అర్జున్‌నాయక్ తండా పాఠశాలకు వెళ్లి చదువుకుంటున్నారు. దీంతో నిత్యం వస్తున్న ఒక్క విద్యార్థికే ఉపాధ్యాయిని శ్రీలత పాఠాలు బోధిస్తున్నారు.

సీసీఎల్‌ఏ నవీన్‌మిట్టల్‌కు షోకాజ్ నోటీసులు

పట్టాదార్ పాస్‌బుక్ ఎందుకివ్వలేదు: హైకోర్టు



సాక్షి, హైదరాబాద్: పట్టాదార్ పాస్ పుస్తకాల జారీపై తాము ఇచ్చిన ఉత్తర్వులు ఎందుకు అమలు చేయలేదో చెప్పాలని చీఫ్ కమిషనర్ ఆఫ్ ల్యాండ్ అడ్మినిస్ట్రేషన్ (సీసీఎల్‌ఏ) నవీన్ మిట్టల్‌తో పాటు కుమరంభీమ్ ఆసిఫాబాద్ జిల్లా కలెక్టర్ వెంకటేశ్‌కు హైకోర్టు షోకాజ్ నోటీసులు జారీ చేసింది. వ్యక్తిగతంగా లేదా న్యాయవాది ద్వారా ఫిబ్రవరి 14న హాజరై వివరణ ఇవ్వాలని ఆదేశించింది. కొనుగోలు చేసిన భూమి పాస్ పుస్తకం కోసం దరఖాస్తు చేసుకున్నా కుమరంభీమ్ ఆసిఫాబాద్ జిల్లా కలెక్టర్, సీసీఎల్‌ఏ ఇవ్వడం లేదంటూ బీవీ నారాయణరావు హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. విచారణ చేపట్టిన హైకోర్టు 2021, జనవరి 11న పిటిషనర్ దరఖాస్తును పరిశీలించి, సాంకేతిక ఇబ్బందులను పరిష్కరించి పట్టాదార్ పాసు పుస్తకం అందజేయాలని ఆదేశించింది. సాంకేతిక ఇబ్బందులు పరిష్కరించలేని పక్షంలో ఈ–పట్టాదార్ పాస్ పుస్తకమైనా ఇవ్వాలని స్పష్టం చేసింది. ఈ ప్రక్రియంతా నాలుగు వారాల్లో పూర్తి చేయాలని గత ఏడాది ఆగస్టు 14న ఉత్తర్వులు జారీ చేసింది. దాదాపు ఐదు నెలలు కావస్తున్నా ఉత్తర్వులు అమలు చేయకపోవడంతో నారాయణరావు మరోసారి హైకోర్టును ఆశ్రయించి.. ధిక్కరణ పిటిషన్ వేశారు. పిటిషన్‌పై న్యాయమూర్తి కె.లక్ష్మణ్ విచారణ చేపట్టారు. వాదనలు విన్న న్యాయమూర్తి.. ప్రతివాదులకు నోటీసులు జారీ చేస్తూ, విచారణ వాయిదా వేశారు.

సమర్థతతోనే లక్ష్యాల సాధన

ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి



సాక్షి, హైదరాబాద్: విధి నిర్వహణలో సమర్థతను పెంచుకుని లక్ష్యాలను సాధించాలని ఎక్సైజ్ అధికారులకు ఆ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు సూచించారు. ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖ గెజిటెడ్ అధికారుల అసోసియేషన్ రూపొందించిన డైరీని మంగళవారం రాష్ట్ర ఎక్సైజ్ కార్యాలయంలో ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎక్సైజ్ శాఖ ఉద్యోగుల సమస్యల సత్వర పరిష్కారానికి తనవంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఇందుకోసం త్వరలోనే అబ్కారీ ఉద్యోగ సంఘాలతో సమావేశం నిర్వహించి అన్ని అంశాలపై క్షుణ్ణంగా చర్చిస్తామన్నారు. కార్యక్రమంలో ఎక్సైజ్ శాఖ ముఖ్య కార్యదర్శి ఎస్‌ఏఎం రిజ్వీ, కమిషనర్ చెవ్వూరి హరికిరణ్, ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ వి.బి.కమలాసన్‌రెడ్డి పాల్గొన్నారు.

కాంగ్రెస్ అంటేనే శాంపిల్ సర్కారు

బీజేపీ నేతలు నర్సయ్య గౌడ్, విష్ణువర్ధన్‌రెడ్డి ఎద్దేవా

సాక్షి, న్యూఢిల్లీ: కాంగ్రెస్ ప్రభుత్వం అంటేనే శాంపిల్ సర్కారని తెలంగాణ, ఏపీ బీజేపీ నేతలు బూర నర్సయ్యగౌడ్, విష్ణువర్ధన్ రెడ్డి దుయ్యబట్టారు. బీజేపీ అభ్యర్థులకు మద్దతుగా ప్రచారం కోసం.. ఢిల్లీ వచ్చిన తెలంగాణ, ఏపీ బీజేపీ నేతలు బూర నర్సయ్యగౌడ్, మరోనేత విష్ణువర్ధన్ రెడ్డి మంగళవారం కానిస్టిట్యూషన్ క్లబ్‌లో విలేకరులతో మాట్లాడారు. ప్రభుత్వ పథకాలు ఏవైనా.. శాంపిల్‌గా ఒకటి రెండుచోట్ల ఇస్తున్నారన్నారు. రాష్ట్రానికి కేంద్రం ఇచ్చే ఉచిత రేషన్ పథకంతో పాటు.. ప్రధానమంత్రి ఆవాస్ యోజన కింద ఇళ్లు కావాలంటే మోదీ ఫొటో పెట్టాల్సిందేనని డిమాండ్ చేశారు. బూర నర్సయ్య మాట్లాడుతూ బీజేపీ అధికారంలోకి వస్తే.. ఆప్ కంటే ఉత్తమ పాలన అందిస్తుందని హామీ ఇచ్చారు.

ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ)లో ఎదురులేని అమెరికా టెక్ దిగ్గజాలకు చైనా ఊహించని షాక్ ఇచ్చింది. ఏఐ రారాజు చాట్‌జీపీటీకి ఓ అనామక చైనా ఏఐ స్టార్టప్ పెను సవాల్ విసిరింది. అదే డీప్‌సీక్. దీని చౌక ఏఐ దెబ్బకు మొత్తం సిలికాన్ వ్యాలీ చివురుటాకులా వణుకుతోంది. లక్షల కోట్లు వెచ్చించి అమెరికా కంపెనీలు కడుతున్న 'ఆర్టిఫిషియల్'కోటను బద్దలుకొట్టేందుకు డ్రాగన్ బరిలోకి దూకడంతో ఏఐ వార్‌కు తెరలేచింది. దీంతో జపాన్ నుంచి యూరప్ మీదుగా.. అమెరికా వరకు టెక్ షేర్లన్నీ కుప్పకూలాయి. విలువ పరంగా ప్రపంచంలోనే అతిపెద్ద కంపెనీ ఎన్విడియా షేరు ఏకంగా 17 శాతం పడిపోవటంతో దాదాపు 600 బిలియన్ డాలర్ల మార్కెట్ విలువ తుడిచిపెట్టుకుపోయింది. మన దేశంలో మూడు అతిపెద్ద కంపెనీలైన రిలయన్స్, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, టీసీఎస్‌ల మొత్తం మార్కెట్ విలువ కంటే ఇది ఎక్కువ.

– సాక్షి, హైదరాబాద్

ఏఐ 'డీప్' వార్

డీప్‌సీక్ పురుడుపోసుకుని రెండేళ్లు కూడా కాలేదు. క్వాంట్ హెడ్జ్ ఫండ్ 'హై–ఫ్లయర్'చీఫ్ లియాంగ్ వెన్‌ఫెంగ్ 2023లో దీన్ని నెలకొల్పారు. అతి తక్కువ ఖర్చుతో డీప్‌సీక్ రూపొందించిన ఆర్1 ఏఐ మోడల్ చైనాతోపాటు అమెరికా టెక్ దిగ్గజాలను కూడా ఉలిక్కిపడేలా చేసింది. ఈ ఏఐ మోడల్‌ను పూర్తి ఉచితంగా అందిస్తుండటం ఓపెన్ ఏఐ వంటి కంపెనీల భవిష్యత్తుకు గొడ్డలిపెట్టులా మారింది. అమెరికాలో విడుదలైన వారంలోనే యాపిల్ యాప్ స్టోర్‌లో డీప్‌సీక్ మొబైల్ యాప్ అత్యధిక డౌన్‌లోడ్‌లతో నంబర్ వన్ స్థానాన్ని దక్కించుకుని చాట్‌జీపీటీని వెనక్కి నెట్టింది. ఈ నెల 27న ఒక్కరోజే ఏకంగా 20 లక్షల మంది డౌన్‌లోడ్ చేసుకోవడం దీని జోరుకు నిదర్శనం. మరోపక్క టెక్స్ట్ ప్రాంప్ట్‌ను ఇమేజ్‌గా మార్చే జానస్–ప్రో–7బీతో మరో సంచలనానికి తెరతీసింది డీప్‌సీక్.

2023లో ఆవిర్భావం

ప్రపంచ టెక్నాలజీ రంగంలో డీప్‌సీక్ ఏఐ కుదుపు

- అతి తక్కువ ఖర్చుతో ఏఐ మోడల్‌ను రూపొందించిన చైనా స్టార్టప్
- డ్రాగన్ అనూహ్య పోటీతో పాశ్చాత్య టెక్ కంపెనీల్లో వణుకు
- పేకమేడలా కుప్పకూలిన 'ఏఐ'సంబంధ కంపెనీల షేర్లు
- ఏఐ ఎకోసిస్టమ్‌లో సమూల మార్పులు తప్పవంటున్న విశ్లేషకులు

ఏఐలో అగ్రస్థానాన్ని మరింత బలోపేతం చేసుకోవడానికి డొనాల్డ్ ట్రంప్ అమెరికా అధ్యక్షుడిగా పగ్గాలు చేపట్టిన వెంటనే స్టార్‌గేట్ ప్రాజెక్టును ప్రకటించిన విషయం తెలిసిందే. నాలుగేళ్లలో 500 బిలియన్ డాలర్లు వెచ్చించి అమెరికాను తిరుగులేని ఏఐ సూపర్‌పవర్‌గా చేసేందుకు ఓపెన్‌ఏఐ, ఒరాకిల్, సాఫ్ట్ బ్యాంక్, ఎంజీఎక్స్ చేతులు కలిపాయి. ఈ ప్రాజెక్టు పట్టాలెక్కకముందే డీప్‌సీక్ కారుచౌకగా ఏఐ మోడల్‌ను అభివృద్ధి చేసి షాకిచ్చింది. ట్రంప్ సలహాదారు మార్క్ ఆండర్సన్.. డీప్‌సీక్–ఆర్1ను ఏకంగా ''ఏఐ స్పుత్నిక్ మూమెంట్''గా (1957లో సోవియట్ యూనియన్ ప్రపంచంలో తొలి శాటిలైట్ స్పుత్నిక్‌ను ప్రయోగించడంతో యూఎస్, సోవియట్ మధ్య స్పేస్ వార్‌కు తెరలేచింది) అభివర్ణించడం విశేషం.

అమెరికాకు 'డీప్'ట్రబుల్..

దిగ్గజాలకు దీటుగా..

ఎన్విడియా అధునాతన చిప్స్, గ్రాఫిక్స్ ప్రాసెసింగ్ యూనిట్స్ (జీపీయూ)తో పోలిస్తే చాలా లో ఎండ్ హార్డ్‌వేర్‌తో (పాత ఎన్విడియా ఏ100 జీపీయూలు) తాము ఏఐ మోడల్స్‌ను రూపొందించామని డీప్‌సీక్ ప్రకటించింది. చైనాకు అధునాతన చిప్స్, టెక్నాలజీ ఎగుమతిపై అమెరికా విధించిన ఆంక్షలను సైతం ఎదురొడ్డి సొంతంగా దిమ్మదిరిగే ఏఐ మోడల్‌ను అభివృద్ధి చేయడంపై నిపుణులు కూడా నోరెళ్లబెడుతున్నారు. డీప్‌సీక్ దెబ్బతో ప్రపంచ ఏఐ పరిశ్రమ స్వరూపమే మారిపోవచ్చని విశ్లేషకులు చెబుతున్నారు. ఇది ఓపెన్ సోర్స్ (డెవలపర్లు ఈ సాఫ్ట్‌వేర్‌ను మెరుగుపరచే అవకాశంతో పాటు దీని ఆధారంగా సొంత టూల్స్‌ను రూపొందించుకోవచ్చు) మోడల్ కావడంతో తక్కువ బడ్జెట్లోనే కంపెనీలు, యూజర్లకు ఏఐ అందుబాటులోకి వస్తుంది. డీప్‌సీక్ ఆర్1 ఏఐ మోడల్ మేథమెటిక్స్, కోడింగ్, రీజనింగ్, లాంగ్వేజ్ పరంగా అన్ని రకాల ప్రమాణాల్లో చాట్‌జీపీటీ, జెమిని, గ్రోక్ వంటి ఏఐ మోడళ్లకు దీటుగా నిలవడం గమనార్హం. మెటా ఏఐ మోడల్ అభివృద్ధికి 6 బిలియన్ డాలర్లు ఖర్చు చేయగా.. డీప్‌సీక్ కేవలం 6 మిలియన్ డాలర్లతోనే ఆర్1 ఏఐ మోడల్‌ను తీసుకొచ్చింది. మైక్రోసాఫ్ట్ నుంచి 13 బిలియన్ డాలర్లతో సహా, భారీగా నిధులు సమీకరించిన ఓపెన్‌ఏఐలో సిబ్బంది సంఖ్య 4,500. దీనికి పూర్తి భిన్నంగా ఇప్పటిదాకా డీప్‌సీక్ వెచ్చించింది 10 మిలియన్ డాలర్లే. ఉద్యోగులు 200 మంది మాత్రమే.

ఎన్విడియాకు షాకెందుకు?

ఏఐ మోడల్స్‌ను నడిపేందుకు హై ఎండ్ చిప్స్, జీపీయూలు, నెట్‌వర్కింగ్ అవసరమని ఇప్పటిదాకా ఊదరగొడుతున్నారు. ఈ రంగంలో నంబర్ వన్‌గా ఉన్న ఎన్విడియా మార్కెట్ విలువ 2023 డిసెంబర్‌లో తొలిసారి 500 బిలియన్ డాలర్లు దాటింది. గడిచిన ఏడాదిలోనే ఏకంగా 3.5 ట్రిలియన్ డాలర్లను (మన కరెన్సీలో రూ.301 లక్షల కోట్లు) తాకి ప్రపంచంలోనే అత్యంత విలువైన కంపెనీగా యాపిల్‌ను వెనక్కి నెట్టింది. డీప్‌సీక్ చౌక మోడల్ వల్ల డిమాండ్ తగ్గొచ్చనే భయంతో ఇన్వెస్టర్లు ఏఐ టెక్ షేర్లను అమ్మేసుకుంటున్నారు. దీంతో ఎన్విడియా షేర్ 17 శాతం కుప్పకూలింది. బ్రాడ్‌కామ్, ఏఎండీ, అరిస్టా నెట్‌వర్క్స్, నెదర్లాండ్స్ చిప్ దిగ్గజం ఏఎస్‌ఎంఎల్ హోల్డింగ్స్, తైవాన్ సెమీకండక్టర్స్ మాన్యుఫ్యాక్చరర్స్ (టీఎస్‌ఎం) వంటి చిప్, నెట్‌వర్కింగ్ షేర్లు సైతం 15–23 శాతం పడిపోయాయి.

టాప్ ఏఐ టూల్స్..

1. చాట్‌జీపీటీ
2. క్లాడ్
3. డీప్‌సీక్ ఆర్1
4. జెమిని
5. అబాకస్
6. మిడ్‌జర్నీ
7. గ్రోక్
8. సోరా
9. కాన్వా
10. రన్‌వే



మంగళవారం హైకోర్టు ఆవరణలోని బార్ అసోసియేషన్ హాల్‌లో నిర్వహించిన అభినందన కార్యక్రమంలో న్యాయమూర్తులుగా ఇటీవల బాధ్యతలు చేపట్టిన న్యాయమూర్తులు జస్టిస్ రేణుక యారా, జస్టిస్ నర్సింగ్‌రావు నందికొండ, జస్టిస్ తిరుమలాదేవి, జస్టిస్ బీఆర్ మధుసూధన్‌రావులను సన్మానించి, మాట్లాడుతున్న హెచ్‌సీఏఏ అధ్యక్షుడు ఏ.రవీందర్‌రెడ్డి.

అర్హతలేని వ్యక్తికి జేఎన్‌టీయూహెచ్ వీసీ పోస్టు?

సెర్చ్ కమిటీపై ఓ మంత్రి ఒత్తిడి తెచ్చి జాబితాలో చోటు కల్పించిన వైనం!

సాక్షి, హైదరాబాద్: జవహర్‌లాల్ నెహ్రూ సాంకేతిక విశ్వవిద్యాలయం (జేఎన్‌టీయూహెచ్) ఉపకులపతి నియామకం కోసం సెర్చ్ కమిటీ ముగ్గురి పేర్లతో ప్రభుత్వానికి చేసిన సిఫార్సు వెనక ఓ మంత్రి ఒత్తిడి పనిచేసినట్లు తెలిసింది. దక్షిణ తెలంగాణకు చెందిన ఆ మంత్రి ఒత్తిడి వల్లే అర్హత లేనప్పటికీ ఓ మాజీ ప్రొఫెసర్ పేరును కూడా జాబితాలో కమిటీ చేర్చిందని తెలియవచ్చింది. నెల రోజులుగా వీసీ పోస్టు కోసం ప్రయత్నిస్తున్న ఆ వ్యక్తి.. ఇందుకోసం మంత్రిని పలుమార్లు కలిసి భారీగా ఖర్చు చేసినట్లు సన్నిహితులతో చెప్పుకుంటుండటం ఉన్నతవిద్య వర్గాల్లో చర్చనీయాంశమైంది. సెర్చ్ కమిటీ భేటీకి ముందే తనకు వీసీ పోస్టు ఖాయమని చెప్పుకోవడం గమనార్హం. తొలుత ఈ పేరును సిఫార్సు చేసేందుకు సెర్చ్ కమిటీ ఇష్టపడలేదని సమాచారం. 2022లో జరిగిన ప్రవేశాల అవకతవకల్లో ఆయన ప్రమేయం ఉండటం, రిటైరయ్యాక చేరిన ఓ ప్రైవేటు వర్సిటీలోనూ అక్రమాలకు పాల్పడి ఉద్వాసనకు గురికావడంతో ఆ వ్యక్తిని ఎలా సిఫార్సు చేస్తామని కమిటీ అన్నట్లు తెలిసింది. కానీ ఆయన్నే ఎంపిక చేయాలని మంత్రి పట్టుబట్టడంతో విధిలేని పరిస్థితుల్లో ఆయన పేరును సైతం సిఫార్సు నివేదికలో చేర్చామని కమిటీ వర్గాలు చెబుతున్నాయి. మరోవైపు ఆయన్ను ఎంపిక చేస్తే వర్సిటీలో అవినీతి రాజ్యమేలుతుందని పలు విద్యాసంఘాల నేతలు, విద్యార్థులు ప్రభుత్వానికి ఫిర్యాదు చేసేందుకు సిద్ధమవుతున్నారు.

కరెంటు చార్జీలు పెరగవు!

- ప్రస్తుత చార్జీలే 2025–26 ఆర్థిక సంవత్సరంలో కొనసాగింపు
- ఈఆర్సీకి ప్రతిపాదించిన దక్షిణ/ఉత్తర తెలంగాణ డిస్కంలు
- 2025–26లో రూ.20,151 కోట్ల నష్టాలు
- ఆ మేరకు ప్రభుత్వ సబ్సిడీలను పెంచితేనే గట్టెక్కే అవకాశం



సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో వచ్చే ఆర్థిక సంవత్సరం 2025–26లో సైతం విద్యుత్ చార్జీలు పెరగవు. ప్రస్తుత చార్జీలనే యథాతథంగా కొనసాగించాలని కోరుతూ దక్షిణ/ఉత్తర తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ (టీజీఎస్పీడీసీఎల్/టీజీఎన్పీడీసీఎల్)లు రాష్ట్ర విద్యుత్ నియంత్రణ మండలి (ఈఆర్సీ)ని కోరాయి. ఈ మేరకు తమ వార్షిక ఆదాయ అవసరాల నివేదిక (ఏఆర్ఆర్), టారిఫ్ ప్రతిపాదనలు 2025–26ను మంగళవారం ఈఆర్సీకి సమర్పించాయి. డిస్కంల అంచనాల ప్రకారం 2025–26లో రాష్ట్రానికి విద్యుత్ సరఫరా చేసేందుకు అన్ని రకాల ఖర్చులు కలిపి మొత్తం రూ.65,849 కోట్ల వ్యయం కానుంది. అందులో విద్యుత్ కొనుగోళ్లకే రూ.50,572 కోట్ల వ్యయం కానుండగా, నిర్వహణ, పర్యవేక్షణ ఖర్చులు, ఉద్యోగుల జీతాలు కలిపి మిగిలిన వ్యయం కానుంది. అయితే, ప్రస్తుత చార్జీలతో రూ.45,698 కోట్ల ఆదాయం మాత్రమే రానుంది. దీంతో విద్యుత్ చార్జీలు పెంచకపోతే రూ.20,151 కోట్ల నష్టాలను మూటగట్టుకోనున్నాయి. అయితే, డిస్కంలు సమర్పించిన అంచనా ప్రతిపాదనలపై ఈఆర్సీ రాతపూర్వకంగా ప్రజాభిప్రాయ సేకరణ నిర్వహించిన తర్వాత హైదరాబాద్, వరంగల్‌లో బహిరంగ విచారణ సైతం జరపనుంది. అనంతరం వాస్తవికతకు దగ్గరగా ఉండేలా డిస్కంల అంచనాలను సవరిస్తూ ఆమోదించనుంది. ఒకవేళ డిస్కంల ఆదాయ లోటు రూ.20,151 కోట్లు వాస్తవమేనని ఈఆర్సీ ఆమోదిస్తే ఆ మేరకు రాష్ట్ర ప్రభుత్వం విద్యుత్ సబ్సిడీలను పెంచాల్సి ఉంటుంది. అయితే, ప్రభుత్వంపై సబ్సిడీల భారం పడకుండా గతంలో ఈఆర్సీ.. డిస్కంల ఆదాయ లోటును తగ్గించి చూపించినట్టు విమర్శలున్నాయి.

ఏటేటా నష్టాలు

ప్రభుత్వం ఏ మేరకు సబ్సిడీ ఇచ్చేందుకు అంగీకరిస్తే ఆ మేరకు మాత్రమే ఆదాయ లోటు ఉందని ఈఆర్సీ నిర్ధారించడంతో డిస్కంల నష్టాలు ఏటేటా పెరుగుతున్నాయి. 2023–24లో రూ.6,299.29 కోట్ల కొత్త నష్టాలను మూటగట్టుకోగా, మొత్తం నష్టాలు రూ.57,448 కోట్లకు ఎగబాకాయి. ఒక్క టీజీఎస్పీడీసీఎల్ నష్టాలే రూ.39,692 కోట్లకు చేరగా, టీజీఎన్పీడీసీఎల్ రూ.17,756 కోట్ల నష్టాల్లో ఉంది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ప్రభుత్వం డిస్కంలకు రూ.11,499 కోట్ల సబ్సిడీలను చెల్లించేందుకు అంగీకరించింది. వచ్చే ఆర్థిక సంవత్సరంలో విద్యుత్ చార్జీల పెంపు భారం నుంచి ప్రజలకు ఉపశమనం కల్పించడానికి సబ్సిడీలను మరింతగా పెంచక తప్పని పరిస్థితి ఏర్పడింది. ఇదిలా ఉండగా, విద్యుత్ టారిఫ్‌ను యథాతథంగా కొనసాగించినా, హెచ్‌టీ కేటగిరీ వినియోగదారులకు గ్రిడ్ సపోర్ట్ చార్జీలతోపాటు స్టాండ్ బై చార్జీలు, క్రాస్ సబ్సిడీ సర్‌చార్జీలను మాత్రం సవరించాలని డిస్కంలు ఈఆర్సీని కోరినట్టు తెలిసింది.

2025-26లో అవసరాలు, ఆదాయం, లోటు ఇలా (రూ.కోట్లలో)

అంశం	టీజీఎస్పీడీసీఎల్	టీజీఎన్పీడీసీఎల్	మొత్తం
ఆదాయ అవసరాలు	46,035	19,814	65,849
ప్రస్తుత చార్జీలతో వచ్చే ఆదాయం	36,277	9,421	45,698
ఆదాయ లోటు (నష్టాలు)	9,758	10,393	20,151

చట్టప్రకారమే డీనోటిఫై చేశారా?

కొంగరకలాన్‌లోని రూ.700 కోట్ల అటవీ భూమిపై సర్కారుకు హైకోర్టు ప్రశ్న



సాక్షి, హైదరాబాద్: రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నం మండలం కొంగరకలాన్‌లో రూ.700 కోట్ల విలువ చేసే 72 ఎకరాల అటవీ భూమిని చట్టప్రకారమే డీనోటిఫై చేశారో.. లేదో చెప్పాలని ప్రభుత్వాన్ని హైకోర్టు ఆదేశించింది. అసలు డీ నోటిఫై చేసే అధికారం కలెక్టర్‌కు ఉండదు కదా అని ప్రశ్నించింది. అటవీ భూమికి సంబంధించి వివాదాస్పద అంశాలు ఉన్నందున తుది ఉత్తర్వులు వెలువడే వరకు వివాదం ఉన్న 72 ఎకరాల భూములపై ఎటువంటి క్రయవిక్రయ లావాదేవీలు, ఇతరుల పేర్లపై మార్పు లాంటివేవీ చేయవద్దని రెవెన్యూ ముఖ్య కార్యదర్శికి సూచించింది. డీ నోటిఫై కోరుతూ కలెక్టర్ నుంచి వచ్చిన ఫైలును సమర్పించాలని ఆదేశించింది. ఈ మేరకు మధ్యంతర ఉత్తర్వులు జారీ చేస్తూ.. తదుపరి విచారణను ఫిబ్రవరి 24కు వాయిదా వేసింది. కొంగరకలాన్ గ్రామం సర్వే నం.249లోని 1026.19 ఎకరాల అటవీ భూమిలో 72 ఎకరాలను నిషేధిత జాబితా నుంచి తొలగించి, ప్రైవేటు వ్యక్తులకు పట్టాదారు పాస్ పుస్తకాలు జారీ చేయాలని 2019, నవంబర్ 16న కలెక్టర్ ఉత్తర్వులు జారీ చేశారంటూ.. గ్రామానికి చెందిన కె.ప్రవీణ్ గౌడ్ హైకోర్టులో రిట్ పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై జస్టిస్ సీవీ భాస్కర్‌రెడ్డి విచారణ చేపట్టారు.

కలెక్టర్ ఉత్తర్వులు ఎలా కన్పించకుండా పోతాయ్?

72 ఎకరాలను నిషేధిత జాబితా నుంచి తొలగించి అనధికారిక ప్రతివాదులు (ప్రైవేట్ వ్యక్తులు) నందిత, దండు కరుణాకర్, రాధాకృష్ణారెడ్డి, ఎన్‌డీ ఇన్‌ఫ్రా, సాయినాథ్‌రెడ్డి పేరు మీద పట్టా చేయాలని కలెక్టర్ ఆదేశాలు జారీ చేశారని పిటిషనర్ తరఫు న్యాయవాది విజయ్ బి.పరోపకారి వాదించారు. ఎలాంటి విచారణ లేకుండా అటవీ భూముల డీ నోటిఫై చేయడం తెలంగాణ అటవీ చట్టం 1967, భూమి, పట్టాదార్ పాస్ బుక్స్ చట్టం 2020 నిబంధనలకు విరుద్ధమని చెప్పారు. వాదనలు విన్న న్యాయమూర్తి.. చట్టప్రకారం డీ నోటిఫై చేసే అధికారం కలెక్టర్‌కు లేదని అభిప్రాయం వ్యక్తం చేశారు. నిబంధనలకు విరుద్ధంగా ఉత్తర్వులు జారీ చేయడాన్ని తప్పుబట్టారు. కలెక్టర్ ఇచ్చిన ఉత్తర్వులు ఎలా కనిపించకుండా పోతాయని నిలదీశారు. వివాదాస్పద అటవీ భూమికి సంబంధించి ఎలాంటి లావాదేవీలు నిర్వహించవద్దని రెవెన్యూ, అటవీ శాఖల ముఖ్య కార్యదర్శులు, రంగారెడ్డి జిల్లా కలెక్టర్‌తో పాటు అనధికార ప్రతివాదులను ఆదేశించారు. ఆ భూమి చట్టప్రకారమే డీ నోటిఫై చేశారా? రిజర్వు ఫారెస్టు కిందకే వస్తుందా?.. లాంటి వివరాలతో కౌంటర్ దాఖలు చేయాలని అధికారులను ఆదేశించారు.

పాలసీ నిర్ణయంలో జోక్యం చేసుకోలేం

- ఉస్మానియా ఆస్పత్రి తరలింపుపై హైకోర్టు స్పష్టీకరణ
- సీఎంను వ్యక్తిగత హోదాలో ప్రతివాదిగా ఎలా చేరుస్తారని నిలదీత

సాక్షి, హైదరాబాద్: ప్రభుత్వం తీసుకునే విధానపరమైన నిర్ణయంలో న్యాయస్థానాలు జోక్యం చేసుకోలేవని హైకోర్టు స్పష్టం చేసింది. మెరుగైన వసతులు, నాణ్యమైన చికిత్స అందించడం కోసం ఉస్మానియా ఆస్పత్రిని తరలించే అధికారం సర్కార్‌కు ఉందని అభిప్రాయపడింది. హెరిటేజ్ అంశం డివిజన్ బెంచ్ వద్ద విచారణలో ఉన్నందున ఇక్కడ ప్రస్తావన అనవసరమని వ్యాఖ్యానించింది. ముఖ్యమంత్రిని వ్యక్తిగత హోదాలో ప్రతివాదిగా ఎలా చేరుస్తారని పిటిషనర్‌ను ప్రశ్నించింది. ప్రతివాదుల జాబితా నుంచి తొలగించాలని ఆదేశించింది. ఉస్మానియా ఆస్పత్రి తరలింపుపై వివరాలు తెలుసుకుని చెప్పాలని అడ్వొకేట్ జనరల్ ఎ.సుదర్శన్‌రెడ్డిని ఆదేశించింది. తదుపరి విచారణ ఫిబ్రవరి 18కి వాయిదా వేసింది. ఉస్మానియా ఆస్పత్రి భవనం శిథిలావస్థకు చేరడంతో ఆస్పత్రిని గోషామహల్ పోలీస్ స్టేడియానికి తరలించాలని సర్కార్ నిర్ణయించడాన్ని సవాల్ చేస్తూ హైకోర్టులో పిటిషన్ దాఖలైంది. ఆస్పత్రి రాకతో గోషామహల్ పరిసరాల్లో నివసించే వారు తీవ్ర ఇబ్బందులకు గురికావాల్సి వస్తుందని, తరలింపు రాజ్యాంగంలోని ఆర్టికల్ 21ని ఉల్లంఘించడమేనని పిటిషనర్ పేర్కొన్నారు. ఆస్పత్రి తరలింపును నిలిపివేస్తూ ఆదేశాలివ్వాలని కోరారు. ఈ పిటిషన్‌పై జస్టిస్ బి.విజయ్‌సేన్‌రెడ్డి మంగళవారం విచారణ చేపట్టారు. ప్రభుత్వం తరఫున ఏజీ హాజరయ్యారు. గోషామహల్ స్టేడియంలో భవనం ఉందా? అక్కడికి ఎందుకు మారుస్తున్నారని ఏజీని ప్రశ్నించారు. ప్రస్తుత భవనం శిథిలావస్థకు చేరిందని, అధునాతన వసతులతో గోషామహల్‌లో ఆస్పత్రి నిర్మాణం చేపట్టనున్నట్లు చెప్పారు. పూర్తి వివరాలు తెలుసుకుని చెప్పాలని ఏజీని ఆదేశిస్తూ, విచారణ వాయిదా వేశారు.

అత్యాధునికంగా ఉస్మానియా

వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ వెల్లడి

31న శంకుస్థాపనకు ఏర్పాట్లు చేయాలని ఆదేశం



సాక్షి, హైదరాబాద్: ఉస్మానియా ఆసుపత్రి నూతన భవనాన్ని అత్యాధునిక హంగులతో, పూర్తిస్థాయి మౌలిక సదుపాయాలతో నిర్మించాలని నిర్ణయించినట్లు రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ తెలిపారు. మంగళవారం ఉస్మానియా ఆసుపత్రి నూతన భవనాల డిజైన్లు, శంకుస్థాపన కార్యక్రమానికి సంబంధించిన పనులపై ఆయన సమీక్షించారు. ఈ నెల 25న ఈ భవనాల డిజైన్లపై సీఎం రేవంత్‌రెడ్డి సమీక్షించి పలు మార్పులు సూచించారు. ఆ మేరకు భవన నమూనాల్లో ఆర్కిటెక్ట్ మార్పులు చేశారు. ఆయా డిజైన్లను పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా అధికారులు మంత్రికి మంగళవారం వివరించారు. అనంతరం రాజనర్సింహ మాట్లాడుతూ.. ఉస్మానియా ఆసుపత్రి తెలంగాణకు తలమానికమని, దానికి పూర్వ వైభవం తెచ్చేందుకు తమ ప్రభుత్వం కట్టుబడి ఉందని తెలిపారు. కొత్త ఉస్మానియా ఆసుపత్రిలో ప్రజలకు అన్నిరకాల సూపర్ స్పెషాలిటీ వైద్య సేవలను అందుబాటులోకి తెస్తామని చెప్పారు. పేషెంట్లు, డాక్టర్లు, మెడికల్ విద్యార్థులు, ఇతర స్టాఫ్‌కు కావాల్సిన అన్ని సదుపాయాలు ఉంటాయని వెల్లడించారు. గోషామహల్‌లో ఈ నెల 31న ఉస్మానియా నూతన భవన నిర్మాణానికి సీఎం రేవంత్‌రెడ్డి శంకుస్థాపన చేస్తారని తెలిపారు. అందుకు అన్ని ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. చిన్న పొరపాటుకు కూడా తావులేకుండా నిర్మాణాలు ఉండాలని స్పష్టంచేశారు.

కొన్ని అంశాలకే ఎక్కువ ప్రాధాన్యత

- ఓ మాదిరి క్లిష్టతతో జేఈఈ మెయిన్ ప్రశ్నలు
- నేటితో ముగియనున్న బీటెక్ ఎంట్రన్స్ పరీక్షలు



సాక్షి, ఎడ్యుకేషన్: జేఈఈ–మెయిన్ రెండో దఫా పరీక్షలు మంగళవారం మొదలయ్యాయి. రెండు షిఫ్టులలో పరీక్ష నిర్వహించగా.. మొదటి షిఫ్ట్ ప్రశ్నపత్రం ఓ మాదిరి క్లిష్టతతో ఉందని విద్యార్థులు, సబ్జెక్ట్ నిపుణులు చెప్పారు. గత పరీక్షల మాదిరిగానే.. రెండు షిఫ్టులలోనూ మ్యాథమెటిక్స్ క్లిష్టత స్థాయి ఓ మాదిరిగా ఉన్నప్పటికీ ప్రశ్నలు సుదీర్ఘంగా ఉన్నాయి. కెమిస్ట్రీలో ప్రశ్నలు సులభంగానే ఉన్నాయి. ఫిజిక్స్ మాత్రం క్లిష్టంగా ఉంది. ఈ నెల 22, 23, 24 తేదీల్లో నిర్వహించిన పరీక్షలతో పోల్చితే మంగళవారం మొదటి షిఫ్ట్ కష్టంగా ఉందని అంటున్నారు. కొన్ని అంశాలకు ఎక్కువ ప్రాధాన్యత ఇచ్చినట్లు చెబుతున్నారు. ఫిజిక్స్‌లో ఆప్టిక్స్ నుంచి 3 ప్రశ్నలు, ఫ్లూయిడ్ మెకానిక్స్, థర్మోడైనమిక్స్, కరెంట్ ఎలక్ట్రిసిటీల నుంచి రెండు ప్రశ్నల చొప్పున అడిగారు. మ్యాథమెటిక్స్‌లో వెక్టార్స్..3డి, కానిక్స్ నుంచి మూడు ప్రశ్నల చొప్పున మాట్రిసెస్ అండ్ డిటర్మినెంట్స్, సిరీస్, డీఈఎఫ్ ఇంటిగ్రేషన్‌ల నుంచి రెండు ప్రశ్నల చొప్పున అడిగారు. కెమిస్ట్రీలో ఇనార్గానిక్ కెమిస్ట్రీ ప్రశ్నలు క్లిష్టంగా ఉండడమే కాకుండా ఎన్‌సీఈఆర్‌టీ పుస్తకాల నుంచే ప్రశ్నలు అడగడంతో బోర్డు పుస్తకాలకే పరిమితమైన విద్యార్థులు ఇబ్బంది పడ్డారు. పిరియాడిక్ టేబుల్, బేసిక్ ఆర్గానిక్ కెమిస్ట్రీల నుంచి 3 ప్రశ్నల చొప్పున, అటామిక్ స్ట్రక్చర్, ఫినాల్ – ఈథర్–ఆల్కహాల్, కెమికల్ బాండింగ్‌ల నుంచి రెండు ప్రశ్నల చొప్పున అడిగారు. రెండో షిఫ్ట్‌లో కూడా మ్యాథమెటిక్స్ ఓ మాదిరిగా ఉన్నప్పటికీ.. సుదీర్ఘమైన ప్రశ్నలు, కాలిక్యులేషన్స్ అవసరమైన ప్రశ్నలు అడిగారు. కెమిస్ట్రీ సులభంగా, ఫిజిక్స్‌లో సులభం, ఓ మాదిరి క్లిష్టత గల ప్రశ్నలు ఉన్నాయి.

రెండు షిఫ్టుల్లోనూ కొన్ని టాపిక్స్ నుంచే..

మొత్తంగా చూస్తే.. రెండు షిఫ్టులలోనూ కొన్ని టాపిక్స్ నుంచే ఎక్కువ ప్రశ్నలు వచ్చాయి. ఈ క్రమంలో మ్యాథమెటిక్స్‌లో ఏరియాస్, మాట్రిసెస్ అండ్ డిటర్మినేషన్స్, కానిక్స్, వెక్టార్ అండ్ 3డి జామెట్రీ, కానిక్స్, ఇంటిగ్రల్ కాలక్యులస్‌కు ఎక్కువ వెయిటేజీ కనిపించింది. కెమిస్ట్రీలో కోఆర్డినేట్ కాంపౌండ్, అటామిక్ స్ట్రక్చర్, బేసిక్ ఆర్గానిక్ కెమిస్ట్రీ, కెమికల్ బాండింగ్ టాపిక్స్ నుంచి ఎక్కువ ప్రశ్నలు అడిగారు. ఫిజిక్స్‌లో కరెంట్ ఎలక్ట్రిసిటీ, థర్మో డైనమిక్స్, ఆప్టిక్స్, ఫ్లూయిడ్ డైనమిక్స్, మోడ్రన్ ఫిజిక్స్ అంశాలకు ప్రాధాన్యం ఇచ్చారు. అదే విధంగా మ్యాథమెటిక్స్, ఫిజిక్స్‌లలో కొన్ని ప్రశ్నలు కాసింత తికమక పెట్టేలా అడ్వాన్స్‌డ్ పరీక్ష స్థాయిలో ఉన్నాయని జేఈఈ మెయిన్, అడ్వాన్స్‌డ్ సబ్జెక్ట్ నిపుణులు ఎం.ఎస్. రావు తెలిపారు. ఫిజిక్స్‌లో ఫార్ములా బేస్డ్‌గా డైరెక్ట్ కొశ్చన్స్ లేకపోవడం విద్యార్థులను కొంత ఇబ్బందికి గురి చేసిందని చెప్పారు. కాగా జాతీయ స్థాయిలో బీటెక్‌లో ప్రవేశానికి నిర్వహిస్తున్న ఈ పరీక్షలు బుధవారంతో ముగియనున్నాయి.

లాభాల ఆశ చూపి.. రూ.4.31 కోట్లు కొల్లగొట్టారు

- హైదరాబాద్‌కు చెందిన ఓ ప్రైవేట్ ఉద్యోగిని మోసం చేసిన సైబర్ కేటుగాళ్లు
- కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్న టీజీ సైబర్ సెక్యూరిటీ బ్యూరో

సాక్షి, హైదరాబాద్ : తక్కువ కాలంలో ఎక్కువ లాభాలు వస్తాయని చెప్పి...హైదరాబాద్‌కు చెందిన ఓ ప్రైవేట్ ఉద్యోగి నుంచి రూ.4.31 కోట్లు కొల్లగొట్టారు సైబర్ కేటుగాళ్లు. 'శూన్య'అనే మొబైల్ యాప్‌లో పెట్టుబడులు పెట్టాలని సూచించి పలు దఫాల్లో భారీ మొత్తాన్ని కాజేశారు. విడతల వారీగా డబ్బులు తీసుకోవడం మినహా లాభాలు లేవని గ్రహించిన సదరు వ్యక్తి టీజీ సైబర్ సెక్యూరిటీ బ్యూరో అధికారులకు ఫిర్యాదు చేశారు. మొత్తం 11 మందిపై కేసు నమోదు చేసిన టీజీ సీఎస్‌బీ అధికారులు నిందితులను గుర్తించే పనిలో ఉన్నారు. ఈ ఇన్వెస్ట్‌మెంట్ ఫ్రాడ్‌కు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. యాప్రాల్ ప్రాంతానికి చెందిన రాజేశ్వరరావుకు ఇన్‌స్టాగామ్‌లో ఒక లింక్ వచ్చింది. ఆ లింక్ ఓపెన్ చేయడంతోనే ఒక వాట్సాప్ గ్రూప్‌లో ఆయన నంబర్ యాడ్ అయ్యింది. ఫిన్‌వసియా ఇన్వెస్ట్‌మెంట్ కంపెనీకి చెందిన శూన్య అనే యాప్ ద్వారా పెట్టుబడులు పెడితే అధిక లాభాలు వస్తాయని ఆ వాట్సాప్ గ్రూప్‌లోని సదరు కంపెనీ ప్రతినిధి దివ్యాంశి అగర్వాల్ నమ్మబలికారు. గూగుల్‌లో సెర్చ్ చేయడంతోపాటు తెలిసిన వారి ద్వారా వాకబు చేసిన రాజేశ్వరరావు.. ఫిన్‌వసియాని నమ్మదగిన కంపెనీగా నిర్ధారించుకున్నారు. శూన్య అనే యాప్ ద్వారా పెట్టుబడులు పెట్టడం ప్రారంభించారు. ఆ తర్వాత అశోక్‌రెడ్డి అనే వ్యక్తిని దివ్యాంశి రాజేశ్వరరావుకు పరిచయం చేసింది. అలా అశోక్‌రెడ్డి సూచన మేరకు మరో యాప్ 'ట్రశూన్యన్'లోనూ రాజేశ్వరరావు పెట్టుబడులు పెట్టారు. గతేడాది డిసెంబర్ 13 నుంచి ఈ నెల 13 వరకు మొత్తం రూ.4.31 కోట్ల రూపాయలు పలు ఖాతాల్లోకి మళ్లించారు. చివరకు మోసపోయానని గ్రహించిన రాజేశ్వరరావు టీజీ సైబర్ సెక్యూరిటీ బ్యూరోకు ఫిర్యాదు చేశారు.

Published and Printed by Dhananjaya Reddy Rakkasi on behalf of Jagati Publications Limited, Printed at Jagati Publications Limited, Sakshi Press, Plot no. D-75 & E-52, Industrial Estate (APIE), Balanagar, Medchal Dist. and Published at 6-3-249/1, Sakshi Towers, Road No. 1, Banjara Hills, Hyderabad - 500 034,
EDITOR: Dhananjaya Reddy Rakkasi, (Responsible for selection of News under the PRB Act) Phone No. +91-40-23256000 (30). RNI Reg No. TELTEL/2008/23482.

బోధకులే లేరు.. ఏం సాధిస్తాం?



అధ్యాపకులు, నిధుల కొరతతో వర్సిటీలు సతమతం

- 11 వర్సిటీల్లో సమస్యలపై వైస్ చాన్స్‌లర్ల నివేదిక
- త్వరలో సీఎం రేవంత్‌రెడ్డికి అందించాలని నిర్ణయం
- తక్షణమే ప్రొఫెసర్లను నియమించాలి.. వసతులు కల్పించాలి
- సమస్యలు పరిష్కరిస్తేనే ఫలితాలుంటాయని ఏకాభిప్రాయం

సాక్షి, హైదరాబాద్: సమస్యలు పరిష్కరిస్తే తప్ప రాష్ట్రంలోని విశ్వవిద్యాలయాల్లో మెరుగైన ప్రమాణాలు నెలకొల్పలేమని వైస్ చాన్స్‌లర్లు అభిప్రాయపడుతున్నారు. ముఖ్యంగా అధ్యాకుల కొరతను తక్షణమే తీర్చాలని కోరుతున్నారు. ప్రభుత్వ విశ్వవిద్యాలయాల వైస్ చాన్స్‌లర్లు ఇటీవల హైదరాబాద్‌లో సమావేశమై వర్సిటీల్లో సమస్యలపై చర్చించారు. అన్ని వర్సిటీల్లోనూ దాదాపు ఒకే రకమైన సమస్యలు ఉన్నాయని గుర్తించారు. ఈ సమస్యలపై సమగ్ర నివేదికను రూపొందించారు. దీనిని త్వరలో సీఎంకు అందివ్వనున్నారు.

సమస్యలెన్నో..

రాష్ట్రంలోని 11 విశ్వవిద్యాలయాల్లో దాదాపు 74 శాతం అధ్యాపక పోస్టులు ఖాళీగా ఉన్నాయి. మంజూరైన మొత్తం పోస్టులు 2,825 కాగా, ప్రస్తుతం ఉన్న రెగ్యులర్ సిబ్బంది 873 మంది మాత్రమే. మిగతా వాళ్లంతా తాత్కాలిక ఉద్యోగులే. దీంతో బోధనలో జవాబుదారీతనం లోపించి, విద్యా ప్రమాణాలు పడిపోతున్నాయనే విమర్శలున్నాయి. పోస్టుల భర్తీపై గత ప్రభుత్వం నియమించిన కామన్ రిక్రూట్‌మెంట్ బోర్డు స్థానంలో ప్రత్యామ్నాయాన్ని ప్రభుత్వం ఆలోచిస్తోంది. అధ్యాపకుల కొరత కారణంగా ప్రైవేటు, డీమ్డ్ వర్సిటీలతో పోటీ పడలేని స్థితి ఉంది. ఏఐ, సైబర్ సెక్యూరిటీ వంటి కోర్సులు తీసుకొచ్చినా ప్రాజెక్టులు రావడం లేదు. ఉస్మానియా వర్సిటీలో పరిశోధనలు. పరిశోధన ప్రాజెక్టులూ తగ్గిపోయాయి. 2020–21లో రూ.52.45 కోట్ల ప్రాజెక్టులొస్తే.. 2022–23 నాటికి రూ.24.75 కోట్లకు తగ్గింది. రెండేళ్లలోనే 53 శాతం పడిపోయాయి.

శాపంగా మారిన నిధుల కొరత

చాలా యూనివర్సిటీల్లో నిధుల కొరత ఉంది. పాలమూరు వర్సిటీకి రూ.10 కోట్లు కేటాయించినా, ఇస్తున్నది మాత్రం రూ.7 కోట్ల లోపే. ఇక్కడ ఏడు విభాగాలకు 84 పోస్టులు మంజూరైతే 17 పోస్టుల్లోనే అధ్యాపకులున్నారు. వీరిలో ఇద్దరు ప్రొఫెసర్లు. నలుగురు అసోసియేట్ ప్రొఫెసర్లు, 11 మంది అసిస్టెంట్ ప్రొఫెసర్లు. కొత్తగా ప్రవేశ పెట్టిన 11 సెల్ఫ్ ఫైనాన్స్ కోర్సులకు రెగ్యులర్ అధ్యాపకులే లేరు. 94 మంది తాత్కాలిక అధ్యాపకులతో బోధన కొనసాగుతోంది. తెలంగాణ వర్సిటీలో 152 ప్రొఫెసర్ పోస్టులు మంజూరైనా, ఉన్నది 61 మంది మాత్రమే. 91 పోస్టులు ఖాళీగా ఉన్నాయి. 12 సెల్ఫ్ ఫైనాన్స్ కోర్సులున్న ఈ వర్సిటీలో అకడమిక్ కన్సల్టెంట్లు, పార్ట్ టైం అధ్యాపకులతో నెట్టకొస్తున్నారు. కాకతీయ వర్సిటీలో బోధన, బోధనేతర సిబ్బంది వేతనాలకు ఏడాదికి రూ.150 కోట్లు అవసరం. రాష్ట్ర ప్రభుత్వం నుంచి బ్లాక్ గ్రాంట్ కింద రూ.97 కోట్లు మాత్రమే వస్తోంది. దీంతో అంతర్గత సమీకరణల ద్వారా రూ.53 కోట్లు సమకూర్చుకుంటున్నారు. ఇక్కడ 405 రెగ్యులర్ అధ్యాపకుల పోస్టులు ఉంటే, అందుబాటులో ఉన్నది 83 మందే. మరో 190 మందిని కాంట్రాక్టు, 201 మందిని తాత్కాలిక పద్ధతిలో తీసుకున్నారు. కొత్తగా ప్రవేశ పెట్టిన కోర్సులను కలుపుకుంటే వెయ్యి మంది వరకూ అధ్యాపకులు ఉండాలి.

సాంకేతిక విద్యకు అగచాట్లు

ఇంజనీరింగ్‌లో కొత్త కోర్సులు వస్తున్నాయి. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, సైబర్ సెక్యూరిటీ, డేటాసైన్స్ వంటి కోర్సులకు మౌలిక వసతులు, బోధనా నైపుణ్యం గల సిబ్బంది లేకపోవటంతో ప్రభుత్వ వర్సిటీల్లో నిర్వహించలేకపోతున్నారు. జేఎన్‌టీయూహెచ్‌లో 410 మంది అధ్యాపకులుండాలి. కానీ 169 మందే ఉన్నారు. 241 పోస్టులు ఖాళీ. కొత్త ఏఐ కోర్సులు, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం సమకూర్చుకోవడానికి ఏటా రూ.200 కోట్లు అవసమని ఇక్కడి ఉన్నతాధికారులు చెబుతున్నారు. బాసర ట్రిపుల్ ఐటీలో చాలాకాలంగా విద్యార్థులకు ఇంటర్న్‌షిప్ లేదు. ఇక్కడ 90 మంది బోధన, 100 మంది బోధనేతర సిబ్బంది కాంట్రాక్టు పద్ధతిలో పనిచేస్తున్నారు.

యూనివర్సిటీల్లో బోధన సిబ్బంది పరిస్థితి ఇదీ..

వర్సిటీ	మంజూరైన పోస్టులు	ఉన్న సిబ్బంది	ఖాళీలు
ఉస్మానియా	1,257	376	891
కాకతీయ	409	86	323
జేఎన్‌టీయూహెచ్	410	169	241
అంబేడ్కర్	86	34	52
తెలంగాణ	152	61	91
మహాత్మాగాంధీ	70	35	35
పాలమూరు	95	21	74
శాతవాహన	63	16	47
జేఎన్ఏఫైన్ ఆర్ట్స్	55	17	58
పీఎస్‌టీయూ	72	14	58
ఆర్‌జీయూకేటీ	146	19	127

ఐదుగురు సభ్యులతో కంట్రోల్ కమిషన్

రాష్ట్ర మహాసభల్లో ఎన్నుకున్న సీపీఎం నాయకత్వం

సాక్షిప్రతినిధి, సంగారెడ్డి/సాక్షి, హైదరాబాద్: సీపీఎం రాష్ట్ర మహాసభల్లో భాగంగా నూతన కమిటీని ఎన్నుకున్న పార్టీ నాయకత్వం ఐదుగురు సభ్యులతో కంట్రోల్ కమిషన్ ఏర్పాటు చేసింది. దానికి డీజీ నర్సింహారావు చైర్మన్‌గా వ్యవహరించనున్నారు. సభ్యులుగా వంగూరు రాములు, కె.నరసమ్మ, మాటూరి బాలరాజుగౌడ్, ఎం.వాసుదేవరెడ్డి ఉండనున్నారు.

రాష్ట్ర కమిటీలో 60 మంది..

సీపీఎం రాష్ట్ర కమిటీని కూడా ఈ సందర్భంగా ప్రకటించారు. మొత్తం 60 మంది ఈ కమిటీలో సభ్యులుగా ఉన్నారు. జి.నాగయ్య, ఎస్.వీరయ్య, జూలకంటి రంగారెడ్డి, పోతినేని సుదర్శన్‌రావు, చుక్కారాములు, టి.జ్యోతి, జాన్‌వెస్లీ, టి.సాగర్, ఎం.డీ.అబ్బాస్, పాలడుగు భాస్కర్, మల్లులక్ష్మి, పి.ప్రభాకర్, బి.రవికుమార్, జె.వెంకటేష్, ఎస్.రమ, భూపాల్, పి.జయలక్ష్మి, రాంపల్లి రమేష్, ఎ.నర్సిరెడ్డి (ఎంఎల్‌సీ), రవి, కె.హిమబిందు, ఎం.వీ.రమణ, పి.ఆశయ్య, ఆర్.వెంకట్రాములు, బుర్రిప్రసాద్, ఆర్.శ్రీరాంనాయక్, టి.స్కైలాబ్‌బాబు, ఆర్,అరుణజ్యోతి, జె.బాబూరావు, పి.సచిన్, ఖమ్మం జిల్లాకు చెందిన నున్నా నాగేశ్వర్‌రావు, వై.శ్రీకాంత్, ఎం.భారతి, బండిరమేష్, నల్లగొండ జిల్లాకు చెందిన ఎం.సుధాకర్‌రెడ్డి, తుమ్మల వీరారెడ్డి, నారి అయిలయ్య, డబ్బికార్ మల్లేశం, సూర్యాపేట జిల్లాకు చెందిన ఎం.నాగార్జునరెడ్డి, నెమ్మాది వెంకటేశ్వర్లు, కె.యాదగిరిరావు, భువనగిరి జిల్లాకు చెందిన ఎం.డి.జహంగీర్, కొండమడుగు నర్సింహ, బి.అనురాధ, కొత్తగూడెం జిల్లా ఎ.కనకయ్య, మచ్చా వెంకటేశ్వర్లు, ఏ.జె.రమేష్, సాధుల శ్రీనివాస్ (మహబూబాబాద్), ఎం.కనకారెడ్డి (జనగాం), పగడాల యాదయ్య (రంగారెడ్డి), ఎ.మల్లారెడ్డి (సిద్దిపేట), బి.సాంబశివ (ములుగు), జి.ప్రభాకర్ రెడ్డి (హన్మకొండ), బందుసాయిలు (భూపాలపల్లి), వి.పర్వతాలు (నాగర్‌కర్నూల్), సీహెచ్.రంగయ్య (వరంగల్), పి.సత్యం (మేడ్చల్), ఎం.వెంకటేశ్ (హైదరాబాద్), పుట్ట ఆంజనేయులు (వనపర్తి), జి.జయరాజు (సంగారెడ్డి)లు రాష్ట్ర కమిటీలో ఉన్నారు. కాగా, తమిళనాడులోని మదురైలో ఏప్రిల్ రెండు నుంచి ఆరో తేదీ వరకు జరిగే సీపీఎం అఖిల భారత మహాసభలకు హాజరయ్యే 28 మంది ప్రతినిధులతోపాటు ఏడుగురు ప్రత్యామ్నాయ ప్రతినిధులను మహాసభ ఎంపిక చేసింది.

ఆ కుటుంబాలను ఆదుకుంటాం

హుస్సేన్‌సాగర్ బోటు ప్రమాద మృతులకు కిషన్‌రెడ్డి సంతాపం



సాక్షి, హైదరాబాద్: 'గణతంత్ర దినోత్సవం రోజు హుస్సేన్ సాగర్‌లో జరిగిన బోటు ప్రమాదంలో గణపతి, అజయ్ అనే ఇద్దరు యువకులు మృతిచెందిన విషయం తనను తీవ్రంగా కలిచివేసిందని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి అన్నారు. 'ఇది ఆ రెండు కుటుంబాలకు తీర్చలేని లోటు. వారికి భారమైన హృదయంతో నా ప్రగాఢ సానుభూతిని, సంతాపాన్ని తెలియజేస్తున్నా. భారతమాత ఫౌండేషన్ ద్వారా ఈ రెండు కుటుంబాలను అన్ని విధాలుగా ఆదుకుంటాం'అని ఆయన ఓ పత్రికా ప్రకటనలో పేర్కొన్నారు.



సీఎంకు టీజీఐఐసీ చైర్మన్ అభినందన

సాక్షి, హైదరాబాద్: దావోస్ వేదికగా రికార్డు స్థాయిలో పెట్టుబడులు తీసుకొచ్చినందుకు ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డిని టీజీఐఐసీ చైర్‌పర్సన్ టి.నిర్మలా జగ్గారెడ్డి అభినందించారు. సచివాలయంలో మంగళవారం సీఎంను మర్యాదపూర్వకంగా నిర్మల కలిసి అభినందించారు. కార్యక్రమంలో మంత్రులు దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, జూపల్లి కృష్ణారావు, సీతక్క, రాజ్యసభ సభ్యుడు అనిల్‌కుమార్ యాదవ్ పాల్గొన్నారు.

ఇవీ పెట్టుబడులు..

దావోస్, సింగపూర్, జ్యూరిక్‌లలో పెట్టుబడుల ఒప్పందాలకు సంబంధించిన వివరాలను సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి శ్రీధర్‌బాబు వెల్లడించారు.

సంస్థ పేరు	ప్రాజెక్టు	పెట్టుబడి రూ.కోట్లలో..	ఉద్యోగాలు/ ఉపాధి
ఐటీఈఈఎస్ సింగపూర్	స్కిల్స్ యూనివర్సిటీ	---	---
ఎస్‌టీటీ	న్యూ డేటా సెంటర్	3500	--
కేపిటల్ ల్యాండ్	న్యూ ఐటీ క్యాంపస్(హైదరాబాద్)	450	--
దావోస్‌లో..			
హెచ్‌సీఎల్	టెక్నాలజీ ఐటీ స్పేస్ విస్తరణ	----	5,000
ఇన్ఫోసిస్	ఐటీ క్యాంపస్ విస్తరణ(పోచారం	----	17,000
విప్రో	ఐటీ క్యాంపస్ విస్తరణ (గోపన్‌పల్లి)	----	5,000
ఎక్లాట్ హెల్త్ సొల్యూషన్స్	ఐటీ క్యాంపస్ విస్తరణ	---	800
డబ్ల్యూఈఎఫ్	డిజిటల్ హెల్త్ అక్సేటర్	--	----
స్కైరూట్ ఏరో స్పేస్	రాకెట్ ఉత్పత్తి, టెస్టింగ్	500	800
జేఎస్‌డబ్ల్యూ గ్రూప్	యూఏవీ మాన్యుఫ్యాక్చరింగ్	800	200
ఫోనిక్స్ ఇంజనీరింగ్	ఎయిర్‌క్రాఫ్ట్ ఇంటీరియర్ డిజైన్	250	400
అమెజాన్ వెబ్ సర్వీసెస్	డేటా సెంటర్ల విస్తరణ	60000	--
టిల్మాన్ గ్లోబల్ హోల్డింగ్స్	డేటా సెంటర్	15000	--
ఉర్సా క్లస్టర్స్	డేటా సెంటర్	5000	--
సిఫి టెక్నాలజీస్	డేటాసెంటర్-ఏఐ హబ్స్, వరంగల్	10,000	---
కంట్రోల్ ఎస్	400 మెగావాట్ల డేటా సెంటర్	10000	3600
జేసీకే గ్రూప్	డేటా సెంటర్	4500	---
సన్ పెట్రోకెమికల్స్	పంప్డ్ స్టోరేజ్ ప్రాజెక్టులు	45,500	7000
మేఘా ఇంజనీరింగ్	2000 మెగావాట్ల పంప్డ్ స్టోరేజ్ 1గిగావాట్ ఎనర్జీ స్టోరేజ్+వెల్‌నెస్	15000	7200
మైత్రా ఎనర్జీ	సోలార్‌సెల్(2.4గిగావాట్)	7000	2500
యూనీలివర్	ఆయిల్‌పామ్ ప్రాసెసింగ్, కామారెడ్డి	----	---
అగిలిటీ	తెలంగాణ అగ్రిటెక్ హబ్	400	--
సుహానా మసాలా	సెంటర్ ఆఫ్ ఎక్సలెన్సీ	----	---
డబ్ల్యూఈఎఫ్	ట్రిలియన్ మొక్కలు నాటే ప్రతిజ్ఞ	---	---
యూబీఎస్	జీసీసీ విస్తరణ	---	1800
మల్టీవర్క్	కొత్త జీసీసీ	---	50
క్వాంటమ్‌బసెల్	క్వాంటమ్ హబ్, హైదరాబాద్	--	---

రైతు నేస్తం శిక్షణ భేష్

మంత్రి తుమ్మల



సాక్షి, హైదరాబాద్: రైతులతో నేరుగా వ్యవసాయ శాస్త్రవేత్తలు మాట్లాడి శిక్షణ ఇచ్చే 'రైతు నేస్తం 'కార్యక్రమం ఉపయోగకరమని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్ రావు చెప్పారు. ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం శాస్త్రవేత్తలతో కలిసి.. రాష్ట్రంలోని 566 రైతు వేదికల్లో ఏర్పాటు చేసిన దృశ్య శ్రవణ యంత్రాల సహకారంతో వివిధ పంటలు, తెగుళ్లపై 41 వారాలుగా ప్రతి మంగళవారం రైతులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా ఈ వారం నిర్వహించిన కార్యక్రమంలో.. మధిర నుంచి ఏఆర్ఎస్ డాక్టర్ కె.రుక్మిణి దేవి 'వేసవిలో అపరాల సాగు – సూచనలు'కార్యక్రమాన్ని నిర్వహించి రైతులకు శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా మంత్రి తుమ్మల మాట్లాడుతూ ఇప్పటి వరకు 4,23,426 మంది రైతులకు శిక్షణ ఇచ్చామని, ఉగాది నాటికి మరో 1,000 రైతు వేదికల్లో దృశ్య శ్రవణ పరికరాలను ఏర్పాటు చేయాలని ఆదేశించారు. రైతులు పామాయిల్ పంటపై దృష్టి పెట్టాలని కోరారు. నాబ్‌కాన్ కన్సల్టెంట్ భుజంగరావు 'వ్యవసాయానికి మౌలిక సదుపాయాల కల్పన'అంశంపై రైతులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో వ్యవసాయ సంచాలకుడు డాక్టర్ గోపి, అదనపు సంచాలకుడు విజయ్‌కుమార్ పాల్గొన్నారు.



మంగళవారం తిరుమల శ్రీవారిని దర్శించుకున్న ఎమ్మెల్యే రాకేశ్‌రెడ్డి, ఎమ్మెల్సీ రఘోత్తమరెడ్డి, గాయని సునీత





ప్రమాదమని తెలిసినా తగిన జాగ్రత్తలు తీసుకోకుండా నిర్లక్ష్యంగా వాహనాలు నడుపుతున్న నగరవాసులు. హెల్మెట్ పెట్టుకోకపోవడం ఒక ఎత్తయితే, చంటి పిల్లాడిని ఒక చేత్తో పట్టుకుని వాహనాన్ని నడపడం.. సెల్‌ఫోన్ మాట్లాడుతూ డ్రైవింగ్ చేయడం.. ఇలా నగర వాసులు తమ రక్షణను తామే మరుస్తున్నారు.

అర్బన్ నక్సలిజానికి కాంగ్రెస్ ప్రోత్సాహం

బీజేపీ ప్రధాన కార్యదర్శి 'కాసం'

సాక్షి, హైదరాబాద్: కాంగ్రెస్ పార్టీ అర్బన్ నక్సలిజాన్ని ప్రోత్సహిస్తోందని బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కాసం వెంకటేశ్వర్లు ఆరోపించారు. కాంగ్రెస్ పార్టీ సూచించిన ఐఎస్ఐ తీవ్రవాదులు, దేశద్రోహులకు జాతీయ అవార్డులు ఇవ్వాలా? అని ఆయన ప్రశ్నించారు. అనేకసార్లు పీపుల్స్ వార్ గ్రూప్‌ను, వామపక్ష తీవ్రవాదాన్ని, పౌరహక్కుల సంఘాలను నిషేధించిన చరిత్రను కాంగ్రెస్ మరిచిపోతోందా? అని నిలదీశారు. ఆయన మంగళవారం విలేకరులతో మాట్లాడుతూ కమ్యూనిస్టు పార్టీలతో కలిసి సీఎం రేవంత్ రెడ్డి పద్మ అవార్డులపై రాజకీయం చేస్తున్నారని మండిపడ్డారు. కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌ను విమర్శిస్తున్న కాంగ్రెస్ నాయకుల తీరును బీజేపీ ప్రధాన కార్యదర్శి జి.ప్రేమేందర్‌రెడ్డి ఖండించారు. కాంగ్రెస్ పార్టీ ముసుగు వేసుకున్న నక్సలైట్ల అభిమానులు.. సంజయ్ దిష్టిబొమ్మలు ఎందుకు దగ్ధం చేస్తున్నారని ప్రశ్నించారు.

మోదీపై సీఎం దిగజారుడు వ్యాఖ్యలు

బీజేపీ నేత డాక్టర్ లక్ష్మణ్

సాక్షి, హైదరాబాద్: ప్రధాని మోదీని మహ్మద్ గజనీతో పోల్చుతూ, హిందూ ధార్మికతను అవమానించేలా సీఎం రేవంత్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలను బీజేపీ ఓబీసీ మోర్చా జాతీయ అధ్యక్షుడు డాక్టర్ కె.లక్ష్మణ్ ఖండించారు. రేవంత్ రెడ్డి మాటలు దిగజారిన రాజకీయాలకు, చౌకబారు మాటలకు నిదర్శనమని ఒక ప్రకటనలో మండిపడ్డారు. మోదీ నాయకత్వంలో దేశం తన ఆధ్యాత్మిక, సాంస్కృతిక వైభవాన్ని తిరిగి చాటుకుంటోందని ప్రశంసించారు. ముఖ్యమంత్రిగా తన హోదాను రేవంత్ రెడ్డి మరిచిపోయి ఇలాంటి వ్యాఖ్యలు చేయడం సిగ్గుచేటని పేర్కొన్నారు.

హింసను ప్రేరేపించే వాళ్లకు అవార్డులు ఇవ్వొద్దన్నారు: గుజ్జుల ప్రేమేందర్‌రెడ్డి

సాక్షి, హైదరాబాద్: హింసను ప్రేరేపించిన వాళ్లకు అవార్డులు ఇవ్వాలని కాంగ్రెస్ పార్టీ అంటోందని, అలాంటి వాళ్లకు అవార్డులు ఇవ్వొద్దని కేంద్ర మంత్రి బండి సంజయ్ అన్నారని బీజేపీ ప్రధాన కార్యదర్శి గుజ్జుల ప్రేమేందర్‌రెడ్డి అన్నారు. మంగళవారం ఆయన రాష్ట్ర పార్టీ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. బండి సంజయ్ వ్యాఖ్యలను విమర్శిస్తున్న కాంగ్రెస్ నాయకుల తీరును తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. బండి అన్న దాంట్లో తప్పేముందని ప్రశ్నించారు. శ్రీపాదరావు, అనేక మంది బడుగు బలహీన వర్గాల నాయకులను చంపింది నక్సలైట్లు కాదా అని గుజ్జుల ప్రశ్నించారు. నక్సలైట్ సంస్థలను కాంగ్రెస్ పార్టీ నిషేధించలేదా.. అలాంటి సంస్థలో పని చేసిన నాయకులకు అవార్డులు ఇవ్వాలని కాంగ్రెస్ నాయకులు కోరుతున్నారా అని నిలదీశారు. సమాజసేవ చేస్తున్న వాళ్లకే అవార్డులు ఇచ్చి పద్మ పురస్కారాలకే నరేంద్రమోదీ ప్రభుత్వం వన్నె తెచ్చిందన్నారు. మాజీ ప్రధాన మంత్రి పీవీ నరసింహారావుకు కాంగ్రెస్ పార్టీ భారతరత్న ఎందుకివ్వలేదో సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. మోదీ ప్రభుత్వం మందకృష్ణ మాదిగకు పద్మశ్రీ అవార్డు ఇస్తే కాంగ్రెస్ నాయకులకు బాధేస్తున్నట్లు ఉందని గుజ్జుల ఎద్దేవా చేశారు.

బండికి ప్రజలే బుద్ధి చెబుతారు

ఫిషరీష్ కార్పొరేషన్ చైర్మన్ సాయికుమార్

సాక్షి, హైదరాబాద్: తెలంగాణ ఉద్యమానికి ప్రాణం పోసిన ప్రజా యుద్ధనౌక గద్దర్‌కు పద్మ అవార్డు ఎలా ఇస్తామన్న కేంద్రమంత్రి బండి సంజయ్‌కు ప్రజలే సరైన బుద్ధి చెబుతారని ఫిషరీష్ కార్పొరేషన్ చైర్మన్ మెట్టు సాయికుమార్ చెప్పారు. ఆయన మంగళవారం గాంధీభవన్‌లో విలేకరులతో మాట్లాడుతూ.. బండి సంజయ్ తెలంగాణ ప్రజలు, ఉద్యమకారులను అవమానించారన్నారు. తక్షణమే ఆయన క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.

గద్దర్‌పై వ్యాఖ్యలు ఉపసంహరించుకోవాలి

బండికి.. టీపీసీసీ ప్రధాన కార్యదర్శి రవళిరెడ్డి డిమాండ్

సాక్షి, హైదరాబాద్: గద్దర్‌కు పద్మ అవార్డు ఎలా ఇస్తామని కేంద్రమంత్రి బండి సంజయ్ చేసిన వ్యాఖ్యలను బేషరతుగా ఉపసంహరించుకోవాలని టీపీసీసీ ప్రధాన కార్యదర్శి రవళిరెడ్డి డిమాండ్ చేశారు. ఆమె మంగళవారం గాంధీభవన్‌లో విలేకరులతో మాట్లాడారు. కేంద్రం ఇచ్చినవి.. పద్మ అవార్డులా? కమలం అవార్డులా? అనేది బండి సంజయ్ చెప్పాలని ప్రశ్నించారు. బండి వ్యాఖ్యలు వ్యక్తిగతమా.. పార్టీ లైనా? అనే విషయాన్ని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి స్పష్టం చేయాలని నిలదీశారు.



హెల్మెట్ పెట్టుకోండి.. ప్లీజ్!

హెల్మెట్ ధరించి వాహనాలు నడిపి ప్రాణాలు కాపాడుకోవాలని, ఫిబ్రవరి 1 నుంచి తప్పనిసరిగా హెల్మెట్ వాడాలని ఏలూరు జిల్లా కలెక్టర్ కే.వెట్రి సెల్వి పిలుపునిచ్చారు. ఆమె ఏలూరులో హెల్మెట్ ధరించని వాహనదారులకు మంగళవారం అవగాహన కల్పించారు. హెల్మెట్ ధరించని పలువురికి చలానా విధించారు. – సాక్షి ఫోటోగ్రాఫర్, ఏలూరు



ఉరకలెత్తే ఉత్సాహం మాదే మాదే..!

క్రీడల్లో రాణించాలన్న వారి పట్టుదల ముందు రన్నింగ్ ట్రాక్ చిన్నబోయింది. ఉత్తి కాళ్లపై విద్యార్థినులు పోటీల్లో పరుగు పెట్టిన తీరు ఆకట్టుకుంది. విశాఖలో మంగళవారం రాష్ట్ర స్థాయి రన్నింగ్ పోటీలు నిర్వహించగా... ఇందులో కొంత మంది విద్యార్థినులు కాళ్లకు షూ లేనప్పటికీ.. పోటీల్లో ఇలా పాల్గొన్నారు. – సాక్షి ఫోటోగ్రాఫర్, విశాఖపట్నం



భళా.. ఓపెన్ హౌస్

ఫిషింగ్ హార్బర్‌లో భారతీయ మత్స్య పరిశోధనా సంస్థ, విశాఖపట్నం ఆధ్వర్యంలో రెండు పరిశోధనా నౌకల్లో ప్రజలు, విద్యార్థులు సందర్శన కోసం ఓపెన్ హౌస్ నిర్వహించారు. మత్స్య షికారి, మత్స్య దర్శిని నౌకల సందర్శనకు విద్యార్థులు భారీగా బారులు తీరారు. – సాక్షి ఫోటోగ్రాఫర్, విశాఖపట్నం

చుట్టూ పక్కల చూడరా..!

నాటి అనుబంధాలు, ఆత్మీయతలు కరువు ● ఎవరికి ఎవరో అన్నట్లు జీవనం

ఉమ్మడి కుటుంబాలు విచ్ఛిన్నం కావడమే కారణం

ఇరుగు పొరుగు పలకరించుకోని వైనం

ప్రస్తుత పరిస్థితులపై ఆవేదన వ్యక్తం చేస్తున్న నాటి పెద్దలు

● కర్నూలు నగరానికే చెందిన రాజ్‌కుమార్ ఓ ప్రైవేటు సంస్థలో పనిచేస్తూ కుటుంబాన్ని నెట్టుకొచ్చేవాడు. మూడేళ్ల క్రితం అతని తల్లి అనారోగ్యంతో మరణించింది. విషయం తెలిసిన ఇంటి యజమాని మృతదేహాన్ని 'మా ఇంట్లో ఉంచొద్దని, మీ బంధువుల ఇళ్లకు తీసుకెళ్లు' అని గొడవ చేశాడు. ఎంత నచ్చజెప్పినా వినలేదు. దీంతో తప్పనిసరై నగరంలోని తన సోదరుని ఇంటికి అప్పటికప్పుడు మృతదేహాన్ని తీసుకెళ్లి అంత్యక్రియలు నిర్వహించారు.

● నంద్యాల పట్టణంలో ఇటీవల ఓ వ్యక్తి తన కుమారుడి వివాహం చేశారు. బంధువులు, మిత్రులు, శ్రేయోభిలాషులు ఎక్కువ మంది వస్తారని పెద్ద ఫంక్షన్ హాల్, పెళ్లి భోజనంలో రకరకాల స్వీట్లు, వంటకాలు ఏర్పాటు చేశారు. అయితే పెళ్లి ముందు రోజు కూడా పెద్దగా బంధువులు, మిత్రులు రాలేదు. తలంబ్రాల సమయానికి హడావుడిగా వచ్చి నూతన వధూవరులను ఆశీర్వదించి తెచ్చిన గిఫ్టులను చేతిలో పెట్టి వెళ్లిపోయారు. ఆహార పదార్థాలు భారీగా మిగిలిపోవడంతో అనాథశ్రమానికి పంపించేశారు.

సమాజంలో ప్రస్తుతం మానవ సంబంధాలు ఎలా ఉన్నాయో ఈ సంఘటనలే నిదర్శనం.

● ఎమ్మిగనూరుకు చెందిన ఓ ప్రభుత్వ ఉద్యోగి పిల్లల చదువుల కోసం కర్నూలులో ఉంటున్నారు. ఆ వీధిలో అతను దాదాపు పదేళ్లుగా ఉంటున్నాడు. అయితే చుట్టు పక్కల వారితో ఇంత వరకు ఆయన మాట్లాడలేదంటే ఆశ్చర్యం కలగకమానదు. ఉదయాన్నే విధులకు వెళ్లడం, సాయంత్రం ఇంటికి రావడం, కుటుంబీకులతో గడుపుతారు. పక్క ఇళ్లల్లో శుభకార్యం జరిగినా వెళ్లింది లేదు.. ఆపద వచ్చినా పలకరించింది లేదు.

కర్నూలు(హాస్పిటల్): మానవ సంబంధాల పేరుతో మనిషన్నవాడు మాయమవుతున్నాడు. అందరూ బాగుంటేనే సమాజం అన్న ధోరణి నుంచి నా కుటుంబం బాగుంటే చాలనే ధోరణితో జీవిస్తున్నాడు. ఈ క్రమంలో చివరికి తల్లిదండ్రులు, అన్నదమ్ములు, అక్కా చెల్లెళ్లను సైతం దూరం చేసుకుంటున్నాడు. కేవలం భార్యాబిడ్డలు బాగుంటే చాలని అనుకుంటున్నారు. ఒకప్పుడు పక్కింట్లో పెళ్లంటే ఆ వీధిలో ఉన్న వారందరూ తలోచేయి వేసి ఇంట్లో మనుషుల మాదిరిగా పనులు చేసేవారు. ఇప్పుడు అయిన వారు కూడా చుట్టపు చూపుగా వస్తున్నారు. అయిన వారు అందరూ ఉన్నా పనులన్నీ ఈవెంట్ మేనేజర్లు చూసుకుంటున్నారు. పట్టణీకరణ పేరుతో మనుషులు దూరం అవుతున్నారు. కానీ ఇప్పటికీ పల్లెలు, పట్టణాల్లోని మురికివాడల్లో ఒకప్పటి అనుబంధాలు, ఆత్మీయతలు కొనసాగుతుండటం గమనార్హం. ఉన్నత చదువులు, పెద్ద పెద్ద ఉద్యోగాలు మనుషులను దూరం చేయడానికా లేదా దగ్గర చేయడానికా అని ఆనాటి పెద్దలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కొన్ని దశాబ్దాల క్రితం ఎవ్వరికైనా ఏదైనా కష్టం వస్తే బంధువుల కంటే ముందు ఇరుగుపొరుగు వారే ముందుగా వచ్చి ఆదుకునేవారు. ఇంట్లో ఎవ్వరైనా చనిపోతే పక్కింటి వారే ఆ కుటుంబానికి అవసరమైన ఏర్పాట్లు చేసేవారు. ఇప్పుడు అపార్ట్‌మెంట్‌లలో, అద్దె ఇళ్లల్లో సైతం మృతదేహాన్ని ఉండనీయని పరిస్థితులు నెలకొన్నాయి. ఉమ్మడి కుటుంబాలు విచ్ఛిన్నం కావడం, చిన్న కుటుంబాలు ఏర్పడటం, చిన్నతనంలో పిల్లలను హాస్టల్‌లో, వృద్ధాప్యంలో పెద్దలను ఆశ్రమాల్లో ఉంచడంతో కుటుంబ విలువలు తగ్గిపోతున్నాయి. ఉన్నత చదువుల పేరుతో ఆధునికత సంతరించుకోవడంతో ఎవ్వరికి వారే అన్న రీతిలో సమాజంలో జీవిస్తున్నారు.



నిలవని ప్రేమ వివాహాలు..

తల్లిదండ్రులను ఎదిరించి ప్రేమవివాహాలు చేసుకోవడం ఇటీవల కాలంలో అధికమైంది. కొందరు తల్లిదండ్రులను ఒప్పించి పెళ్లి చేసుకుంటుండగా మరికొందరు ఇంటి నుంచి వెళ్లిపోయి పెళ్లి చేసుకుంటూ వేరుగా ఉంటున్నారు. ఆ తర్వాత ఏడాది, రెండేళ్లకే విడిపోయి తిరిగి తల్లిదండ్రుల వద్దకు చేరుకుంటున్నారు. ప్రతి పోలీస్‌స్టేషన్‌లో వారానికి రెండు, మూడు కేసులైనా అమ్మాయి మిస్సింగ్ అని నమోదవుతున్నాయి. ఇలాంటి ఘటనలు ఇటీవల అధికంగా చూస్తున్న పోలీసులు చాలా మంది అమ్మాయిని వెతకడం అటుంచి రెండురోజులకు వారే వస్తారులే అన్న ధోరణితో మాట్లాడుతున్నారు. ప్రేమించి పెళ్లి చేసుకున్న జంటల్లో వచ్చే చిన్న చిన్న మనస్పర్ధలను సర్దిచెప్పేవారు లేక రెండు, మూడేళ్లకే విడిపోతున్నారు. పోలీస్‌స్టేషన్‌లు, వన్‌స్టాప్ సెంటర్లు, ఐసీడీఎస్ కార్యాలయాల్లో ఇలాంటి వారికి కౌన్సిలింగ్ నిర్వహించే ఉదంతాలు ఇటీవల అధికమయ్యాయి.



కష్టమొస్తే భరోసానిచ్చే చేతుల్లేవు..

నాగరికత వెంట పరుగులు పెడుతున్న మనుషుల మధ్య దూరం మరింత పెరుగుతోంది. ఉన్నత చదువులు, ఉద్యోగాల పేరుతో ఎవ్వరికి వారు వేరుగా ఉండేందుకు ఆసక్తి చూపిస్తున్నారు. అపార్ట్‌మెంట్‌లో 40కి పైగా కుటుంబాలున్నా.. కష్టమొస్తే పలకరించేవారు ఎవ్వరూ రాని పరిస్థితి నెలకొంది. కానీ పండుగలు, చిన్న చిన్న శుభకార్యాలు మాత్రం చేసుకుని ఎంజాయ్ చేసేందుకు ముందుకు వస్తున్నారు. ఎవ్వరికైనా ఆరోగ్యం బాగాలేకపోతే అయిన వారే పలకరించే దిక్కులేదు. బంధువులు, స్నేహితులు సైతం సోషల్ మీడియాలో మాత్రమే పరామర్శలు చేస్తున్నారు. ఇంటికి వచ్చి ధైర్యం చెప్పే వారు కరువైపోయారు.



పలకరించి ఎన్నాళ్లైందో..

ఒకప్పుడు ఇంటికి బంధువులు, స్నేహితులు వస్తే గంటల తరబడి మాట్లాడుకుంటూ ఉండిపోయేవారు. సమయానికి భోజనం చేయాలన్న విషయం కూడా మరిచిపోయేవారు. కుటుంబంతో పాటు ఊళ్లో, సమాజంలో ముచ్చట్లు, రాజకీయాలు, సినిమాలు అన్నీ ఈ మాటల్లో కనిపించేవి. కానీ ఇప్పుడు ఇంటికి ఎవ్వరైనా వస్తే ముఖస్తుతిగా పలకరించి రెండు నిమిషాలు మాట్లాడి వదిలేస్తున్నారు. ఎవ్వరి మొబైల్‌లో వారు బిజీగా గడుపుతున్నారు. ఎదురుగా ఉన్న వారిని పలకరించే సమయం లేకపోయినా ఎక్కడా కనిపించని వారిని సోషల్ మీడియాలో పలకరించుకుంటూ కాలం వెళ్లదీస్తున్నారు.

యూపీఎస్‌కు మద్దతు ఇవ్వొద్దు

ఆంధ్రప్రదేశ్ కంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీమ్ ఎంప్లాయీస్ అసోసియేషన్

సాక్షి, అమరావతి: కేంద్ర ప్రభుత్వం అమల్లోకి తెస్తున్న యూనిఫైడ్ పెన్షన్ స్కీమ్ (యూపీఎస్)ను వ్యతిరేకిస్తూ ఆంధ్రప్రదేశ్ కంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీమ్ ఎంప్లాయీస్ అసోసియేషన్ ఆందోళనకు పిలుపునిచ్చింది. ఏప్రిల్ ఒకటో తేదీనుంచి దేశవ్యాప్తంగా అమలు చేస్తున్న ఈ విధానంతో ఉద్యోగులు దాచుకున్న సొమ్మును ప్రభుత్వమే తీసుకోవడం దారుణమని, యూపీఎస్‌కు బదులుగా పాత పెన్షన్ విధానం (ఓపీఎస్) అమలు డిమాండ్‌తో ఉద్యోగులు నిరసన తెలపాలని అసోసియేషన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు బాజీ పఠాన్, కరిమి రాజేశ్వరరావు మంగళవారం ఓ ప్రకటనలో పిలుపునిచ్చారు. పాత పెన్షన్ విధానంలో ఉద్యోగి దాచుకున్న సొమ్ము మొత్తాన్ని రిటైరైన తర్వాత తిరిగి పొందేవారని, కానీ, 2004లో తీసుకొచ్చిన నూతన పెన్షన్ విధానం (సీపీఎస్)లో 60 శాతం మాత్రమే వెనక్కి ఇచ్చేవారని తెలిపారు. కొత్తగా తీసుకొస్తున్న యూనిఫైడ్ పెన్షన్ స్కీమ్ (యూపీఎస్)లో ఉద్యోగి దాచుకున్న 100 శాతం సొమ్మును ప్రభుత్వమే తీసుకుంటుందని ఆందోళన వ్యక్తం చేశారు. దాదాపు 40 సంవత్సరాల పాటు సర్వీసు చేసి ఉద్యోగి దాచుకున్న మొత్తాన్ని రిటైర్ అయ్యాక తిరిగి ఇవ్వకుండా మొత్తం సొమ్మును ప్రభుత్వమే తీసుకోవడం అత్యంత దారుణమని పేర్కొన్నారు. కేవలం ఉద్యోగుల సొమ్మును కార్పొరేట్ శక్తులకు దోచిపెట్టేందుకే యూపీఎస్ విధానం తీసుకొస్తున్నారని దుయ్యబట్టారు. ఎన్నికల ముందు మేనిఫెస్టోలోనూ, కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక ఇచ్చిన హామీ మేరకు పాత పెన్షన్ విధానంలో ఉన్న ప్రయోజనాలను కల్పించేలా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. యూపీఎస్‌కు వ్యతిరేకంగా జాతీయ స్థాయిలో జరిగే నిరసనలకు మద్దతుగా రాష్ట్రంలోని ప్రభుత్వ కార్యాలయాలు, పాఠశాలల్లో సీపీఎస్ ఉద్యోగులు నిరసన ప్రదర్శనలు చేయాలని పిలుపునిచ్చారు.

180 రోజులు.. 14 రాష్ట్రాలు.. 4,900 కి.మీలు

- కశ్మీర్ నుంచి తిరుపతికి చేరుకున్న గోమాత పాదయాత్ర
- గోరక్షణతో భరతభూమి సంరక్షణ, దేశ సుభిక్షత
- బాలకృష్ణ గురుస్వామి వెల్లడి



గోమాతతో పాదయాత్రగా వస్తున్న బాలకృష్ణ గురుస్వామి, వారి బృందం

తిరుపతి కల్చరల్: గోరక్షణ, భూ సంరక్షణ, దేశ సుభిక్షతను కాంక్షిస్తూ బాలకృష్ణ గురుస్వామి కశ్మీర్ నుంచి కన్యాకుమారి వరకు చేపట్టిన గోమాతతో పాదయాత్ర మంగళవారం తిరుపతికి చేరుకుంది. తొలిత మంగళం రోడ్డులోని బొంతాలమ్మ ఆలయం వద్ద స్థానికులు, రాష్ట్రీయ హిందూ వాహిని సంఘటన సభ్యులు గోమాత పాదయాత్రకు హారతులు పట్టి స్వాగతం పలికారు. గోమాత పాదయాత్ర దారుడు బాలకృష్ణ గురుస్వామి మాట్లాడుతూ భూ సంరక్షణ గోమాత రక్షణతోనేనని, భరత భూమి రక్షణతో దేశం సుభిక్షతతో వర్ధిల్లుతుందన్నారు. గోమాతను సంరక్షించి తద్వారా భారత భూమి సారవంతమైన భూమిగా పర్యావరణం పరిమళించడంతో దేశం, మానవాళి సుభిక్షతగా ఉంటారనే నినాదంతో గోమాతతో కశ్మీర్ నుంచి కన్యాకుమారి వరకు 180 రోజుల పాటు 14 రాష్ట్రాల మీదుగా 4,900 కిలోమీటర్లు ఈ పాదయాత్ర సాగిస్తున్నారని తెలిపారు. ఇప్పటికే పది రాష్ట్రాల మీదుగా 3710 కిలోమీటర్లు ప్రయాణం చేసి తిరుపతికి నగరానికి చేరుకున్నామన్నారు. శ్రీవారిని దర్శించుకున్న తర్వాత ఇక్కడ నుంచి పాదయాత్రను కన్యాకుమారికి కొనసాగిస్తామని తెలిపారు. సనాతన ధర్మ పరిరక్షణ కోసం గోమాతను రక్షించాలని కోరుతూ చేపడుతున్న ఈ పాదయాత్ర పట్ల ప్రజలు చూపుతున్న ఆదరణ మరువలేనిదన్నారు. అనంతరం అక్కడ నుంచి లీలామహల్ సర్కిల్ మీదుగా కపిలతీర్థం, అలిపిరి వరకు గోమాత పాదయాత్ర సాగించారు.

క్లుప్తంగా...

స్పీకర్ వ్యాఖ్యలతో గిరిజన హక్కులకు విఘాతం

రాష్ట్ర ఆదివాసీ గిరిజన సంఘం ఆక్షేపణ

అరకులోయ టౌన్: టూరిజం అభివృద్ధి పేరుతో 1/70 భూ బదలాయింపు చట్టానికి సవరణ చేయాలని సాక్షాత్తూ అసెంబ్లీ స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు మాట్లాడటం ఆదివాసీల హక్కులు, చట్టాలకు విఘాతం కలిగించడమేనని ఆదివాసీ గిరిజన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కిల్లో సురేంద్ర, జిల్లా ప్రధాన కార్యదర్శి పొద్దు బాలదేవ్ మంగళవారం వేర్వేరుగా చేపట్టిన నిరసన కార్యక్రమాల్లో ఆక్షేపించారు. ఏజెన్సీ ప్రాంతంలో టూరిజం అభివృద్ధి చెందాలంటే హోటళ్లు, రిసార్ట్స్, పార్కుల నిర్మాణం కోసం 1/70 చట్టం సవరణకు రాష్ట్ర ప్రభుత్వం లోతైన అధ్యయనం చేయాలని, అప్పుడే పెట్టుబడులు పెరిగి టూరిజం అభివృద్ధి చెందుతుందనడం సరికాదన్నారు. వెంటనే ఆ ప్రకటనను వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు.

'ప్రభుత్వ బడులు మూతబడేలా నిర్ణయాలు'

సాక్షి, అమరావతి: జీవో 117కు సవరణగా ఇచ్చిన మార్గదర్శకాలకు భిన్నంగా పాఠశాల విద్యాశాఖ వెళుతోందని ఆంధ్రప్రదేశ్ టీచర్స్ ఫెడరేషన్ ఆగ్రహం వ్యక్తం చేసింది. ప్రతి శుక్రవారం ఉపాధ్యాయ సంఘాలతో జరిగిన చర్చల్లో పాఠశాల విద్య డైరెక్టర్ చెప్పిన దానికి భిన్నంగా జిల్లాల్లో పరిస్థితి ఉందని, దీంతో పాఠశాలల ఉనికికే ప్రమాదం ఏర్పడుతోందని ఏపీటీఎఫ్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు చెన్నుపాటి మంజుల, కె.భానుమూర్తి మంగళవారం పేర్కొన్నారు. ప్రాథమికోన్నత పాఠశాలలో 6, 7,8 తరగతుల్లో విద్యార్థుల సంఖ్య 60కి మించితే ఉన్నత పాఠశాలలుగా ఉన్నతీకరించాలని మెమోలో పేర్కొన్నా, మౌలిక వసతులు లేని పాఠశాలలను ఉన్నతీకరించకుండా, ఆ తరగతులను ఉన్నత పాఠశాలలో విలీనం చేసేలా ప్రయత్నాలు జరుగుతున్నాయని తెలిపారు.

మదరసా టీచర్లకు త్వరలో వేతన బకాయిలు

మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండీ ఫరూక్

సాక్షి, అమరావతి: సర్వశిక్ష అభియాన్‌కు అనుబంధంగా ఉన్న మదరసాల్లోని ఉపాధ్యాయులకు పెండింగ్ వేతనాల చెల్లింపు సమస్యను త్వరలోనే పరిష్కరిస్తామని మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండీ ఫరూక్ తెలిపారు. మంగళవారం అమరావతిలోని మంత్రి పేషీ కార్యాలయంలో మదరసాలలో సామాన్య శాస్త్రం, సాంఘిక శాస్త్రం బోధించే ఉపాధ్యాయులు మంత్రిని సమస్యను వివరించారు.

సంక్షేమ పథకాలపై మంత్రుల చర్చ

కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రజా సంక్షేమ పథకాల అమలు, ప్రజాభిప్రాయాల సంతృప్తి తదితర అంశాలపై మైనార్టీ, బీసీ సంక్షేమం, సాంఘిక సంక్షేమం మంత్రిత్వ శాఖల మంత్రులు చర్చించారు.

వక్ఫ్ సవరణ బిల్లుపై మీ వైఖరేంటి?

టీడీపీకి హజ్ కమిటీ రాష్ట్ర చైర్మన్ గౌసు లాజం సూటి ప్రశ్న

సాక్షి, అమరావతి: టీడీపీ రెండు కళ్ల సిద్ధాంతంతో కాకుండా వక్ఫ్ సవరణ బిల్లుపై తమ వైఖరిని వెల్లడించాలని హజ్ కమిటీ రాష్ట్ర చైర్మన్ గౌసు లాజం డిమాండ్ చేశారు. టీడీపీలోని మైనార్టీ నేతలు దీనిపై పార్టీ నుంచి స్పష్టమైన ప్రకటన ఇప్పించాలని కోరారు. విపక్షాల అభ్యంతరాలను పట్టించుకోకుండా, అధికారపక్ష సభ్యులు వక్ఫ్ సవరణ బిల్లుకు ఆమోదం తెలపడం శోచనీయమన్నారు. బిల్లు ప్రవేశపెట్టినప్పుడు పార్లమెంట్ ఉభయ సభల్లో ప్రతిపక్ష పార్టీలన్నీ చైర్మన్ తీరుపై నిలదీయాలని కోరారు.

టెన్త్‌లో వంద శాతం ఫలితాలు సాధించాలి

బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవిత

సాక్షి, అమరావతి: కార్పొరేట్‌కు దీటుగా రాబోయే పదో తరగతి పరీక్షల్లో వందశాతం ఫలితాలు సాధించాలని బీసీ సంక్షేమ శాఖ మంత్రి ఎస్.సవిత స్పష్టం చేశారు. మంగళవారం రాష్ట్ర సచివాలయంలో ఎంజేపీ గురుకుల పాఠశాల ఉద్యోగుల అసోసియేషన్ ప్రతినిధులు మంత్రిని కలిసి తమ సమస్యలపై వినతిపత్రం అందజేశారు. మంత్రి సవిత మాట్లాడుతూ.. సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు.

తెలుగు రాష్ట్రాల సీఎంలు ట్రంప్‌కు లేఖలు రాయాలి

ప్రజాశాంతి పార్టీ అధ్యక్షుడు కె.ఎ.పాల్

సాక్షి, న్యూఢిల్లీ: అమెరికాలోని తెలుగు ప్రజల ఇబ్బందుల నేపథ్యంలో ఏపీ, తెలంగాణ ముఖ్యమంత్రులు చంద్రబాబు, రేవంత్‌రెడ్డి అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌కు లేఖలు రాయాలని ప్రజాశాంతి పార్టీ అధ్యక్షుడు కేఏ పాల్ డిమాండ్ చేశారు. మంగళవారం ఆయన ఢిల్లీలో విలేకరులతో మాట్లాడారు. అమెరికాలోని భారతీయులు ఎవరూ ఆందోళన చెందవద్దన్నారు. భారతీయులను వెనక్కి పంపే ప్రక్రియ నిలిపివేయాలని, వారికి రక్షణ కల్పించాలని తాను ఇటీవలే ట్రంప్‌కు లేఖ రాశానని గుర్తుచేశారు. ట్రంప్ మనసు మార్చుకునేలా తాను ప్రార్థన చేస్తున్నానని తెలిపారు.

కోస్ట్‌గార్డ్ రైజింగ్ డే బైక్ ర్యాలీ ప్రారంభం

విశాఖ–చెన్నై వరకు ర్యాలీ



సింధియా: ఇండియన్ కోస్ట్‌గార్డ్ 49వ రైజింగ్ డే వేడుకల్లో భాగంగా మంగళవారం భారీ బైక్ ర్యాలీని కోస్ట్‌గార్డ్ సిబ్బంది చేపట్టారు. విశాఖపట్నం నుంచి ప్రారంభమై చెన్నై వరకు సాగనున్న ఈ ర్యాలీకి అడిషనల్ డైరెక్టర్ జనరల్ డానీ మైఖేల్, పీటీఎం, టీఎం(జీ) కోస్ట్‌గార్డ్ కమాండర్ జెండా ఊపి ప్రారంభించారు. 49 మంది కోస్ట్‌గార్డ్ సిబ్బందితో ఈ బైక్ ర్యాలీ విశాఖలో ప్రారంభమై సుమారు 1,400 కిలోమీటర్లు ప్రయాణం చేసి ఫిబ్రవరి 1న చెన్నైలోని ట్యూటికోరిన్ మెరైన్ బీచ్ వద్ద ముగుస్తుందని నేవీ వర్గాలు తెలిపాయి. ఏపీలో సుమారు 850 కిలోమీటర్ల ప్రయాణంలో కాకినాడ, కృష్ణపట్నం, నిజాంపట్నం పోర్టులను సందర్శించి రైజింగ్ డేపై అవగాహనతో పాటు రహదారి, సముద్ర భద్రత, రక్షణ విషయాలపై అవగాహన కలిగించనున్నారు. ఈ మోటారు బైక్ ర్యాలీని ఆయిల్ అండ్ నేచురల్ గ్యాస్ కార్పొరేషన్ (ఓఎన్‌జీసీ) భాగస్వామ్యంతో నిర్వహిస్తున్నారు.

ఆధ్యాత్మిక సమాచారం

శ్రీవారి దర్శనానికి 8 గంటలు

తిరుమల : తిరుమలలో భక్తుల రద్దీ సాధారణంగా ఉంది. క్యూకాంప్లెక్స్‌లో 4 కంపార్ట్‌మెంట్లు ఖాళీగా ఉన్నాయి. సోమవారం అర్ధరాత్రి వరకు 65,278 మంది స్వామి వారిని దర్శించుకున్నారు. హుండీ ద్వారా రూ. 3.70 కోట్ల ఆదాయం వచ్చింది. టైంస్లాట్ టికెట్లు కలిగిన భక్తులకు సకాలంలో, టికెట్లు లేని భక్తులకు 8 గంటల్లో దర్శనం లభిస్తోంది. ప్రత్యేక ప్రవేశ టికెట్లున్నవారికి 3 గంటల్లో దర్శనమవుతోంది. సర్వదర్శనం టోకెన్లు కలిగిన భక్తులు నిర్దేశించిన సమయానికే క్యూలోకి వెళ్లాలని టీటీడీ విజ్ఞప్తి చేసింది.

మద్దిలో పూజలు



జంగారెడ్డిగూడెం: ఏలూరు జిల్లా జంగారెడ్డిగూడెం మండలం గురవాయిగూడెంలో కొలువైన శ్రీ మద్ది ఆంజనేయస్వామి వారి ఆలయంలో మంగళవారం తెల్లవారుజామున ఆలయ అర్చకులు స్వామివారికి ప్రభాత సేవ, నిత్యార్చన పూజలు నిర్వహించారు. స్వామివారు ప్రత్యేక అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. స్వామివారికి ప్రీతికరమైన మంగళవారం కావడంతో దర్శనాలకు అధిక సంఖ్యలో భక్తులు విచ్చేశారు. భక్తుల హనుమద్ నామస్మరణతో ఆలయం మార్మోగింది. భక్తులు శ్రీస్వామి వారి ఆలయం చుట్టూ 108 ప్రదక్షిణలు చేసి, మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయ అర్చకులచే అన్నప్రాశనలు, వాహన పూజలు చేయించుకున్నారు. 1500 మందికి అన్నప్రసాద వితరణ చేశారు.

విద్యా సమాచారం

జాతీయ తైక్వాండో పోటీలకు చీరాల క్రీడాకారిణి

చీరాల రూరల్: జాతీయస్థాయి తైక్వాండో పోటీలకు చీరాల తైక్వాండో క్రీడాకారిణి జి.శివ నాగ సాయిప్రియ ఎంపికైంది. ఇటీవల తిరుపతిలో జరిగిన సీనియర్స్ రాష్ట్రస్థాయి తైక్వాండో పోటీల్లో శివనాగ సాయిప్రియ పాల్గొని విశేష ప్రతిభతో ప్రత్యర్థులను చిత్తు చేసింది. దీంతో సెలక్టర్లు ఆమెను జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక చేశారు. జాతీయ స్పోర్ట్స్ అథారిటీ ఆధ్వర్యంలో ఈ ఏడాది ఫిబ్రవరి 3, 4 తేదీల్లో 38వ జాతీయ స్థాయి తైక్వాండో చాంపియన్ షిప్ పోటీలు ఉత్తరాఖండ్ రాష్ట్రం హల్ద్వానిలో నిర్వహించనున్నట్లు తెలిపారు.

వరల్డ్ తైక్వాండో రిఫరీగా వెంకటేశ్వరరావు



నిజాంపట్నం: ఈ నెల 17 నుంచి 26వ తేదీ వరకు వరల్డ్ తైక్వాండో వారు ఇండియా తైక్వాండో ఆధ్వర్యంలో మహారాష్ట్ర పూణేలో నిర్వహించిన ఇంటర్నేషనల్ రిఫరీ కోర్స్‌లో ఆంధ్రప్రదేశ్ బాపట్ల జిల్లా రేపల్లెకు చెందిన రాష్ట్ర తైక్వాండో ప్రధాన కార్యదర్శి వెంకటేశ్వరరావు పాల్గొని అంతర్జాతీయ రెఫరీగా అర్హత సాధించారు. వెంకటేశ్వరరావు మాట్లాడుతూ అంతర్జాతీయ తైక్వాండో క్రీడాకారులను తయారు చేయటానికి అవకాశం లభించటం అదృష్టంగా పేర్కొన్నారు. నేటి వరకు వేలాది మంది క్రీడాకారులకు శిక్షణ ఇచ్చామని, తన వద్ద శిక్షణ పొందిన అనేక మంది జాతీయ స్థాయిలో పతకాలు సాధించారని తెలిపారు.



శ్రవణ కార్తె: జనవరి 24 నుంచి ఫిబ్రవరి 6 వరకు

- పత్తి, కంది సాళ్ల మధ్యలో ఆచ్ఛాదన కోసం పచ్చిరొట్ట సాగు
- ఆచ్ఛాదన వల్ల అధిక దిగుబడితోపాటు అనేక ప్రయోజనాలు
- ఎకరాకు పత్తి 12, కంది 15 క్వింటాళ్ల దిగుబడి పొందుతున్న సుభాష్ శర్మ

ఆచ్ఛాదనతో అధిక దిగుబడి!

సుభాష్ శర్మ కృషిపై 2018లో, హరిమన్ శర్మ విశేష కృషి గురించి 2017లోనే 'సాక్షి సాగుబడి'లో కథనాలు ప్రచురించాం. ఈ ఏడాది వీరు పద్మశ్రీ పురస్కారాలకు ఎంపికైన సందర్భంగా ఆ కథనాలను పునర్ముద్రిస్తున్నాం.

మహారాష్ట్ర.. విదర్భ.. యవత్‌మాల్.. ఈ పేర్లు వినగానే అప్పుల్లో కూరుకుపోయి బలవన్మరణాల పాలైన వేలాది మంది పత్తి రైతుల విషాద గాథలు మదిని బరువెక్కిస్తాయి. అయితే, ఈ కథ అంతటితో ముగిసిపోలేదు. ఎడారిలో ఒయాసిస్సు మాదిరిగా సేద్యాన్ని ఆనందమయంగా మార్చుకున్న అతి కొద్ది మంది ప్రకృతి వ్యవసాయదారులు కూడా అదృష్టవశాతూ అక్కడ ఉన్నారు. రసాయనాలను త్యజించి, నేల తల్లికి ప్రణమిల్లుతూ భూసారాన్ని పరిరక్షించుకుంటూనే అధిక దిగుబడులు సాధిస్తున్న అద్భుత ప్రకృతి వ్యవసాయదారుల్లో సుభాష్ శర్మ ఒకరు. ప్రకృతి వ్యవసాయంలో ఆచ్ఛాదన అతి ముఖ్యపాత్ర పోషిస్తుంది.

అయితే, ఆచ్ఛాదనగా వేయడానికి గడ్డీ గాదం ఎక్కడ దొరుకుతుంది అని రైతులు ప్రశ్నిస్తుంటారు. ఈ సమస్యకు సుభాష్ శర్మ అద్భుతమైన పరిష్కారాన్ని కనుగొన్నారు. రెండు సాళ్లు పత్తి వేస్తారు (కందిని కూడా ఇలాగే సాగు చేయవచ్చు). ఆ పక్కనే 3 సాళ్లలో పచ్చిరొట్ట మొక్కలు పెంచి, వాటినే కత్తిరించి ఆచ్ఛాదనగా వేస్తారు. పొలం అంతా ఇలాగే వేయడం ద్వారా అధిక దిగుబడిని సాధించే వినూత్న పద్ధతిని ఆయన దీర్ఘకాలంగా అనుసరిస్తున్నారు. ప్రకృతి వ్యవసాయదారుడిగా, పరిశోధకుడిగా ప్రయోగాలు చేస్తూ అధిక దిగుబడులు సాధిస్తున్న సుభాష్ శర్మతో 'సాక్షి సాగుబడి' ముచ్చటించింది. ముఖ్యాంశాలు..

సుభాష్ శర్మకు 66 ఏళ్లు. వ్యవసాయంలో 46 ఏళ్ల అనుభవం ఉన్న రైతు. అనుభవాల నుంచి గుణపాఠాలు నేర్చుకొని, గడ్డు సమస్యలకు అద్భుతమైన పరిష్కారాలను వెదికిన తలపండిన ప్రకృతి వ్యవసాయదారుడు, రైతుశాస్త్రవేత్త. క్షేత్రస్థాయిలో వ్యవసాయ సమస్యలను లోతుగా పరిశీలిస్తూ.. తన ప్రజ్ఞతో ప్రకృతికి అనుగుణమైన సాగు పద్ధతులను రూపొందించుకున్నారు. కరువుకు, పత్తి రైతుల ఆత్మహత్యలకు నిలయమైన మహారాష్ట్ర విదర్భలోని యవత్‌మాల్ జిల్లా (చోటి గుజారి) వితస గ్రామ వాస్తవ్యుడైన ఆయనకు 19 ఎకరాల నల్లరేగడి భూమి ఉంది. 1975 నుంచి వ్యవసాయం చేస్తున్న సుభాష్ శర్మ 20 ఏళ్ల పాటు రసాయనిక ఎరువులు, పురుగుమందులతోనే వ్యవసాయం చేశారు. ఫలితంగా ఆర్థికంగా నష్టాలపాలవటమే కాకుండా భూసారం సర్వనాశనమైపోయింది. 1986 తర్వాత ఖర్చులు పెరుగుతున్నా దిగుబడులు తగ్గిపోతూ వచ్చాయి. ఆ దరశలో రసాయనిక వ్యవసాయ పద్ధతే నష్టదాయకమైనదన్న సత్యాన్ని గ్రహించారు. 1994 నుంచి ప్రకృతి వ్యవసాయ పద్ధతుల వైపు మళ్లారు. నిశిత పరిశీలనతో ప్రకృతికి అనుగుణమైన ఆచరణాత్మక సుస్థిర వ్యవసాయ పద్ధతులను రూపొందించుకొని అనుసరిస్తూ మంచి నికరాదాయాన్ని పొందుతున్నారు. ఆయనకున్న 3 ఎకరాలను ఆవులు, ఎద్దులు మేయడానికి కేటాయించి మిగతా పొలంలో వివిధ పంటలు సాగు చేస్తున్నారు. ముఖ్యంగా కంది, పత్తి, కూరగాయలు, ఆకుకూరలను సాగు చేస్తున్నారు. ఏడాది పొడవునా ఏవో కొన్ని రకాల పంటలు సాగు చేస్తుంటారు.

ఎక్కడ కురిసిన వాన అక్కడే ఇంకాలి...

నల్లరేగడి భూమి అయినప్పటికీ ఏ గజం స్థలంలో పడిన వర్షాన్ని ఆ గజంలోనే ఇంకింపజేయడం సుభాష్ శర్మ ప్రత్యేకత. ఏ పంటనైనా బోదెలపైనే సాగు చేస్తారు. బోదెల మధ్యలో ప్రతి మీటరుకూ అడ్డుకట్ట వేసి జల స్తంభన చేస్తారు. వేసవికి ముందు నుంచే ఇలా వాన నీటి సంరక్షణ ఏర్పాట్లు చేస్తారు. మరీ కుండపోత వర్షం కురిస్తే పంట ఉరకెత్తకుండా అడ్డుకట్టలను తాత్కాలికంగా తొలగించి, వరద నీరు పోయిన తర్వాత మళ్లీ కట్టలు వేస్తారు. ఏడాదిలో ఏ సీజన్‌లోనైనా అకాల / సకాల వర్షాలన్నిటినీ ఒడిసిపడతారు. ఒక్క మాటలో చెప్పాలంటే.. ప్రతి నీటి బొట్టునూ పొలంలో ఎక్కడికక్కడే ఇంకింపజేస్తారు. దీంతో భూగర్భ జలాలకు, మట్టిలో తేమకు లోటుండదు. అయినా, చాలా పొదుపుగా మరీ అవసరమైతేనే ఒకటి, రెండు తడులు ఇస్తూ పత్తి, కంది, కూరగాయలను సాగు చేస్తారు. భూమిలో ఎకరానికి 4 టన్నుల చొప్పున దిబ్బ ఎరువు వేసి కలియదున్నుతారు. ఆ తర్వాత పంట ఏదైనా నరే.. బోదెలు తోలి విత్తుతారు. విత్తనాలతో పాటే ప్రతి పాదిలోనూ తాను స్వయంగా తయారు చేసుకున్న 'అలౌకిక్ ఖాద్'ను దోసెడు (ఎకరానికి టన్ను) చొప్పున వేస్తారు.







పత్తి/కంది సాళ్ల మధ్యలో పచ్చి రొట్ట పంటల సాగు

పత్తి లేదా కంది సాగులో సుభాష్ శర్మ అధిక దిగుబడులు పొందుతున్న పద్ధతి ఆసక్తికరంగానే కాదు.. రైతులెవరైనా సులభంగా అనుసరించడానికి వీలుగానూ ఉంది. రెండు సాళ్లలో పత్తి లేదా కంది పంట, వాటి పక్కనే మూడు సాళ్లలో పచ్చిరొట్ట మొక్కలను సాగు చేస్తారు. ప్రతి సాలుకు మధ్య 2 అడుగుల దూరం ఉంటుంది. ఈ ఐదు సాళ్లు 10 అడుగుల స్థలంలో ఉంటాయి. అంటే.. 4 అడుగుల్లో పంట, 6 అడుగుల్లో పచ్చిరొట్ట పంటలు పెరుగుతాయి. పత్తి లేదా కంది సాళ్ల మధ్య 2 అడుగులు, మొక్కల మధ్య అడుగున్నర దూరం ఉంటుంది. సాధారణంగా పత్తి సాగు చేసే రైతులు 4×2 అడుగుల దూరం పాటిస్తారు. 2×1.5 అడుగుల దూరాన వేస్తున్నందున ఎకరానికి వేసే మొక్కల సంఖ్య గానీ దిగుబడి గానీ తగ్గబోదని, ఎకరానికి కిలో పత్తి విత్తనాలు అవసరమవుతాయని సుభాష్ శర్మ అన్నారు.

పచ్చిరొట్ట పంటలుగా ఎకరానికి 4 కిలోల సజ్జ, 6 కిలోల అలసంద, 15 కిలోల జనుము విత్తనాలను కలిపి వరుసలుగా బోదెలపై విత్తుతారు.

పత్తి లేదా కంది సాళ్లలో కలుపును అతి చిన్నగా ఉన్నప్పుడే మనుషులు పీకేస్తారు లేదా కుర్పీతో తీసేస్తారు. నెలకోసారి కలుపు తీసి అక్కడే ఆచ్ఛాదనగా వేస్తారు. మరీ అవసరమైతే పంట తొలిదశలో గుంటక తోలుతారు. కలుపు మొక్కలు చిన్నగా ఉన్నప్పుడే తీసేస్తే కలుపు తీత ఖర్చు 80% తగ్గుతుందని సుభాష్ శర్మ తెలిపారు. పచ్చిరొట్ట పంటలున్న సాళ్లలో కలుపు తియ్యరు. 45-50 రోజులు పెరిగిన తర్వాత పచ్చిరొట్ట పంట మొక్కలను, కలుపును కోసి అక్కడే ఆచ్ఛాదనగా వేస్తారు. ఆ తర్వాత 30-35 రోజులు గడచిన తర్వాత మరోసారి కోసి అక్కడే ఆచ్ఛాదనగా వేస్తారు. ఈ రెండు సార్లూ ఆచ్ఛాదనగా వేసే పచ్చిరొట్ట మూరెడు ఎత్తున వస్తుంది. కాబట్టి, ఆచ్ఛాదనతో సత్ఫలితాలు వస్తున్నాయి.


పచ్చిరొట్ట ఆచ్ఛాదనతో ప్రయోజనాలు..

1. పంట పక్కనే పచ్చిరొట్టను కూడా పెంచడం వల్ల సూర్యరశ్మి పూర్తిగా వినియోగమవుతుంది. ఆచ్ఛాదన వల్ల నేలలో సేంద్రియ కర్బనంతో పాటు భూసారం పెరుగుతుంది.
2. పొలం అంతటా వత్తుగా పంటలు ఆవరించి ఉండటం వల్ల, ఆచ్ఛాదన వల్ల వర్షాలకు భూమి పైపొర మట్టి కొట్టుకుపోకుండా రక్షింపబడుతుందని తెలిపారు.
3. పచ్చిరొట్ట పంటలు ఎర పంటగా పనిచేస్తాయి. జీవ నియంత్రణ వల్ల చీడపీడలు కూడా అదుపులో ఉంటాయి. ప్రతి 75 మిత్రపురుగులకు 25 శత్రుపురుగుల చొప్పున పెరుగుతుంటాయి. మిత్రపురుగులు శత్రుపురుగులను తింటూ వాటి సంతతిని అదుపు చేస్తూ ఉంటాయి. పురుగుల మందులు, కషాయాలు కూడా చల్లాల్సిన అవసరం లేదని, ఆ ఖర్చంతా రైతుకు మిగిలిపోతుందని సుభాష్ శర్మ తెలిపారు. సూరజ్ సూటి రకం పత్తి గులాబీ పురుగును సైతం తట్టుకుంటుందన్నారు.
4. భూమిలో తేమ ఆరిపోకుండా ఎక్కువ కాలం నీటి ఎద్దడి రాకుండా చూస్తుంది. పత్తి వేర్లకు భోజనంతోపాటు తేమ కూడా దొరుకుతుంది. వర్షాలు మొహం చాటేసి మరీ ఇబ్బంది అయినప్పుడు ఒకటి లేక రెండు తడులు ఇస్తున్నామని సుభాష్ శర్మ వివరించారు.

ఒక పంట కాలంలో పత్తి లేదా కంది సాళ్లు వేసిన చోట తదుపరి పంట కాలంలో పచ్చిరొట్ట పంటలు వేస్తామని, ఇప్పుడు పచ్చిరొట్ట విత్తనాలు చల్లిన చోట పత్తి లేదా కంది పంటలు వేస్తూ.. విత్తిన ప్రతిసారీ పంట మార్పిడి చేస్తారు.

ఆచ్ఛాదన వల్ల అనేక ప్రయోజనాలు

పంటల సాళ్ల పక్కనే పచ్చిరొట్ట పంటలను పెంచటం వల్ల చాలా స్థలం వృథా అయినట్లు పైకి కనిపిస్తుంది. కానీ, నిజానికి బహుళప్రయోజనాలు నెరవేరతాయి. దీని వెనుక ఉన్న శాస్త్రీయతను రైతులు సరిగ్గా అర్థం చేసుకోవాలని సుభాష్ శర్మ అంటారు. పొలం బెట్టకు రాకుండా భూమిలో తేమను పచ్చిరొట్ట పంటలు కాపాడతాయి. ఆ పంటలను కోసి, అక్కడే ఆచ్ఛాదనగా వేస్తే నేలలోని తేమ ఆరిపోకుండా ఉంటుంది. వాతావరణంలో నుంచి నీటి తేమను ఆచ్ఛాదనగా వేసిన గడ్డీ గాదం గ్రహించి భూమికి అందిస్తుంది. ఫలితంగా వానపాములు, సూక్ష్మ జీవులు తమ కార్యకలాపాలను సజావుగా నిర్వర్తిస్తూ నేలను సారవంతం చేస్తూ ఉంటాయి. పత్తి లేదా కంది మొక్కల వేర్లు పక్క సాళ్లలో ఉన్న ఆచ్ఛాదన కిందికి చొచ్చుకు వచ్చి దాహాన్ని తీర్చుకోవడం తోపాటు పోషకాలను గ్రహిస్తాయి. ఈ విధంగా పచ్చిరొట్ట సాగు వల్ల పత్తి లేదా కంది పంట దిగుబడి పెరుగుతుంది.



ఆచ్ఛాదనలోని శాస్త్రీయతను అర్థం చేసుకోవాలి

పత్తి 2 సాళ్లు వేసి.. ఆ పక్కనే 3 సాళ్లలో అనేక రకాల పచ్చిరొట్టను సాగు చేస్తే దిగుబడి పెరగడంతోపాటు భూసారం పెరగడం, బెట్టను తట్టుకోవడం వంటి ఎన్నో ప్రయోజనాలు నెరవేరతాయి. చీడపీడల బెడద కూడా తీరిపోతుంది. పత్తి మాదిరిగానే కందిని కూడా ఇలాగే సాగు చేయవచ్చు. ప్రకృతి వ్యవసాయంలో ఈ విషయాలు చాలా కీలకం. రైతులు మనసుపెట్టి దీనిలో దాగి ఉన్న శాస్త్రీయతను సరిగ్గా అర్థం చేసుకోవాలి. పచ్చిరొట్ట సాగుకు స్థలం వృథా అవుతున్నదని పొరబడకూడదు. రసాయనిక వ్యవసాయంలో కన్నా ప్రకృతి వ్యవసాయంలో అధిక దిగుబడి, అధికాదాయం పొందటం ముమ్మాటికీ సాధ్యమే.

- సుభాష్ శర్మ,
ప్రసిద్ధ ప్రకృతి వ్యవసాయ నిపుణులు, మహారాష్ట్ర

పత్తి 12, కంది 15 క్వింటాళ్ల దిగుబడి

పత్తిని పచ్చిరొట్టతో కలిపి సాగు చేసే ప్రయోగంలో.. సూరజ్ (సూటి రకం) పత్తి తొలి ఏడాది ఎకరానికి 8 క్వింటాళ్ల దిగుబడి వచ్చింది. మూడో ఏడాదికి 12 క్వింటాళ్లకు పెరిగింది. మరో రెండు, మూడేళ్లలో 20 క్వింటాళ్లకు పెరుగుతుందని సుభాష్ శర్మ ధీమా వ్యక్తం చేశారు. నల్లరేగడి నేలలో ఇది ఒకటి, రెండు తడులు ఇచ్చే పద్ధతిలో దిగుబడి వివరాలు. పూర్తిగా వర్షాధారంగా ప్రయోగాత్మక సాగు వచ్చే ఏడాది ప్రారంభిస్తామన్నారు సుభాష్ శర్మ.

అదేవిధంగా, కంది స్థానిక సూటి రకాలను విత్తి 15-20 క్వింటాళ్ల దిగుబడి సాధిస్తున్నామని తెలిపారు. రైతులు ఈ పద్ధతి వెనుక దాగి ఉన్న శాస్త్రీయతను అర్థం చేసుకొని సాగు చేస్తే చక్కటి ఫలితాలు వస్తాయని, తక్కువ ఖర్చుతోనే అధిక దిగుబడి, అధిక నికరాదాయం పొందవచ్చని తెలిపారు.

(సుభాష్ శర్మతో 94228 69620 హిందీలో మాట్లాడవచ్చు)



- అద్భుత వంగడాన్ని సృష్టించిన హిమాచల్‌ప్రదేశ్ రైతు
- హెచ్.ఆర్.ఎం.ఎన్.-99 ఆపిల్ మొక్కలు దేశవ్యాప్తంగా సాగులోకి..

ఈ ఆపిల్ ఎక్కడైనా కాస్తుంది!


హిమవత్పర్వత సానువులకే పరిమితమైన ఆపిల్ సాగును మైదాన ప్రాంతాలకు తీసుకొచ్చారు ఓ సామాన్య రైతు. ఉష్ణమండల ప్రాంతాల్లోనూ సాగయ్యే హెచ్ఆర్ఎంఎన్-49 ఆపిల్ వంగడాన్ని రైతు శాస్త్రవేత్త హరిమాన్ శర్మ అభివృద్ధి చేశారు. హిమాచల్ ప్రదేశ్‌లోని బిలాస్‌పూర్ జిల్లాలోని పనియాలా ఆయన స్వగ్రామం.

మామిడితో పాటే ఆపిల్ సాగు... హిమాచల్ ప్రదేశ్, ఉత్తర ప్రదేశ్, కశ్మీర్ రాష్ట్రాల్లోని కొండలపై మాత్రమే ఆపిల్ వాణిజ్య పంటగా సాగులో ఉంది. చల్లని వాతావరణం ఉన్న ఆ కొండ ప్రాంతాలు మాత్రమే ఆపిల్ సాగుకు అనుకూలంగా ఉంటాయి. హిమాచల్ ప్రదేశ్ రాష్ట్రంలోనూ కొండ ప్రాంతాల్లో మాత్రమే వాతావరణం చల్లగా ఉంటుంది. అందుకే, ఆ రాష్ట్ర రాజధాని సిమ్లా ఆపిల్ సాగులో దేశంలోనే పేరెన్నికగన్నది. కానీ ఆ రాష్ట్రంలోనూ కొండ లోయల్లో, మైదాన ప్రాంతాల్లో ఉష్ణోగ్రతలు అధికమే.

బిలాస్‌పూర్ జిల్లా సముద్ర మట్టానికి 1800 మీటర్ల ఎత్తులో ఉన్న ఒక లోయ ప్రాంతం. అక్కడ ఉష్ణోగ్రతలు అధికంగా ఉండటంతో రైతులు మామిడి తోటలను విస్తారంగా సాగు చేస్తున్నారు. అలాంటి వేడి వాతావరణం ఉన్న ప్రాంతంలో తన ఇంటి పెరట్లో ఒక ఆపిల్ మొక్క మొలకెత్తటాన్ని హరిమాన్ శర్మ గమనించారు. పనియాలా లాంటి వేడి వాతావరణంలో ఆపిల్ చెట్టు పెరగటం శర్మను ఆలోచనలో పడేసింది. ఆ మొక్కను అతి జాగ్రత్తగా చూసుకోవాలని నిర్ణయించుకున్నారు. ఒక ఏడాది గడిచాక ఆ ఆపిల్ చెట్టు నుంచి వచ్చిన కొమ్మలను తీసుకొని రేగు మొక్కతో అంటుకట్టారు. ఆ ప్రాంతంలో అంటు కట్టటానికి కూడా ఆపిల్ చెట్లు అందుబాటులో లేకపోవటమే దీనికి కారణం. అతని ప్రయోగం విజయవంతమైంది. 45 డిగ్రీల ఉష్ణోగ్రతలోనూ పంట చేతికొచ్చింది!

అంతేకాదు.. ఆపిల్ కాయలు సైజులోను, నాణ్యతలోనూ బావున్నాయి. సిమ్లా నుంచి ఆపిల్ విత్తనాలు తెచ్చి పెంచిన మొక్కలతో అంటుకట్టాడు. రెండేళ్ల తరువాత మంచి పంట చేతికొచ్చింది. తను సాగు చేస్తున్న మామిడి చెట్లతో పాటే ఆ ఆపిల్ చెట్లను పెంచాడు. ఆ విధంగా ఒక చిన్న ఆపిల్ తోటనే అతను సృష్టించాడు!

సాధారణంగా ఆపిల్‌లో పూత రావలన్నా పిందెలు రావాలన్నా అతి చల్లని వాతావరణం అవసరం. కానీ హెచ్.ఆర్.ఎం.ఎన్.-99 రకం ఆపిల్‌ను సాధారణ వాతావరణంలోనూ ఉష్ణమండల ప్రాంతాల్లోనూ సాగు చేయవచ్చని హరిమాన్ శర్మ చెబుతున్నారు. ఈ మొక్క మూడేళ్ల తిరిగేసరికి కాపుకొస్తుంది. జూన్‌లో కాయటం దీని మరో ప్రత్యేకత. ఆ కాలంలో ఇప్పుడున్న దేశీవాళీ ఆపిల్ కాయలు మార్కెట్లోకి రావు. దీంతో ఈ రకం ఆపిళ్లను సాగు చేసే రైతులు లాభపడుతున్నారు. హెచ్.ఆర్.ఎం.ఎన్.-99 వంగడంపై నేషనల్ ఇన్నోవేషన్ ఫౌండేషన్ (ఎన్.ఐ.ఎఫ్.) దృష్టి కేంద్రీకరించింది. దేశంలోని విభిన్న వ్యవసాయక వాతావరణ పరిస్థితులున్న ప్రాంతాల్లో 2015-17 మధ్యకాలంలో ప్రయోగాత్మకంగా సాగు చేయించింది. 29 రాష్ట్రాలు, 5 కేంద్ర పాలిత ప్రాంతాలకు చెందిన 1,190 మంది రైతులకు 10 వేల ఆపిల్ మొక్కలు ఇచ్చి సాగు చేయించారు. చాలా రాష్ట్రాల్లో సత్ఫలితాలు వచ్చాయని ఎన్.ఐ.ఎఫ్. ప్రకటించింది.



పరిశోధనాలయాల్లో సాగులో ఉన్న రకాలతో పోల్చితే హెచ్.ఆర్.ఎం.ఎన్.-99 పండ్లు నాణ్యమైనవని తేలింది. కొన్ని రాష్ట్రాల్లో ఏడాది వయసున్న మొక్కలకే పూత వచ్చింది.

దక్షిణాదిన కర్నాటకలోని చిక్‌మగుళూరు, హర్యానా రైతులు హెచ్ఆర్ఎంఎన్-99 ఆపిల్ వంగడాన్ని సాగు చేసి ఏడాదికి రెండు పంటలు తీస్తున్నారు. అన్ని రాష్ట్రాలతో పాటు విదేశాల్లోనూ సాగవుతోంది. మంచి దిగుబడులు వస్తున్నాయి. కాయలు రుచిగా ఉండటంతో కొనేందుకు వినియోగదారులు మక్కువ చూపుతున్నారు. బిలాస్‌పూర్ జిల్లాలోని కొండ దిగువ జిల్లాల్లోని ప్రాంతాల్లోని వేలాది మంది సాధారణ రైతులకు హరిమాన్ శర్మ స్ఫూర్తి ప్రదాతగా మారారు. అంతకు ముందు ఆ ప్రాంతంలోని రైతులు తాము ఆపిల్‌ను సాగు చేయటమనేది వారు కలనైనా ఊహించ లేదు. ఆయనను ఇప్పుడు బిస్లాపూర్ జిల్లాలో 'ఆపిల్ మేన్' అని ఆత్మీయంగా పిలుస్తున్నారు. ఈ ఆవిష్కరణ ఆయనకు ప్రతిష్టాత్మక అవార్డులను సంపాయించి పెట్టింది. రాష్ట్రపతి చేతుల మీదుగా ఎన్.ఐ.ఎఫ్. జాతీయ పురస్కారాన్ని, 'ప్రేరణా స్రోత్' పురస్కారాన్ని పొందారు.

హరిమాన్ శర్మ, పనియాల గ్రామం, బిలాస్‌పూర్ జిల్లా, హిమాచల్ ప్రదేశ్ - 174021.
ఫోన్: 09418 867209, 09817 284251.
sharmahariman farm
@gmail.com

'తెలుగు రాష్ట్రాల్లో రైతులకు 15 వేల మొక్కలు అందించాం'

మైదాన ప్రాంతాల్లో అధిక ఉష్ణోగ్రతల్లోనూ సాగు చేయదగిన ఆపిల్ వంగడాన్ని హరిమన్ శర్మ రూపొందించారు. ఆయన దగ్గరి నుంచి ఈ మొక్కల్ని పల్లెసృజన తరఫున తెప్పించి, తెలుగు రాష్ట్రాల్లో పలువురు రైతులకు గత ఐదేళ్లుగా నవంబర్-డిసెంబర్ నెలల్లో ఇస్తున్నాం. ఇప్పటికి సుమారు 15 వేల ఆపిల్ మొక్కల్ని రైతులకు అందించాం. ప్రత్యేకంగా ప్యాక్ చేసి స్పీడ్ కొరియర్‌లో రైతుల ఊళ్లకే పంపుతున్నాం. ఖర్చులన్నీ కలిపి మొక్క ఖరీదు రూ. 220 అవుతోంది. చాలా చోట్ల ఈ ఆపిల్ చెట్లకు ఇప్పటికే పండ్లు కాస్తున్నాయి.

- సుభాష్ (96528 01700),
పల్లెసృజన స్వచ్ఛంద సంస్థ, సైనిక్‌పురి, సికింద్రాబాద్



నిర్వహణ:
పంతంగి రాంబాబు, సాగుబడి డెస్క్

సాక్షి ప్లస్
బుధవారం। 29-1-2025

బిజినెస్ రీల్

బీఎస్ఎన్ఎల్ ఐఎఫ్టీవీ ప్లాట్‌ఫామ్



ముంబై: ప్రభుత్వ రంగ టెలికం కంపెనీ బీఎస్ఎన్ఎల్ తాజాగా ఐఎఫ్టీవీ ప్లాట్‌ఫామ్‌ను అందుబాటులోకి తెచ్చింది. ఇందుకోసం ఐపీటీవీ, ఇంటర్నెట్ సర్వీస్ ప్రొవైడర్ అయిన స్కైప్రో, ఓటీటీ భాగస్వామి ప్లేబాక్స్‌టీవీతో భాగస్వామ్యం కుదుర్చుకున్నట్లు ప్రకటించింది. ఈ ప్లాట్‌ఫామ్ భారత్‌లో 550 కంటే ఎక్కువ లైవ్ టీవీ ఛానెళ్లు, ప్రీమియం ఓటీటీ యాప్‌లను అందిస్తుందని బీఎస్ఎన్ఎల్ తెలిపింది. ప్రీమియం టీవీ, ఓటీటీ యాప్స్‌ను బీఎస్ఎన్ఎల్ కస్టమర్లు ఎటువంటి అదనపు ఖర్చు లేకుండా ఆస్వాదించవచ్చు.

భారత్‌లోకి జనరాలీ గ్లోబల్ కార్పొరేట్



న్యూఢిల్లీ: వ్యాపార సంస్థలకు బీమా సొల్యూషన్స్‌ను అందించే జనరాలీ గ్లోబల్ కార్పొరేట్ అండ్ కమర్షియల్ (జీసీ అండ్ సీ) తాజాగా భారత మార్కెట్లోకి ప్రవేశించింది. దేశీయంగా కార్పొరేట్, కమర్షియల్ విభాగంలో అధునాతన ఇన్సూరెన్స్ సొల్యూషన్స్‌కి డిమాండ్ పెరుగుతున్న నేపథ్యంలో ఈ విభాగంలో గణనీయంగా వ్యాపార అవకాశాలు ఉన్నట్లు సంస్థ వెల్లడించింది. ఫ్యూచర్ జనరాలీ ఇండియా ఇన్సూరెన్స్‌లో అంతర్గతంగా ఏర్పాటు చేసిన జీసీ అండ్ సీ.. మధ్య స్థాయి, భారీ స్థాయి సంస్థల అవసరాలకు అనుగుణంగా సమగ్ర బీమా కవరేజీ పథకాలను అందిస్తుంది. మెరైన్, ఏవియేషన్, సైబర్ రిస్క్, తదితర విభాగాల్లో సర్వీసులు ఉన్నాయి.

బోర్డు సమావేశాలు

మారుతీ సుజుకీ, టాటా మోటార్స్, ఒలెక్ట్రా గ్రీన్‌టెక్, బజాజ్ ఫైనాన్స్, ఇండియన్ బ్యాంక్, యూనియన్ బ్యాంక్, అదానీ పవర్, అంబుజా సిమెంట్స్, వోల్టాస్, బ్లూస్టార్, ఎస్ఆర్ఎఫ్, జిందాల్ స్టెయిన్‌లెస్, హిటాచీ ఎనర్జీ, కేపీఐటీ టెక్, రాడికో ఖైతాన్, బ్రిగేడ్ ఎంటర్‌టైన్‌మెంట్, కామ్స్ సర్వీసెస్, కేపీఐటీ టెక్నాలజీస్, జేబీఎం ఆటో, బ్లూడార్ట్, చాలెట్ హోటల్స్, క్రాఫ్ట్‌మెన్ ఆటో, ఓరియంట్ ఎలక్ట్రిక్, క్వెస్ కార్ప్, రేమాండ్, యస్ఆర్ఎఫ్, ఉషా మార్టిన్, దీపక్ ఫెర్టిలైజర్స్

కోడిగుడ్లు (హోల్‌సేల్-నెక్ / 100కు రూ.లలో)

29-1-2025

విశాఖ	505-00
చిత్తూరు	553-00
ఈస్ట్, వెస్ట్ గోదావరి	490-00
విజయవాడ	500-00
రిటైల్ ధర (డజను)	72.00
హైదరాబాద్	475-00
వరంగల్	477-00
రిటైల్ ధర	5.35

నిఫ్టీ 50

టాప్ 5 గెయినర్స్ (రూపాయల్లో)

Symbol	LTP	(%)Change
BAJFINANCE	7,610.00	4.31
AXISBANK	983.25	3.71
SHRIRAMFIN	529.85	3.56
BAJAJFINSV	1,770.10	3.42
HDFCBANK	1,673.30	2.67

నిఫ్టీ 50

టాప్ 5 లూజర్స్ (రూపాయల్లో)

Symbol	LTP	(%)Change
SUNPHARMA	1,711.00	-4.24
BRITANNIA	5,065.00	-2.15
HINDALCO	574.7	-2.08
GRASIM	2,415.00	-1.75
BEL	258.5	-1.69

స్టాక్ మార్కెట్ డేటా

	టర్నోవర్ (రూ. కోట్లలో)
బీఎస్ఈ	6,401
ఎన్ఎస్ఈ	1,15,503
ఎన్ఎస్ఈ(డెరివేటివ్స్)	4,39,919
ఎఫ్ఐఐ	- 4,921
డీఐఐ	+ 6,814

ముడిచమురు... (బ్యారెల్)

నైమెక్స్ లైట్ స్వీట్	73.14 (రాత్రి 11.30కు)	$ 73.17 (క్రితం ముగింపు)
బ్రెంట్	76.03 (రాత్రి 11.30కు)	$ 76.18 (క్రితం ముగింపు)

రియల్టీపైనే కుబేరుల కన్ను..



- రెండేళ్లలో మరింతగా ఇన్వెస్ట్ చేస్తామంటున్న 62 శాతం సంపన్నులు
- లగ్జరీ ఫార్మ్‌హౌస్‌లు, విల్లాలకు డిమాండ్
- ఇండియా సోత్‌బీస్ సర్వే నివేదిక

న్యూఢిల్లీ: దేశీయంగా అత్యంత సంపన్నులు (హెచ్ఎన్ఐలు, యూహెచ్ఎన్ఐలు) రియల్ ఎస్టేట్ రంగంలో ఇన్వెస్ట్ చేయడంపై ఎక్కువగా ఆసక్తి చూపుతున్నారు. వచ్చే రెండేళ్లలో రియల్టీపై గణనీయంగా పెట్టుబడులు పెట్టాలని 62 శాతం మంది పైగా కుబేరులు భావిస్తున్నారు. సంపన్నుల పెట్టుబడుల ధోరణులపై లగ్జరీ ప్రాపర్టీలకు సంబంధించిన రియల్ ఎస్టేట్ కన్సల్టెన్సీ సంస్థ ఇండియా సోత్‌బీస్ ఇంటర్నేషనల్ రియల్టీ నిర్వహించిన సర్వేలో ఈ అంశాలు వెల్లడయ్యాయి. పెద్ద నగరాలకు చెందిన 623 మంది హెచ్ఎన్ఐలు, యూహెచ్ఎన్ఐలు ఇందులో పాల్గొన్నారు. ఈ సర్వే ప్రకారం, భారత ఆర్థిక వృద్ధిపై ఆశాభావం కాస్త నెమ్మదించినప్పటికీ, వృద్ధి పటిష్టంగానే ఉండగలదనే అంచనాలు ఉన్నాయి. 2024లో ఆశాభావం 79 శాతంగా ఉండగా 2025 సర్వేలో ఇది 71 శాతానికి నెమ్మదించింది. అయినప్పటికీ, దేశ జీడీపీ వృద్ధి 6 శాతం నుంచి 6.5 శాతం వరకు ఉండొచ్చన్న అంచనాల నేపథ్యంలో.. భారత్ అత్యంత వేగంగా ఎదుగుతున్న ప్రధాన ఎకానమీగానే కొనసాగుతుందని చాలామటుకు హెచ్ఎన్ఐలు, యూహెచ్ఎన్ఐలు విశ్వసిస్తున్నారు. 'ఏడాది, రెండేళ్లలో రియల్ ఎస్టేట్ రంగంలో ఇన్వెస్ట్ చేయాలని భావిస్తున్న సంపన్నుల సంఖ్య 2024లో 71 శాతంగా ఉండగా 2025లో 62 శాతానికి పరిమితమైంది. అయినప్పటికీ పెట్టుబడులకు ఆకర్షణీయమైన సాధనంగా రియల్టీపై ఇంకా గట్టి నమ్మకం ఉండటాన్ని ఇది సూచిస్తుంది' అని నివేదిక వివరించింది.

రాబడులపై ఆశాభావం..

పెట్టుబడి గణనీయంగా వృద్ధి చెందుతుందనే అంచనాలే, లగ్జరీ రెసిడెన్షియల్ రియల్ ఎస్టేట్‌లో ఇన్వెస్ట్ చేయడానికి ప్రధాన కారణమని సంపన్నులు వెల్లడించారు. 2024లో ఇలా చెప్పిన వారి సంఖ్య 44 %గా ఉండగా ప్రస్తుతం ఇది 55 శాతానికి పెరిగింది. ఇక రియల్టీ పెట్టుబడులపై రాబడులు 12–18% స్థాయిలో ఉంటాయని సర్వేలో పాల్గొన్న వారిలో దాదాపు సగం మంది ఆశాభావంతో ఉన్నారు. 38% మంది మాత్రం ఇది 12% కన్నా తక్కువే ఉంటుందని భావించగా .. 18 శాతానికి మించి ఉంటుందని 15%మంది అభిప్రాయపడ్డారు. 'కాస్త ఆచితూచి వ్యవహరించే ధోరణి నెలకొన్నా, దేశీయంగా లగ్జరీ రియల్ ఎస్టేట్ మార్కెట్ వృద్ధి కొనసాగుతుంది. ముఖ్యంగా విశాలమైన ఫార్మ్‌హౌస్‌లు, గేటెడ్ కమ్యూనిటీ విల్లాలు మొదలైన వాటికి డిమాండ్ ఉంటుందని భావిస్తున్నాం' అని ఇండియా సోత్‌బీస్ ఇంటర్నేషనల్ రియల్టీ ఎండీ అమిత్ గోయల్ తెలిపారు. ఒకప్పుడు హోదాకు చిహ్నంగా నిల్చిన లగ్జరీ రియల్ ఎస్టేట్ ప్రస్తుతం మెరుగైన పెట్టుబడి సాధనంగా మారిందని సంస్థ సీఈవో అశ్విన్ చడ్ఢా పేర్కొన్నారు.

బిలియనీర్ల బూస్ట్..

దేశీయంగా బిలియనీర్ల సంఖ్య గణనీయంగా పెరుగుతుండటం సైతం రియల్టీకి కలిసొస్తోందని నివేదిక పేర్కొంది. యూబీఎస్ నివేదికను ఉటంకిస్తూ, కుబేరుల సమష్టి సంపద 42 శాతం వృద్ధి చెంది ఏకంగా దాదాపు 905 బిలియన్ డాలర్ల స్థాయిని దాటిందని వివరించింది. గత దశాబ్దకాలంలో భారత్‌లో బిలియనీర్ల సంఖ్య రెట్టింపై 185కి చేరుకోగా, మొత్తం సంపద మూడు రెట్లు పెరిగినట్లు తెలిపింది. దీంతో అంతర్జాతీయంగా అత్యధిక సంఖ్యలో కుబేరులకు కేంద్రంగా అమెరికా, చైనా తర్వాత భారత్ మూడో స్థానంలో ఉన్నట్లు వివరించింది.

ఫ్లిప్‌కార్ట్‌తో ముగిసిన సస్తాసుందర్ భాగస్వామ్యం

కోల్‌కతా: ఈ-కామర్స్ కంపెనీ ఫ్లిప్‌కార్ట్ తాజాగా ఆన్‌లైన్ ఫార్మసీ, హెల్త్‌కేర్ విభాగంలో తన భాగస్వామ్యాన్ని ముగించిందని ఆన్‌లైన్‌లో ఔషధాలను విక్రయిస్తున్న సస్తాసుందర్ మంగళవారం తెలిపింది. బ్రాండ్ యొక్క మేధో సంపత్తి హక్కులను (ఐపీఆర్) తిరిగి పొందినట్లు వెల్లడించింది. వాల్‌మార్ట్ ప్రమోట్ చేస్తున్న ఫ్లిప్‌కార్ట్ 2021లో సస్తాసుందర్ మార్కెట్‌ప్లేస్‌లో 75 శాతం వాటాను రూ.750 కోట్లకు కొనుగోలు చేసింది. కంపెనీ యాప్‌ను ప్రారంభిస్తామని సస్తాసుందర్ గ్రూప్ చైర్మన్ బి.ఎల్.మిత్తల్ తెలిపారు. 'హోల్డింగ్ కంపెనీ సస్తాసుందర్ వెంచర్స్ కొత్తగా ఏర్పడిన అనుబంధ సంస్థ సస్తాసుందర్ హెల్త్‌టెక్ ద్వారా బ్రాండ్ ఐపీఆర్‌లు, పోటీ రహిత హక్కులను ఫ్లిప్‌కార్ట్ హెల్త్ ప్లస్ నుండి తిరిగి పొందింది. ఇందుకోసం సుమారు రూ.100 కోట్ల విలువైన కంపల్సరీ కన్వర్టిబుల్ ప్రిఫరెన్స్ షేర్లను ఫ్లిప్‌కార్ట్‌కు విక్రయించాం. చివరి త్రైమాసికంలో లావాదేవీ పూర్తయింది. దీని ఫలితంగా నిలుపుకున్న 25 శాతం వాటాను రైట్ ఆఫ్ చేయడం వల్ల దాదాపు రూ.188 కోట్ల నష్టం వాటిల్లింది. ఇది కేవలం టెక్నికల్ అకౌంటింగ్ నష్టం. కంపెనీకి భౌతిక నష్టం కాదు. ఆరోగ్య వ్యాపారం నుండి నిష్క్రమించాలన్న అంతర్జాతీయ ప్రణాళికను అనుసరించి ఫ్లిప్‌కార్ట్ ఈ నిర్ణయం తీసుకుని ఉంటుందని నేను భావిస్తున్నాను. ఫ్లిప్‌కార్ట్ హెల్త్ ప్లస్ కంపెనీ వారితోనే ఉంటుంది. వారు ఆ కంపెనీని ఏం చేస్తారనేది వారి ఇష్టం' అని మిత్తల్ వివరించారు.

మొబిక్విక్, క్రెడ్‌లో ఈ-రూపీ వాలెట్లు



న్యూఢిల్లీ: డిజిటల్ ఆర్థిక సేవల ప్లాట్‌ఫాంలు మొబిక్విక్, క్రెడ్ తాజాగా సెంట్రల్ బ్యాంక్ డిజిటల్ కరెన్సీ (సీబీడీసీ) ఈ-రూపీ వాలెట్లను ప్రవేశపెట్టాయి. దీనికి యస్‌బ్యాంక్‌తో జతకట్టాయి. యూపీఐ ద్వారా బ్యాంకు ఖాతాలకు నగదును బదలాయించేందుకు, అలాగే వ్యక్తులు.. వ్యాపారవర్గాలకు చెల్లింపులు జరిపేందుకు ఈ సర్వీసులు ఉపయోగపడనున్నాయి. 2024లో రిజర్వ్ బ్యాంక్ అధికారికంగా డిజిటల్ కరెన్సీ ఈ-రూపీని ప్రవేశపెట్టినప్పుడు కేవలం బ్యాంకులకు మాత్రమే దీన్ని అందుబాటులో ఉంచింది. ప్రస్తుతం థర్డ్ పార్టీ అప్లికేషన్ ప్రొవైడర్లు (టీపీఏపీ) కూడా సీబీడీసీ సేవలను అందించేందుకు వెసులుబాటు లభించింది. ఇప్పుడు ఈ-రూపీ వాలెట్ల రోజువారీ లావాదేవీల పరిమితి రూ. 50,000గా ఉండగా, ఒక్కో లావాదేవీ విలువ పరిమితి రూ. 10,000గా ఉంది. అర్ధ రూపాయి, 1 రూపాయి నుంచి రూ. 500 వరకు కరెన్సీ డినామినేషన్లలో ఈ-రూపీ అందుబాటులో ఉంటుంది.

జెప్టో 'రివర్స్ ఫ్లిప్' పూర్తి..



న్యూఢిల్లీ: దేశీయంగా పబ్లిక్ ఇష్యూకి వచ్చే దిశగా క్విక్ కామర్స్ సంస్థ జెప్టో మరో అడుగు ముందుకు వేసింది. తమ హోల్డింగ్ కంపెనీ కిరాణాకార్ట్ ప్రైవేట్ లిమిటెడ్ ప్రధాన కేంద్రాన్ని సింగపూర్ నుంచి భారత్‌కు మార్చుకుంది. రివర్స్ ఫ్లిప్‌గా వ్యవహరించే ఈ ప్రక్రియకు సంబంధించి సింగపూర్ కోర్టులు, భారత్‌లో నేషనల్ కంపెనీ లా ట్రిబ్యునల్ నుంచి లాంఛనంగా అనుమతులు లభించినట్లు సంస్థ సహ-వ్యవస్థాపకుడు ఆదిత్ పలీచా తెలిపారు. తక్కువ సమయంలోనే దీన్ని సాకారం చేశారని తమ బృందానికి కితాబిచ్చారు.

పటిష్ట వ్యవస్థను ఏర్పాటు చేయండి: ఆర్‌బీఐ

ముంబై: పెరుగుతున్న డిజిటల్ మోసాలను అరికట్టేందుకు బ్యాంకులు పటిష్ట, క్రియాశీలక వ్యవస్థలను ఏర్పాటు చేయాలని రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ) గవర్నర్ సంజయ్ మల్హోత్రా సోమవారం కోరారు. అలాగే నష్టాలను తగ్గించడానికి థర్డ్-పార్టీ సర్వీస్ ప్రొవైడర్లపై పర్యవేక్షణను మెరుగుపరచాలని సూచించారు. ఆర్‌బీఐ డిప్యూటీ గవర్నర్లు ఎం.రాజేశ్వర్ రావు, టి.రబి శంకర్, జె.స్వామినాథన్‌తో కలిసి ప్రభుత్వ, ప్రైవేట్ రంగ బ్యాంకుల ఎండీలు, సీఈఓలతో ఆయన సమావేశమయ్యారు. డిజిటల్ మోసాల పెరుగుదలపై మల్హోత్రా ఈ సందర్భంగా ఆందోళన వ్యక్తం చేశారు.

సీమాంతర పెట్టుబడులకు ముంబై టాప్



- ఆసియా పసిఫిక్‌లో 5వ ర్యాంకు
- ఢిల్లీకి 8వ స్థానం
- సీబీఆర్ఈ నివేదికలో వెల్లడి

న్యూఢిల్లీ: సీమాంతర పెట్టుబడులకు సంబంధించి ఆసియా పసిఫిక్ ప్రాంతంలోని టాప్ 10 కీలక మార్కెట్ల జాబితాలో ముంబై, ఢిల్లీ చోటు దక్కించుకున్నాయి. రియల్ ఎస్టేట్ కన్సల్టెన్సీ సంస్థ సీబీఆర్ఈ ఇండియా నిర్వహించిన సర్వే నివేదికలో ముంబైకి అయిదో ర్యాంకు, న్యూఢిల్లీకి ఎనిమిదో ర్యాంకు లభించింది. ఈ జాబితాలో ముంబై కన్నా ముందువరుసలో టోక్యో, సిడ్నీ, సింగపూర్, హోచిమిన్ సిటీ ఉన్నాయి. సర్వేలో పాల్గొన్నవారిలో సగం మంది పైగా ఇన్వెస్టర్లు 2025లో మరింతగా రియల్ ఎస్టేట్‌లో పెట్టుబడులు పెట్టాలనుకుంటున్నట్లు వెల్లడించారు. దేశీయంగా రియల్టీలో ఆఫీస్, రెసిడెన్షియల్ స్పేస్‌తో పాటు పారిశ్రామిక.. డేటా సెంటర్లపై కూడా ఇన్వెస్టర్లు ఆసక్తిగా ఉన్నట్లు సర్వే వెల్లడించింది. 2024లో భారతీయ రియల్ ఎస్టేట్ రంగంలోకి పెట్టుబడులు 54 శాతం పెరిగి ఆల్‌టైం గరిష్టమైన 11.4 బిలియన్ డాలర్లకు చేరాయి.

'భారతీయ రియల్ ఎస్టేట్ మార్కెట్లో పెట్టుబడులు 2024లో రికార్డు స్థాయికి చేరాయి. ఇందులో దేశీ ఇన్వెస్టర్ల ఆధిపత్యం ఎక్కువగానే ఉన్నప్పటికీ విదేశీ ఇన్వెస్టర్ల పెట్టుబడులు కూడా గణనీయంగా పెరగడమనేది గ్లోబల్ రియల్ ఎస్టేట్ గమ్యస్థానంగా భారత్‌కి ప్రాధాన్యం పెరుగుతుండటానికి నిదర్శనంగా నిలుస్తుంది' అని సీబీఆర్ఈ చైర్మన్ అన్షుమన్ మ్యాగజైన్ తెలిపారు. రియల్ ఎస్టేట్‌లో ప్రస్తుత విభాగాలతో పాటు కొత్త విభాగాల్లోకి సైతం పెట్టుబడుల ప్రవాహం ఇలాగే కొనసాగే అవకాశం ఉందని పేర్కొన్నారు. ఈ-కామర్స్, వేగవంతమైన డెలివరీ సేవలకు డిమాండ్ నెలకొనడమనేది లాజిస్టిక్స్, వేర్‌హౌసింగ్ పరిశ్రమకు ఊతమివ్వగలదని అన్షుమన్ చెప్పారు. దీనితో ఇటు డెవలపర్లు, ఇన్వెస్టర్లకు కూడా ఆకర్షణీయమైన అవకాశాలు లభించవచ్చని పేర్కొన్నారు.

ఐపీవోకు వెరిటాస్ ఫైనాన్స్

ముంబై: నాన్-బ్యాంకింగ్ ఫైనాన్స్ సంస్థ వెరిటాస్ ఫైనాన్స్ తమ ఐపీవోకి సంబంధించి మార్కెట్ల నియంత్రణ సంస్థ సెబీకి ముసాయిదా ప్రాస్పెక్టస్‌ను దాఖలు చేసింది. దీని ప్రకారం పబ్లిక్ ఇష్యూ ద్వారా రూ. 2,800 కోట్ల వరకు సమీకరించనుంది. ఇందులో రూ. 600 కోట్ల విలువ చేసే షేర్లను తాజాగా జారీ చేయనుండగా, సెల్లింగ్ షేర్‌హోల్డర్లు రూ. 2,200 కోట్ల విలువ చే షేర్లను ఆఫర్ ఫర్ సేల్ విధానంలో విక్రయించనున్నారు. కంపెనీ ప్రధానంగా చిన్న, మధ్య తరహా సంస్థలకు వ్యాపార రుణాలు అందిస్తోంది. ఇష్యూ ద్వారా సమీకరించిన నిధులను భవిష్యత్ వ్యాపార అవసరాల కోసం వెరిటాస్ ఫైనాన్స్ ఉపయోగించుకోనుంది.

మహిళల కోసం ఎస్‌బీఐ శిక్షణా కార్యక్రమం



ముంబై: ప్రభుత్వ రంగ దిగ్గజం స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్‌బీఐ) మహిళలకు సాధికారత కల్పించే దిశగా వారికోసం ప్రత్యేకంగా రూపొందించిన శిక్షణా కార్యక్రమాన్ని ఆవిష్కరించింది. 153 గ్రామీణ గ్రామీణ స్వయం సమృద్ధి శిక్షణా కేంద్రాల్లో (ఆర్ఎస్ఈటీ) దీన్ని ప్రారంభించింది. దీనితో 5,200 మందికి ప్రయోజనం చేకూరగలదని బ్యాంకు తెలిపింది. ఇందులో భాగంగా టైలరింగ్, ఫుడ్ ప్రాసెసింగ్, వర్మికల్చర్ మొదలైన 27 అంశాల్లో శిక్షణా మాడ్యూల్స్ ఉంటాయని వివరించింది. ట్రైనింగ్‌తో పాటు ఆర్థికంగా సహాయం పొందడం, మార్కెట్ లింకేజీలు మొదలైన విషయాల్లోనూ మార్గదర్శకత్వం లభించగలదని బ్యాంకు పేర్కొంది. ప్రారంభ కార్యక్రమంలో గ్రామీణాభివృద్ధి శాఖ కార్యదర్శి శైలేష్ కుమార్ సింగ్, ఎస్‌బీఐ చైర్మన్ సీఎస్ శెట్టి వర్చువల్‌గా పాల్గొన్నారు.

క్యూ3 ఫలితాలు

హిందుస్తాన్ జింక్ లాభం జూమ్

క్యూ3లో రూ. 2,678 కోట్లు



న్యూఢిల్లీ: మైనింగ్ దిగ్గజం హిందుస్తాన్ జింక్ ప్రస్తుత ఆర్థిక సంవత్సరం(2024-25) మూడో త్రైమాసికంలో పటిష్ట ఫలితాలు సాధించింది. అక్టోబర్-డిసెంబర్(క్యూ3)లో కన్సాలిడేటెడ్ నికర లాభం 32 శాతం జంప్‌చేసి రూ. 2,678 కోట్లకు చేరింది. అమ్మకాలు పుంజుకోవడం ఇందుకు సహకరించింది. గతేడాది(2023-24) ఇదే కాలంలో రూ. 2,028 కోట్లు మాత్రమే ఆర్జించింది. మొత్తం ఆదాయం సైతం రూ. 7,606 కోట్ల నుంచి రూ. 8,832 కోట్లకు ఎగసింది. జింక్, సిల్వర్ ధరలతోపాటు డాలరు బలపడటం ఇందుకు తోడ్పాటునిచ్చింది. అయితే మొత్తం వ్యయాలు రూ. 4,937 కోట్ల నుంచి రూ. 5,305 కోట్లకు పెరిగాయి. 2024 డిసెంబర్‌కల్లా స్థూల పెట్టుబడులు, నగదు విలువ రూ. 8,153 కోట్లు కాగా.. రుణ భారం రూ. 12,270 కోట్లుగా నమోదైంది.

హింద్ జింక్ షేరు బీఎస్ఈలో 4 శాతం పతనమై రూ. 433 వద్ద ముగిసింది.

సుజ్లాన్ ఎనర్జీ లాభం దూకుడు

రూ. 388 కోట్లు



న్యూఢిల్లీ: రెనెవబుల్స్ సొల్యూషన్లు అందించే సుజ్లాన్ ఎనర్జీ ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2024-25) మూడో త్రైమాసికంలో ప్రోత్సాహకర ఫలితాలు సాధించింది. అక్టోబర్-డిసెంబర్(క్యూ3)లో కన్సాలిడేటెడ్ నికర లాభం 91 శాతం జంప్‌చేసి రూ. 388 కోట్లను తాకింది. అమ్మకాలు పుంజుకోవడం ఇందుకు సహకరించింది. గతేడాది(2023-24) ఇదే కాలంలో కేవలం రూ. 203 కోట్లు ఆర్జించింది. మొత్తం ఆదాయం సైతం రూ. 1,553 కోట్ల నుంచి రూ. 2,969 కోట్లకు ఎగసింది. ఈ కాలంలో 447 మెగావాట్ల రికార్డ్ డెలివరీలు చేపట్టినట్లు కంపెనీ వెల్లడించింది. అంతేకాకుండా ఆర్డర్‌బుక్ సరికొత్త రికార్డ్ సృష్టిస్తూ 5.5 గిగావాట్లకు చేరినట్లు పేర్కొంది. పుదుచ్చేరి, డామన్ నాసెల్లీ ప్లాంట్ల పునర్వ్యవస్థీకరణ నేపథ్యంలో తయారీ సామర్థ్యం 4.5 గిగావాట్లకు చేరినట్లు తెలియజేసింది.

సుజ్లాన్ ఎనర్జీ షేరు బీఎస్ఈలో యథాతథంగా రూ. 50 వద్ద ముగిసింది.

సిప్లా లాభం హైజంప్

రూ. 1,571 కోట్లు



న్యూఢిల్లీ: ఔషధ రంగ దిగ్గజం సిప్లా ప్రస్తుత ఆర్థిక సంవత్సరం(2024-25) మూడో త్రైమాసికంలో ప్రోత్సాహకర ఫలితాలు సాధించింది. అక్టోబర్-డిసెంబర్(క్యూ3)లో కన్సాలిడేటెడ్ నికర లాభం 49 శాతం జంప్‌చేసి రూ. 1,571 కోట్లకు చేరింది. వివిధ మార్కెట్లలో అమ్మకాలు పుంజుకోవడం ఇందుకు సహకరించింది. గతేడాది(2023-24) ఇదే కాలంలో కేవలం రూ. 1,056 కోట్లు ఆర్జించింది. మొత్తం ఆదాయం రూ. 6,604 కోట్ల నుంచి రూ. 7,073 కోట్లకు ఎగసింది. యూఎస్‌లో సరఫరా సవాళ్లు ఎదురైనప్పటికీ వివిధ ప్రాంతాలలో అధిక అమ్మకాలు సాధించినట్లు కంపెనీ ఎండీ, గ్లోబల్ సీఈవో ఉమంగ్ వోహ్రా పేర్కొన్నారు. ఈ కాలంలో కంపెనీ చరిత్రలోనే అత్యధికంగా 28.1 శాతం నిర్వహణ లాభ(ఇబిటా) మార్జిన్లు అందుకున్నట్లు వెల్లడించారు. యూఎస్ నుంచి 22.6 కోట్ల డాలర్ల ఆదాయం లభించగా.. దక్షిణాఫ్రికాసహా.. వర్ధమాన మార్కెట్లు, యూరప్‌లో అమ్మకాలు 20 శాతం ఎగసినట్లు పేర్కొన్నారు. కాగా.. ఫిబ్రవరి 1నుంచి వన్ ఇండియా బిజినెస్(ఎస్ఎంపీ) సీఈవో అచిన్ గుప్తాను గ్లోబల్ సీవోవోగా బోర్డు ఎంపిక చేసినట్లు ఉమంగ్ వెల్లడించారు.

సిప్లా షేరు బీఎస్ఈలో 2 శాతం బలపడి రూ. 1,426 వద్ద ముగిసింది.

అరవింద్ ఆదాయం రూ. 2,089 కోట్లు



న్యూఢిల్లీ: ప్రస్తుత ఆర్థిక సంవత్సరం మూడో త్రైమాసికంలో టెక్స్‌టైల్స్ తయారీ దిగ్గజం అరవింద్ లిమిటెడ్ ఆదాయం రూ. 1,888 కోట్ల నుంచి రూ. 2,089 కోట్లకు పెరిగింది. మరోవైపు నికర లాభం రూ. 106 కోట్లకు చేరింది. క్రితం ఆర్థిక సంవత్సరం క్యూ3లో ఇది రూ. 94.32 కోట్లు. కీలకమైన టెక్స్‌టైల్స్‌తో పాటు వివిధ వ్యాపార విభాగాలు గణనీయంగా రాణించడంతో పటిష్టమైన ఫలితాలు సాధించినట్లు సంస్థ వెల్లడించింది. పూర్తి ఆర్థిక సంవత్సరానికి టెక్స్‌టైల్స్ విభాగం పనితీరు ఆశావహంగానే ఉంటుందని, అడ్వాన్స్ మెటీరియల్స్ డివిజన్ (ఏఎండీ) కూడా పుంజుకోగలదని గైడెన్స్‌లో వివరించింది. 2025 ఆర్థిక సంవత్సరంలో పెట్టుబడి వ్యయాలు రూ. 400-450 కోట్ల స్థాయిలో ఉంటాయని పేర్కొంది.

కోల్గేట్ పామోలివ్ ఇండియా లాభం రూ. 323 కోట్లు



న్యూఢిల్లీ: ఎఫ్ఎంసీజీ దిగ్గజం కోల్గేట్-పామోలివ్ ఇండియా ప్రస్తుత ఆర్థిక సంవత్సరం మూడో త్రైమాసికంలో సుమారు రూ. 323 కోట్ల లాభాన్ని ప్రకటించింది. క్రితం ఆర్థిక సంవత్సరం క్యూ3లో నమోదైన రూ. 330 కోట్లతో పోలిస్తే లాభం స్వల్పంగా 2 శాతం తగ్గింది. మరోవైపు, అమ్మకాలు సుమారు 5 శాతం పెరిగి రూ. 1,386 కోట్ల నుంచి రూ. 1,452 కోట్లకు చేరాయి. పట్టణ మార్కెట్లో డిమాండ్ కొంత నెమ్మదించి, పోటీ పెరిగినప్పటికీ తాము మెరుగైన పనితీరు సాధించగలిగామని కంపెనీ ఎండీ, సీఈవో ప్రభా నరసింహన్ తెలిపారు.

కోల్గేట్-పామోలివ్ ఇండియా షేరు స్వల్పంగా 1 % క్షీణించి రూ. 2,674.35 వద్ద క్లోజయ్యింది.

ఇమామీ లాభం ప్లస్



న్యూఢిల్లీ: ఎఫ్ఎంసీజీ దిగ్గజం ఇమామీ ప్రస్తుత ఆర్థిక సంవత్సరం(2024-25) మూడో త్రైమాసికంలో పటిష్ట ఫలితాలు సాధించింది. అక్టోబర్-డిసెంబర్(క్యూ3)లో నికర లాభం 7 శాతం పుంజుకుని రూ. 279 కోట్లకు చేరింది. కీలక బిజినెస్ అమ్మకాల పరిమాణం ఇందుకు సహకరించింది. గతేడాది(2023-24) ఇదే కాలంలో రూ. 261 కోట్లు ఆర్జించింది. నిర్వహణ లాభం సైతం 8 శాతం ఎగసి రూ. 339 కోట్లను తాకింది. స్థూల మార్జిన్లు 1.5 శాతం మెరుగుపడి 70 శాతాన్ని దాటినట్లు కంపెనీ వెల్లడించింది. వాటాదారులకు షేరుకి రూ. 4 చొప్పున రెండో మధ్యంతర డివిడెండ్ ప్రకటించింది. క్యూ2లోనూ రూ. 4 డివిడెండ్ చెల్లించిన సంగతి తెలిసిందే. తాజా సమీక్షా కాలంలో మొత్తం ఆదాయం 5 శాతం బలపడి రూ. 1,064 కోట్లను అధిగమించింది. అయితే మొత్తం వ్యయాలు సైతం 4 శాతం పెరిగి రూ. 711 కోట్లకు చేరాయి.

ఇమామీ షేరు బీఎస్ఈలో 3 శాతం క్షీణించి రూ. 535 వద్ద ముగిసింది.

టీవీఎస్ మోటార్ లాభం అప్

రూ. 609 కోట్లు



న్యూఢిల్లీ: ద్విచక్ర, త్రిచక్ర వాహన దిగ్గజం టీవీఎస్ మోటార్ కంపెనీ ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2024-25) మూడో త్రైమాసికంలో పటిష్ట ఫలితాలు సాధించింది. కన్సాలిడేటెడ్ ప్రాతిపదికన అక్టోబర్-డిసెంబర్(క్యూ3)లో నికర లాభం 20 శాతం ఎగసి రూ. 609 కోట్లను అధిగమించింది. అమ్మకాలు పుంజుకోవడం ఇందుకు సహకరించింది. గతేడాది(2023-24) ఇదే కాలంలో రూ. 510 కోట్లు మాత్రమే ఆర్జించింది. మొత్తం ఆదాయం సైతం రూ. 10,114 కోట్ల నుంచి రూ. 11,135 కోట్లకు బలపడింది. అయితే మొత్తం వ్యయాలు రూ. 9,363 కోట్ల నుంచి రూ. 10,273 కోట్లకు పెరిగాయి. ఎగుమతులుసహా ద్విచక్ర, త్రిచక్ర వాహన విక్రయాలు 10 శాతం ఎగసి 12.12 లక్షల యూనిట్లను తాకాయి. వీటిలో మోటార్‌సైకిళ్లు 6 శాతం వృద్ధితో 5.56 లక్షలకు చేరగా.. స్కూటర్ అమ్మకాలు 22 శాతం జంప్‌చేసి 4.93 లక్షలకు చేరాయి. అయితే త్రిచక్ర వాహన అమ్మకాలు 38,000 నుంచి 29,000 యూనిట్లకు తగ్గాయి. ఈ కాలంలో ఎలక్ట్రిక్ స్కూటర్ విక్రయాలు 57 శాతం అధికమై 76,000 యూనిట్లను తాకాయి.

బీఎస్ఈలో టీవీఎస్ మోటార్ షేరు 5 శాతం జంప్‌చేసి రూ. 2,335 వద్ద ముగిసింది.

ఎస్‌బీఐ కార్డ్ లాభం 30 శాతం డౌన్



న్యూఢిల్లీ: మొండిబాకీలు పెరగడంతో ప్రస్తుత ఆర్థిక సంవత్సరం మూడో త్రైమాసికంలో ఎస్‌బీఐ కార్డ్స్ అండ్ పేమెంట్ సర్వీసెస్ నికర లాభం 30 శాతం క్షీణించి, రూ. 383 కోట్లకు పరిమితమైంది. క్రితం క్యూ3లో లాభం రూ. 549 కోట్లుగా నమోదైంది. మరోవైపు, సమీక్షాకాలంలో ఆదాయం రూ. 4,742 కోట్ల నుంచి స్వల్పంగా పెరిగి రూ. 4,767 కోట్లకు చేరింది. స్థూల నిరర్ధక ఆస్తుల పరిమాణం (జీఎన్‌పీఏ) 2.64 శాతం నుంచి 3.24 శాతానికి పెరిగింది. నికర ఎన్‌పీఏలు కూడా 0.96 శాతం నుంచి 1.18 శాతానికి చేరాయి.

బీఎస్ఈలో మంగళవారం ఎస్‌బీఐ కార్డ్స్ షేరు స్వల్పంగా పెరిగి రూ. 758.75 వద్ద క్లోజయ్యింది.

సాక్షి ప్లస్
బుధవారం । 29-1-2025

2న రాష్ట్ర ర్యాంకింగ్ చెస్ టోర్నీ

సాక్షి, హైదరాబాద్: తెలంగాణ రాష్ట్ర చెస్ సంఘం (టీజీసీఏ) ఆధ్వర్యంలో ఫిబ్రవరి 2వ తేదీన రాష్ట్ర ర్యాంకింగ్ చెస్ టోర్నమెంట్ జరగనుంది. బషీర్ బాగ్ సమీపంలో లాల్‌బహదూర్ స్టేడియం యోగా హాల్‌లో ఈ టోర్నీని ఏర్పాటు చేశారు. అండర్–7, 9, 11, 13, 15 బాలబాలికల విభాగాల్లో ఈ టోర్నీ జరుగుతుంది. 1–1–2010న లేదా ఆ తర్వాత పుట్టిన వారే ఈ టోర్నీలో ఆడేందుకు అర్హులు. స్విస్ ఫార్మాట్‌లో ఐదు రౌండ్లపాటు టోర్నీని నిర్వహిస్తారు. ప్రతి విభాగంలో టాప్–10లో నిలిచిన ప్లేయర్లకు ట్రోఫీలు, సర్టిఫికెట్లు, పతకాలు అందజేస్తామని టీజీసీఏ అధ్యక్షుడు కేఎస్ ప్రసాద్ తెలిపారు. ఈ టోర్నీలో పాల్గొనాలనుకునే వారు తమ ఎంట్రీలను జనవరి 31వ తేదీలోపు పంపించాలి. స్పాట్ ఎంట్రీలు స్వీకరించరు. వివరాలకు 7337578899 లేదా 7337399299 ఫోన్‌నంబర్లలో సంప్రదించాలి.



హైదరాబాద్ తూఫాన్స్ ఓటమి

రూర్కెలా: హాకీ ఇండియా లీగ్ (హెచ్‌ఐఎల్)లో హైదరాబాద్ తూఫాన్స్ జట్టుకు రెండో పరాజయం ఎదురైంది. మంగళవారం హోరాహోరీగా సాగిన పోరులో హైదరాబాద్ తూఫాన్స్ జట్టు 1–3 గోల్స్‌తో టీమ్ గోనాసిక వైజాగ్ చేతిలో 'షూటౌట్'లో పరాజయం పాలైంది. నిర్ణీత సమయంలో ఇరు జట్లు 3–3తో సమంగా నిలవగా... ఫలితం తేల్చేందుకు షూటౌట్ అనివార్యమైంది. మ్యాచ్ ఆరంభమైన 20వ సెకనులోనే గోల్ కొట్టిన హైదరాబాద్ స్ట్రయికర్ జాకబ్ అండర్సన్... హెచ్‌ఐఎల్‌లో ఫాస్టెస్ట్ గోల్ చేసిన ప్లేయర్‌గా రికార్డుల్లోకెక్కాడు. అండర్సన్‌తో పాటు హైదరాబాద్ తరఫున టిమ్ బ్రాండ్ (6వ నిమిషంలో), అమన్‌దీప్ లక్రా (25వ నిమిషంలో) చెరో గోల్ చేశారు. గోనాసిక తరఫున విక్టర్ చార్లెట్ (12వ, 55వ నిమిషాల్లో) డబుల్ గోల్స్‌తో విజృంభించగా... అర్షైజీత్ సింగ్ (24వ నిమిషంలో) ఒక గోల్ కొట్టాడు. తాజా సీజన్‌లో 10 మ్యాచ్‌లాడిన 6 విజయాలు, 4 పరాజయాలతో హైదరాబాత్ తూఫాన్స్ 18 పాయింట్లు ఖాతాలో వేసుకొని పట్టిక రెండో స్థానంలో ఉంది.

కోహ్లితో కళకళ...



న్యూఢిల్లీ: భారత స్టార్ క్రికెటర్ విరాట్ కోహ్లి 2012 తర్వాత దేశవాళీ టోర్నీ రంజీ ట్రోఫీ బరిలోకి దిగనున్నాడు. ఇటీవలి కాలంలో ఫామ్‌లేమితో పాటు షాట్ సెలెక్షన్ విషయంలో పదే పదే పొరబాట్లు చేస్తూ విమర్శలు ఎదుర్కొంటున్న కోహ్లి... ఐసీసీ చాంపియన్స్ ట్రోఫీకి ముందు రంజీ మ్యాచ్ ద్వారా ఆత్మవిశ్వాసం పెంపొందించుకోవాలని చూస్తున్నాడు. ఈ నేపథ్యంలో గురువారం నుంచి రైల్వేస్‌తో ప్రారంభం కానున్న రంజీ మ్యాచ్‌లో కోహ్లి ఢిల్లీ తరఫున ఆడనున్నాడు. చివరిసారిగా 2012లో ఉత్తరాఖండ్‌తో జరిగిన రంజీ మ్యాచ్‌లో ఆడిన కోహ్లి... ఆ తర్వాత అంతర్జాతీయ షెడ్యూల్ కారణంగా దేశవాళీ మ్యాచ్‌లకు దూరమయ్యాడు. అయితే జాతీయ జట్టుకు ప్రాతినిధ్యం వహించాలంటే దేశవాళీల్లో ఆడాల్సిందే అని ఇటీవల భారత క్రికెట్ నియంత్రణ మండలి (బీసీసీఐ) ప్లేయర్లను హెచ్చరించడంతో స్టార్ ఆటగాళ్లు కూడా రంజీ బాటపట్టారు. టీమిండియా కెప్టెన్ రోహిత్ శర్మ, శుబ్‌మన్ గిల్, యశస్వి జైస్వాల్, రవీంద్ర జడేజా, శ్రేయస్ అయ్యర్ ఆరో రౌండ్ రంజీ మ్యాచ్‌ల్లో ఆడగా... రేపటి నుంచి ప్రారంభం కానున్న ఈ సీజన్ చివరి లీగ్ మ్యాచ్‌ల్లో కోహ్లితో పాటు కర్ణాటక తరఫున కేఎల్ రాహుల్, హైదరాబాద్ తరఫున మొహమ్మద్ సిరాజ్ కూడా ఆడుతున్నారు. మంగళవారం ఢిల్లీ జట్టుతో కలిసి కోహ్లి ప్రాక్టీస్ సెషన్‌లో పాల్గొన్నాడు. ఆద్యంతం ఉత్సాహంగా కనిపించిన కోహ్లి ... కోచ్‌లతో చర్చిస్తూ కుర్రాళ్లలో ఉత్సాహం నింపుతూ సందడి చేశాడు.

కోహ్లి... 'కడీ చావల్'

కెరీర్ ఆరంభంలో ఢిల్లీ జట్టు తరఫున ఎన్నో మ్యాచ్‌లు ఆడిన విరాట్... తిరిగి 13 ఏళ్ల తర్వాత ఆ డ్రెస్సింగ్‌రూమ్‌లో అడుగు పెట్టాడు. ప్రస్తుతం ఢిల్లీ జట్టులో ఉన్న నవ్‌దీప్ సైనీ మినహా మిగిలిన 17 మంది ప్లేయర్లు కేవలం టీవీల్లో మాత్రమే చూసిన స్టార్ ఆటగాడితో కలిసి ప్రాక్టీస్ చేశారు. ఫిరోజ్ షా కోట్లా మైదానంలో 'చీకూ'గా మొదలైన విరాట్ కోహ్లి ప్రస్థానం... దినదిన ప్రవర్ధమానంగా ఎదుగుతూ 'కింగ్' వరకు చేరింది. ఢిల్లీ హెడ్ కోచ్ శరణ్‌దీప్ సింగ్, బ్యాటింగ్ కోచ్ బంటూ సింగ్ పర్యవేక్షణలో విరాట్ ప్రాక్టీస్ సాగించాడు. భారత అండర్–19 జట్టుకు కోహ్లి కెప్టెన్‌గా వ్యవహరించిన సమయంలో కోచ్‌గా పనిచేసి, ప్రస్తుత జట్టుకు మేనేజర్‌గా పనిచేస్తున్న మహేశ్ భాటీ విరాట్ కోసం ప్రత్యేక ఏర్పాట్లు చేసినట్లు వెల్లడించారు. 'అతడేం మారలేదు. అప్పుడెలా ఉన్నాడో ఇప్పుడూ అలాగే ఉన్నాడు. విరాట్‌కు 'ఛోలే పూరీ' బాగా ఇష్టమని అతడి కోసం అవి తెప్పించాం. కానీ ఇప్పుడు తినడంలేదని విరాట్ చెప్పాడు' అని మహేశ్ పేర్కొన్నాడు. ప్రాక్టీస్ అనంతరం ప్లేయర్లతో కలిసి 'కడీ చావల్' (పప్పన్నం) తిన్నాడని వెల్లడించాడు. మొదట ఈ మ్యాచ్‌ను ప్రత్యక్ష ప్రసారం చేయాలని నిర్ణయించకపోయినా... విరాట్ క్రేజ్‌ను దృష్టిలో పెట్టుకొని జియో సినిమా లైవ్‌కు సంబంధించిన ఏర్పాట్లు చేస్తోంది.

కుర్రాళ్లతో కలిసి...

ఉదయం తొమ్మిది గంటలకు ఖరీదైన పోర్షే కారులో మైదానానికి చేరుకున్న విరాట్... ఒక్కసారి ప్రాక్టీస్ ప్రారంభించాక నిత్యవిద్యార్థిలా శ్రమించాడు. తొలుత 35 నిమిషాల పాటు ప్లేయర్లతో కలిసి వార్మప్ చేసిన కోహ్లి... ఆ తర్వాత 15 నిమిషాల పాటు ఫుట్‌బాల్ ఆడాడు. ఆ తర్వాత నెట్ సెషన్ ప్రారంభమైంది. ఆ సమయంలో ఢిల్లీ రంజీ జట్టు కెప్టెన్ ఆయుశ్ బదోనీ వద్దకు వెళ్లిన కోహ్లి... 'ఆయుశ్ నువ్వు ముందు బ్యాటింగ్ చేయి. ఆ తర్వాత మనిద్దరం స్థానాలు మార్చుకుందాం' అని చెప్పాడు. స్టార్ ఆటగాళ్లు రంజీల్లో ఆడనున్న నేపథ్యంలో ఢిల్లీ క్రికెట్ బోర్డు రిషభ్ పంత్‌తో పాటు విరాట్ కోహ్లికి కెప్టెన్సీ చేపట్టాలని కోరగా... ఈ ఇద్దరూ దాన్ని సున్నితంగా తిరస్కరించారు. దీంతో ఐపీఎల్ మెరుపులతో వెలుగులోకి వచ్చిన ఆయుశ్ బదోనీ ఢిల్లీ జట్టుకు నాయకత్వం వహిస్తున్నాడు. నెట్స్‌లో గంటకు పైగా ప్రాక్టీస్ చేసిన విరాట్... త్రోడౌన్స్ వేయించుకొని పుల్ షాట్లు సాధన చేశాడు. పేసర్లు నవ్‌దీప్ సైనీ, రాహుల్ గెహ్లోట్, సిద్ధాంత్ శర్మ, మోనీ గ్రెవాల్, స్పిన్నర్లు హర్ష్ త్యాగి, సుమిత్ మాథుర్‌ను సునాయాసంగా ఎదుర్కొన్న కోహ్లి బ్యాక్‌ఫుట్‌పై ఎక్కువ షాట్లు ఆడే ప్రయత్నం చేశాడు. అలాగే ఆఫ్ వికెట్ లైన్ బంతులను ఎక్కువగా వదిలేశాడు.

కోహ్లికి కబీర్ ఆసక్తికర ప్రశ్న!

మంగళవారం విరాట్ ప్రాక్టీస్ చేస్తున్న సమయంలో గ్రౌండ్‌లో ఆసక్తికర సంఘటన చోటు చేసుకుంది. కోహ్లి సాధన ముగించుకొని వెళ్తున్న సమయంలో నాలుగో తరగతి చదువుతున్న ఓ కుర్రాడు... 'విరాట్ అంకుల్' అంటూ పిలవడంతో అటు వైపు వెళ్లిన కోహ్లి



అతడితో సుదీర్ఘంగా ముచ్చటించి కీలక సూచనలు చేశాడు. ఆ కుర్రాడి పేరు కబీర్ కాగా... అతడి తండ్రి ఒకప్పుడు విరాట్ కోహ్లీతో కలిసి ఢిల్లీ అండర్–17, అండర్–19 జట్లకు ఆడిన షావేజ్. భారత జట్టుకు ఆడాలంటే ఏం చేయాలని కబీర్ ప్రశ్నించగా... 'కఠోర సాధన చేయాలి. ప్రాక్టీస్ ఎప్పుడూ వదిలేయొద్దు. మీ నాన్న నిన్ను ప్రాక్టీస్‌కు వెళ్లు అని చెప్పకూడదు. నువ్వే నాన్నా నేను గ్రౌండ్‌కు వెళ్తున్నా అని చెప్పాలి' అని కోహ్లి సూచించాడు.

టెస్టు సిరీస్ ట్రోఫీతో స్మిత్, ధనంజయ



ఆస్ట్రేలియా X శ్రీలంక

- నేటి నుంచి తొలి టెస్టు
- ఉదయం 10 గంటల నుంచి సోనీ స్పోర్ట్స్ టెన్–5 చానెల్‌లో, సోనీ లివ్ యాప్‌లో ప్రత్యక్ష ప్రసారం

గాలె: ఇప్పటికే ప్రపంచ టెస్టు చాంపియన్‌షిప్ (డబ్ల్యూటీసీ) ఫైనల్ బెర్త్ దక్కించుకున్న ఆస్ట్రేలియా జట్టు బుధవారం నుంచి శ్రీలంకతో పోరుకు సిద్ధమైంది. ఈ పర్యటనలో భాగంగా ఆసీస్ జట్టు శ్రీలంకతో 2 టెస్టులు, 3 వన్డేలు ఆడనుంది. రెగ్యులర్ కెప్టెన్ ప్యాట్ కమిన్స్‌కు ఈ సిరీస్ నుంచి విశ్రాంతినివ్వగా... స్టీవ్ స్మిత్ తాత్కాలిక కెప్టెన్‌గా వ్యవహరించనున్నాడు. బుధవారం నుంచి ప్రారంభం కానున్న తొలి టెస్టుకు వరుణుడు అడ్డుపడే అవకాశాలుండగా... ఆస్ట్రేలియా జట్టు సుదీర్ఘ ఫార్మాట్‌లోనూ ట్రావిస్ హెడ్‌ను ఓపెనర్‌గా దింపాలని యోచిస్తోంది. 'ట్రావిస్ టాపార్డర్‌లో బరిలోకి దిగుతాడు. భారత్‌లో అతడు ఓపెనర్‌గా రాణించిన అంశాన్ని సెలెక్టర్లు పరిగణలోకి తీసుకున్నారు. కొత్త బంతితో హెడ్ వేగంగా పరుగులు రాబట్టి ప్రత్యర్థిని ఒత్తిడిలో పడేయగలడు. లంకలోనూ అదే చేస్తాడనే నమ్మకముంది' అని స్మిత్ పేర్కొన్నాడు. హెడ్ ఓపెనర్‌గా ప్రమోషన్ దక్కించుకుంటే... టీమిండియాతో 'బాక్సింగ్ డే' టెస్టులో చక్కటి ప్రదర్శన కనబర్చిన 19 ఏళ్ల యువ ఓపెనర్ స్యామ్ కొన్‌స్టాస్‌కు జట్టులో చోటు దక్కడం అనుమానమే. ఇక చాన్నాళ్లుగా ఆసీస్ తరఫున మెరుగైన ప్రదర్శన చేస్తున్న జోష్ ఇంగ్లిస్ ఈ సిరీస్ ద్వారా టెస్టు అరంగేట్రం చేయనున్నాడు. ఈ మేరకు స్మిత్ సూచనలిచ్చాడు. మ్యాచ్‌కు ఒక రోజు ముందే తుది జట్టును ప్రకటించాలని ఆసీస్ భావించినా... వాతావరణ పరిస్థితులు మారుతుండటంతో మ్యాచ్‌కు ముందు నిర్ణయిస్తామని స్మిత్ వెల్లడించాడు. మరోవైపు డబ్ల్యూటీసీ ఫైనల్‌కు దూరమైన శ్రీలంక... సొంతగడ్డపై మెరుగైన ప్రదర్శన చేసి కంగారూల విజయయాత్రకు చెక్ పెట్టాలని భావిస్తోంది. కాగా... గాయం కారణంగా తొలి టెస్టు నుంచి లంక ఓపెనర్ నిసాంక దూరమయ్యాడు. అతడి స్థానంలో ఒషాడా ఫెర్నాండో జట్టులోకి రానున్నాడు. 'డబ్ల్యూటీసీ ఫైనల్‌కు దూరమైనప్పటికీ... ఈ సిరీస్‌ను 2–0తో గెలుచుకుంటే పట్టికలో మూడో స్థానంలో నిలిచే అవకాశం మా జట్టుకు ఉంది. అది మా ఆత్మవిశ్వాసాన్ని మరింత పెంచుతుంది' అని శ్రీలంక సారథి ధనంజయ డిసిల్వా అన్నాడు.

18 శ్రీలంకలో శ్రీలంక జట్టుతో ఆస్ట్రేలియా ఆడిన టెస్టులు. ఇందులో 7 టెస్టుల్లో నెగ్గిన ఆస్ట్రేలియా. 5 టెస్టుల్లో ఓడిపోయింది. మరో 6 టెస్టులు 'డ్రా'గా ముగిశాయి.



జాతీయ క్రీడల మస్కట్ మౌలి



లక్ష్య సేన్ నుంచి క్రీడా జ్యోతిని అందుకున్న ప్రధాని మోదీ

అంగరంగ వైభవంగా...

- 38వ జాతీయ క్రీడలు ప్రారంభం
- ఉత్తరాఖండ్ వేదికగా ప్రారంభించిన ప్రధాని మోదీ
- 18 రోజుల పాటు 32 క్రీడాంశాల్లో పోటీలు



డెహ్రాడూన్: గ్రామీణ ప్రతిభకు పట్టం కట్టే జాతీయ క్రీడలు... అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. మంగళవారం ఉత్తరాఖండ్ వేదికగా 38వ జాతీయ క్రీడలను ప్రధానమంత్రి నరేంద్ర మోదీ శ్రీకారం చుట్టారు. వచ్చే నెల 14 వరకు జరగనున్న ఈ క్రీడల్లో 10 వేల మందికి పైగా అథ్లెట్లు పాల్గొంటున్నారు. ఉత్తరాఖండ్ రాష్ట్రం ఆవిర్భవించి 25 ఏళ్లు అయిన సందర్భంగా ఈ క్రీడలకు ఆతిథ్యమిస్తున్న ఆ రాష్ట్రం... ఆద్యంతం తమ సంస్కృతి, సంప్రదాయాలు ఉట్టిపడేలా ఆరంభ వేడుకలు నిర్వహించింది. ఈ సందర్భంగా ప్రధానమంత్రి మాట్లాడుతూ ... 2036లో భారత్‌లో ఒలింపిక్స్ నిర్వహించడమే తమ లక్ష్యమని... దీంతో దేశవ్యాప్తంగా క్రీడలకు మరింత ఆదరణ పెరుగుతుందని అన్నారు. 'మీ సామర్థ్యాలను పెంపొందించుకునేందుకు ప్రయత్నాలు కొనసాగించండి. వాటికి మద్దతివ్వడంపై మేము దృష్టి పెడతాం. దేశాభివృద్ధిలో క్రీడలు ముఖ్యమైన భాగం అని బలంగా విశ్వసిస్తున్నాం' అని నరేంద్ర మోదీ అన్నారు. ఈ క్రీడలకు డెహ్రాడూన్ ప్రధాన వేదిక కాగా... మొత్తం 7 నగరాల్లో పోటీలు నిర్వహిస్తున్నారు. 18 రోజుల పాటు జరగనున్న ఈ ఆటల్లో 32 క్రీడాంశాల్లో పోటీలు జరగనున్నాయి. జాతీయ క్రీడల ఆరంభ వేడుకలు సాంస్కృతిక నృత్య కళారూపం 'తాండవ్'తో ప్రారంభం కాగా.. ప్రముఖ సినీ గాయకుడు జుబిన్ నౌటియాల్ ప్రదర్శన ఆహుతులను ఆకట్టుకుంది. అంతకుముందు ఉత్తరాఖండ్ ముఖ్యమంత్రి పుష్కర్‌సింగ్ ధామితో కలిసి ప్రధాని మోదీ గోల్ఫ్ కార్ట్‌లో మైదానమంతా కలియతిరిగారు. అనంతరం స్థానిక సంప్రదాయ దుస్తుల్లో అథ్లెట్ల నుంచి గౌరవ వందనం స్వీకరించారు. అథ్లెట్ల మార్చ్‌పాస్ట్ అనంతరం ఉత్తరాఖండ్‌కు చెందిన భారత స్టార్ షట్లర్ లక్ష్యసేన్... క్రీడాజ్యోతిని ప్రధాని మోదీకి అందించారు. జ్యోతిని నిర్దిష్ట ప్రదేశంలో పెట్టిన ప్రధాని... క్రీడలు అధికారికంగా ప్రారంభమైనట్లు ప్రకటించారు. ఆరంభ వేడుకలు 'ఏక్ భారత్ శ్రేష్ఠ భారత్' స్ఫూర్తి ప్రస్ఫుటించాయని ప్రధాని అన్నారు. ఉత్తరాఖండ్ రాష్ట్ర పక్షి మోనల్‌ను పోలి ఉండే విధంగా 'మౌలి' మస్కట్‌ను రూపొందించారు.

సహజ, రష్మిక శుభారంభం

పుణే: అంతర్జాతీయ టెన్నిస్ సమాఖ్య (ఐటీఎఫ్) డబ్ల్యూ75 మహిళల టోర్నమెంట్‌లో భారత నంబర్ వన్, తెలంగాణ అమ్మాయి సహజ యామలపల్లి, భారతమూడో ర్యాంకర్, తెలంగాణకే చెందిన భమిడిపాటి శ్రీవల్లి రష్మిక శుభారంభం చేశారు. మంగళవారం జరిగిన సింగిల్స్ తొలి రౌండ్ మ్యాచ్‌ల్లో సహజ 6–7 (4/7), 6–1, 6–3తో నహో సాటో (జపాన్)పై... శ్రీవల్లి రష్మిక 6–1, 6–2తో అలానా స్మిత్ (అమెరికా)పై గెలిచారు. క్వాలిఫయర్ నహో సాటోతో 2 గంటల 35 నిమిషాలపాటు జరిగిన మ్యాచ్‌లో సహజ తొలి సెట్‌ను టైబ్రేక్‌లో కోల్పోయింది. తొలి సెట్ చేజార్చుకున్నా ఆందోళన చెందకుండా సంయమనంతో ఆడిన సహజ పుంజుకుంది. ఆ తర్వాత కేవలం నాలుగు గేమ్‌లు కోల్పోయి రెండు సెట్‌లు నెగ్గి విజయాన్ని ఖరారు చేసుకుంది. అలానా స్మిత్‌తో 80 నిమిషాల్లో ముగిసిన మ్యాచ్‌లో రష్మిక కేవలం మూడు గేమ్‌లు మాత్రమే చేజార్చుకుంది. భారత్‌కే చెందిన వైదేహి, వైష్ణవి, అంకిత రైనా తొలి రౌండ్‌లోనే నిష్క్రమించారు. వైదేహి 3–6, 3–6తో తాతియానా ప్రాజోరోవా (రష్యా) చేతిలో, వైష్ణవి 3–6, 4–6తో ఫాన్‌గ్రాన్ టియాన్ (చైనా) చేతిలో, అంకిత రైనా 7–6 (8/6), 4–6, 3–6తో ఎలీనా ప్రిదాన్కినా (రష్యా) చేతిలో ఓడిపోయారు. డబుల్స్ తొలి రౌండ్‌లో రష్మిక-వైదేహి ద్వయం 2–6, 1–6తో మరియా కొజిరెవా-ఇరీనా శ్యామనోవిచ్ (రష్యా) జోడీ చేతిలో ఓడిపోయింది.



సహజ
రష్మిక

ప్రాంజలకు నిరాశ

హైదరాబాద్‌కే చెందిన మరో ప్లేయర్ యడ్లపల్లి ప్రాంజలకు నిరాశ ఎదురైంది. క్వాలిఫయింగ్ సింగిల్స్ తొలి రౌండ్‌లో ప్రాంజల 4–6, 4–6తో నహో సాటో (జపాన్) చేతిలో ఓడిపోయింది. డబుల్స్ మెయిన్ 'డ్రా' తొలి రౌండ్‌లో ప్రాంజల-జీల్ దేశాయ్ (భారత్) ద్వయం 2–6, 4–6తో డయానా మర్సిన్‌కెవికా (లాత్వియా)–నహో సాటో (జపాన్) జంట చేతిలో పరాజయం పాలైంది. 2019లో కెరీర్ బెస్ట్ 265వ ర్యాంక్‌కు చేరుకున్న 25 ఏళ్ల ప్రాంజల ఆ తర్వాత గాయాల బారిన పడింది. గత ఏడాది ఒక్క టోర్నీలోనూ ఆడని ప్రాంజల ఈ ఏడాది గత వారం న్యూఢిల్లీలో జరిగిన ఐటీఎఫ్ డబ్ల్యూ50 టోర్నీతో పునరాగమనం చేసింది.



శ్రీనిధి, నామ్‌ధారి మ్యాచ్ 'డ్రా'

చండీగఢ్: ఐ–లీగ్‌లో శ్రీనిధి డెక్కన్ ఫుట్‌బాల్ క్లబ్ (ఎఫ్‌సీ) మూడో 'డ్రా' నమోదు చేసుకుంది. మంగళవారం నామ్‌ధారి ఫుట్‌బాల్ క్లబ్‌తో జరిగిన పోరును శ్రీనిధి జట్టు 1–1 గోల్స్‌తో 'డ్రా'గా ముగించింది. శ్రీనిధి డెక్కన్ జట్టు తరఫున విలియమ్ అల్వెస్ ఒలీవైరా (45+1వ నిమిషంలో), నామ్‌ధారి జట్టు తరఫున క్లెడ్సన్ కార్వాలో డిసిల్వా (33వ నిమిషంలో) చెరో గోల్ చేశారు. ఇరు జట్లు తొలి అర్ధభాగంలోనే ఒక్కో గోల్ సాధించాయి. ద్వితీయార్ధంలో రెండు జట్లు ఎంత ప్రయత్నించినా మరో గోల్ చేయలేకపోయాయి. గత నాలుగు మ్యాచ్‌ల్లో శ్రీనిధి జట్టుకు ఇది మూడో 'డ్రా' కాగా... వరుస విజయాలతో దూసుకెళ్తున్న నామ్‌ధారి జట్టు గెలుపు జోరుకు శ్రీనిధి క్లబ్ అడ్డుకట్ట వేసింది. తాజా సీజన్‌లో 11 మ్యాచ్‌లాడిన శ్రీనిధి జట్టు 3 విజయాలు, 5 పరాజయాలు, 3 'డ్రా'లతో 12 పాయింట్లు ఖాతాలో వేసుకొని 8వ స్థానంలో ఉంది. 11 మ్యాచ్‌లాడిన నామ్‌ధారి ఫుట్‌బాల్ క్లబ్ 6 విజయాలు, 2 పరాజయాలు, 3 'డ్రా'లతో 21 పాయింట్లు సాధించి 'టాప్'లో కొనసాగుతోంది.


మౌని అమావాస్య సందర్భంగా పుణ్యస్నానాలు ఆచరించేందుకు తరలివస్తున్న అశేష భక్తకోటి. మంగళవారం ప్రయాగ్‌రాజ్ నగరంలో కచ్చప్ ద్వారం వద్ద తీసిందీ ఫొటో


మహాకుంభమేళాలో భాగంగా మంగళవారం రాత్రిత్రివేణి సంగమ స్థలిలో గంగా హారతి ఇస్తున్న పూజారులు


త్రివేణి సంగమ స్థలికి దారితీసే మార్గమంతా భక్తులతో నిండిపోయిన దృశ్యం. మంగళవారం ప్రయాగ్‌రాజ్‌లో తీసిందీ ఫొటో

మహిళా సత్తా చాటుతారా?

గడిచిన నాలుగు దశాబ్దాలతో పోలిస్తే ఢిల్లో ఎన్నికల్లో పెరిగిన మహిళా అభ్యర్థులు

- ఈ ఎన్నికల్లో అత్యధికంగా 96 మంది బరిలో
- ఆప్, బీజేపీల నుంచి చెరో తొమ్మిది, కాంగ్రెస్ నుంచి ఏడుగురు పోటీలో
- గడిచిన ఐదు ఎన్నికల్లో 10 శాతం కూడా దాటని మహిళా ప్రతినిధ్యం

సాక్షి, న్యూఢిల్లీ: ప్రస్తుత ఎన్నికల్లో మహిళా ఓటర్లను ఆకట్టుకునేందుకు అనేక ప్రత్యేక సంక్షేమ పథకాలను ప్రకటిస్తున్న పార్టీలు మహిళా అభ్యర్థులను బరిలో నిలిపినా ఎంతమంది చట్ట సభల్లో అడుగు పెడతారన్న దానిపై ప్రస్తుతం పెద్ద చర్చే జరుగుతోంది. గడిచిన నాలుగు దశాబ్దాలతో పోలిస్తే ఢిల్లీ ఎన్నికల్లో మహిళా అభ్యర్థుల సంఖ్య పెరగ్గా, గెలుపు తీరాన్ని ఎంత మంది చేరుకుంటారన్నది ఆసక్తి రేపుతోంది. గతంలో ఎన్నడూ 10 శాతం కూడా దాటని మహిళా ప్రాతినిధ్యం ఈసారైనా పెరుగుతుందా? అన్నది ఫిబ్రవరి 5న జరిగే ఎన్నికలు తేల్చనున్నాయి.

అభ్యర్థులు పెరిగారు.. ప్రాతినిధ్యం సంగతేంటో?

ఢిల్లీకి గతంలో ముగ్గురు మహిళా ముఖ్యమంత్రులు పనిచేశారు. 1998లో బీజేపీకి చెందిన సుష్మా స్వరాజ్, 1998- 2013 వరకు వరుసగా మూడుసార్లు కాంగ్రెస్ నుంచి షీలా దీక్షిత్, ప్రస్తుత ముఖ్యమంత్రి ఆప్‌కి చెందిన అతిశి ముఖ్యమంత్రులుగా ఉన్నారు. అయినప్పటికీ ఇంతవరకు ఢిల్లీ అసెంబ్లీలో మహిళా ప్రతినిధుల సంఖ్య 10 శాతం దాటలేదు. 2003 నుంచి ఇప్పటివరకు గత అసెంబ్లీలో మాత్రమే 10 శాతం అంటే 8 మంది గెలిచారు. ఈ ఎనిమిది మంది ఆప్ పార్టీకి చెందిన వారే. అయితే ప్రస్తుత ఎన్నికల్లో మహిళా పోటీ దారుల సంఖ్య పెరిగింది. ఈసారి ఎన్నికల్లో అన్ని పార్టీల నుంచి కలిసి 96 మంది (14 శాతం) మహిళలు బరిలో నిలిచారు. ఇందులో ఆప్, బీజేపీల నుంచి తొమ్మిదేసి మంది ఉండగా, కాంగ్రెస్ నుంచి ఏడుగురు ఉన్నారు. 1993లో, 1,316 మంది అభ్యర్థులలు పోటీలో ఉండగా, అందులో 58 మంది మహిళలు పోటీ చేయగా, 1998లో ఈ సంఖ్య 57కి తగ్గింది. 2003లో 78 మహిళలు, 2008లో 81, 2013లో 71, 2015లో 66కి మంది మహిళా అభ్యర్థులు పోటీ చేయగా, 2020లో 79 మంది మహిళలు పోటీ చేయగా, 10 శాతం (8) మంది విజయం సాధించారు. ఈసారి పోటీలో ఉన్న 96 మంది మహిళలతో విజయాల రేటు రేటు మెరుగుపడుతుందా అన్నది ఆసక్తిగా మారింది. ఇక పార్టీల వారీగా చూస్తే 2008 నుంచి బీజేపీకి ఒక్కరంటే ఒక్క మహిళా ఎమ్మెల్యే లేరు. 2008లో నలుగురు, 2013లో ఐదుగురు, 2015లో ఎనిమిది, 2020లో ఆరు మందిని మహిళలను పోటీలో నిలిపినా ఎవరూ గెలువలేదు. ఈ సారి 9 మందిని బరిలో పెట్టి ఖాతా తెరవాలనే తాపత్రయంతో ఉంది. ఇక కాంగ్రెస్‌కు 2008లో ముగ్గురు మహిళా ఎమ్మెల్యేలు ఉండగా, ఆ తర్వాత వారినుంచి ప్రాతినిధ్యమే లేదు. ఈసారి ఏడుగురు మహిళలను పార్టీ రంగంలోకి దించి అదృష్టాన్ని పరీక్షించుకోనుంది. ఇక ఆప్ మాత్రం 2013 నుంచి స్థిరంగా విజయాలను నమోదు చేస్తోంది. 2013లో ఆరుగురిలో ముగ్గురు గెలవగా, 2015లో ఆరింటికి ఆరు, 2020లో తొమ్మిదిలో ఎనిమిది మంది గెలిచారు. ఆసారి తొమ్మిది మంది అభ్యర్థులను బరిలో పెట్టింది. ఆప్ ముఖ్యమంత్రి అతిశి, సీనియర్ ఎమ్మెల్యేలు రాఖీ బిడ్లాన్, పర్మిలా టోకాస్, ధన్వతి చండేలా, బందన కుమార్, సరితా సింగ్‌లతో సహా ఏడుగురు మహిళా అభ్యర్థులను ఈసారి మళ్లీ పోటీలో పెట్టింది. మహిళలు మళ్లీ ఆకట్టుకునేందుకు ఆప్ ప్రభుత్వం కొద్ది నెలల ముందు మహిళలకు ప్రతి నెలా రూ. 1,000 అందించడానికి 'ముఖ్యమంత్రి మహిళా సమ్మాన్ యోజన'పథకాన్ని అమల్లోకి తెచ్చింది. ఆప్ తిరిగి అధికారంలోకి వస్తే దీన్ని నెలకు రూ.2,100 పెంచుతామన్న హామీతో తిరిగి వారి మద్దతు కూడగట్టే పనిలో పడింది.

పార్టీల వారీగా బరిలో గెలిచిన, నిలిచిన మహిళలు ఇలా

పార్టీ	2008	2013	2015	2020
ఆప్	-	3/6	6/6	8/9
కాంగ్రెస్	3/8	0/6	0/5	0/10
బీజేపీ	0/4	0/5	0/8	0/6

గడిచిన ఎన్నికల్లో మహిళల పోటీ, గెలుపు ఇలా..

ఏడాది	పోటీ చేసిన అభ్యర్థులు	గెలుపు	గెలిచిన శాతం
1993	58	3	5
1998	57	9	16
2003	78	7	9
2008	81	3	4
2013	71	3	4
2015	66	6	9
2020	79	8	10

కల ఆలస్యమైందంటే
అల్జీమర్ ముంచుకొస్తున్నట్లే

- నిద్రపోయాక కల కనే సమయానికి, అల్జీమర్స్‌కు లంకె
- అధ్యయనంలో వెల్లడి

న్యూఢిల్లీ: నిద్రలోకి జారుకున్నాక ఆ రోజంతా మదిలో మెదిలిన ఆలోచనల్లో మళ్లీ అవసరమైన వాటిని భద్రంగా దాచేస్తూ, మిగతా వాటిని చెరిపేస్తూ మెదడు తన పని తాను చేసుకుంటూ పోతుంది. ఈ ప్రక్రియ వేగంగా పూర్తయ్యాక కలలు వస్తాయి. అయితే నిద్రలోకి జారుకున్నాక కల కనడం మరింత ఆలస్యమైతే అల్జీమర్స్ వ్యాధి త్వరగా వచ్చే అవకాశాలు ఉన్నట్లు భావించాలని ఓ అధ్యయనం పేర్కొంది. సంబంధిత అధ్యయనం వివరాలు ''అల్జీమర్స్ అండ్ డెమెన్షియా: ది జర్నల్ ఆఫ్ ది అల్జీమర్స్ అసోసియేషన్''జర్నల్‌లో తాజాగా ప్రచురితమయ్యాయి. నిద్రలోకి జారుకునే సమయంలో తొలుత కళ్లు వేగంగా కదలని స్థితి (నాన్ ర్యాపిడ్ ఐ మూవ్‌మెంట్- నాన్‌రెమ్)లోకి మనిషి జారుకుంటాడు. దాదాపు 90 నిమిషాల తర్వాత కళ్లు వేగంగా కదిలే రెమ్ దశ మొదలవుతుంది. ఈ రెమ్ ఒక రాత్రి నిద్రలో నాలుగు నుంచి ఆరుసార్లు చక్రంలా కొనసాగుతూ వస్తుంది. ఈ రెమ్ దశ ఎంత ఆలస్యమైతే ఆ మనిషికి అల్జీమర్స్ త్వరగా వచ్చే అవకాశాలు అంత ఎక్కువగా ఉంటాయి. త్వరగా రెమ్ దశ వచ్చే వారితో పోలిస్తే రెమ్ దశ ఆలస్యంగా మొదలైన వారి మెదడులో అసాధారణ స్థాయిలో అమిలాయడ్ ప్రోటీన్లు 16 శాతం ఎక్కువగా పోగుబడుతున్నట్లు అధ్యయనంలో తేలింది.

టౌ ప్రోటీన్లు సైతం 29 శాతం అధికంగా పోగుబడుతున్నట్లు వెల్లడైంది. 128 మంది వ్యక్తుల నిద్ర స్థితులపై సమగ్ర స్థాయిలో అధ్యయనం చేశాక ఈ విషయాలను శాస్త్రవేత్తలు ధృవీకరించారు. రెమ్ దశను ఆలస్యంగా చేరుకున్న వాళ్లలో మెదడు ఆరోగ్యానికి ఉపకరించే బ్రెయిన్-డెరీవ్‌డ్ న్యూరోట్రోఫిక్ ఫ్యాక్టర్(బీడీఎన్‌ఎఫ్)అనే ప్రోటీన్ 39 శాతం తక్కువగా ఉత్పత్తి అవుతున్నట్లు గుర్తించారు. బీడీఎన్‌ఎఫ్ ఎంత తగ్గితే అంతగా అల్జీమర్స్ వ్యాధి ముదురుతుందని శాన్‌ఫ్రాన్సిస్కోలోని కాలిఫోర్నియా విశ్వవిద్యాలయ పరిశోధకులు చెప్పారు. ''రెమ్ దశ ఆలస్యమైతే మెదడు నిద్రాకాలంలో పాత జ్ఞాపకాలను సమీక్ష విధానంలో అవాంతరాలు ఏర్పడతాయి''అని వర్సిటీలోని అసోసియేట్ ప్రొఫెసర్ యూయీ లెంగ్ చెప్పారు. రెమ్ దశ పూర్తిస్థాయిలో లేకపోయినా, ఒకవేళ ఆలస్యమైనా ఒత్తిడి హార్మోన్ అయిన కార్టిసోల్ ఉత్పత్తి అవుతుంది. ఇది మెదడులోని హిప్పోక్యాంపస్ పనితీరుపై ప్రతికూల ప్రభావం చూపుతుంది''అని ఆయన చెప్పారు. బీజింగ్‌లోని చైనా-జపాన్ ఫ్రెండ్‌షిప్ ఆస్పత్రిలో సగటున 70 ఏళ్ల వయసున్న వృద్ధులపై ఈ పరిశోధన చేశారు.

ఇన్ఫోసిస్ క్రిస్ గోపాలకృష్ణన్‌పై ఎస్సీ, ఎస్టీ కేసు

యశవంతపుర: ఇన్ఫోసిస్ సంస్థ సహ వ్యవస్థాపకులు సేనాపతి క్రిస్ గోపాలకృష్ణన్, మాజీ డైరెక్టర్ బలరామ్‌తో పాటు మొత్తం 18 మందిపై బెంగళూరులో ఎస్సీ, ఎస్టీ చట్టం కింద జనవరి 27వ తేదీన కేసు నమోదైంది. బెంగళూరు 71వ సిటీ సివిల్, సెషన్స్ కోర్టు ఆదేశాలతో సదాశివనగర పోలీసులు కేసు నమోదు చేశారు. బోవీ (ఎస్టీ) వర్గానికి చెందిన ప్రొఫెసర్ డి. సన్న దుర్గప్ప ఈ ఫిర్యాదు చేశారు. దుర్గప్ప గతంలో ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్(ఐఐఎస్‌సీ)లో సెంటర్ ఫర్ సస్టేనబుల్ టెక్నాలజీ విభాగంలో లెక్చరర్‌గా పనిచేసేవారు. 2014లో హనీట్రాప్ పేరుతో తప్పుడు కేసులో ఇరికించి తనను సంస్థ నుంచి తొలగించారని, ఈ కుట్రలో క్రిస్ గోపాలకృష్ణన్‌తో పాటు 18 మంది ఉన్నారని ఆయన తన ఫిర్యాదులో పేర్కొన్నారు. 2008 నుంచి 2025 వరకు కులం పేరుతో దూషించి దౌర్జన్యానికి పాల్పడినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. గోవిందన్ రంగరాజన్, శ్రీధర్ వారియర్, సంధ్యా విశ్వేశ్వరయ్య, హరి కెవిఎస్, దాసప్ప, దేవలతా మహితి, చటోపాధ్యాయ, కె ప్రదీప్, డీ సావర్, మనిహరన్‌లపై దుర్గప్ప ఫిర్యాదు చేశారు. సంస్థ నుంచి దుర్గప్ప ఉద్వాసనకు గురైన కాలంలో క్రిస్ గోపాలకృష్ణన్ ఐఐఎస్‌సీ ట్రస్టు బోర్డ్ సభ్యునిగా ఉన్నారు. మిగతావారు సహ అధ్యాపకులుగా కొనసాగారు. వీరందరూ సంస్థకు చెందిన రూ. 2,500 కోట్లను లూటీ చేసినట్లు ఫిర్యాదులో దుర్గప్ప ఆరోపించారు.

నేను భారత్, అమెరికా బంధం నుంచి వచ్చా

మైక్రోసాఫ్ట్ సీఈవో సత్యా నాదెళ్ల వ్యాఖ్య

సియాటిల్/న్యూయార్క్: కీలక రంగాల్లో భారత్, అమెరికా కలిసి పనిచేస్తున్నాయని, అలా నేను కూడా ఈ రెండు దేశాల ఉమ్మడి ఉత్పత్తిని అని మైక్రోసాఫ్ట్ సీఈవో సత్యా నాదెళ్ల వ్యాఖ్యానించారు. భారత 76వ గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని అమెరికాలో జరిగిన ఒక కార్యక్రమంలో నాదెళ్ల మాట్లాడారు. ''విద్య, ఆరోగ్యం, ప్రజాసేవ, పోటీతత్వం, చిన్న వ్యాపారుల అభ్యున్నతి కోసం సాంకేతికతను ఎలా ప్రభావవంతంగా వినియోగించాలనే దానిపై భారత్, అమెరికా బాగా దృష్టిసారించాయి''అని ఆయన పొగిడారు. సియాటెల్‌లోని భారత కాన్సులేట్ జనరల్ ఇక్కడి బెల్ హార్బర్ సమావేశమందిరంలో ఈ ప్రత్యేక కార్యక్రమాన్ని ఏర్పాటుచేసింది.


దక్షిణకొరియాలోని బుసాన్ సిటీలోని గిమ్హే అంతర్జాతీయ ఎయిర్‌పోర్ట్ నుంచి బయల్దేరుతూ హఠాత్తుగా మంటల్లో చిక్కుకున్న ఎయిర్‌బుసాన్ విమానం. మంగళవారం రాత్రి జరిగిన ఈ ఘటనలో వెంటనే మంటలను అదుపులోకి తేవడంతో మొత్తం 169 మంది ప్రయాణికులు సురక్షితంగా బయటపడ్డారు.



అత్యంత ధనిక పార్టీగా అవతరించిన బీజేపీ

న్యూఢిల్లీ: ఏకంగా రూ.7,113.80 కోట్ల బ్యాంక్ బ్యాలెన్స్‌తో దేశంలోనే అత్యంత ధనిక రాజకీయ పార్టీగా బీజేపీ అవతరించింది. కేంద్ర ఎన్నికల సంఘం విడుదల చేసిన గణాంకాల ద్వారా ఈ విషయం వెల్లడైంది. గత ఏడాది మార్చి 31వ తేదీనాటికి కాంగ్రెస్ వద్ద కేవలం రూ.857.15 కోట్లే ఉన్నాయని తేలింది. 2022-23 ఆర్థికంతో పోలిస్తే 2023-24 ఆర్థికంలో బీజేపీ రూ.1,754 కోట్లు ఖర్చుచేసింది. 2022-23లో ఈ ఖర్చు రూ.1,092 కోట్లే. 2023-24 ఆర్థికంలో కాంగ్రెస్ రూ.619.67 కోట్లను ఖర్చుచేసింది.

గుర్మీత్ రామ్ రహీమ్‌కు 30 రోజుల పెరోల్

చండీగఢ్: అమ్మాయిలైన తన ఇద్దరు శిష్యులను రేప్‌చేసిన కేసులో దోషిగా తేలి శిక్ష అనుభవిస్తున్న డేరా సచ్చా సౌదా చీఫ్ గుర్మీత్ రామ్ రహీమ్ సింగ్ 30 రోజుల పెరోల్ (తాత్కాలిక విడుదల) సాధించారు. దీంతో మంగళవారం ఆయన హరియాణాలోని రోహ్‌తక్ కారాగారం నుంచి విడుదలయ్యారు. మరో వారంలో ఢిల్లీ శాసనసభ పోలింగ్ జరగనున్న తరుణంలో ఆయన విడుదలకావడం గమనార్హం.

మళ్లీ ప్రైవేట్ స్కూళ్లు కళకళ

ప్రభుత్వ పాఠశాలల్లో తగ్గిపోతున్న చేరికలు

వెల్లడించిన యాన్యువల్ స్టేటస్ ఆఫ్ ఎడ్యుకేషన్ రిపోర్టు

దేశంలో కోవిడ్-19 మహమ్మారి ఉధృతం ఉన్న సమయంలో పెద్ద సంఖ్యలో ప్రైవేట్ పాఠశాలలు మూతపడ్డాయి. విద్యార్థులు ప్రభుత్వ పాఠశాలల్లో చేరారు. అప్పట్లో ప్రభుత్వ స్కూళ్లలో చేరికల సంఖ్య విపరీతంగా పెరిగింది. ఆ పరిస్థితి మారిపోయిందని, ప్రభుత్వ స్కూళ్ల నుంచి విద్యార్థులు ప్రైవేట్ స్కూళ్ల బాటపడుతున్నారని యాన్యువల్ స్టేటస్ ఆఫ్ ఎడ్యుకేషన్ రిపోర్టు(ఏఎస్ఈఆర్) మంగళవారం వెల్లడించింది. కోవిడ్-19కు ముందున్న పరిస్థితి మళ్లీ కనిపిస్తోందని తెలియజేసింది. 6 నుంచి 14 ఏళ్లలోపు పిల్లలు ప్రైవేట్ స్కూళ్లలో చేరడానికి ఆసక్తి చూపుతున్నారని పేర్కొంది. కరోనా విపత్తు సమయంలో పిల్లలు విద్యార్జనలో వెనుకబడ్డారు. తరగతులు జరగకపోవడం, ఆన్‌లైన్ పాఠాలు సరిగ్గా అర్థం కాకపోవడం ఇందుకు కారణం. అప్పటి నష్టం చాలావరకు పూడుకుపోయిందని ఏఎస్ఈఆర్ నివేదిక స్పష్టం చేసింది. ప్రాథమిక తరగతుల్లో గతంలో పోలిస్తే ఇప్పుడు అభ్యసన స్థాయిలు పెరిగాయని తెలిపింది. నివేదికలో ఇంకా ఏం ప్రస్తావించారంటే..

- 14 నుంచి 16 ఏళ్లలోపు బాలబాలికల్లో 82 శాతం మందికి స్మార్ట్‌ఫోన్ ఎలా ఉపయోగించాలో తెలుసు. కానీ, వారిలో కేవలం 57 శాతం మంది మాత్రమే విద్యార్జన కోసం స్మార్ట్‌ఫోన్ వాడుకుంటున్నారు.
- 2006 నుంచి గ్రామీణ ప్రాంతాల్లో ప్రైవేట్ పాఠశాలల్లో చేరికల సంఖ్య స్థిరంగా పెరుగుతోంది. 6 నుంచి 14 ఏళ్లలోపు బాలల్లో ఈ చేరికల సంఖ్య 2006లో 18.7 శాతం ఉండగా, 2014 నాటికి అది 30.8 శాతానికి చేరుకుంది. 2018లో ఇది స్థిరంగా ఉంది.
- కరోనా కాలంలో ప్రభుత్వ స్కూళ్లలో చేరిక సంఖ్య భారీగా పెరిగింది. 2018లో ఇది 65.6 శాతంగా ఉండగా, 2022లో 72.9 శాతంగా నమోదయ్యింది. కానీ, 2024లో 66.8 శాతానికి పడిపోయింది. అంటే దాదాపుగా 2018 నాటి పరిస్థితి పునరావృతమైందని చెప్పొచ్చు.
- దేశవ్యాప్తంగా గత ఏడాది సర్వే నిర్వహించి, ఏఎస్ఈఆర్ నివేదిక రూపొందించారు. 605 గ్రామీణ జిల్లాల్లో 17,997 మంది గ్రామాలోల6.49 లక్షల మంది విద్యార్థులను ప్రశ్నించారు.
- ఐదేళ్లలోపు వయసు ఉండి ఒకటో తరగతి చదువుతున్న చిన్నారుల సంఖ్య 2018లో 25.6 శాతంగా కాగా, 2022 నాటికి 22.7 శాతానికి పడిపోయింది. 2024 నాటికి 16.7 శాతానికి తగ్గింది.

- సాక్షి, నేషనల్ డెస్క్

యమునా కాలుష్యంపై రాజకీయ మంటలు

- ఢిల్లీ ఒకరిపై ఒకరు దుమ్మెత్తిపోసుకుంటున్న ప్రధాన పార్టీలు
- రూ.6వేల కోట్లు ఖర్చు పెట్టినా కాలుష్యం ఎందుకు తగ్గలేదని ప్రశ్నిస్తున్న బీజేపీ
- యమునా నదిలో హరియాణా ప్రభుత్వం విషాన్ని కలిపి పంపుతోందని కేజ్రీవాల్ ఆరోపణలు
- యమునా నది పునరుజ్జీవం చుట్టూ ఢిల్లీ రాజకీయం

సాక్షి, న్యూఢిల్లీ: ఢిల్లీ ఎన్నికల పోలింగ్ గడువు ముంచుకొస్తున్న వేళ ఎన్నికల ప్రచారంలో యమునా నది కాలుష్యం అంశం రాజధాని రాజకీయాలను కమ్ముకుంటోంది. నదీ కాలుష్యానికి మీరంటే మీరు కారణమంటూ అధికార ఆప్, ప్రతిపక్ష బీజేపీ పార్టీలు ఒకరిపై ఒకరు దుమ్మెత్తిపోసుకోవడంతో ప్రచార పర్వంలో రాజకీయ మంటలు రాజుకుంటున్నాయి. హరియాణాలోని బీజేపీ ప్రభుత్వ హయాంలో పారిశ్రామిక వ్యర్థాలను యమునా నదిలో యథేచ్ఛగా వదిలేస్తూ ఢిల్లీలోకి విషాన్ని పంపుతోందంటూ ఆప్ అధినేత కేజ్రీవాల్ చేసిన ఆరోపణలతో ఈ కాలుష్య అంశం రాజకీయ రంగు పులుముకుంది.

నురగలు కక్కుతున్న కాలుష్యం

ఒకప్పుడు అత్యంత పవిత్రంగా భావించే యమునా నని నీళ్లు ఇప్పుడు కాలుష్యానికి ఆలవాలంగా మారిపోయింది. యమునోత్రి నుంచి ప్రయాగ్‌రాజ్‌లోని త్రివేణి సంగమం వరకు 1,370 కిలోమీటర్ల పొడవునా ప్రవహించే యమున నది ప్రధానంగా ఢిల్లీలోని వజీరాబాద్-ఓఖ్లా మధ్య 22 కిలోమీటర్ల పరిధిలోఅత్యంత విషపూరితంగా మారుతున్నట్లు అధ్యయనాలు చెబుతున్నాయి. జనాభా పెరగడం, నదీ ఆక్రమణలు, నదీ తీరాన పారిశ్రామికీకరణ విపరీతంగా పెరగడం, హరియాణా, ఉత్తర్‌ప్రదేశ్ రాష్ట్రాలు సహా ఢిల్లీలోని పారిశ్రామిక కార్ఖానాల నుంచి వ్యర్థాలన్నీ నదిలోకి చేరడంతో కాలుష్యానికి యమునా నది కేరాఫ్ అడ్రస్‌గా మారింది. పారిశ్రామిక వ్యర్థాల కారణంగా నదీ ప్రవాహం చాలా చోట్ల నురగలు కక్కుతూ దర్శనమిచ్చిన సందర్భాలు అనేకమున్నాయి. పారిశ్రామిక వ్యర్థాలు, శుద్ధి చేయని ఇతర వ్యర్థాలే ఈ నురగకు కారణమవుతున్నాయి. ఈ నురగలో అత్యంత ప్రమాదకర స్థాయిలో పాస్ఫేట్ ఉంటోందని కాలుష్య నియంత్రణ బోర్డు సహా ఇతర నివేదికలు తేల్చాయి. యమునా నీళ్ల తాగడానికి కాదుగదా కనీసం ఇంటి అవసరాలకు కూడా పనికి రావని, ఈ నీటిలో మానవ వ్యర్థాలు సాధారణ స్థితికంటే 500 రెట్లు అధికంగా ఉన్నాయని ఢిల్లీ కాలుష్య నియంత్రణ కమిటీ ఫిబ్రవరిలో ప్రభుత్వానికి సమర్పించిన నివేదికలో పేర్కొంది. యమునా కాలుష్యాన్ని అరికట్టేందుకు 1992 నుంచి ప్రణాళికలు ఉన్నా, ఇందుకోసం వేల కోట్ల రూపాయల వ్యయంతో ప్రాజెక్టులు చేపడుతున్నా కాలుష్యంలో తగ్గుదల కనిపించడం లేదు. ప్రస్తుతం ఢిల్లీలో రోజుకు దాదాపు 96 కోట్ల గ్యాలన్ల మురుగునీరు ఉత్పత్తి అవుతుండగా, అందులో 55 శాతం నీటినే శుద్ధిచేస్తున్నారు. ప్రస్తుతం 35 ప్లాంట్ల సామర్థ్యం 632 ఎంజీడీలు కాగా ప్రస్తుతం 530 ఎంజీడీల మురుగునీటిని మాత్రమే శుభ్రం చేస్తున్నారు. ఆప్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక 2017-18 నుంచి ఇప్పటివరకు నీటి కాలుష్యాన్ని తగ్గించేందుకు వివిధ పనులపై రూ.6,856.91 కోట్లు ఖర్చు చేశారు. కేంద్ర ప్రభుత్వం సైతం నమామీ గంగే కార్యక్రమం కింద యమునా కాలుష్యాన్ని అరికట్టేందుకు హిమాచల్‌ప్రదేశ్, హరియాణా, ఢిల్లీ, యూపీ రాష్ట్రాలకు 23 ప్రాజెక్టుల కింద మొత్తంగా రూ.4,290కోట్లు మంజూరు చేసింది. ఇందులో ఇప్పటికే రూ.2,500 కోట్లు ఖర్చు చేసినా కాలుష్యాన్ని ఆపడంతో ఆయా రాష్ట్రాలు పూర్తిగా విఫలమయ్యాయి. 2025 నాటికి యమునా కాలుష్యాన్ని అరికడతామన్న కేజ్రీవాల్ మాటలు నీటి మూటలు కావడంతో ఆయనే లక్ష్యంగా విపక్షాలు విరుచుకుపడుతున్నాయి.

పొరుగు రాష్ట్రాలకు తాకిన కాలుష్య కాటు

యమునా కాలుష్య అంశం ప్రస్తుతం ఢిల్లీ ఎన్నికల్లో ప్రధాన అంశంగా మారింది. కాలుష్యానికి హరియాణాలోని బీజేపీ ప్రభుత్వం ప్రధాన కారణమని, పారిశ్రామిక వ్యర్థాలను యమునా కలిపి ఢిల్లీలోకి విషాన్ని పంపుతున్నారంటూ కేజ్రీవాల్ రెండ్రోజుల కిందట తీవ్ర ఆరోపణలు చేశారు. ఇదో రకంగా జీవజల యుద్ధం, వాటర్ టెర్రరిజం అంటూ హరియాణా ప్రభుత్వంపై విమర్శలు గుప్పించారు. ఢిల్లీ సీఎం ఆతిశీ సైతం హరియాణా నుంచి ఢిల్లీకి ప్రవహిస్తున్న నదీ జలాల్లో వ్యర్థాలు, అమ్మోనియా స్థాయిలో చాలా ఎక్కువగా ఉన్నాయని విమర్శించారు. దీనిపై పంజాబ్ సీఎం భగవంత్ మాన్‌తో కలిసి ఆమె బుధవారం కేంద్ర ఎన్నికల సంఘం అధికారులను కలిసి ఫిర్యాదుచేశారు. హరియాణా ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగా ఢిల్లీ ప్రజలకు నీటి సరఫరా ప్రమాదంలో పడిందని ఆరోపించారు. మునాక్ కాలువ నుంచి అదనపు జలాలను విడుదలచేయాలని మాన్ డిమాండ్‌చేశారు. దీనిపై హరియాణా సీఎం నయాబ్ సింగ్ షైనీ సైతం తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. ''ఎగువ రాష్ట్రాలతో సత్సంబంధాలు క్షీణించేలా, ఢిల్లీ ప్రజలను అనవసరంగా భయపెట్టేలా కేజ్రీవాల్ ఆరోపణ చేశారు. వీటిపై లెఫ్టినెంట్ గవర్నర్ చర్యలు తీసుకోవాలి'' అని ఆయన డిమాండ్‌చేశారు. ఓటమి భయం కేజ్రీవాల్‌ను నిస్సహాయంగా మార్చిందని, ఢిల్లీ ప్రజలను భయపెట్టి ఓట్ల లబ్ధి పొందేందుకు కేజ్రీవాల్ ప్రయత్నిస్తున్నారని ఢిల్లీ బీజేపీ అధ్యక్షుడు వీరేంద్ర సచ్‌దేవా ఆరోపించారు. బీజేపీ, ఆప్ పార్టీలు తాము అధికారంలోకి వస్తే యమునా కాలుష్యాన్ని అరికట్టి పునరుజ్జీవం చేస్తామని తమతమ మేనిఫెస్టోల్లో ప్రకటించడంతో ఈ అంశం ఇప్పుడు ఎన్నికల హామీల్లో ప్రధానమైనదిగా మారుతోంది.

రాత్రి 8 కల్లా ఆధారాలు చూపండి

యమునాలో 'విషం' ఆరోపణలపై కేజ్రీవాల్‌కు ఈసీ ఆదేశాలు

న్యూఢిల్లీ: హరియాణాలోని అధికార భాజపా యమునా నదిలోకి విషయం కలిపేందుకు ప్రయత్నించిందన్న ఆమ్ ఆద్మీ పార్టీ కన్వీనర్ కేజ్రీవాల్ ఆరోపణలపై ఎన్నికల సంఘం ఘాటుగా స్పందించింది. ''తప్పుడు ఆరోపణలు చేస్తే గరిష్ఠంగా మూడేళ్ల జైలు శిక్ష పడుతుందన్న విషయాన్ని గుర్తుంచుకోండి. విషం కలిపడానికి ప్రయత్నించారని మీరు చేసిన ఆరోపణలకు బలం చేకూర్చే అన్ని ఆధారాలను జనవరి 29వ తేదీ రాత్రి 8 గంటలలోపు మాకు సమర్పించండి. విషం కలుపుతుంటే అడ్డుకున్న ఢిల్లీ జల్ బోర్డ్ ఇంజనీర్ల వివరాలూ ఇవ్వండి'' అని కేజ్రీవాల్‌కు ఈసీ మంగళవారం ఒక లేఖ రాసింది. హరియాణా నుంచి దిల్లీకి ప్రవహిస్తున్న యమునా నదీ ప్రవాహంలో అమ్మోనియా స్థాయి చాలా ఎక్కువగా ఉన్నట్లు ఢిల్లీలోని ఆప్ ప్రభుత్వం ఆరోపించడం తెల్సిందే.

వాట్సాప్ ద్వారా నిందితులకు నోటీసు ఇస్తారా?

అలా చేయడం చట్టప్రకారం చెల్లదు: సుప్రీంకోర్టు

న్యూఢిల్లీ: ఏదైనా కేసులో నిందితులకు వాట్సాప్ ద్వారా లేదా ఇతర ఎలక్ట్రానిక్ పరికరం ద్వారా నోటీసు ఇవ్వడం సరైంది కాదని సుప్రీంకోర్టు స్పష్టంచేశారు. భారతీయ నాగరిక్ సురక్ష సంహిత-2023 ప్రకారం ఇలా వాట్సాప్ ద్వారా నోటీసు పంపించడం చెల్లదని పేర్కొంది. సీఆర్‌పీసీ-1973లోని సెక్షన్ 41ఏ, బీఎన్ఎస్ఎస్-2023లోని సెక్షన్ 35 ప్రకారం.. చట్టం అనుమతించిన విధానంలోనే నోటీసులు ఇవ్వాలని జస్టిస్ ఎం.ఎం.సుందరేశ్, జస్టిస్ రాజేశ్ బిందాల్‌లో కూడిన సుప్రీంకోర్టు ధర్మాసనం వెల్లడించింది. ఈ మేరకు పోలీసులకు తగిన ఆదేశాలివ్వాలని అన్ని రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలకు సూచించింది. ఈ మేరకు ఈ నెల 21వ తేదీన ధర్మాసనం ఉత్తర్వులిచ్చింది. వాట్సాప్ ద్వారా, ఎలక్ట్రానిక్ పరికరాల ద్వారా నోటీసులు ఇవ్వడాన్ని చట్టం ప్రకారం ఇచ్చే విధానానికి ప్రత్యామ్నాయంగా గుర్తించలేమని తేల్చిచెప్పింది. ఓ కేసు విషయంలో సీనియర్ న్యాయవాది సిద్ధార్థ లూత్రా చేసిన విజ్ఞప్తి మేరకు ధర్మాసనం ఈ ఆదేశాలిచ్చింది.

సిక్కుల పదవ, చివరి గురువు.. గురు గోవింద్ సింగ్

సివిల్స్, గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం

జనరల్ స్టడీస్

ఇండియన్ హిస్టరీ

ప్రాంతీయ రాజ్యాలు

సిక్కులు

గురునానక్ (1469-1539)

సిక్కు మతస్థాపకుడు గురునానక్. ఇతడు 1469లో పంజాబ్‌లోని తల్వండి అనే గ్రామంలో జన్మించాడు. మొదటి సిక్కు గురువైన గురునానక్ సర్వమత సమానత్వాన్ని, సహన భావాన్ని బోధించాడు. ఇతడి శిష్యులను 'నానక్ పంతి' అంటారు. కొంత కాలం తర్వాత వీరినే సిక్కులుగా పిలిచారు. దేవుడు ఒక్కడేనని, కర్మ సిద్ధాంతాన్ని నమ్మాలని నానక్ బోధించాడు.

గురు అంగద్ (1539-1552)

గురు అంగద్ 1539లో నానక్ వారసుడిగా గురువయ్యాడు. ఇతడు మొగల్ చక్రవర్తి హుమాయూన్‌కు సమకాలీకుడు. అంగద్ 'గురుముఖి' లిపిని కనిపెట్టాడు. భాయిబాల సహాయంతో నానక్ జీవిత చరిత్రను రచించాడు.

గురు అమర్‌దాస్ (1552-1574)

ఇతడు 78 ఏళ్ల వయస్సులో సిక్కు గురువు అయ్యాడు. సతీ సహగమనాన్ని నిరసించాడు.

గురు రామ్‌దాస్ (1574-81)

ఇతడు గురు అమర్‌దాస్ అల్లుడు. గురు రామ్‌దాస్ మొగల్ చక్రవర్తి అక్బర్‌కు సమకాలీకుడు. అక్బర్ పంజాబ్‌లోని అమృతసర్ ప్రాంతాన్ని ఇతడికి బహుకరించగా అక్కడే 1577లో స్వర్ణ దేవాలయ నిర్మాణానికి పునాది వేశాడు. ఒక సరస్సును తవ్వించాడు. ఇతడి కాలం నుంచే గురువు కావడం వారసత్వ హక్కుగా మారింది.

గురు అర్జున్ దేవ్ (1581-1606)

ఇతడు సిక్కుల అయిదో గురువు. ప్రాచీన హిందూ, ముస్లింల రచనల్లోని ముఖ్య సిద్ధాంతాలు సేకరించి 'ఆదిగ్రంథ్'ను సంకలనం చేశాడు. ఇది సిక్కుల పవిత్ర గ్రంథం. స్వర్ణ దేవాలయ నిర్మాణాన్ని పూర్తి చేశాడు.

'వైశాఖి' అనే పండుగను ప్రవేశపెట్టి ప్రజల సంపాదనలో పదో వంతు వసూలు చేసేవాడు. జహంగీర్ కుమారుడైన ఖుస్రూ తండ్రికి ఎదురు తిరిగాడు. అర్జున్ దేవ్ ఖుస్రూకు ఆశ్రయం కల్పించాడు. ఫలితంగా జహంగీర్ చక్రవర్తి అర్జున్ దేవ్‌పై దేశద్రోహ నేరం మోపి అతణ్ని ఉరితీయించాడు. ఈ ఘటనతో అప్పటివరకు ప్రశాంతంగా ఉన్న సిక్కులు సైనికులుగా మారారు.

గురు హర గోవింద్ (1606-44)

ఇతడు గురు అర్జున్ దేవ్ వారసుడు. రక్షక దళాన్ని చిన్న సైన్యంగా మార్చాడు. సైనిక శిక్షణ ఇప్పించాడు. 'అఖల్ తక్త్'ను స్థాపించాడు. 'లోహఘర్' (అమృతసర్) కోటను నిర్మించాడు. ఇతడికి 'సచ్చాబాద్షా' అనే బిరుదు ఉంది. హర గోవింద్ సింగ్ 'సంగ్రామ్' యుద్ధంలో షాజహాన్ సైన్యాన్ని ఓడించాడు. ఇతడి తర్వాత గురువైన గురు హర రాయ్ (1644-61)శాంత స్వభావుడు.హర రాయ్ తర్వాత గురు హర కృష్ణ (1661-64) గురువయ్యాడు.

గురు తేజ్ బహద్దూర్ (1664-1675)

తేజ్ బహదూర్ కశ్మీర్‌లోని ఆనందపూర్‌లో స్థిరపడ్డాడు. ఇతడు ఔరంగజేబ్ అసహన మత విధానాన్ని వ్యతిరేకించాడు. దీంతో ఔరంగజేబ్ తేజ్ బహద్దూర్‌ను చిత్రవధ చేసి చంపించాడు.

గురు గోవింద్ సింగ్ (1675-1708)

ఇతడు పదో గురువు, చివరి వాడు. ఇతడు సిక్కులను రాజకీయ, సైనిక సమాజంగా రూపొందించాడు. దీన్నే ఖల్సా సమాజం అంటారు. సిక్కులు ఖడ్గంతో చిలికిన నీటిని తాగి 'సింగులు' (సింహాలు)గా బిరుదు వహించారు. ఖల్సా ప్రకారం సిక్కులు కేశ (పొడవు వెంట్రుకలు), కంఘా (దువ్వెన), కృపాణ్ (ఖడ్గం), కచ్చా (పొట్టి లాగు), కర్డ (చిన్న చాకు)ను ధరించేవారు. ఇతడి కుమారులందరూ ఆనందపూర్ యుద్ధంలో మరణించారు. గోవింద్ సింగ్‌ను నాందేడ్‌లో ఒక అఫ్గాన్ సైనికుడు కత్తితో పొడిచి చంపాడు. అయిదు గురు సిక్కులు ఎక్కడ కూడితే అక్కడే నేనుంటాను అని గురు గోవింద్ సింగ్ తన శిష్యులకు చివరి సందేశం ఇచ్చాడు.

1708 తర్వాత సిక్కుల చరిత్ర

బందా బహదూర్ (1708-16)

ఇతడు సిక్కుల నాయకుడయ్యాడు. సిక్కుల స్వాతంత్ర్యం కోసం మొగలులతో పోరాటం చేశాడు. సయ్యద్ సోదరులు బందా బహదూర్‌ను బంధించి హత్య చేశారు. సిక్కులు స్థాపించిన రాజ్యాలను ఖల్సా రాజ్యాలంటారు. 1773 నాటికి 12 ఖల్సా రాజ్యాలుండేవి. సుకేర్ చకియా వీటిలో ఒక రాజ్యం. చరత్ సింగ్ దీని స్థాపకుడు. అతని కుమారుడు రంజిత్ సింగ్. ఈయన 1780 నాటికి సుకేర్ చకియా పాలకుడయ్యాడు.

రంజిత్ సింగ్ (1792-1839)

ఇతడికి పంజాబ్ సింహం అనే బిరుదు ఉంది. 1799లో లాహోర్‌ను ఆక్రమించి సట్లెజ్ నదికి పశ్చిమంగా ఉన్న ఖల్సా రాజ్యాలను స్వాధీనం చేసుకున్నాడు. 1801లో మహారాజా అనే బిరుదు ధరించాడు. ఇతడు సిక్కు సామ్రాజ్య నిర్మాత. బ్రిటిష్ వారితో సఖ్యతతో మెలిగాడు. 1809లో గవర్నర్ జనరల్ మింటోతో సంధి చేసుకున్నాడు. రైతుల నుంచి 40 శాతం శిస్తు వసూలు చేసేవాడు. రంజిత్ సింగ్ వారసులు అసమర్థులైనందువల్ల మొదటి ఆంగ్లో సిక్కు యుద్ధం (1845-46), రెండో ఆంగ్లో సిక్కు యుద్ధం (1848-49)లో బ్రిటిషర్లు సిక్కులను జయించారు. దీంతో పంజాబ్ బ్రిటిష్ సామ్రాజ్యంలో విలీనమైంది.

మరాఠాలు

శివాజీ

శివాజీ 1627లో జన్మించాడు. ఇతడి తల్లి జిజియా బాయి. శివాజీ దాదాజీ కొండదేవ్ సంరక్షణలో పెరిగాడు. ఇతడి గురువు రామదాస్. రాయ్‌గఢ్ వద్ద దుర్గాన్ని నిర్మించి తన కార్యకలాపాలకు కేంద్రం చేసుకున్నాడు. శివాజీని చంపి లేదా బంధించి తీసుకురమ్మని 1659లో బీజాపూర్ సుల్తాన్ తన సేనాని అఫ్జల్ ఖాన్‌ను ఆదేశించాడు. శివాజీ భాఘనఖ్ (పులిగోళ్లు) ఉపయోగించి అఫ్జల్‌ఖాన్‌ను హతమార్చాడు. 1665లో ఔరంగజేబ్ మీర్జా జయసింగ్‌ను శివాజీపై యుద్ధానికి పంపాడు. జయసింగ్ పురంధర్‌ను ముట్టడించాడు. శివాజీ 23 దుర్గాలను మొగలులకు ఇచ్చి 12 దుర్గాలను తన వద్ద ఉంచుకునేలా సంధి చేసుకున్నాడు. 1666లో శివాజీ తన కుమారుడైన శంభాజీతో కలిసి ఆగ్రాలో ఔరంగజేబ్‌ను సందర్శించాడు. కానీ ఔరంగజేబ్ శివాజీతో అమర్యాదగా ప్రవర్తించి అతణ్ని గృహ నిర్బంధం చేశాడు. శివాజీ మిఠాయిల గంపలో దాక్కొని తప్పించుకున్నాడు. తర్వాత దక్కన్ చేరి మొగలులకు ఇచ్చిన కోటలన్నింటినీ తిరిగి స్వాధీనం చేసుకున్నాడు. రాయ్‌గఢ్‌ను రాజధానిగా చేసుకున్న శివాజీ 1674లో పట్టాభిషిక్తుడయ్యాడు. శివాజీ 'ఛత్రపతి' బిరుదు వహించాడు. ఇతడి రాజ్యానికి స్వరాజ్యమని పేరు. శివాజీ రాజ్యాన్ని రెండు భాగాలుగా విభజించాడు. అతడి ప్రత్యక్ష పాలనలో ఉన్న ప్రాంతానికి స్వరాజ్యమని, దాని చుట్టూ ఉన్న ప్రాంతానికి మొగలాయ్ అని పేరు. ఈ ప్రాంతాల నుంచి చౌత్, సర్దేశ్‌ముఖి అనే పన్నులు వసూలు చేశాడు. కేంద్ర ప్రభుత్వంలో అష్టప్రధాన్ అనే మంత్రి పరిషత్ ఉండేది. రాజు వారికి నేరుగా జీతాలను చెల్లించేవాడు. పంటలో నాలుగో వంతు భూమి శిస్తుగా వసూలు చేసేవారు. సైన్యాన్ని వ్యవస్థీకరించారు. పది మంది ఉన్న దళానికి అధిపతి 'నాయక్' నుంచి వేయి మంది ఉన్న దళానికి అధిపతి 'హజారీ' వరకు అనేక భాగాలుగా సైన్యాన్ని విభజించారు. శివాజీ, అతడి వారసులు గెరిల్లా యుద్ధంలో ప్రావీణ్యం పొందారు.



పీష్వాలు

బాలాజీ విశ్వనాథ్ (1713-20)

సాహు కాలంలో బాలాజీ విశ్వనాథ్ ప్రధాన మంత్రి లేదా పీష్వా. సాహుకు వారసులు లేకపోవడం వల్ల అతడి మరణానంతరం మరాఠా సామ్రాజ్యం పీష్వాల పరమైంది. పీష్వా వంశ స్థాపకుడు బాలాజీ విశ్వనాథ్. ఇతణ్ని మహారాష్ట్ర జాతీయ స్థాపకుడిగా అభివర్ణిస్తారు. బాలాజీ విశ్వనాథ్ పీష్వా పదవిని వంశ పారంపర్యం చేశాడు. పుణేను రాజధానిగా చేసుకున్నాడు.

మొదటి బాజీరావు (1720-1740)

ఇతడు పీష్వాలందరిలోకెల్లా సమర్థుడు. హిందూ పద్ పద్ షాహి లేదా అఖిల భారత సామ్రాజ్యం నిర్మించాలనేది ఇతడి ఆశయం. లక్ష్య సాధనలో కొంత మేర సఫలీకృతుడయ్యాడని చెప్పవచ్చు. ఇతడి కాలంలో పన్నులు వసూలు చేసే సర్దార్లు బలవంతులై స్వతంత్రం ప్రకటించుకున్నారు. నాగ్‌పూర్‌లో రఘోజీ భోంస్లే, బరోడాలో పిల్లాజీ గైక్వాడ్, ఇండోర్‌లో మల్హర్‌రావ్ హోల్కార్, గ్వాలియర్‌లో రోబోజీ సింధియా స్వతంత్ర రాజ్యాలు స్థాపించారు. వీరందర్నీ మహారాష్ట్ర కూటమిగా చేర్చిన ఘనత మొదటి బాజీరావుదే.

బాలాజీ బాజీరావు (1740-1761)

ఇతడు మొదటి బాజీరావు కుమారుడు. బాలాజీ బాజీరావు కాలంలో మరాఠాల అధికారం, వైభవం ఉచ్ఛ స్థితికి చేరింది. 1757లో మరాఠాలు అహ్మద్ షా అబ్దాలీ ప్రతినిధి నుంచి ఢిల్లీని స్వాధీనం చేసుకున్నారు. రఘోబా పీష్వా తమ్ముడు పంజాబ్‌ను జయించి అటక్ కోటపై మరాఠా జెండా ఎగురవేశాడు. ఇదే సమయంలో అఫ్గానిస్తాన్ రాజైన అహమ్మద్ షా అబ్దాలీ 1761లో పానిపట్ వద్ద మరాఠాలను ఓడించాడు. దీన్నే 'మూడో పానిపట్' యుద్ధం అంటారు. ఈ యుద్ధంలో అబ్దాలీకి రెండో షా ఆలం, ఔద్ నవాబు సహకరించారు. గెరిల్లా పోరాటం చేయకపోవడం వల్లే మరాఠాలు ఈ యుద్ధంలో ఓడారు.

హైదరాబాద్ రాజ్యం

నిజాం-ఉల్-ముల్క్ అసఫ్‌జా 1724లో హైదరాబాద్ రాజ్యాన్ని స్థాపించాడు. ఇతడు 1722-24 మధ్య మొగల్ సామ్రాజ్యానికి వజీర్‌గా పనిచేశాడు. హిందువుల పట్ల సహన భావం ప్రదర్శించాడు. పూరన్ చంద్ అనే హిందువు ఆయన వద్ద దివాన్‌గా పనిచేయడమే దీనికి ఉదాహరణగా పేర్కొనవచ్చు. నిజాం-ఉల్-ముల్క్ 1748లో మరణించాడు. తర్వాత వరుసగా.. అతడి రెండో కుమారుడైన నాజర్ జంగ్, నిజాం మనవడైన ముజఫర్ జంగ్, నిజాం మూడో కుమారుడైన సలాబత్ జంగ్ అధికారంలోకి వచ్చారు. వీరి తర్వాత రెండో నిజాంగా లేదా రెండో అసఫ్‌జాగా నిజాం అలీ రాజ్యపాలన చేపట్టాడు. ఇతడు 1763లో ఉత్తర సర్కార్ జిల్లాలను, 1788లో గుంటూరును, 1802లో దత్త జిల్లాలను బ్రిటీషర్లకు ఇచ్చేశాడు. నిజాం అలీ తర్వాత సికిందర్ ఝా మూడో నిజాంగా రాజ్యానికొచ్చాడు. ఇతడు లష్కర్ (సికింద్రాబాద్)ను నిర్మించాడు. నసీరుద్దీన్ నాలుగో నిజాం, అఫ్జల్ ఉద్దౌలా అయిదో నిజాం. ఇతడి కాలంలో హైదరాబాద్ రాజ్యంలో సిపాయిల తిరుగుబాటు జరిగింది. ఇతడి ప్రధాని సాలార్‌జంగ్-1 గొప్పవాడు. సాలార్‌జంగ్ అసలు పేరు తురాబ్ అలీఖాన్. ఆరో నిజాం మీర్ మహబూబ్ అలీఖాన్ అఫ్జల్‌గంజ్‌లో స్టేట్ సెంట్రల్ లైబ్రరీ, కాచిగూడలో రైల్వేస్టేషన్, నిజాం కళాశాల (1887), మహబూబ్ ఆలియా కళాశాలను నిర్మించాడు. చివరి నిజాంగా మీర్ ఉస్మాన్ అలీఖాన్ 1911లో పాలనా పగ్గాలు చేపట్టాడు.

బెంగాల్

ముర్షిద్ కులీఖాన్ 1700 నుంచి బెంగాల్ దివాన్‌గా పనిచేసి స్వతంత్రంగా వ్యవహరించాడు. ఇతడు 1717లో మరణించాడు. అలీ వర్దీఖాన్ 1741లో స్వతంత్రం ప్రకటించుకున్నాడు. ఇతడి రాజధాని ముర్షిదాబాద్. 1756లో సిరాజ్ ఉద్దౌలా సింహాసనాన్ని అధిష్టించాడు. 1757లో ఆంగ్లేయులు రాబర్ట్ క్లైవ్ నేతృత్వంలో బెంగాల్ నవాబైన సిరాజ్ ఉద్దౌలాను ప్లాసీ యుద్ధంలో ఓడించారు. ఆంగ్లేయులు జయించిన మొదటి రాష్ట్రం బెంగాల్.


ఔద్

సాదత్ ఖాన్ 1724లో ఔద్‌ను స్వతంత్ర రాజ్యంగా ప్రకటించాడు. 1764లో ఔద్ నవాబైన షుజాద్దౌలా మొగల్ చక్రవర్తి రెండో షా ఆలం, బెంగాల్ నవాబ్ మీర్ ఖాసీంతో ఒక కూటమిని ఏర్పాటు చేశాడు. వీరు ఆంగ్లేయుల నుంచి బెంగాల్‌ను స్వాధీనం చేసుకోవడానికి ప్రయత్నించి విఫలమయ్యారు. 1764లో జరిగిన యుద్ధానికి బక్సార్ యుద్ధమని పేరు. కూటమిపై విజయం సాధించిన ఆంగ్లేయులు, బెంగాల్, బిహార్, ఒరిస్సాలపై దివానీ హక్కు పొందారు. ఈ యుద్ధం వల్ల ఈస్టిండియా కంపెనీ భారతదేశంలో స్వతంత్ర రాజకీయాధికారం పొందింది. షుజాద్దౌలా తర్వాత అసఫ్ ఉద్దౌలా ఔద్ రాజ్యానికి నవాబు అయ్యాడు.

మైసూర్

1766లో మైసూర్ రాజు మరణించగానే హైదరాలీ సింహాసనం ఆక్రమించి సుల్తాన్ అయ్యాడు. 1776లో మొదటి ఆంగ్లేయ-మహారాష్ట్ర యుద్ధంలో హైదరాలీ, నిజాం నవాబు కలిసి ఆంగ్లేయులపై పోరాడారు. ఈ యుద్ధంలో ఏ పక్షానికి విజయం లభించలేదు. 20 ఏళ్లపాటు శాంతి వర్ధిల్లింది. వారన్ హేస్టింగ్స్ నిజాం నవాబుకు గుంటూరు జిల్లాను లంచంగా ఇచ్చి అతణ్ని బ్రిటిష్ వ్యతిరేక కూటమి నుంచి వేరు చేశాడు. 1781-82లో జరిగిన రెండో మైసూర్ యుద్ధంలో ఐర్‌కూట్ నాయకత్వంలోని బ్రిటిష్ సేనలు పోర్టోనొవో వద్ద హైదరాలీని ఓడించాయి. 1782లో హైదరాలీ మరణించాడు. అతడి కుమారుడైన టిప్పు సుల్తాన్ అధికారాన్ని చేపట్టాక 1784లో శాంతి ఒప్పందం జరిగింది. గవర్నర్ జనరల్ లార్డ్ కారన్ వాలిస్ మహారాష్ట్రులు, నిజాం నవాబు, తిరువాన్కూరు, కూర్గు రాజులను తన వైపు తిప్పుకొని కూటమిని ఏర్పాటు చేశాడు. యుద్ధంలో టిప్పు సుల్తాన్‌ను ఓడించి అతడి రాజ్యంలోని సగ భాగాన్ని స్వదేశీ రాజులకు ఇచ్చేశాడు. దీన్నే మూడో ఆంగ్లో-మైసూర్ యుద్ధం (1790-92) అంటారు. 1799లో జరిగిన నాలుగో ఆంగ్లో-మైసూర్ యుద్ధంలో బ్రిటిష్ సైన్యం టిప్పును ఓడించింది. శ్రీ రంగ పట్నాన్ని రక్షించుకునే ప్రయత్నంలో టిప్పు సుల్తాన్ 1799 మే 4న వీర మరణం పొందాడు.

రాజనీతి శాస్త్ర పితామహుడు ఎవరు?



మాదిరి ప్రశ్నలు

1. కింది వాటిలో పంచశీల సూత్రం కానిది?
   1) రాజ్యాల సమగ్రతను, సార్వభౌమాధికారాన్ని పరస్పరం గౌరవించడం
   2) రాజ్యాల పరస్పర దురాక్రమణకు పాల్పడకుండా ఉండటం
   3) ఇతర రాజ్యాల అంతరంగిక వ్యవహారాల్లో జోక్యం చేసుకోవడం
   4) ఇతర రాజ్యాల అంతరంగిక వ్యవహారాల్లో జోక్యం చేసుకోకుండా ఉండటం
2. **అలీనోద్యమ మొదటి శిఖరాగ్ర సమావేశం 1961లో యుగోస్లేవియాలోని బెల్‌గ్రేడ్‌లో జరిగితే, 2015లో 17వ శిఖరాగ్ర సమావేశాన్ని ఎక్కడ నిర్వహించారు?**
   1) కౌలాలంపూర్ (మలేషియా)
   2) హవానా (క్యూబా)
   3) టెహ్రాన్ (ఇరాన్)
   4) కారకాస్ (వెనిజులా)
3. **ఐక్యరాజ్య సమితి ప్రధాన కార్యదర్శుల్లో రెండు పర్యాయాలు పనిచేసిన వారెవరు?**
   1) ట్రిగ్వేలీ (నార్వే)
   2) యుథాంట్ (బర్మా)
   3) డాగ్‌హోమర్ జోల్డ్ (స్వీడన్)
   4) బుట్రోస్ బుట్రాస్ ఘలీ (ఈజిప్ట్)
4. **కింది వాటిలో యూఎన్‌వో ప్రత్యేక ఏజెన్సీల్లో జెనీవాలో ప్రధాన కార్యాలయం లేని సంస్థ ఏది?**
   1) అంతర్జాతీయ ద్రవ్య నిధి సంస్థ (ఐఎంఎఫ్)
   2) అంతర్జాతీయ కార్మిక సంస్థ (ఐఎల్‌వో)
   3) ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యూహెచ్‌వో)
   4) ప్రపంచ వాతావరణ సంస్థ (డబ్ల్యూఎంవో)
5. **కింది వాటిలో బ్రిక్స్‌లో సభ్యత్వం లేని దేశం ఏది?**
   1) దక్షిణాఫ్రికా 2) బ్రెజిల్
   3) భారత్ 4) భూటాన్
6. **CTBTను విస్తరించండి?**
   1) Common Treatment for Bad Terrorists
   2) Comprehensive Nuclear Test Ban Treaty
   3) Conclusive Test Ban Treaty
   4) Community Test Base Treatment
7. **వివిధ సమావేశాలకు అధ్యక్షత వహించే వారికి సంబంధించి కింది వాటిని జతపరచండి.**
   జాబితా -I
   i) ఉపరాష్ట్రపతి ii) ప్రధానమంత్రి
   iii) స్పీకర్
   iv) శాసన మండలి చైర్మన్
   జాబితా -II
   a) కేబినెట్ సమావేశం
   b) పార్లమెంట్ ఉభయ సభల సంయుక్త సమావేశం
   c) రాజ్యసభ సమావేశం
   d) విధాన పరిషత్ సమావేశం
   1) i-c, ii-a, iii-b, iv-d
   2) i-c, ii-a, iii-d, iv-b
   3) i-b, ii-a, iii-c, iv-d
   4) i-a, ii-c, iii-b, iv-d
8. **'మున్సిపల్ వ్యవస్థకు కళ్లు, చెవులు, చేతులు' అని వేటిని పేర్కొంటారు?**
   1) మున్సిపల్ కమిషనర్లు
   2) ఆర్థిక వనరులు
   3) పన్నులు, ప్రణాళికలు
   4) స్థాయి సంఘాలు
9. **కలకత్తా, మద్రాస్, బొంబాయి హైకోర్టులను ఏ చట్టం ద్వారా ఏర్పాటు చేశారు?**
   1) రెగ్యులేటింగ్ చట్టం -1773
   2) చార్టర్ చట్టం - 1833
   3) కౌన్సిల్ చట్టం - 1861
   4) భారత ప్రభుత్వ చట్టం - 1858
10. **కింది వారిలో ముసాయిదా కమిటీలో సభ్యుడు కాని వారెవరు?**
    1) బి. కృష్ణమాచారి 2) ఎన్. మాధవరావు
    3) కె.ఎం. మున్షీ 4) రాజేంద్రప్రసాద్
11. **'రాజనీతి శాస్త్ర పితామహుడి'గా ఎవరిని పేర్కొంటారు?**
    1) సోక్రటీస్ 2) అరిస్టాటిల్
    3) ప్లేటో 4) మాకియవెల్లి
12. **భారత రాజ్యాంగ రూపకల్పనకు పట్టిన కాలం?**
    1) 36 నెలల 18 రోజులు
    2) 34 నెలల 18 రోజులు
    3) 35 నెలల 18 రోజులు
    4) 37 నెలల 18 రోజులు
13. **రాజ్యాంగ పరిషత్ చిహ్నం?**
    1) సింహం 2) ఐరావతం
    3) మేషం 4) వరాహం
14. **భారత రాజ్యాంగాన్ని రూపొందించినప్పుడు, అందులో ఎన్ని ఆర్టికల్స్, షెడ్యూళ్లు, భాగాలు ఉన్నాయి?**
    1) 395 ఆర్టికల్స్, 6 షెడ్యూళ్లు, 12 భాగాలు
    2) 395 ఆర్టికల్స్, 8 షెడ్యూళ్లు, 21 భాగాలు
    3) 395 ఆర్టికల్స్, 12 షెడ్యూళ్లు, 8 భాగాలు
    4) 395 ఆర్టికల్స్, 8 షెడ్యూళ్లు, 22 భాగాలు
15. **జతపరచండి.**
    కేసులు
    i) బెరుబారి ii) కేశవానంద భారతి
    iii) గోలక్ నాథ్ iv) మినర్వా మిల్స్
    సంవత్సరాలు
    a) 1967 b) 1980
    c) 1960 d) 1973
    1) i-c, ii-a, iii-b, iv-d
    2) i-b, ii-c, iii-a, iv-d
    3) i-b, ii-a, iii-c, iv-d
    4) i-c, ii-d, iii-a, iv-b
16. **కింది వారిలో రాజ్యాంగ పరిషత్ సలహాదారుడిగా ఎవరు వ్యవహరించారు?**
    1) బెనగల్ రామారావు
    2) బెనగల్ నర్సింగ రావు
    3) బెనగల్ నరేంద్ర 4) ఎవరూ కాదు
17. **జతపరచండి.**
    వ్యక్తులు
    i) గ్రాన్‌విల్లె ఆస్టిన్ ii) హెచ్.వి. కామత్
    iii) ఎం.వి. పైలీ iv) కె.సి. వేర్
    భారత రాజ్యాంగంపై వ్యాఖ్యానం
    a) న్యాయవాదుల స్వర్గం
    b) అందమైన అతుకుల బొంత
    c) ఐరావతం d) అర్ధ సమాఖ్య
    1) i-c, ii-a, iii-b, iv-d
    2) i-b, ii-c, iii-a, iv-d
    3) i-b, ii-a, iii-c, iv-d
    4) i-a, ii-c, iii-b, iv-d
18. **లోక్‌సభ స్పీకర్‌కు సంబంధించి కింది వాటిలో సరైన అంశం ఏది?**
    ఎ) రాజ్యాంగ నిర్మాతలు స్పీకర్ పదవిని బ్రిటిష్ రాజ్యాంగం నుంచి స్వీకరించారు
    బి) స్పీకర్‌గా ఎన్నికైన వ్యక్తికి లోక్‌సభలో సభ్యత్వం ఉండాలి
    సి) లోక్‌సభ రద్దు అయినప్పటికీ స్పీకర్ పదవి రద్దుకాదు
    డి) స్పీకర్ పదవి గురించి 90 - 99 అధికరణల్లో పేర్కొన్నారు
    1) ఎ, బి, డి 2) ఎ, సి, డి
    3) ఎ, బి, సి 4) బి, సి, డి
19. **కింది వ్యాఖ్యల్లో సరైనవి ఏవి?**
    ఎ) పార్లమెంటరీ ప్రభుత్వాన్ని 'బాధ్యతాయుత ప్రభుత్వం' అని కూడా పిలుస్తారు
    బి) అధ్యక్షతరహా ప్రభుత్వానికి మరోపేరు 'ఏక సభ్య కార్య నిర్వాహక ప్రభుత్వం'
    సి) పునరాయనం అనేది పరోక్ష ప్రజాస్వామ్య సాధనం
    డి) రాజ్యాంగం అంటే ప్రభుత్వ రూపం - స్టీఫెన్ లీకాక్
    1) బి, సి 2) ఎ, సి
    3) బి, డి 4) ఎ, బి, డి
20. **మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్‌కు సంబంధించి కింది వాటిలో సరికానిది ఏది?**
    1) రాజ్యసభ సభ్యత్వంతో ప్రధాని పదవి చేపట్టిన నాలుగో వ్యక్తి
    2) ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడిగా పనిచేసి ప్రధాని అయిన రెండో వ్యక్తి
    3) గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని ప్రవేశపెట్టారు
    4) పంజాబ్ నుంచి రాజ్యసభకు ఎన్నికయ్యారు
21. **కింది వాటిని జతపరచండి.**
    జాబితా -I
    i) మొరార్జీ దేశాయ్
    ii) పీవీ నరసింహారావు
    iii) దేవెగౌడ iv) లాల్ బహదూర్ శాస్త్రి
    జాబితా -II
    a) రాజ్యసభ సభ్యత్వంతో ప్రధాని పదవి చేపట్టిన వారు
    b) మొదటి కాంగ్రెసేతర ప్రధాని
    c) తాష్కెంట్ ఒప్పందంపై సంతకం చేసిన ప్రధాని
    d) తొలి తెలుగు ప్రధాని
    1) i-b, ii-d, iii-a, iv-c
    2) i-a, ii-b, iii-c, iv-d
    3) i-c, ii-a, iii-d, iv-b
    4) i-c, ii-d, iii-b, iv-a
22. **కింది వారిలో అలీన విధాన (నామ్) రూపకల్పనలో ప్రమేయం లేని వారెవరు?**
    1) మార్షల్ టిటో (యుగోస్లేవియా)
    2) సుకర్ణో (ఇండోనేషియా)
    3) సిరిమావో బండారు నాయకే (శ్రీలంక)
    4) జవహర్ లాల్ నెహ్రూ (భారత్)
23. **భారత రాష్ట్రపతులు - వారి ప్రత్యేకతలను జతపరచండి.**
    జాబితా -I
    i) హిదయతుల్లా ii) వి.వి. గిరి
    iii) జాకీర్ హుస్సేన్
    iv) నీలం సంజీవరెడ్డి
    జాబితా -II
    a) భారత ప్రధాన న్యాయమూర్తిగా పని చేసి రాష్ట్రపతి పదవి చేపట్టిన వారు
    b) తాత్కాలిక రాష్ట్రపతిగా పనిచేసిన తొలి వ్యక్తి
    c) తొలి ముస్లిం రాష్ట్రపతి
    d) ఏకగ్రీవంగా ఎన్నికైన రాష్ట్రపతి
    1) i-b, ii-d, iii-a, iv-c
    2) i-a, ii-b, iii-c, iv-d
    3) i-c, ii-a, iii-d, iv-b
    4) i-a, ii-b, iii-c, iv-d
24. **ఏ సభలోని సభాపతి ఆ సభలో సభ్యుడిగా ఉండరు?**
    1) విధానసభ 2) రాజ్యసభ
    3) లోక్‌సభ 4) పైవేవీకాదు
25. **ఉపరాష్ట్రపతిని తొలగించే అధికారం ఎవరికి ఉంది?**
    1) పార్లమెంట్ 2) రాష్ట్రపతి
    3) ప్రధానమంత్రి 4) సుప్రీంకోర్టు
26. **భారత ఉపరాష్ట్రపతులకు సంబంధించి కింది వాటిలో సరైంది?**
    ఎ) ఉపరాష్ట్రపతిని పదవి నుంచి తొలగించే తీర్మానాన్ని మొదట రాజ్యసభలో మాత్రమే ప్రవేశపెట్టాలి
    బి) ఉపరాష్ట్రపతి పదవిని అమెరికా రాజ్యాంగం నుంచి స్వీకరించారు
    సి) సర్వేపల్లి రాధాకృష్ణన్, మహమ్మద్ హమీద్ అన్సారీ రెండు పర్యాయలు ఉపరాష్ట్రపతులుగా విధులు నిర్వర్తించారు
    డి) ఉపరాష్ట్రపతి తన రాజీనామాను రాష్ట్రపతికి సమర్పిస్తారు
    1) ఎ, బి, డి 2) ఎ, సి, డి
    3) ఎ, బి, సి 4) ఎ, బి, సి, డి
27. **రాజ్యసభ అధ్యక్షుడికి సంబంధించి కింది వాటిలో సరికానిది ఏది?**
    1) ఓటు వేసే హక్కు ఉండదు
    2) ఇతర సభ్యుల మాదిరిగా ఒక ఓటు ఉంటుంది
    3) సమానంగా ఓట్లు వచ్చిన సందర్భంలో మాత్రమే ఓటు ఉంటుంది
    4) సవరణ బిల్లుల విషయంలో మాత్రమే ఓటు ఉంటుంది
28. **భారత రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్‌కు సంబంధించి కింది వాటిలో సరైంది?**
    ఎ) ఉత్తర్‌ప్రదేశ్ నుంచి రాష్ట్రపతి అయిన తొలి వ్యక్తి
    బి) భారతీయ జనతా పార్టీ నుంచి రాష్ట్రపతి అయిన తొలి వ్యక్తి
    సి) దేశంలో రెండో దళిత రాష్ట్రపతి
    డి) వ్యక్తుల పరంగా 14, ఎన్నికల పరంగా 15వ రాష్ట్రపతి
    1) బి మాత్రమే 2) సి మాత్రమే
    3) ఎ, సి 4) ఎ, బి, సి, డి
29. **కింది వాటిలో సరైంది ఏది?**
    ఎ) రాష్ట్రపతి తన రాజీనామాను సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తికి సమర్పిస్తారు
    బి) రాష్ట్రపతి తన రాజీనామాను ఉపరాష్ట్రపతికి సమర్పిస్తారు
    సి) రాష్ట్రపతిని పార్లమెంట్ మహాభియోగ తీర్మానం ద్వారా తొలగిస్తుంది
    డి) ప్రధానమంత్రిని రాష్ట్రపతి తొలగిస్తారు
    1) బి, సి 2) ఎ, సి
    3) బి, డి 4) బి, సి, డి
30. **అలీన దేశాల ఏడో శిఖరాగ్ర సమావేశం 1983లో భారత్‌లోని ఏ నగరంలో నిర్వహించారు?**
    1) బెంగళూరు 2) ఢిల్లీ
    3) హైదరాబాద్ 4) ముంబై
31. **రాజ్యం అనే పదం కింది వాటిలో ఏ భాష పదంతో సంబంధం కలిగి ఉంది?**
    1) లాటిన్ 2) గ్రీక్
    3) ట్యూటానిక్ 4) జర్మన్
32. **అవినీతి నిరోధక చట్టాన్ని ఎప్పుడు రూపొందించారు?**
    1) 1985 2) 1988
    3) 1990 4) 1919
33. **సమష్టి కుటుంబాల నిర్వహణ బాధ్యతలను ఎవరు చేపడతారు?**
    1) పెద్ద కుమారుడు 2) పెద్ద కుమార్తె
    3) తల్లి 4) కుటుంబ పెద్ద
34. **'నాగరికతకు ఊయల లాంటిది' అని దేన్ని పేర్కొంటారు?**
    1) ప్రభుత్వం 2) సమాజం
    3) కుటుంబం 4) సంస్కృతి
35. **పబ్లిక్ ఆస్తికి ఉదాహరణ?**
    1) విద్యుచ్ఛక్తి 2) సముద్ర నీరు
    3) వార్తా పత్రిక 4) జనరేటర్
36. **'మానవుడికి సుఖప్రదమైన, గౌరవప్రదమైన జీవనాన్ని ప్రసాదించడమే లక్ష్యంగా కలిగిన కుటుంబాలు, గ్రామాల సముదాయమే రాజ్యం' అని రాజ్యాన్ని నిర్వచించినవారు?**
    1) బ్లంట్ షీ 2) గార్నర్
    3) బీన్ బోడిన్ 4) అరిస్టాటిల్
37. **సైమన్ కమిషన్ ముఖ్య ఉద్దేశం?**
    ఎ) 1919 చట్టం ద్వారా ప్రవేశపెట్టిన సంస్కరణలను సమీక్షించడం
    బి) డొమినియన్ ప్రతిపత్తిని సమీక్షించడం
    1) ఎ మాత్రమే 2) బి మాత్రమే
    3) ఎ, బి 4) ఏదీకాదు
38. **బి.ఆర్. అంబేద్కర్ ముసాయిదా రాజ్యాంగంలో ఎన్ని ఆర్టికల్స్ ఉన్నాయి?**
    1) 314 2) 315
    3) 316 4) 317

సమాధానాలు

1) 3	2) 4	3) 2	4) 1	5) 4
6) 2	7) 1	8) 4	9) 3	10) 4
11) 2	12) 3	13) 2	14) 4	15) 4
16) 2	17) 2	18) 3	19) 4	20) 4
21) 1	22) 3	23) 4	24) 2	25) 1
26) 4	27) 3	28) 4	29) 1	30) 2
31) 3	32) 2	33) 4	34) 3	35) 2
36) 4	37) 3	38) 2		

నీటిలో తేలే మంచు కరిగితే, నీటిమట్టం?

గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం

జనరల్ స్టడీస్

భౌతిక శాస్త్రం

ద్రవ పదార్థాలు

పీడనం (PRESSURE)

ప్రమాణ వైశాల్యంపై ప్రయోగించే బలాన్ని పీడనం అంటారు.

పీడనం $P = \frac{F}{A}$

ప్రమాణాలు:

1. డైన్ / సెం.మీ.^{2}
2. న్యూటన్ / మీ^{2}
3. 1 పాస్కల్
4. BAR
5. TORR

- ఒక ప్రవాహిని వల్ల (ద్రవాలు, వాయువులు) కలిగే పీడనం P = hdg
  - h → ప్రవాహి ఎత్తు
  - d → ప్రవాహి సాంద్రత
  - g → భూమి గురుత్వ త్వరణం
- ఒక వస్తువుతో కలిగించే పీడనం, దాని వైశాల్యాని(అడ్డుకోత వైశాల్యం)కి విలోమానుపాతంలో ఉంటుంది.

$$P \propto \frac{1}{A}$$

కాబట్టి వస్తువుల అడ్డుకోత వైశాల్యం తగ్గితే వాటి వల్ల కలిగే పీడనం పెరుగుతుంది.

ఉదాహరణ:

- కత్తి, కత్తెరల అంచులను సునుపుగా తయారు చేయడం వల్ల వాటి వల్ల కలిగే పీడనం పెరుగుతుంది.
- సూది, దబ్బనం, గడ్డపార, మేకు, మొదలైన వాటి అడ్డుకోత వైశాల్యాలను తగ్గించడం వల్ల వీటి వలన కలిగే పీడనం ఎక్కువగా ఉంటుంది.
- మానవుడు నేల మీద నిలుచున్నప్పుడు అధిక పీడనాన్ని కలుగజేస్తాడు.
- వెడల్పైన పాత్రలో ఉండే ద్రవాన్ని పొడవైన, తక్కువ వ్యాసం ఉన్న పాత్రలో పోసినప్పుడు ద్రవస్తంభ పొడవు పెరగడంతో ఆ ద్రవం వల్ల కలిగే పీడనం కూడా పెరుగుతుంది.
- సమాన ఘనపరిమాణం ఉన్న మూడు భిన్న పాత్రల్లో వరసగా పాదరసం (Hg), నీరు (H_2O), ఆల్కహాల్ నింపారు. వీటిలో పాదరస సాంద్రత, నీటిసాంద్రత కంటే ఎక్కువగా ఉంటుంది. ఈ రెండింటి సాంద్రతలు ఆల్కహాల్ సాంద్రత కంటే ఎక్కువగా ఉంటాయి. కాబట్టి పాదరసం వల్ల కలిగే పీడనం ఎక్కువగా, నీటి పీడనం తక్కువగా, ఆల్కహాల్ పీడనం కనిష్ఠంగా ఉంటాయి.

భారమితి

ఒక ప్రదేశంలో ఉండే వాతావరణ పీడనాన్ని కొలవడానికి భారమితిని ఉపయోగిస్తారు. దీన్ని టారిసెల్లీ అనే శాస్త్రవేత్త కనుగొన్నాడు.

పనిచేసే విధానం:

భారమితి ఎత్తు 100 సెం.మీ., వ్యాసం 1 సెం.మీ. దీనిలో పాదరసాన్ని ఉపయోగిస్తారు.

- సాధారణ వాతావరణ పీడనం పాదరస మట్టం 76 సెం.మీ. లేదా 760 మి.మీ.

ఫలితాలు:

- ఒక ప్రదేశంలో భారమితిలోని పాదరస స్తంభం పొడవు అకస్మాత్తుగా తగ్గితే రాబోయే తుపాన్‌ను, క్రమక్రమంగా తగ్గితే రాబోయే వర్షాన్ని సూచిస్తుంది.
- భారమితిలో తగ్గిన పాదరస మట్టం క్రమక్రమంగా పెరిగితే అక్కడ మారిన వాతావరణ పరిస్థితులు తిరిగి సాధారణ స్థాయికి చేరుకుంటున్నాయని అర్థం.
- భారమితి ఎత్తు, దానిలో ఉపయోగించే ద్రవ సాంద్రతకు విలోమానుపాతంలో ఉంటుంది.

P = hdg

$$\frac{P}{d} = hg \quad \therefore h \propto \frac{1}{d}$$

- ద్రవ సాంద్రత తగ్గితే భారమితిలోని ద్రవ మట్టం పెరుగుతుంది.

నోట్: ఇంక్ ఫిల్లర్స్, గాలిపంపులు, స్ట్రాలు వాతావరణ పీడనాన్ని అనుసరించి పనిచేస్తాయి.



1. పర్వతాలు ఎక్కినప్పుడు ముక్కు నుంచి రక్తం కారడం, వాంతులు కావడానికి ప్రధాన కారణం.. వాతావరణ పీడనం కంటే రక్తపీడనం ఎక్కువగా ఉండటం.
2. విమానాల్లో ప్రయాణించేటప్పుడు బాల్‌పెన్‌లోని ఇంక్ బయటకి రావడానికి కారణం- వాతావరణ పీడనం కంటే పెన్నులోని పీడనం ఎక్కువగా ఉండటం.

నోట్:

1. పాదరసం సాంద్రత ఎక్కువగా ఉండటం వల్ల దానితో పనిచేసే భారమితి ఎత్తు 1 మీ. ఉంటుంది.
2. నీటితో పనిచేసే భారమితి ఎత్తు నీటి సాంద్రతను బట్టి 10 మీ. నుంచి 11 మీ. ఉంటుంది. ఆల్కహాల్‌తో పనిచేసే భారమితి ఎత్తు 13.6 మీటర్లు.
3. ప్రయోగశాలలో ఉపయోగించే ఫోర్టీన్ (FORTINE) భారమితి ఎత్తు 80 సెం.మీ., దీనిలో పాదరసం వాడతారు.
4. అనార్ద్ర భారమితిలో ఉండే వివిధ పరికరాలన్నీ ఘన స్థితిలో మాత్రమే ఉంటాయి.

బాయిల్ నియమం

స్థిరమైన ఉష్ణోగ్రత వద్ద నియమిత ద్రవ్యరాశి ఉన్న వాయువు ఘనపరిమాణం, దానిపై ప్రయోగించిన పీడనానికి విలోమానుపాతంలో ఉంటుంది.

$$V \propto \frac{1}{P}$$

ఉదాహరణ:

1. నీటి అడుగు భాగంలో ఉండే గాలి బుడగ ఉపరితలం పైకి చేరినప్పుడు గాలిపై నీటి వల్ల కలిగే పీడనం ఉండదు. కాబట్టి గాలి బుడగపై పనిచేస్తున్న పీడనం తగ్గడం వల్ల దాని ఘనపరిమాణం పెరుగుతుంది.
2. భూమి ఉపరితలం నుంచి పైకి వెళ్లే బెలూన్‌పై ఉండే వాతావరణ పీడనం తగ్గడం వల్ల ఆ బెలూన్ పరిమాణం పెరుగుతుంది.
3. చంద్రుడిపై ఎలాంటి వాతావరణం లేదు. కాబట్టి అక్కడ బెలూన్ పైకి ఎగరదు.

పాస్కల్ నియమం

ఒక ప్రవాహినిపై కలిగించే పీడనం అన్ని వైపులా సమానంగా విభజితమవుతుంది.

అనువర్తనాలు:

1. బట్టలు, కాగితాలను అదిమి పట్టడానికి ఉపయోగించే 'బ్రామాప్రెస్' సాధనం పాస్కల్ నియమం ఆధారంగా పనిచేస్తుంది.
2. వ్యవసాయ రంగంలో ఉపయోగించే స్ప్రేయర్ ఈ నియమం ఆధారంగా పనిచేస్తుంది. ఈ సాధనాన్ని ఉపయోగించి క్రిమిసంహారక మందులను పిచికారీ చేస్తారు.
3. హైడ్రాలిక్ బ్రేకులు, హైడ్రాలిక్ పంపులు, హైడ్రాలిక్ క్రేన్లు, టిప్పర్లు, సాధనాలు, ఎయిర్ బ్రేక్‌లు పాస్కల్ నియమం ఆధారంగానే పనిచేస్తాయి.

స్నిగ్ధత వివరణ

- సమాన ద్రవ్యరాశులు ఉన్న పక్షి ఈక, ఒక రాయిని ఒకే ఎత్తు నుంచి జారవిడిచినప్పుడు, ఆ రాయి వాతావరణంలోని స్నిగ్ధతా బలాలను తొందరగా అధిగమించడం వల్ల ఈక కంటే ముందుగా భూమిని చేరుతుంది. ఒకవేళ ఈ రెండు వస్తువులను ఒకే ఎత్తునుంచి ఒకేసారి శూన్యంలో జారవిడిచినప్పుడు అవి రెండూ ఒకేసారి భూమిని చేరుతాయి. కారణం.. శూన్యంలో ఎలాంటి స్నిగ్ధతా బలాలు ఉండవు.
- అన్ని ద్రవ పదార్థాల కంటే గ్రీజు స్నిగ్ధత స్థానం ఎక్కువగా ఉంటుంది. తేనె స్నిగ్ధత కూడా ఎక్కువగా ఉంటుంది.

నోట్ :

1. స్నిగ్ధత.. పీడనంపై ఆధారపడుతుంది.
2. ఉష్ణోగ్రత పెరిగితే వాయువుల స్నిగ్ధత పెరుగుతుంది.
3. ఉష్ణోగ్రత పెరిగితే ద్రవాల స్నిగ్ధత తగ్గుతుంది.
4. గాలిలో ఉన్న స్నిగ్ధతా బలాల కంటే నీటిలోని స్నిగ్ధతా బలాలు ఎక్కువగా ఉంటాయి. కాబట్టి ఒక వస్తువు భారం గాలిలో కంటే నీటిలో తక్కువగా ఉంటుంది.

స్నిగ్ధత మారడానికి కారణాలు

- ద్రవ పదార్థాలను వేడి చేసినప్పుడు ద్రవాణువుల మధ్య ఉండే సంసంజన బలాలు బలహీనపడి స్నిగ్ధత తగ్గిపోతుంది.
- వాయువులను వేడిచేసినప్పుడు వాటి అనుచలనం పెరిగి అవి పరస్పరం ఒకదానికి మరొకటి దగ్గరగా రావడంతో స్నిగ్ధత బలం పెరుగుతుంది.

గతంలో అడిగిన ప్రశ్నలు

1. జతపరచండి.

i. బలం	1. పాయిజ్
ii. ప్రచోదనం	2. పాస్కల్
iii. స్నిగ్ధత	3. న్యూటన్
iv. పీడనం	4. న్యూటన్ – సెకన్

	i	ii	iii	iv
ఎ)	1	2	3	4
బి)	3	4	1	2
సి)	2	1	4	3
డి)	4	3	2	1

2. తలతన్యత అనువర్తనం.
   1. వేడి ఆహారం చల్లని ఆహారం కంటే రుచిగా ఉండడం
   2. వర్షం చినుకులు, సబ్బు బుడగ, పాదరస బిందువులు గోళాకారంలో ఉండడం
   3. రంగులు, ల్యూబ్రికెంట్ సులభంగా విస్తరించడానికి అవసరం
   4. నిలకడగా ఉన్న నీటిపై దోమలు స్వేచ్ఛగా చలించడం

   ఎ) 2, 4 బి) 2 మాత్రమే
   సి) 2, 3, 4 డి) అన్నీ
3. సమాన ద్రవ్యరాశి ఉన్న ఒక ఆస్ట్రిచ్ పక్షి ఈక, 100 గ్రాముల రాయిని భూమికి 200 మీటర్లు ఎత్తు నుంచి ఒకేసారి జారవిడిచినప్పుడు వాతావరణ పొరలోని స్నిగ్ధతా బలాల వల్ల అవి....
   ఎ) రెండూ ఒకేసారి భూమిని చేరుతాయి
   బి) రాయి ముందుగా భూమి చేరుతుంది
   సి) పక్షి ఈక ముందుగా చేరుతుంది
   డి) రెండూ స్నిగ్ధతా బలాల వల్ల భూమిని చేరవు
4. సమాన ద్రవ్యరాశి ఉన్న ఒక ఆస్ట్రిచ్ పక్షి ఈకను 100 గ్రా. రాయిని 200 మీ. ఎత్తునుంచి ఒకేసారి శూన్యంలో జారవిడిచినప్పుడు...
   ఎ) రెండూ ఒకేసారి భూమిని చేరుతాయి
   బి) రాయి ముందుగా చేరుతుంది
   సి) పక్షి ఈక ముందుగా చేరుతుంది
   డి) రెండూ స్నిగ్ధతా బలాల వల్ల భూమిని చేరవు
5. కింది వాటిలో సరైనది.
   1. ద్రవాల తలతన్యత ఉష్ణోగ్రతకు విలోమానుపాతంలో ఉంటుంది.
   2. సందిగ్ధ ఉష్ణోగ్రత వద్ద ప్రతి ద్రవం తలన్యత శూన్యం.

   ఎ) 1 సరైనది, 2 తప్పు
   బి) 1 తప్పు, 2 సరైనది
   సి) రెండూ సరికావు
   డి) రెండూ సరైనవే
6. నిలకడగా ఉన్న నీటిపై కిరోసిన్‌ను వెదజల్లినప్పుడు దేనిలో మార్పు జరిగి దోమల గుడ్లు, లార్వాలు మునుగుతాయి.
   ఎ) నీటి తలతన్యత తగ్గడం
   బి) నీటి తలతన్యత పెరగడం
   సి) నీటి స్నిగ్ధత పెరగడం
   డి) నీటి స్నిగ్ధత తగ్గడం
7. కేశనాళికీయత అనువర్తనం కానిది
   ఎ) కిరోసిన్ స్టవ్, దీపం, మైనం క్యాండిల్ పనిచేయడం
   బి) ఇసుక నేలలు తేమగా ఉండడం
   సి) ఎడారుల్లో ఒయాసిస్‌లు ఏర్పడటం
   డి) మొక్కలు దారువు ద్వారా పీల్చుకున్న నీరు పైకి ఎగబాకడం
8. జతపరచండి. (పదార్థాలు- స్పర్శకోణం)

i. పాదరసం	1. 0°
ii. స్వచ్ఛమైన నీరు	2. 8°- 9°
iii. వెండితో నీరు	3. 90°
iv. సాధారణ నీరు	4. 135° - 140°

	i	ii	iii	iv
ఎ)	2	3	4	1
బి)	4	1	3	2
సి)	1	4	2	3
డి)	3	2	1	4

9. 1. ఒక ప్రదేశంలో భారమితిలోని పాదరస స్తంభం పొడవు అకస్మాత్తుగా తగ్గితే అది తుపాను రాకను సూచిస్తుంది.
   2. పాదరస మట్టం క్రమంగా తగ్గితే రాబోయే వర్షసూచనను తెలుపుతుంది.

   ఎ) 1, 2 సరైనవి బి) రెండూ తప్పు
   సి) 1 సరైనది, 2 తప్పు
   డి) 1తప్పు, 2 సరైనది
10. జలాంతర్గామి పనిచేయడంలో ఉపయోగించే సూత్రం?
    ఎ) బాయిల్ నియమం
    బి) పాస్కల్ నియమం
    సి) బెర్నౌలీ నియమం
    డి) ఆర్కిమిడీస్ ప్లవన సూత్రం
11. నదిలో ప్రయాణిస్తున్న ఓడ సముద్రజలాల్లోకి ప్రవేశించినప్పుడు ఓడ మట్టం పెరుగుతుంది. కారణం?
    ఎ) సముద్ర నీటి సాంద్రత ఎక్కువగా ఉండటం
    బి) నది నీటి సాంద్రత ఎక్కువగా ఉండటం
    సి) నది నీటి సాంద్రత తక్కువగా ఉండటం
    డి) సముద్ర నీటి సాంద్రత తక్కువగా ఉండటం
12. టారిసెల్లీ కనుగొన్న భారమితి దేన్ని కొలుస్తుంది?
    ఎ) సాంద్రత బి) వాతావరణ పీడనం
    సి) స్నిగ్ధత డి) నీటి అసంగత వ్యాకోచం
13. నీటిలో తేలే మంచు కరిగితే, నీటిమట్టం?
    ఎ) పెరుగుతుంది బి) తగ్గుతుంది
    సి) పెరిగి తగ్గుతుంది డి) మారదు
14. ప్రెషర్ కుక్కర్‌లో పదార్థాలు త్వరగా ఉడుకుతాయి. ఎందుకు?
    ఎ) ఉష్ణం తగ్గడం వల్ల
    బి) ఉష్ణోగ్రత పెరగడం వల్ల
    సి) నీటి బాష్పీభవన స్థానం పెరగడం వల్ల
    డి) నీటి బాష్పీభవన స్థానం తగ్గడం వల్ల

సమాధానాలు

1) బి 2) డి 3) బి 4) ఎ 5) డి
6) ఎ 7) బి 8) బి 9) ఎ 10) డి
11) డి 12) బి 13) డి 14) సి

The meaning of pedigree in this context is?



BANK EXAMS

GENERAL ENGLISH

MODEL QUESTIONS

Directions (Q.No.1-05): Read each sentence to find out whether there is any grammatical mistake/ error in it. The error, if any, will be in one part of the sentence. Mark the number of that part with error as your answer. If there is 'No error', mark (5) as your answer.

1. Entrepreneurs, who have dealt with multiple government agencies, (1)/ also felt that there are too many government bodies that play an active role in the journey of a company and, (2)/ more often than not, it only complicates the operations of the company (3)/ while increasing the compliance costs manifold. (4)/ No error (5)
2. The Comptroller and Auditor General (CAG), in its first ever audit of the Goods and Services Tax, (1)/ has said the government had failed (2)/ to trying out the system before its rollout, (3)/ leading to inadequate compliance mechanisms, and lower tax revenues. (4)/ No error (5)
3. The accumulated toxins in our body (1)/ did not just affect our physical being (2)/ but also have adverse effect (3)/ on our mental faculties. (4)/ No error (5)
4. One needs to acquire many talent (1)/ and master plenty of disciplines (2)/ to make a profitable (3)/ and reputed business. (4)/ No error (5)
5. Hundreds of doctors and medicos staged dharnas (1)/ and taking out rallies in Andhra Pradesh (2)/ to register their protest (3)/ against the National Medical Council Bill. (4)/ No error (5)

Directions: (Q.No. 06- 10) Which of the phrases (1), (2), (3), and (4) given below each sentence should replace the phrase underlined in the sentence to make it grammatically correct? If there is no error mark (5) No correction required as your answer.

6. The appropriate atmospheric conditions made it feasible for the astronomers to see the stars <u>and they could even distinguish the sizes.</u>
   1) and even distinguish the sizes
   2) and they were even distinguishing the sizes
   3) and he could even distinguish the size
   4) and even distinguishing the sizes
   5) no correction required
7. Get out of the building! <u>It sound like the generator is going to explode.</u>
   1) It is sounding like the generator is going to explode
   2) It sounds like the generator is going to explode
   3) It sounds like generator exploded
   4) it sounded like generator explosion
   5) no correction required
8. <u>A belief in superstitious people is that</u> birth marks are the signs of influence on the mother before childbirth.
   1) A belief in superstitious people that
   2) Superstitious people beliefs are that
   3) Among superstitious people the beliefs is that
   4) Superstitious people believe that
   5) no correction required
9. Tonight I am going to check that <u>Ramesh will do his homework correctly.</u>
   1) Ramesh must be doing his homework correctly
   2) Ramesh shall do his homework correctly
   3) Ramesh does his homework correctly
   4) Ramesh did his homework correct
   5) no correction required
10. People working in high position in companies <u>tend to shifting their work</u> burden by delegating tasks to their subordinates.
    1) tend for shifting their work
    2) tend to shift their work
    3) tend as to shifting their work
    4) tended to shift his work
    5) no correction required

Directions(Q.11-15): Rearrange the following six sentences(A),(B), (C),(D), (E) and(F) in a proper sequence to form a meaningful paragraph and then answer the questions given below.

A) There are about four hundred old stone bridges joining the island of Venice.
B) Venice is a strange and beautiful city in the north of Italy.
C) It is not an island but a hundred and seventeen islands.
D) These small islands are near one another.
E) This is because Venice has no streets.
F) In this city there are no motor cars, no horses and no buses.

11. What is the FIRST sentence after rearrangement?
    1) A 2) B 3) C 4) D 5) F
12. What is the SECOND sentence after rearrangement?
    1) A 2) B 3) C 4) D 5) F
13. What is the THIRD sentence after rearrangement?
    1) A 2) B 3) D 4) E 5) F
14. What is the FOURTH sentence after rearrangement?
    1) A 2) B 3) C 4) D 5) E
15. What is the LAST sentence after rearrangement?
    1) A 2) B 3) C 4) D 5) E

Directions(Q.No.16-20): Each question below has a blank/ two blanks, each blank indicating that something has been omitted. Choose the word/ set of words from the five options for each blank that best fits the meaning of the sentence as a whole.

16. Countries which _____ still undergoing the economic processes _____ known as developing countries.
    1) were, are 2) are, were
    3) are, are 4) is, are
    5) are, is
17. There are many textile producing mills in the market that _____ with each _____ to gain the largest share of the market.
    1) fight, person 2) compete, other
    3) Compare, contestants
    4) Clash, individual
    5) Struggle, another
18. As per the recent ethical rules _____ down by National Institute of Health, diseases which cannot be treated _____ would qualify for treatment involving human gene manipulation.
    1) Lay, dangerous
    2) Produced, similar
    3) Laid, alternatively
    4) Identified, uncommon
    5) Framed, fast
19. In the first ten years after the _____ of the UGC Act, eight institutions were granted deemed university status.
    1) implification 2) enactment
    3) Statement 4) Forming
    5) issue
20. But each attempt ended in _____ failure, just as such attempts have _____ all over the world including Britain and the US.
    1) gloomy, ended
    2) Spectacular, tremendous
    3) Intense, intensified
    4) Dismal, failed
    5) Abysmal, aroused

Directions (Q.No. 21-25) Read the following passage carefully and answer the questions given below it. Certain words have been printed in bold to help you locate them while answering some of the questions.

The most **avid** users of social-networking websites may be exhibitionist teenagers, but when it comes to more grown-up use by business people, such sites have a surprisingly long **pedigree**. LinkedIn, an online network for professionals that signed up its ten-millionth user this week, was launched in 2003, a few months before MySpace, the biggest of the social sites. Consumer adoption of social networking has grabbed most attention since then. But interest in the business uses of the technology is rising. Many companies are attracted by the marketing opportunities offered by community sites. But the results can be painful. Pizza Hut has a profile on MySpace devoted to a pizza-delivery driver called Ted, who helpfully lets friends in on the chain's latest promotional offers ("Dude, I just heard some scoop from the Hut," ran one recent post). Wal-Mart started up and rapidly closed down a much-derided teenage site called The Hub last year. Reuters hopes to do better with its forthcoming site for those in the financial-services industry. Social networking has proved to be of greatest value to companies in recruitment. Unlike a simple jobs board, social networks enable members to pass suitable vacancies on to people they know, and to refer potential candidates back to the recruiter. So employers reach not only active jobseekers but also a much larger pool of passive candidates through referrals. LinkedIn has over 350 corporate customers which pay up to $250,000 each to advertise jobs to its expanding network. Having lots of people in a network increases its value in a "super-linear" fashion, says Reid Hoffman, LinkedIn's founder. He says corporate use of his service is now spreading beyond recruiters: hedge funds use it to identify and contact experts, for example. This technique is also gathering momentum in "knowledge management". IBM recently unveiled a social-software platform called Lotus Connections, due out in the next few weeks, that lets company employees post detailed profiles of themselves, team up on projects and share bookmarks.

21. Why does the author call "Lotus Connections" a social software platform?
    1) Because it is used for knowledge management
    2) It has a feature to allow employees to interact and cooperate with each other
    3. Because IBM developed it
    4. Because the service team can get in touch with the right engineers using it
22. What meaning of avid could you infer from the passage?
    1) Dormant 2) Unprincipled
    3) Unwanted 4) Enthusiastic
    5) Hibernate
23. What is the most probable context in which the author is talking about Pizza Hut?
    1) Social Networking did not benefit it
    2) Social Networking was a big success for it
    3) Social Networking created problems for it
    4) any of the above
    5) none of the above
24. Which of the following statement is true?
    1) LinkedIn's rich pool of corporate customers scarcely add weightage to its expanding network.
    2) Social networks enable members to pass suitable vacancies on to people they know, and to prefer potential candidates back to the recruiter.
    3) Employers have a ready to use database of selected candidates.
    4) Social networks help the recruiters in providing the information about potential candidates.
    5) Interest in the business uses of the technology is alarming
25. The meaning of pedigree in this context is
    1) It is a rare breed
    2) It is a food used for pet animals
    3) It means full of rage
    4) To derive something 5) A lineage

Directions (Q.No. 26-30): In the following passage there are blanks, each of which has been numbered. These numbers are printed below the passage and against each, five words/ phrases are suggested, one of which fits the blank appropriately. Find out the appropriate word/ phrase in each case and mark your answer.

Although foetal sex determination and sex selection is _____ (26) offence in India, the practice is _____(27). Private clinics with ultrasound machines are doing _____ (28) business. Everywhere, people are paying to _____ (29) the sex of the unborn child, and paying more to abort the female child. The technology has reached even remote places through mobile clinics. Dr. Puneet Bedi obstetrician and specialist in foetal medicine, says these days he _____ (30) sees a family with two daughters. People are getting the sex determination even for the first child, he says.

26. 1) an 2) a 3) purely
    4) truly 5) the
27. 1) vibrant 2) rampant 3) colorful
    4) animated 5) alive
28. 1) brisk 2) hurry 3) slow
    4) rare 5) vital
29. 1) understand 2) estimate 3) alter
    4) know 5) change
30. 1) rare 2) scare 3) hard
    4) hardly 5) almost

KEY

1) 2	2) 3	3) 5	4) 1	5) 2
6) 2	7) 2	8) 4	9) 5	10) 2
11) 2	12) 3	13) 3	14) 1	15) 5
16) 3	17) 2	18) 3	19) 1	20) 4
21) 2	22) 4	23) 2	24) 4	25) 5
26) 1	27) 2	28) 1	29) 4	30) 4